అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 27-7-2023

సంపుటి : 9 | సంచిక : 207 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు వెల : 6.50



ఉపాధికి తూట్లు

- ఆధార్ అనుసంధానం సాకుతో లబ్దిదారుల్లో కోత
- గతేడాది 5.18 కోట్ల మంది తొలగింపు
- గ్రామీణ ప్రాంతాలలో పెరుగుతున్న నిరుద్యోగం

వివరాలు 5లో..

అవిశ్వాసానికి ఓకే

అనుమతించిన లోక్‌సభ స్పీకర్

- వేర్వేరుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ తీర్మానాలు



మోడీతో మాట్లాడించే ప్రయత్నం : ఇండియా కూటమి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బుధవారం లోక్‌సభలో వేర్వేరుగా అవిశ్వాస తీర్మానాలను ప్రతిపాదించాయి. సభలో కాంగ్రెస్ పార్టీ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ అందజేసిన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చర్చకు అనుమతించారు. వివిధ పార్టీల సభా నాయకులను సంప్రదించి, తీర్మానంపై చర్చించే తేదీని తెలియజేస్తానని ఆయన చెప్పారు. మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై ప్రధాని నరేంద్ర మోడీ మౌనం దాల్చడాన్ని ప్రతిపక్షాలు నిరసిస్తున్న విషయం తెలిసిందే. ఆయనను ఎలాగైనా పార్లమెంట్‌కు రప్పించి మాట్లాడించాలనే ప్రయత్నంలో భాగంగానే కేంద్ర మంత్రిమండలిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరుగా అవిశ్వాస తీర్మానానికి నోటీసులు అందించాయి. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే ప్రధాని మోడీ మాట్లాడటంతో పాటు తమకూ పలు అంశాలను లేవనెత్తే అవకాశం లభిస్తుందనే యోచనతో ప్రతిపక్ష కూటమి ఈ అడుగు వేసింది.

తొలుత కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు అవిశ్వాస తీర్మానం నోటీసులను లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌కు అందజేశారు. సభా కార్యక్రమాల నియమాలు, నిర్వహణకు సంబంధించి 17వ అధ్యాయంలోని 198-బీ నిబంధన కింద అవిశ్వాస తీర్మానాన్ని అనుమతించాలని కోరారు. గొగోయ్ అందజేసిన నోటీసుకు కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), జేడీయూ, వామపక్షాలు మద్దతు తెలిపాయి. నామా నాగేశ్వరరావు అందజేసిన నోటీసుపై ఎంపీలు బీబీ పాటిల్, రంజిత్ రెడ్డితో పాటు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా సంతకాలు చేశారు.

ఉదయం సభ సమావేశం కాగానే కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగోయ్ లేచి తాను అవిశ్వాస తీర్మానాన్ని అందజేశానని, దానిపై చర్చను చేపట్టాలని స్పీకర్‌ను కోరారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ 'మీరు మీ స్థానంలో కూర్చోండి. సభను జరగనివ్వండి. మీరు అనుభవం కలిగిన సభ్యులు. నిబంధనలు తెలిసిన వారు' అని అన్నారు. అనంతరం ఓం బిర్లా ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టగానే కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష సభ్యులు సభ మధ్యలోకి వెళ్లి నినాదాలు చేశారు. మణిపూర్ హింసపై సభలో మాట్లాడాలని ప్రధానిని డిమాండ్ చేశారు. 'మణిపూర్ కోసం భారతదేశం', 'విద్వేషాలకు వ్యతిరేకంగా దేశం సంఘటితంగా ...2లో

అటవీ సంరక్షణ బిల్లు ఆమోదం

- లోక్‌సభలో మూజువాణి ఓటుతో పాస్ 2లో..

ఏ ప్రధానిపై ఎన్నిసార్లు?



సీపీఐ (ఎం) ఎంపీ జ్యోతిర్మయి బసు (ఫైల్)

దేశాన్ని పరిపాలించిన ప్రధానులలో అందరికంటే ఎక్కువగా ఇందిరాగాంధీయే అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొన్నారు. ఇప్పటి వరకూ సభ ముందుకు వచ్చిన 27 అవిశ్వాస తీర్మానాలలో సగానికి పైగా అంటే 15 తీర్మానాలు ఆమె నేతృత్వంలోని ప్రభుత్వాల మీద ప్రవేశపెట్టినవే. లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వంపై మూడుసార్లు అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఐదు సంవత్సరాల పాటు మైనారిటీ ప్రభుత్వాన్ని నడిపిన పీవీ నరసింహారావు కూడా మూడు తీర్మానాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే మన్మోహన్ సింగ్ పది సంవత్సరాలు ప్రధాని పదవిలో ఉన్నప్పటికీ ఆయనపై ఎవరూ అవిశ్వాసాన్ని ప్రతిపాదించలేదు. అవిశ్వాస తీర్మానాలను అత్యధికంగా ప్రతిపాదించిన ఘనత సీపీఐ (ఎం) ఎంపీ జ్యోతిర్మయి బసుకే దక్కుతుంది. ఆయన నాలుగు అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టగా అవన్నీ ఇందిరాగాంధీ ప్రభుత్వంపై ప్రతిపాదించినవే. ఇక అటల్ బిహారీ వాజ్‌పేయి, మధులిమాయేలు రెండేసి అవిశ్వాస ...2లో



బీజేపీలో లొల్లి

రాష్ట్ర కార్యాలయంలో పార్టీ శ్రేణుల నిరసన జ్వాలలు

- అర్వింద్ డౌన్..డౌన్..వీవాంట్ జస్టిస్ అంటూ నినాదాలు
- నేతల తీరుపై రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి ఆగ్రహం
- 'ఏయ్ ఏం మాట్లాడుతున్నవ్..' అంటూ ఎదురు తిరిగిన కార్యకర్తలు
- ఉక్కిరిబిక్కిరి అయిన బీజేపీ రాష్ట్ర నాయకత్వం
- మీడియా సాక్షిగా రచ్చరచ్చ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అగ్నిపర్వతం బద్దలయినప్పుడు లావా నిరంతరం ఎగిసిపడ్డట్టుగానే బీజేపీలో నిరసన జ్వాలలు ఏదో ఒక రూపంలో ఎగిసిపడుతూనే ఉంది. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు వ్యతిరేకంగా బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోనే ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళనకు దిగటంతో రాష్ట్ర నాయకత్వం ఉక్కిరిబిక్కిరి అయింది. కొద్దిసేపు ధర్నా... కొంత సమయం అర్వింద్ డౌన్..అర్వింద్ డౌన్...వీవాంట్ జస్టిస్..వీవాంట్ జస్టిస్..నినాదాలతో అంతా గందరగోళం నెలకొంది. ఆందోళనపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డిపై 'ఏయ్ ఏం మాట్లాడుతున్నావ్.....' అంటూ కార్యకర్తలు ఉగ్రరూపం దాల్చారు. కిషన్‌రెడ్డినే తమ వద్దకు రావాలని డిమాండ్ చేయడం వంటి పరిణామాలతో కాసేపు అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అతి కష్టం మీద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్, ఆర్మూర్‌లో గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన వినయ్‌రెడ్డి, బాల్కొండ నుంచి రెండు సార్లు పోటీ చేసిన రాజేశ్వర్, బోధన్ మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్, తదితర నాయకులకు ప్రకాశ్‌రెడ్డి, రాణి రుద్రమ దేవి, పలువురు నేతలు నచ్చజెప్పారు. మీడియా ముందు రచ్చచేయడం సరిగాదని బతిమిలాడి నేతలను కిషన్‌రెడ్డి క్యాబిన్ దగ్గరకు తీసుకెళ్లారు. అక్కడకు మీడియాను రానివ్వలేదు. 'కొద్దిసేపు తమతో కిషన్‌రెడ్డి సమావేశమయ్యారు. న్యాయం చేస్తామని హామీనిచ్చి పంపారు' అని కొందరు నాయకులు చెప్పారు. కిషన్‌రెడ్డి కూడా తమకు న్యాయం చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మరోవైపు అర్వింద్ మాత్రం మండలాధ్యక్షుల మార్పులో తన ప్రమేయమేమీ లేదంటూ దాటవేయడం గమనార్హం.

అసలేం జరిగిందంటే...

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టారు. అది ముగిసాక ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ, పలువురితో ప్రత్యేకంగా భేటీ అయ్యేందుకు కార్యాలయంలోని తన క్యాబిన్‌కు వెళ్లారు. అదే సమయంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన 60 నుంచి 70 మంది నాయకులు ...5లో

కితాబులు సరే... సిబ్బంది ఏరి?

- సైన్యాన్ని వేధిస్తున్న అధికారుల కొరత
- ఖాళీగా ఉన్న 11 వేల పోస్టులు
- వైద్య సిబ్బందీ వేరే



న్యూఢిల్లీ : కార్గిల్ అమర వీరులకు దేశ ప్రజలు ఘనంగా నివాళులు అర్పిస్తున్న తరుణంలో ఇప్పటికీ సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్న త్రివిధ ...2లో

కార్గిల్ వీరులకు జాతి ఘన నివాళి

- నియంత్రణ రేఖ దాటేందుకు సిద్ధం : రాజ్‌నాథ్

2లో

తప్పదారి పట్టిస్తుంది

- యువతపై సోషల్ మీడియా ప్రభావం
- వారు సరైన జీవిత గమనాన్ని నిర్ణయించుకోలేకపోతున్నారు : అలహాబాద్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : యువతపై సోషల్ మీడియా, సినిమాలు, వెబ్ సిరీస్‌ల ప్రభావంపై అలహాబాద్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీటి ప్రభావంతో యువత సరైన జీవిత గమనాన్ని నిర్ణయించుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించింది. అలాగే, ...5లో

ఈడీ డైరెక్టర్ పదవీ కాలాన్ని పొడిగించాలి

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేంద్రప్రభుత్వం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చీఫ్ సంజయ్ కుమార్ మిశ్రా పదవీ కాలం అక్టోబర్ 15 వరకు పొడిగించాలని కోరుతూ సుప్రీంకోర్టులో బుధవారం కేంద్ర ప్రభుత్వం పిటిషన్ వేసింది. పదవీకాలం పొడిగింపు విషయంలో ఇదివరకు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో.. తాజా పిటిషన్‌ను ...5లో

1,520 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్

పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 1,520 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగంలో ఈ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి తెలంగాణ మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (తెలంగాణ వైద్యసేవల నియామక మండలి) ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టుల కోసం బోర్డు వెబ్‌సైట్ mhsrb.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఆగస్టు 25 ఉదయం 10.30 గంటల నుంచి సెప్టెంబర్ 19 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు ఆ నోటిఫికేషన్ లో పేర్కొంది.

వైద్యారోగ్యశాఖలో జాబ్ మేళా

వైద్యారోగ్యశాఖలో జాబ్ మేళా కొనసాగుతున్నదని ఆ శాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఇప్పటికే స్టాఫ్ నర్సుల నియామకాల కోసం పరీక్ష నిర్వహించనున్న బోర్డు తాజాగా ఎంపీహెచ్ఏ (ఎఫ్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందంటూ ట్వీట్ చేశారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో తాలిపేరు ప్రాజెక్టు వద్ద గోదావరి ఉధృతి..



మునిగిన భద్రాద్రి

వానొచ్చే.. వరదొచ్చే

భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం...

- కుంటలను తలపిస్తున్న పంట పొలాలు, రోడ్లు
- రాకపోకలు బంద్
- ఉరకలేస్తున్న వాగులు
- గేట్లు తెరుచుకున్న ప్రాజెక్టులు
- గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

వివరాలు 2లో..

హైకోర్టు తీర్పును అమలుచేయండి..

సీఈవో వికాస్‌రాజ్‌ను కలిసిన జలగం వెంకట్రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొత్తగూడెం ఎమ్మెల్యేగా తనను ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌ను కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో వెంకట్రావు సీఈవోను కలిశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదన్న హైకోర్టు తీర్పు ప్రతులను సీఈవోకు అందజేశారు. కేసు వివరాలను వెల్లడించారు. హైకోర్టు జడ్జిమెంట్ ప్రకారం తనను ఎమ్మెల్యేగా ...5లో

ఉత్తమ్...మౌనముద్ర

బీఆర్ఎస్‌లో చేరుతారని ప్రచారం




- అసంతృప్తి రేవంత్ పైనా...పార్టీ పైనా?
- కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టేందుకు బీఆర్ఎస్ ప్రచారమంటున్న సీనియర్లు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దూకుడుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తాజాగా కొన్ని కొత్త చిక్కులు ఎదుర్కొంటున్నది. పార్టీ సీనియర్ నేత, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి దంపతులు ఆపార్టీని వీడతారనే వదంతులు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో గత వారం రోజులుగా ఏదో ఒక రూపంలో ప్రచారం సర్క్యులేట్ అవుతూనే ఉంది. బీజేపీ, బీఆర్ఎస్‌ల నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు పెరుగుతున్న నేపథ్యంలో హస్తం పార్టీ నుంచి కూడా బీఆర్ఎస్‌లోకి సీనియర్ నేతలు వస్తున్నారనే ప్రచారం ఊపందుకుంటున్నది. ముఖ్యంగా నల్లగొండ జిల్లాకు చెందిన ఉత్తమ్‌పై ఈ ప్రచారం జోరందుకుంది. ఈ వ్యవహారం వెనుక బీఆర్ఎస్ ఉందంటూ కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు ఉత్తమ్‌తోపాటు మరికొందరు నేతలు కారెక్కుతారంటూ బీఆర్ఎస్ నేతలు బలంగా వాదిస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చాలా మంది నేతలు తమ పార్టీలోకి వస్తారని తెలంగాణ భవన్ వర్గాలు అంటున్నాయి. బీఆర్ఎస్ కీలక ...2లో

భూం...ఫట్

రూ.350 కోట్ల విలువ చేసే అటవీ భూములు మాయం..!





- కాజేసిన రియల్టర్లు
- సేత్వార్, ఖాస్రా పహాణీల్లో సర్కార్ భూమిగా నమోదు
- రికార్డులు మార్చిన ఇంటి దొంగలు
- హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో జోన్ పరిధి నుంచి తొలగింపు
- మాకేం తెలియదు : రెవెన్యూ అధికారులు

రాజకీయ నేతలు.. ప్రభుత్వ పెద్దలు.. రియల్టర్లు.. ఆక్రమణదారులు.. ఒక్కొక్కరికి ఒక్కో రకంగా ధరణి పోర్టల్ ఉపయోగపడుతోంది. కంటికి కనిపించిన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ధరణి పోర్టల్‌లో లోపాలను తమకు ఆయుధాలుగా మలుచుకుంటున్నారు. అడ్డంగా భూకబ్జాలకు పాల్పడి కోట్లు వెనకేసుకుంటున్నారు.

నవతెలంగాణ - రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు భూమా, అటవీ భూమా, సీలింగ్ భూములా అనే తేడా లేకుండా కోట్ల విలువ గల భూమైతే చాలు.. రికార్డులు మార్చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని పట్టాగా మార్చుకోవడమే కాకుండా హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో ఉన్న జోన్ కూడా మార్చేసిన ఘనులు వారు. ఆ రకంగా కోట్ల రూపాయల అటవీ భూమిని మాయ చేసి పట్టా భూమిగా మార్చుకున్న వైనం బయటపడింది. అధికారులనే పావులుగా వాడుకుని ఇదంతా చక్కబెట్టడం గమనార్హం. దీనిపై సంబంధింత రెవెన్యూ అధికారులను ఎవరిని ...5లో

నవతెలంగాణ



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,160	▲ 160
22 క్యారెట్లు	- 55,150	▲ 150
కిలో వెండి	- 80,400	▲ 400

ఉత్తమ్...మౌనముద్ర

(మొదటిపేజీ తరువాయి)

నేతలతో ఉత్తమ్ చర్చలు జరుపుతున్నారనీ, ఆయనకు ఎమ్మెల్యే టికెట్, ఆయన భార్య పద్మావతికి ఎమ్మెల్సీ పదవి ఇస్తారని ఆ వర్గాలు పదే పదే లీకులు ఇస్తున్నాయి. ఏడేండ్లపాటు పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా, ఎంపీగా ఉన్న ఆయనపై ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని హస్తం నేతలు తప్పుపడుతున్నారు. అతి త్వరలోనే సీడబ్ల్యూసీ ఆహ్వానితులుగా నియమించడంతోపాటు ఏదో ఒక రాష్ట్రానికి స్వతంత్ర ఇంచార్జిగా ప్రమోషన్ ఇస్తారంటూ ఆయన అనుచరులు చెబుతున్నారు. ఉత్తమ్‌ను నమ్ముకుని చాలామంది నాయకులు ఉన్నారనీ, ఆయన తన భవిష్యత్తు చూసుకుంటే, తమ రాజకీయ భవిష్యత్తు నాశనమవుతుందని ఆందోళన చెందుతున్నారు. పార్టీ మారుతున్నారంటూ సోషల్‌మీడియాలో కొనసాగుతున్న ప్రచారాన్ని ఉత్తమ్ ఖండించకపోవడంతో దీనికి మరింత బలం చేకూరుతున్నదని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. ఆయన మౌనంగా ఉండటంతో ఉత్తమ్ నిజంగా పోతున్నారా? అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. రేవంత్‌రెడ్డి అధ్యక్షుడయ్యాక తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలపై అసంతృప్తితో ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. నల్లగొండలో బహిరంగ సభ నిర్వహిస్తామని రేవంత్ ప్రకటించిన వెంటనే తమతో సంప్రది ంచకుండానే ప్రకటించడం సరైందికాదని ఉత్తమ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీంతో రెండు వర్గాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి జోక్యం చేసుకుని ఇరువర్గాలతో సంప్రదించి ఎట్టకేలకు బహిరంగ సభ నిర్వహింపజేశారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరిక విషయంలోనూ వారిద్దరి మధ్య కొన్ని అభిప్రాయభేదాలు తలెత్తినట్టు తెలిసింది. ఆయా నియోజకవర్గాల్లో తన అనుచరులను ఉత్తమ్‌కు వ్యతిరేకంగా రేవంత్ ప్రోత్సహిస్తున్నారనే టాక్ వినబడుతున్నది. ఈ క్రమంలో పాత నాయకులకు అన్యాయం జరుగుతుందని ఉత్తమ్ వర్గీయులు అంటున్నారు. రేవంత్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు తగిన సమయం ఇవ్వరనీ, ఫోన్లు చేసినా ఎత్తరనే విమర్శలున్నాయి. ఏదైనా బాధలు చెప్పుకుందామన్నా సమయం ఇవ్వరనీ, ఇప్పటికీ ఆయన చుట్టూ కంచెలాగా కొంత మంది ఉంటారనీ, దాన్ని చేధించుకుని ఆయన దగ్గరకు చేరుకోవడం సాధ్యం కావడం లేదని గాంధీభవన్‌లో నాయకులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. అయినప్పటికీ ఉత్తమ్ పార్టీ మారేంత బలహీనమైన నేత కాదనీ, ఆయనకు ఏఐసీసీ స్థాయిలో పదవి ఇచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇదంతా కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టేందుకు బీఆర్ఎస్ చేస్తున్న కుట్ర అని కాంగ్రెస్‌లోని సీనియర్లు కొట్టేస్తున్నారు.

సేవా భారతీకి ఎస్‌బీఐ కంప్యూటర్ల విరాళం



హైదరాబాద్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా ఎస్‌బీఐ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సికింద్రాబాద్ బాగు చేసిన 20 పాత కంప్యూటర్లను సేవా భారతీ సంస్థకు అందించింది. వీటిని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ నెట్‌వర్క్-1 హైదరాబాద్ మంజూ శర్మ సేవా భారతీ తెలంగాణ డైరెక్టర్ కుల్దీప్ సక్సేనాకు అందజేశారు.

జిట్టా బాలకృష్ణారెడ్డి సస్పెండ్

- వారం రోజుల్లో వివరణ ఇవ్వాలి : బీజేపీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా నేత జిట్టా బాలకృష్ణారెడ్డిని ఆ పార్టీ సస్పెండ్ చేసింది. బుధవారం ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ నియమ నిబంధనలు ఉల్లంఘించి, క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడినందుకే జిట్టా పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేసినట్టు తెలిపారు.

అవిశ్వాసానికి ఓకే

(మొదటిపేజీ తరువాయి)

ఉంది' అని రాసివున్న ప్లకార్డులు ప్రదర్శించారు. మరోవైపు రాజస్థాన్‌కు చెందిన బీజేపీ ఎంపీలు లేచి అశోక్ గెహ్లాత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎరుపు డైరీని ప్రదర్శించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన కొందరు బీజేపీ ఎంపీలు కూడా నినాదాలు చేయడం కన్పించింది. సభలో గందరగోళం చెలరేగడంతో స్పీకర్ సభను 40 నిమిషాల పాటు వాయిదా వేశారు. తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ "లోక్‌సభలో తనకున్న బలం ఏమిటో ఇండియా కూటమికి తెలుసు.

కానీ ఇది కేవలం బలపరీక్షకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. న్యాయం కోసం చేస్తున్న ప్రయత్నం. మణిపూర్ ప్రజలకు ప్రధాని మోడీ నుంచి ఒక సందేశం వెళ్లాలి. మణిపూర్‌ని ప్రభుత్వం విస్మరిస్తోంది. కాని ఈ విషాద సమయంలో ఇండియా కూటమి అక్కడి ప్రజలకు అండగా నిలుస్తుంది. మేం వారి హక్కుల కోసం పార్లమెంటు లోపల పోరాడుతున్నాం. ఇప్పుడు ఈ వ్యవహారం కేవలం మణిపూర్‌కే పరిమితం కాలేదు. దేశం యావత్తూ ప్రధాని ప్రకటన కోసం ఎదురు చూస్తోంది. దేశ భద్రత, సమగ్రతలను దృష్టిలో పెట్టుకొని ప్రధాని పార్లమెంటులో జాతిని ఉద్దేశించి ప్రసంగించాలి" అని డిమాండ్ చేశారు.

నోటీసుకు అనుమతి

వాయిదా అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైన వెంటనే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు గొగోయ్‌ని స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. దీంతో ఆయన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తీర్మానానికి ఎంతమంది మద్దతు ఇస్తున్నారని స్పీకర్ సభ్యులను అడిగారు. కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు తమ మద్దతు ప్రకటిస్తూ లేచి నిలుచున్నారు. చర్చకు అవసరమైన మద్దతు లభించడంతో తీర్మానాన్ని స్పీకర్ అనుమతించారు. దీనిపై అన్ని పక్షాలతో చర్చించిన తర్వాత సమయం, తేదీ నిర్ణయిస్తామని ప్రకటించారు. సభా వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) సమావేశంలో తీర్మానంపై ఎప్పుడు చర్చ ప్రారంభించాలో, చర్చలో ఏ పార్టీకి ఎంత సమయం ఇవ్వాలో నిర్ణయిస్తారు. చర్చ ముగిసిన తర్వాత ప్రధాని మోడీ సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరుగుతుంది. 2018 జూలై 20న మోడీ ప్రభుత్వంపై మొట్టమొదటి సారిగా తెలుగుదేశం పార్టీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. 126 మంది సభ్యులు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయగా 325 మంది వ్యతిరేకించడంతో ప్రభుత్వం గట్టెక్కింది. ఆ తరువాత మళ్లీ ఇప్పుడు మోడీ ప్రభుత్వం అవిశ్వాసాన్ని ఎదుర్కోబోతోంది.

కొనసాగిన ఆందోళన

మణిపూర్ హింసపై పార్లమెంట్ ఉభయసభల్లో ప్రతిపక్షాల ఆందోళన బుధవారం కూడా కొనసాగింది. మరోవైపు దీనికి ప్రతిగా అధికారపక్షం సైతం ఆందోళన కొనసాగించింది. దీంతో ఉభయ సభలలో వాయిదాల పర్వం కొనసాగింది. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళు లర్పిస్తూ ఉభయసభలలో సభ్యులంతా మౌనం పాటించారు. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు అనుమతించిన తర్వాత అధికార, ప్రతిపక్ష సభ్యులు మళ్లీ ఆందోళనకు దిగారు. దీంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా పడింది. ఆ తర్వాత అటవీ సంరక్షణ సవరణ బిల్లు సహా పలు బిల్లులను ఆమోదించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్

అటు రాజ్యసభలోనూ ప్రతిపక్షాలు మణిపూర్ అంశాన్ని లేవనెత్తగా వారి ఆందోళన మధ్యే కొద్దిసేపు సభా కార్యకలాపాలు కొనసాగించారు. ఆ తరువాత ప్రతిపక్ష సభ్యులకు పోటీగా అధికారపక్ష సభ్యులు కూడా నినాదాలు చేశారు. దీంతో ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతున్న సమయంలో మైక్ కట్ చేయడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తన ఆత్మాభిమానాన్ని సవాలు చేయడమేనని చెప్పారు. ఛైర్మెన్ అనుమతితో మాట్లాడుతున్నప్పటికీ మైక్ కట్ చేయడం తనను అవమానించడమేనని అన్నారు. పలు అంశాలను సభ దృష్టికి తీసుకువస్తున్నానని చెప్పారు. '267వ నిబంధన కింద 50 మంది సభ్యులు నోటీసులు ఇచ్చినప్పటికీ పార్లమెంటులో మాట్లాడేందుకు నాకు అవకాశం రాలేదు. కనీసం నేను మాట్లాడేటప్పుడైనా అది పూర్తి కాకుండానే మైక్‌ను ఆఫ్ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ సభ నడుస్తోందని అనుకుంటే అది ప్రజాస్వామ్యం కాదనే నేను భావిస్తా' అని అన్నారు. ఖర్గేకు మద్దతుగా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. దీంతో అధికార పార్టీ సభ్యులు కూడా 'మోడీ మోడీ' అంటూ ప్రతి నినాదాలు చేయడంతో సభ మొత్తం గందరగోళంగా మారింది.సభను క్రమ పద్ధతిలోకి తీసుకురావా లని ఛైర్మన్ కోరినప్పటికీ సభ్యుల నినాదాలతో సభ హోరెత్తింది. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. హిమాచల్ ప్రదేశ్‌కు సంబంధించిన బిల్లును ఆమోదించిన అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు.

విప్ జారీ చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్

ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేయాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ ఎంపీలందరికీ విప్ జారీ చేశాయి. ఎంపీలందరూ 26, 27, 28 తేదీల్లో సభకు హాజరై బిల్లుపై ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు.

అవిశ్వాస తీర్మానం అంటే....

నిజానికి రాజ్యాంగంలో అవిశ్వాస తీర్మానం ప్రస్తావనే లేదు. కానీ, ఆర్టికల్ 118 ప్రకారం ప్రతి సభ సొంతగా విధానాన్ని రూపొందించుకోవచ్చు. రూల్ 198 ప్రకారం ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి సభ్యులు స్పీకర్‌కు నోటీసు ఇవ్వవచ్చు.

అనుమతి ఇలా...

అవిశ్వాస తీర్మానానికి సభాపతి అనుమతి లభించాలంటే ముందుగా ఎవరైనా సభ్యుడు లోక్‌సభ స్పీకర్‌కు లిఖితపూర్వకంగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. కనీసం 50 మంది సభ్యుల మద్దతు ఉన్నప్పుడే ఈ తీర్మానాన్ని చర్చకు అనుమతిస్తారు. అంటే అవిశ్వాస తీర్మానంపై కనీసం 50 మంది ఎంపీలు సంతకం చేయాలి. లోక్‌సభ స్పీకర్ ఆమోదం పొందిన తర్వాత 10 రోజుల్లో దానిపై చర్చ జరుగుతుంది. చర్చ అనంతరం స్పీకర్ అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. లేదా ప్రత్యేక పరిస్థితులలో ఆయన నిర్ణయం తీసుకోవచ్చు.

ఏ ప్రధానిపై ఎన్నిసార్లు?

(మొదటిపేజీ తరువాయి)

తీర్మానాలు ప్రతిపాదించారు. ఇందిరాగాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొదటి తీర్మానాన్ని, నరసింహారావు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెండో తీర్మానాన్ని వాజ్‌పేయి ప్రవేశపెట్టారు. 2003లో సోనియా గాంధీ కూడా 'అవిశ్వాస తీర్మానం' ప్రవేశపెట్టారు. ఇప్పుడు మోడీపై రెండో సారి 'అవిశ్వాస తీర్మానం' ప్రవేశపెట్టనున్నారు.

కితాబులు సరే...సిబ్బంది ఏరి?

(మొదటిపేజీ తరువాయి)

దళాల పరిస్థితిని గురించి వింటే ఎవరికైనా ఆందోళన కలగక మానదు. ఎముకలు కొరికే చలిలో, ప్రతికూల వాతావరణంలో సైనికులు కంటికి రెప్పలా దేశాన్ని కాపు కాస్తుంటేనే మనం ప్రశాంతంగా నిద్రపోగలుగుతున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప వారి అవసరాలను పాలకులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. సైన్యం, నౌకాదళం, వైమానిక దళంలో ఖాళీగా ఉన్న 11 వేల పైచిలుకు మేజర్, కెప్టెన్ వంటి యువ అధికారుల పోస్టులే త్రివిధ దళాల పట్ల ప్రభుత్వ ఉదాసీనతకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన అధికారిక సమాచారం ప్రకారం భారత సాయుధ దళాలలో మేజర్, కెప్టెన్ సహా 11,266 ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2022లో ఖాళీగా ఉన్న 9,797 పోస్టులు ఆ తర్వాత మరింత పెరిగాయి. అధికారుల కొరత సాయుధ దళాలలోని మూడు విభాగాలనూ ఇబ్బంది పెడుతోందని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ అంగీకరించారు. అయినప్పటికీ ప్రస్తుత సిబ్బంది అవసరాలకు సరిపోతారని చెప్పుకొచ్చారు. సైనిక దళంలో 2,094 మేజర్ ర్యాంక్ పోస్టులు, 4,734 కెప్టెన్ ర్యాంక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నౌకాదళంలో 2,617 లెఫ్టినెంట్ కమాండర్, ఆ కింది స్థాయి పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఇక వైమానిక దళంలో స్క్వాడ్రన్ లీడర్ ర్యాంక్ కలిగిన 881 పోస్టులు, ఫ్లైట్ లెఫ్టినెంట్ ర్యాంక్ కలిగిన 940 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వైద్య సిబ్బంది కూడా...

కేవలం మేజర్, కెప్టెన్ ర్యాంక్ అధికారుల పోస్టులే కాదు...వైద్య సిబ్బంది పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయని మంత్రివర్యులు అంగీకరించారు. త్రివిధ దళాలలో 630 మంది వైద్యులు, 73 మంది దంత వైద్యులు, 701 మంది నర్సులను నియమించాల్సి ఉందని ఆయన తెలిపారు. వీటిలో సైన్యంలోనే అధిక ఖాళీలు ఉన్నాయి. ఆ దళంలో 598 మంది వైద్యులు, 56 మంది దంత వైద్యులు, 528 మంది నర్సుల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. నౌకాదళానికి 20 మంది వైద్యులు, 11 మంది దంత వైద్యులు, 86 మంది నర్సుల అవసరం ఉంది. ఇక వైమానిక దళంలో 12 మంది వైద్యులు, ఆరుగురు దంత వైద్యులు, 87 మంది నర్సులను నియమించాల్సి ఉంది.

కారణం ఏమిటి?

కోవిడ్ సమయంలో నియామకాలు తగ్గడమే సిబ్బంది కొరతకు కారణమని మంత్రి అజయ్ భట్ చెబుతున్నారు. మరోవైపు షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ద్వారా సహాయ సిబ్బంది నియామకాలు తగ్గిపోయాయని రక్షణ శాఖ అంటోంది. వాస్తవానికి సైన్యంలో అధికారుల నియామకాలను వేర్వేరు మార్గాల ద్వారా చేపడతారు. వీటిలో ఎస్ఎస్‌సీ ఒకటి. అక్కడ 11 నెలల పాటు శిక్షణ తీసుకున్న సిబ్బంది ఆఫీసర్ కేడర్‌లో చేరతారు. అనంతరం 10-14 సంవత్సరాలు సేవలు అందిస్తారు. సిబ్బంది కొరతపై లెఫ్టినెంట్ జనరల్ రామేశ్వర్ యాదవ్ వివరణ ఇస్తూ 'సర్వీసు నిబంధనలు కఠినంగా ఉంటాయి. ప్రతిరోజూ ప్రాణాలకు ప్రమాదమే. సైన్యంలో వేతనాలు, ప్రోత్సాహకాలు, పదోన్నతులకు అవకాశాలు వంటివి సివిల్ సర్వీసులలో మాదిరిగా ఆకర్షణీయంగా ఉండవు. ఇంకో విషయమేమంటే కార్పొరేట్ రంగంలో ఆకర్షణీయమైన జీతాలు, ప్యాకేజీలు లభిస్తాయి. సిబ్బంది కొరతకు ఇవే ప్రధాన కారణాలు' అని తెలిపారు. కాగా కొరతను అధిగమించేందుకు ప్రత్యేకమైన వ్యూహాలు ఏమైనా ఉన్నాయా అని మంత్రి భట్‌ను ప్రశ్నించగా అలాంటివేమీ లేవని బదులిచ్చారు. యూనిట్లలో కొరతను అధిగమించేందుకు కేంద్ర కార్యాలయాలలో పని చేసే స్టాఫ్ ఆఫీసర్ల నియామకాలను తగ్గించాలని సైన్యం యోచిస్తున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని రక్షణ శాఖ వివరణ ఇచ్చింది.

అధికారిక సమాచారం ప్రకారం 2022 నుండి ఇప్పటి వరకూ కేవలం 57 మంది మహిళా కేడెట్లను మాత్రమే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ) పరీక్ష ద్వారా నియమించారు. ఈ పరీక్షను యూపీఎస్‌సీ నిర్వహిస్తుంది. మహిళా కేడెట్ల నియామకం విషయంలో హర్యానా (19 మంది) మొదటి స్థానంలో ఉంది. తర్వాతి స్థానం ఉత్తరప్రదేశ్‌ది (12 మంది). ఎన్డీఏలో ఖాళీగా ఉన్న మొత్తం 57 మహిళా కేడెట్ల పోస్టులూ భర్తీ అయ్యాయని రక్షణ శాఖ తెలిపింది.

కార్గిల్ వీరులకు జాతి ఘన నివాళి

న్యూఢిల్లీ : కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా జాతి యావత్తూ అమర జవానుల త్యాగాలను స్మరించుకొని వారికి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులలో శత్రు సైనికులతో వీరోచితంగా పోరాడి ద్రాస్, కార్గిల్, బటాలిక్ సెక్టార్లలో వారిని మట్టి కరిపించి, రణభూమిలో అశువులు బాసిన సాయుధ దళాల సైనికులకు నివాళి అర్పించింది. కార్గిల్ విజయ్ దివస్ 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సైనిక దళాలు లామోచన్ (ద్రాస్)లో కార్యక్రమాన్ని నిర్వహించాయి. దీనికి హాజరైన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళి అర్పించారు. కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన సైనికుల కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. దేశ గౌరవాన్ని కాపాడేందుకు నియంత్రణ రేఖను దాటడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన వ్యాఖ్యానించారు. ఇందుకు ప్రజల మద్దతు కూడా అవసరమని కోరారు.

అటవీ సంరక్షణ బిల్లు ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభలో అటవీ సంరక్షణ సవరణ బిల్లు ఆమోదం పొందింది. బుధవారం లోక్‌సభలో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అటవీ సంరక్షణ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిపై బీజేపీ ఎంపీలు దియా కుమారి, రాజు బిస్తా, వైసీపీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శివసేన (షిండే) ఎంపీ భావన గావాలి మాత్రమే పాల్గొన్నారు. దీనిపై కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ సమాధానం చెప్పారు. అనంతరం మళ్లీ బీజేడీ ఎంపీ భర్తృహరి మహతాబ్, బీఎస్పీ ఎంపీలు రితేష్ పాండే, రాం శిరోమని వర్మ ఒక్కో నిమిషం మాట్లాడారు. అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. బిల్లుపై చర్చ జరిగే సందర్భంలో ఆర్ఎస్పీ ఎంపీ ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ జోక్యం చేసుకొని పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. అవిశ్వాస తీర్మానం పెండింగ్‌లో ఉన్నపుడు ఎటువంటి ప్రభుత్వ విధానపరమైన అంశాలపై సభలో చర్చ జరగ కూడదని అన్నారు. ప్రస్తుతం అవిశ్వాస తీర్మానం స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉందని, అటువంటప్పుడు విధానపరమైన అటవీ సంరక్షణ బిల్లుపై ఎలా చర్చ నడుపుతారని ప్రశ్నించారు. ఈ బిల్లులో జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులను త్వరితగతిన చేపట్టేందుకు, చట్టం పరిధిలోని భూములను మినహాయించాలని బిల్లు ప్రతిపాదిస్తోంది. రైల్వే ట్రాక్, ప్రభుత్వం నిర్వహించే పబ్లిక్ రోడ్డు పక్కన ఉన్న 0.1 హెక్టార్ల వరకు అడవులను తొలగించడానికి ముందస్తు అటవీ క్లియరెన్స్ అవసరాన్ని మినహాయించాలని సవరణ ప్రతిపాదిస్తుంది.

వానొచ్చే..వరదొచ్చే

నవతెలంగాణ- మొఫిసిల్ యంత్రాంగం

రాష్ట్రంలో వర్షాలు ఎడతెరిపివ్వకుండా దంచికొడుతున్నాయి.. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. నదులు, ప్రాజెక్టులు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. వాగులు ఉరకలేస్తున్నాయి. కొన్నిచోట్ల పంట పొలాలు, గ్రామాల రోడ్లూ చెరువులను తలపిస్తున్నాయి. పైర్లు నీట మునిగి మురిగిపోతున్నాయి. వరదలతో మారుమూల గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఇండ్లల్లోకి మురుగు నీరు చేరింది. కొన్ని గ్రామాల నుంచి బయటకు రావాలంటే ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటాల్సి ఉంది. ఈ క్రమంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని వాగులను దాటుతున్నారు. సిద్దిపేట జిల్లాలో బుధవారం ఇలాంటి ఘటనే జరిగింది. ఓ వ్యక్తి చనిపోతే.. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటి అవతల ఉన్న శ్మశాన వాటికలో దహన సంస్కారాలు చేయాల్సి వచ్చింది. భద్రాద్రిలో గోదావరి ప్రమాద హెచ్చరిక జారీ అయింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు జలమయమాయ్యాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఏజెన్సీల్లో కొన్ని గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. గోదావరి నది, కిన్నెరసాని ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల ప్రజలను మైదాన ప్రాంతాలకు తరలించారు. ఖమ్మం నగరంలోని మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వైరా, పాలేరు రిజర్వాయర్లు అలుగు పోస్తున్నాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం 5గంటలకు 39.5 అడుగులు ఉన్న గోదారి క్రమేపీ పెరుగుతూ సాయంత్రం 6 గంటలకు 46.2 అడుగులకు చేరింది. రాత్రి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారుల అంచనా. ప్రస్తుతానికి మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. పట్టణంలోని అశోక్‌నగర్ కొత్త కాలనీ కరకట్ట ప్రాంతంలో సుమారు 50 ఇండ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆ ఇండ్ల వారిని రెవెన్యూ, పంచాయతీ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. రామాలయ ప్రాంతంలో స్లూయిజులు వద్ద మోటర్లు పూర్తిస్థాయిలో పని చేయకపోవడం వల్ల పరిసర ప్రాంతం, అన్నదాన సత్రం మొత్తం వరద నీటిలో చిక్కుకుంది. ఇప్పటికే ఈ నెలలో మూడుసార్లు అధికారుల నిర్లక్ష్యంతో వరద నీటితో సర్వం కోల్పోయిన వ్యాపారస్తులకు మరోసారి ముప్పు తప్పని పరిస్థితి నెలకొన్నది. కొత్త కాలనీలోని కరకట్ట ప్రాంతం మొత్తం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇటు గోదారి ఉగ్రరూపం.. అటు శబరి నది ఉప్పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న నేపథ్యంలో పోలవరం ముంపు మండలాలైన చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, ఎటపాక మండలాలు వరదల్లో చిక్కుకుంటున్నాయి. ఇప్పటికే వీఆర్ పురం, చింతూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు మండలంలోని అనేక గ్రామాలను శబరి ముంపుకి గురయ్యాయి. ఏజెన్సీ వ్యాప్తంగా అనేక గ్రామాలకు రాకపోకలు ఇప్పటికే నిలిచిపోయాయి. పోలవరం వద్ద కాపర్ డాం గేట్లు పూర్తిగా ఎత్తకపోవడం వల్ల ముంపు మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం ఇదే నెలలో వరదలతో సర్వం కోల్పోయిన బాధితులు మరోసారి గోదారమ్మ ఉగ్రరూపానికి బలయ్యారు. గోదావరి పరివాహక మండలాలైన భద్రాచలం, బూర్గంపాడు, మణుగూరు, అశ్వాపురం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.పాల్వంచ కిన్నెరసాని 10 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి సామర్థ్యం 407 అడుగులు కాగా ప్రస్తుతం 405.80 అడుగులు నీరు చేరింది. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక చేశారు. కొత్తగూడెం, కిష్టారం, సత్తుపల్లి, మణుగూరు ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిందని అధికారులు తెలిపారు. మణుగూరులో కట్ట వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చర్లలోని తాలిపేరు ప్రాజెక్టు 15 గేట్లు పూర్తి స్థాయిలో ఎత్తి 11,5956 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రాజెక్టును ప్రస్తుత హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ సందర్శించి వరద ఉధృతిని పర్యవేక్షించారు. భద్రాచలం - పర్ణశాల మధ్య రోడ్డుపై రాకపోకలు నిలిచాయి.యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని రుద్రవెల్లి బ్రిడ్జి వద్ద మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బీబీనగర్ - పోచంపల్లికి రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. భువనగిరి రూరల్ సిఐ సత్యనారాయణ, బీబీనగర్ ఎస్ఐ యుగేందర్ గౌడ్, పరిశీలించి బ్రిడ్జి వద్ద సిబ్బందిని కాపలా పెట్టారు.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మోస్తారు వర్షపాతం నమోదైంది. పలు చోట్ల భారీ వర్షం కురిసింది. నార్సింగ్ మున్సిపాలిటీలోని గౌలిదొడ్డి గ్రామంలో ఇండ్ల మధ్యన ఉన్న భారీ చెట్టు కూలిపోయింది. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బుద్వేల్ భగవత్‌గూడాలో ఓ వృద్ధురాలి ఇల్లు కూలిపోయింది.రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు అత్యధిక వర్షపాతం నమోదైంది. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో ఓ మోస్తారు వర్షపాతం నమోదైంది. శ్రీపాద ఎల్లంపలి ప్రాజెక్టు 11గేట్లు ఎత్తి 81,137 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దిగువమానేరు ప్రాజెక్టులోకి మోయతుమ్మెద వాగు నుంచి వరద కొనసాగుతోంది. శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) ప్రాజెక్టులోకి ఎగువ నుంచి మానేరు, మూల వాగు ద్వారా 9వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు స్పిల్ వే నుంచి 2గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు.

గుంతలమయమైన రోడ్లు

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని అభ్యుదయం కాలనీ జలమయమైంది. రోడ్లు నడవడానికి వీలు లేకుండా గుంతలు పడ్డాయి మంగపేట మండలంలో అబ్బాయిగూడెం ప్రధాన రోడ్డు కొట్టుకుపోయింది. శనిగకుంటకు వెళ్లే దారిలోని పెద్ద ఒర్రె పొంగిపొర్లుతూ రాకపోకలు నిలిచిపోయాయి. తిమ్మంపేట పెద్ద చెరువు, రామచంద్రునిపేట ఊర చెరువు, మంగపేట ఊర చెరువు, చెరుపల్లి చెరువులు మత్తళ్లు పడేందుకు సిద్ధంగా ఉన్నాయి. గౌరారం వాగు, కమలాపురం ఎర్రవాగు, మల్లూరు వాగు, రాజుపేట ముసలమ్మ వాగులు పొంగిపొర్లుతున్నాయి. మేడిగడ్డ, లక్ష్మీబ్యారేజి, తుపాకులగూడెం బ్యారేజ్ గేట్లను అధికారులు ఎత్తారు. రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద వరదనీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడూ పరిశీలిస్తున్నారు. హనుమకొండ జిల్లా చౌరస్తా మొత్తం జలమయమైంది. ఆత్మకూర్ మండలంలో పత్తి పంటలు నీటిలో మునిగిపోగాయి. చలి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల వారిని మైదాన ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కటాక్షపూర్ మత్తడితో రాకపోకలకు అంతరాయమేర్పడింది. కాజీపేట మండలం సోమిడి ప్రగతినగర్ కాలనీలో యాట హర్షవర్ధన్‌రెడ్డి ఇంటిపై పిడుగు పడటంతో ఎలక్ట్రికల్ వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. శాయంపేటమండలంలో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు అలుగు పోస్తుంది. వరదతో సాగు భూముల్లో ఇసుక మేటలు వేశాయి. నారాయణపురం క్రాస్ రోడ్ నుంచి జామాల్ పురం గ్రామానికి వెళ్లే రోడ్డు వరద నీటితో గండిపడింది. వరంగల్ జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో మోకాళ్ళ లోతు నీళ్లు చేరాయి. కల్లెడ ఆకేరు వాగు పాత బ్రిడ్జి సమీపంలో ఉన్న 120 ఏళ్ల చరిత్ర కలిగిన మర్రి చెట్టు(దెయ్యాల మర్రి) నేలమట్టమయింది. మానుకోట జిల్లా మున్నేరు, ఆకేరు, పాలేరు వాగులు పొంగిపొర్లి ప్రవహిస్తున్నాయి. కేసముద్రం గూడూరు వెళ్లే రహదారులు అర్పణ పెళ్లి వాగు పొంగిపోయి రాకపోకలు రద్దయ్యాయి. బ్రిడ్జిపై నుంచి భారీగా నీరు ప్రవహిస్తోంది. మానుకోట-వరంగల్‌కు రహదారులు బంద్ అయ్యాయి. మానుకోట పట్టణంలో జూనియర్ కళాశాల ఎదురుగా డీఎస్పీ కార్యాలయం వద్ద మురికి కాలువలు పొంగి పొర్లి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి.

మూసీకి పోటెత్తిన వరద
7 గేట్లు ఎత్తి 13,308 క్యూసెక్కుల నీరు విడుదల

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో పెద్ద ప్రాజెక్టు అయిన మూసీ రిజర్వాయర్‌కు వరద పోటెత్తడంతో బుధవారం ప్రాజెక్టు 7 క్రస్ట్ గేట్లను మూడు అడుగుల ఎత్తు మేర ఎత్తి దిగువకు 13,308 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి 10,354 వరద నీరు వచ్చి చేరుతోందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుతం 642.10 అడుగుల వద్దకు చేరుకుంది. పూర్తిస్థాయి సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.72 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా 282 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు 7 గేట్లను ఒకేసారి మూడు అడుగుల ఎత్తు లేపడంతో దిగివ మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మూసీ గేట్లు ఎత్తడంతో పర్యాటకుల సందడి ఎక్కువైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో పరిస్థితిని ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నామని డ్యామ్ ఇంజినీర్లు ఉదయ్‌కుమార్, మమత చెప్పారు.

గండిపేట్ 2గేట్లు ఎత్తివేత
జంట జలాశయాలకు భారీగా వరద నీరు

ఎగువ ప్రాంతాల నుంచి జంట జలాశయాలలోకి నీటి వరద ప్రవాహం పెరిగింది. వరద ఉధృతికి జంట జలాశయాల గేట్లను ఎత్తారు. బుధవారం రాజేంద్రనగర్ ప్రకాష్‌గౌడ్ అధికారులతో కలిసి ఉస్మాన్‌సాగర్ (గండిపేట్) రెండు గేట్లను ఎత్తారు. ఎగువ ప్రాంతాలైన తాండూర్, పరిగి వికారాబాద్, శంకర్‌పల్లి ప్రాంతాల నుంచి మూసీ ఉధృతంగా ప్రవహించడంతో గండిపేట చెరువు నీటిమట్టం పూర్తిగా నిండిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం 208 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఇప్పటికే హిమాయత్‌సాగర్ నాలుగు గేట్లు ఎత్తి నీటిని కిందికి విడుదల చేశారు. వరద మరింత పెరిగితే ఉస్మాన్‌సాగర్ మరిన్ని గేట్లు తెరిచే అవకాశం ఉందన్నారు. గేట్లు ఎత్తడంతో మూసీకి దిగువన ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మూసీ పరివాహ ప్రాంతాలకు ఎవరూ వెళ్లొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

వచ్చే రెండ్రోజులు భారీ వర్షాలే

- పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ హెచ్చరికల జారీ
- హైదరాబాద్, చుట్టుపక్కల జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం
- భద్రాద్రి కొత్తగూడెంలో కుండపోత
- 29.02 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- ఈ ఏడాది ఇదే అత్యధికం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పలు జిల్లాల్లో వచ్చే రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నిర్మల్, రంగారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేశారు. ఈ జిల్లాలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అదే సమయంలో గంటలకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నారు. బంగాళాఖాతంలో ఉత్తర ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా మధ్య ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనం కొనసాగుతున్నదనీ, నెమ్మదిగా కదులుతూ అది తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు.

రాష్ట్రం మీదుగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతుండటంతో రాబోయే మూడు రోజులు ఎక్కువ ప్రాంతాల్లో మోస్తరు, కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు, మరికొన్ని జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. బుధవారం రాత్రి 11 గంటల వరకు 29.02 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది రాష్ట్రంలో ఇదే రికార్డు. భద్రాద్రి కొత్తగూడెం, జనగాం, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, ములుగు, ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో 33 చోట్ల అత్యంత భారీ వర్షాలు పడ్డాయి. అక్కడ 12 సెంటీమీటర్లకుపైనే వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో బుధవారం రాత్రి 11 గంటల వరకు 908 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు కాగా, 135 ప్రాంతాల్లో భారీ, 414 ప్రాంతాల్లో మోస్తరు వానలు పడ్డాయి.

అత్యధిక వర్షపాతం నమోదైన జిల్లాలు
(బుధవారం రాత్రి 10 గంటల వరకు)

కరకగూడెం (భద్రాద్రి కొత్తగూడెం)	29.02 సెంటీమీటర్లు
కొత్తగూడెం(భద్రాద్రి కొత్తగూడెం)	21.73 సెంటీమీటర్లు
కల్లెడ(వరంగల్)	19.03 సెంటీమీటర్లు
సుజాతనగర్(భద్రాద్రి కొత్తగూడెం)	17.45 సెంటీమీటర్లు
లక్ష్మీదేవిపల్లి (భద్రాద్రి కొత్తగూడెం)	17.15 సెంటీమీటర్లు
కారేపల్లి(ఖమ్మం)	15.25 సెంటీమీటర్లు
ఏడూళ్ల బయ్యారం (భద్రాద్రి కొత్తగూడెం)	15.20 సెంటీమీటర్లు

ఇంటర్‌లో చేరాలంటే రూ.500 కట్టాల్సిందే...

ఆగస్టు 1 నుంచి ఆలస్య రుసుంతో ప్రవేశాలు

- ఇంటర్ బోర్డు కొత్త నిర్ణయంపై విద్యార్థుల్లో ఆందోళన
- ఉచిత విద్య అంటూనే భారాలు మోపుతున్న వైనం
- ప్రభుత్వ కాలేజీల్లో చేరికలపై తీవ్ర ప్రభావం
- పేద పిల్లలు చదువుకు దూరమయ్యే ప్రమాదం
- ప్రవేశాల గడువు 31 వరకు పొడిగింపు
- 30 వరకు కాలేజీలకు సెలవులే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఇంటర్ విద్యార్థులపై ప్రభుత్వం భారాలు మోపుతున్నది. 2023-24 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరాలంటే రూ.500 కట్టాల్సిందేనని హుకుం జారీ చేసింది. ఇందుకు సంబంధించి ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల ఒకటి నుంచి ఇంటర్‌లో ప్రవేశం పొందాలంటే ఆలస్య రుసుం రూ.500 చెల్లించాలని ఆదేశించారు. ఇంటర్‌లో చేరేందుకు వచ్చేనెల 16 వరకు గడువున్నది. గతంలో ఇలాంటి నిర్ణయాన్ని ఇంటర్ బోర్డు ఎప్పుడూ తీసుకోలేదు. ఈ కొత్త నిర్ణయంపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ విద్యను ఉచితంగా అందిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా చెప్తున్నది. 2015-16 విద్యాసంవత్సరం నుంచి విద్యార్థుల నుంచి ట్యూషన్ ఫీజును వసూలు చేయకుండా ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందిస్తున్నది. కానీ కాలేజీల్లో చేరాలంటే రూ.500 ఆలస్య రుసుం కట్టాలన్న నిబంధన విధించడం గమనార్హం. ఉచిత విద్య అంటూనే విద్యార్థులపై భారాలు మోపడం సరైంది కాదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత నిర్ణయం వల్ల ఆయా కాలేజీల్లో విద్యార్థుల చేరికలపై తీవ్ర ప్రభావం పడనుంది. ప్రవేశాలు తగ్గిపోయే అవకాశమున్నది. పేద విద్యార్థులే ప్రభుత్వ కాలేజీల్లో చేరతారు. ఈ నిర్ణయంతో కొందరు చదువుకు దూరమయ్యే ప్రమాదం లేకపోలేదు. దీనిపై పునరాలోచించాలని విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అయితే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 72



వేల మంది చేరారు. వారిలో జనరల్ కేటగిరీ విభాగంలో 55 వేల మంది, ఒకేషనల్ కేటగిరీ విభాగంలో 17 వేల మంది ఉన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం అత్యధికంగా హైదరాబాద్-2లో 4,681 మంది, రంగారెడ్డిలో 3,654 మంది, ఆదిలాబాద్‌లో 3,209 మంది, అత్యల్పంగా 360 మంది ప్రవేశం పొందినట్టు సమాచారం.

31 వరకు ప్రవేశాల గడువు పొడిగింపు

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును ఈనెల 27 నుంచి 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియను కొనసాగించాలని కోరారు. కాలేజీల ప్రిన్సిపాళ్లు విద్యార్థులను చేర్చుకోవాలని సూచించారు. అయితే వర్షాల నేపథ్యంలో గురువారం కాలేజీలకు సెలవున్నది.

శుక్రవారం మొహర్రం సందర్భంగా ఐచ్ఛిక సెలవు, శనివారం సాధారణ సెలవున్నది. మరుసటి రోజు ఆదివారం. దీంతో ఈనెల 31న మాత్రమే విద్యార్థులు కాలేజీల్లో చేరేందుకు అవకాశమున్నది. ప్రవేశాల గడువును పొడిగించినా అది విద్యార్థులకు ప్రయోజనం కలిగించే అవకాశం లేదు. ఆ గడువును వచ్చేనెల 15వ తేదీ వరకు పొడిగించాలని అధ్యాపక సంఘాలు ఇంటర్ బోర్డును కోరుతున్నాయి.

ఇంటర్ బోర్డు కార్యదర్శికి టీజీజేఎల్‌ఏ ధన్యవాదాలు

రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు చేరే గడువును ఈనెల 31 వరకు పొడిగించడం పట్ల ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్‌కు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్‌ఏ-475) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ధన్యవాదాలు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రవేశాల గడువును పొడిగించాలంటూ ఆన్‌లైన్‌లో వినతిపత్రం సమర్పించామని పేర్కొన్నారు. ఆలస్య రుసుం లేకుండా ఈనెల 31 వరకు చేరేందుకు అవకాశముందనీ, ఆ గడువును మరిన్ని రోజులు పొడిగించాలని కోరారు. రూ.500 ఆలస్య రుసుంతో వచ్చేనెల ఒకటి నుంచి 16 వరకు చేరొచ్చని సూచించారు.

కేటీఆర్‌కు ఐఎస్‌బీ ఆహ్వానం

- ఆగస్ట్ 11న మొహాలీలో విద్యార్థులనుద్దేశించి : ప్రసంగించనున్న మంత్రి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర పురపాలక, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) ఆహ్వానాన్ని పంపింది. ఐఎస్‌బీ ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న 'అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం ఇన్ పబ్లిక్ పాలసీ' ఎనిమిదవ బ్యాచ్‌ను ప్రారంభించాల్సిందిగా కేటీఆర్‌ను కోరింది. ఆగస్ట్ 11న మొహాలీలో జరిగే కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడనున్నారు.

ఎంఎస్ స్వామినాథన్‌తో మంత్రి నిరంజన్‌రెడ్డి భేటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ అంశాలపై చర్చించేందుకు హరిత విప్లవ పితామహుడు ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్‌తో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి భేటీ అయ్యారు. బుధవారం చెన్నై రత్నానగర్‌లో ఆయన్ను కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను సందర్శించారు. 9 ఏండ్లలో తెలంగాణ వ్యవసాయ విజయాలను మంత్రి వివరించారు. రాష్ట్రంలో రైతు అనుకూల విధానాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. 'తెలంగాణకు వస్తా...వ్యవసాయ ప్రగతి చూస్తా' అని స్వామినాథన్ చెప్పినట్టు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖా కార్యదర్శి రఘునందన్‌రావు, విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు, డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ కొణతం తదితరులు ఉన్నారు.

మరుగున పడ్డ చరిత్రను వెలికితీస్తున్నాం.

- చందో వైవిధ్య గ్రంథావిష్కరణలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- రచయిత సంగయ్యను అభినందించిన మంత్రి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రాష్ట్రంలో మరుగున పడ్డ చరిత్రను వెలికితీస్తున్నాం. చారిత్రక, శాసన, భాషా పరిశోధనలో కొత్త కోణాలను వెలికి తీయడం దేశ శాసన పరిశోధనలో తొలి ప్రయత్నం' అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో ప్రముఖ రచయిత, చరిత్ర పరిశోధకులు డాక్టర్ లగడపాటి సంగయ్య రూపొందించిన 'కాకతీయుల శాసనాలలో ఛందో వైవిధ్యం' అనే గ్రంథాన్ని మంత్రి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంగయ్యను అభినందించి, ఈ సందర్భంగా మాట్లాడుతూ చరిత్ర రచన, శాసన, భాషా శాస్త్రంలో కొత్త కోణాలను వెలికితీయడం తొలి ప్రయత్నమన్నారు. కాకతీయుల కాలంనాటి 142 శాసనాలను అధ్యయనం చేసి 49 రకాల చందస్సును విశ్లేషించడం గొప్ప విషయమన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా సాహిత్య, చారిత్రక, సాంస్కృతిక, కళాత్మక అంశాలు, శాసన పరిశోధన గ్రంథాలను సేకరించి ప్రచురిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రముఖ చరిత్ర పరిశోధకులు ఈమని శివనాగిరెడ్డి, సామజిక వేత్త కురేళ్ళ వేములయ్యగౌడ్‌లు పాల్గొన్నారు.

తీర్పును సస్పెన్షన్‌లో ఉంచండి

- హైకోర్టులో ఎమ్మెల్యే వనమా పిటిషన్
- తీర్పు వాయిదా వేసిన న్యాయస్థానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు చూపలేదని తప్పుపడుతూ తన ఎమ్మెల్యే ఎన్నిక చెల్లదని ఇచ్చిన తీర్పు అమలును నిలిపేయాలని కోరుతూ కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌పై హైకోర్టులో బుధవారం వాదనలు ముగిశాయి. వనమా వేసిన మధ్యంతర పిటిషన్‌పై తుది ఉత్తర్వులు తర్వాత వెలువరిస్తామని కోర్టు ప్రకటించింది. ఈ మేరకు జస్టిస్ రాధారాణి ఆదేశాలు జారీ చేశారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు వెళతామని వనమా లాయర్ తెలిపారు. మూడు నెలల్లో ఎన్నికలు వస్తాయనీ, ఈ దశలో తీర్పుపై స్టే ఇవ్వకపోతే తీవ్ర నష్టం జరుగుతుందని వాదన వినిపించారు. తనకు కనీసం మిగిలిన 3 నెలలైనా ఎమ్మెల్యేగా చేసి జనానికి సేవ చేసే అవకాశం ఇవ్వాలని జలగం న్యాయవాది కోరారు. మధ్యంతర పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు తన తీర్పును తర్వాత ప్రకటిస్తానని తెలిపింది.

హైకోర్టులో రేవంత్‌రెడ్డి పిటిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్) టోల్ ఆపరేట్ బదిలీ(టీవోటీ)కి సంబంధించిన సమాచారాన్ని ఇవ్వడం లేదంటూ ఎంపీ, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమాచార హక్కు చట్ట ప్రకారం కోరినా అధికారులు అరకొర సమాచారమే ఇచ్చారని తెలిపారు. మళ్లీ దరఖాస్తు చేసుకుంటే కూడా పూర్తి సమాచారం ఇవ్వడం లేదని పేర్కొన్నరు. పూర్తి సమాచారం ఇచ్చేలా అధికారులకు ఉత్తర్వులివ్వాలని కోరారు. ఓఆర్ఆర్ నిర్వహణ, టోలు వసూలు బాధ్యతలను 30 ఏండ్ల పాటు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ లిమిటెడ్, ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్‌లకు అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ), హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ప్రజా సంబంధాల అధికారి, ఎండీ(ఎఫ్ఏసీ)లను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

ముందస్తు నిర్బంధం సబబే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏటీఎంల్లో నగదు చోరీలకు పాల్పడే నిందితులపై పీడీ యాక్ట్ కింద ముందస్తు నిర్బంధంలోకి తీసుకోవడాన్ని హైకోర్టు సమర్ధించింది. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను కొట్టేయాలన్న పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ పీడీ యాక్ట్ కింద ఉత్తర్వులు జారీ చేయగా దాన్ని ఆమోదిస్తూ ప్రభుత్వం జూన్ 13న జీవో జారీ చేసింది. పంజాబ్‌కు చెందిన గుర్‌గగన్ సింగ్ దిలో, భూపేందర్ సింగ్ అలియాస్ హర్దీతిసింగ్‌లపై ప్రభుత్వం పీడీ యాక్ట్ ఉత్తర్వులను జారీ చేయడాన్ని నిందితుల తరపు సోదరుడు హర్భిందరిసింగ్ హైకోర్టులో సవాల్ చేశారు. హెబియస్ కార్పస్ పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధలతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టేస్తూ తీర్పు వెలువరించింది.

జస్టిస్ లలితకు వీడ్కోలు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కర్నాటక హైకోర్టుకు బదిలీ అయిన జస్టిస్ కన్నెగంటి లలితకు తెలంగాణ హైకోర్టు బుధవారం వీడ్కోలు తెలిపింది. మధ్యాహ్నం 3.45 గంటలకు చీఫ్ జస్టిస్ అలోక్ అరధే అధ్యక్షతన ఫుల్ కోర్టు వీడ్కోలు చెప్పింది.హైకోర్టు న్యాయవాదులు సంఘం కూడా ఆమెను సత్కరించింది.

పిల్లల ప్రతిభకు పదును పెట్టండి

- ఆర్మీ పబ్లిక్ స్కూల్ కార్యక్రమంలో బ్రిగ్ ఏఏ దేశ్‌పాండే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



దేశానికి సముచిత స్థానాన్ని ఏర్పరచడానికి పిల్లల ప్రతిభకు, వారిలో ఉన్న సామర్థ్యానికి పదును పెట్టాలని బ్రిగ్ ఏఏ దేశ్‌పాండే అన్నారు. వారిలో ఉండే మెరిసే భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని ఆర్కే పురంలో ఉన్న ఆర్మీ పబ్లిక్ స్కూల్ మొదటి తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులతో 'బ్రిలియంట్ అవెనిర్-విద్యాప్రవేశ్' అనే అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పిల్లలకు టోకెన్‌ను అందించి వారి కృషిని అనూజా దేశ్‌పాండే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అర్చనరాయ్, ప్రధానోపాధ్యాయురాలు పూజాసింగ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ యాజమాన్యం కొమ్ముకాస్తున్న కార్మికశాఖ

- పది రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి...
- లేకుంటే కమిషనర్ కార్యాలయం ఎదుట వంటా-వార్పు
- తక్షణం ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి
- చలో లేబర్ కమిషనరేట్ ఆందోళనలో జేఏసీ నేతలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కార్మికుల పక్షాన నిలవాల్సిన కార్మికశాఖ యాజమాన్యం కొమ్ముకాస్తూ, కోర్టు ఉత్తర్వుల్ని కూడా అమలు చేయట్లేదని టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలు విమర్శించారు. పదిరోజుల్లో ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించి, సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలనీ, లేనిపక్షంలో లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున వంటా-వార్పు కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. 'చలో కార్మిక శాఖ కమిషనరేట్' అంటూ జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారంనాడిక్కడ ఆందోళనా కార్యక్రమం జరిగింది. జేఏసీ ఛైర్మెన్ కే రాజిరెడ్డి, కో కన్వీనర్ కే యాదయ్య, కమిటీ సభ్యులు జీఆర్ రెడ్డి, కృష్ణ, ప్రకాశ్ తదితరులు మాట్లాడారు. ఆర్టీసీలో మూడున్నరేండ్లుగా కార్మిక సంఘాల కార్యకలాపాలను అనుమతించడం లేదనీ, గుర్తింపు సంఘం కమిటీల స్థానంలో ఎంప్లాయి వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు. సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చినా, యాజమాన్యం, కార్మిక శాఖ పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. ఆర్టీసీలో రోజురోజుకూ కార్మికుల సంఖ్య తగ్గిపోతున్నదనీ, కొత్త నియామకాలు చేపట్టకుండా ఉన్నవారిపై పనిభారాలు మోపుతున్నారని చెప్పారు. 8 గంటల పని స్థానంలో 12 నుంచి 16 గంటలు పనిచేయిస్తున్నారన్నారు. మహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటల లోపు దిగేలా డ్యూటీలు వేయడం లేదనీ, కార్మికులపై ఒత్తిడి, వేధింపులు తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ, టెర్మినల్ బెనిఫిట్స్ కూడా సకాలంలో చెల్లించట్లేదని తెలిపారు. అనంతరం లేబర్ కమిషనర్ అహ్మద్ నదీమ్‌కు జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసీ యాజమాన్యంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ఎస్ జక్రయ్య, బీ జ్యోతి, బీ పాపయ్య గౌడ్, సీహెచ్ బాపురెడ్డి శరణప్ప, శారద, కల్పన, శమంత తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ' జేఏసీతో చర్చించి సమ్మెను విరమింపజేయండి

సీఎం కేసీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే జూలకంటి లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



గ్రామపంచాయితీ కార్మికుల సమ్మె కారణంగా గ్రామాల్లో చెత్త పేరుకపోయి విషజ్వరాలు ప్రబలే ప్రమాదముందని సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీలో చర్చించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. ఈమేరకు బుధవారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. గత 21 రోజుల నుంచి గ్రామ పంచాయితీ కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. వారికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను, ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. గత్యంతరం లేక సమ్మెకు వెళుతున్నట్టు వారు ముందుగానే తెలియజేశారని వివరించారు. అయినా. ప్రభుత్వం ముందస్తుగా వారితో చర్చించకపోవడం, నిర్లక్ష్యం, లెక్కలేనితనంతో వ్యవహించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యమైన చర్యని తెలిపారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, 21 రోజుల నుంచి వీధులు ఊడ్చకపోవడం వల్ల చెత్తా, చెదారంతో గ్రామాలు కంపుకొడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలక మండళ్ళు కూడా సమస్య తీవ్రతను గుర్తించి, వీరి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తీర్మానాలు కూడా చేస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలనీ, ఒకరికిచ్చే నెల వేతనం ఇద్దరికి, ముగ్గురికి పంచే పద్ధతి సరైంది కాదని తెలిపారు. అవసరమైతే కొత్తగా నియామకమైన వారికి అదనపు బడ్జెట్ కేటాయించి కనీస వేతనం అమలు చేయాలని సూచించారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత కేటగిరీలను కొనసాగించాలనీ, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, ఎనిమిది గంటల పని విధానం, వారాంతం, ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలని కోరారు. కార్మికులు అడిగేది గొంతెమ్మ కోరికలు కావని తెలిపారు. వీటిలో కొన్నింటిని అమలు చేస్తామన్న హామీ కూడా అమలుకు నోచుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కార్మికుల తరపున సమ్మె ప్రారంభమైన కాలం నుంచి తాము కూడా పలుమార్లు అధికారులు, మంత్రులకు సమస్యలను, పరిస్థితుల తీవ్రతను వివరించామని గుర్తు చేశారు. అయినా స్పందించకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా మీనమేషాలు లెక్కించకుండా జేఏసీ కార్మిక జీవితాలను, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వెంటనే కార్మిక సంఘాల జేఏసీని పిలిచి, వారితో చర్చించి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. తద్వారా సమ్మెను విరమింపజేయాలని జూలకంటి ...సీఎంకు విజ్ఞప్తి చేశారు.

'భారత్‌మాల'తో భారీ ఇబ్బందులు

- వర్షాల నేపథ్యంలో ట్రాఫిక్‌జామ్‌లు
- ఐదేండ్లుగా ఎలివేటెడ్ కారిడార్ పనులు
- ఉప్పల్-నారపల్లి రోడ్డుకు మోక్షం
- సీఎం కేసీఆర్ ఆదేశం



అగిపోయిన పనులు... నిలిచిపోయిన ట్రాఫిక్...

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్లు, ఫ్లైఓవర్ల పనుల్లో తీవ్ర జాప్యం కనిపిస్తున్నది. నిధుల విడుదలలోనూ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ ప్రాజెక్టు నిర్మాణమే ఇందుకు సాక్ష్యం. వర్కింగ్ ఏజెన్సీ చురుగ్గా పనిచేయకపోవడంతో ఐదేండ్లుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కేంద్రం ప్రారంభించిన ఒకే ఒక్క ప్రాజెక్టు ఏండ్లతరబడి ఆపసోపాలు పడుతుండగా, వాహనదారుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. సాధారణంగా తరచుగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడే ఉప్పల్ ప్రాంతంలో, వర్షాల నేపథ్యంలో మరిన్నీ ఇక్కట్లు తప్పడం లేదు. ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారింది ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు పరిస్థితి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టుతో ప్రజలకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. ఐదేండ్ల క్రితం చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు 40 శాతం కూడా పూర్తికాలేదు. ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన రెండేండ్లలోనే 6.2 కిలోమీటర్ల మేర భూసేకరణ చేసి జాతీయ రహదారుల అభివృద్ధి అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ)కి జీహెచ్‌ఎంసీ అప్పగించింది. కానీ పనుల పురోగతి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. రోడ్డు మధ్యన నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఉప్పల్, నారపల్లి మధ్య ప్రయాణానికి కనీసం గంటకుపైగా సమయం పడుతున్నది. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు ప్రయాణం నరకప్రాయమవుతున్నది. ఉప్పల్ రింగ్‌రోడ్డు, బోడుప్పల్, మేడిపల్లి, చెంగిచర్ల చౌరస్తాల వద్ద తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక వర్షం వచ్చినప్పుడు, పండుగల సమయంలోనైతే ప్రయాణీకుల బాధలు వర్ణనాతీతం. ట్రాఫిక్ సమస్య మరింత పెరిగి వాహనదారుల్లో అసహనం పెంచుతున్నది.

ప్రాజెక్టు ఉద్దేశం..

ఉప్పల్ - మేడిపల్లి మధ్య ట్రాఫిక్ సమస్యకు చరమగీతం పాడేందుకు ఈ ఆరు లేన్ల స్కైవే నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. 163 జాతీయ రహదారిపై 6.2 కిలోమీటర్ల మేర 148 పిల్లర్లతో పనులకు శ్రీకారం చుట్టారు. 2018 జూలైలో పనులు ప్రారంభం కాగా, 2020 జూన్ వరకు నిర్మాణం పూర్తిచేయాలనేది లక్ష్యం. ఈ నిర్మాణ పనులతో ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. కారిడార్ పనులు పూర్తయితేనే దెబ్బతిన్న రోడ్డు పనులు పూర్తిచేయగలమని అధికారులు అంటున్నారు.

భారత్‌మాల...

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం భారత్‌మాల పథకం కింద చేపట్టింది. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రూ.626.80 కోట్ల వ్యయంతో ఉప్పల్-నారపల్లి మధ్య నిర్మిస్తున్న ఈ ఆకాశ మార్గానికి కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ 2018, మే నెలలో శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ఐదేండ్లు గడిచినా 40 శాతం పనులే పూర్తయ్యాయనీ, ఇప్పటికిప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారిస్తే ఈ ఫ్లై ఓవర్ మరో రెండేండ్లలో అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎలివేటెడ్ కారిడార్ పనులు, రోడ్డు పనులు తీవ్ర ఆలస్యమవుతుండంతో ఉప్పల్ ప్రధాన రహదారిలోని వ్యాపారాలు దెబ్బతిన్నాయి. వ్యాపార సముదాయాల వద్ద వాహనాలు పార్కింగ్ చేసే అవకాశమే లేదు. లాభం కంటే నష్టాలు ఎక్కువగా వస్తున్నాయి. పనులు పూర్తిచేసి, రోడ్ల నిర్మాణం జరిగితే కనీసం వ్యాపారం కొనసాగించడానికి వీలుంటుందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. శుభకార్యాలు, ఉదయం, సాయంత్రం రద్దీ సమయంలో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడానికి సిబ్బంది చాలా శ్రమించాల్సి వస్తున్నది. ఈ పరిస్థితిని స్థానిక ప్రజాప్రతినిధులు ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఉప్పల్-నారపల్లి రోడ్డు పనులు పూర్తిచేసి ట్రాఫిక్ సమస్యలను నివారించాలని ఆయన ఆదేశించారు. ఈమేరకు ఆపనులపై ఆర్అండ్‌బీ శాఖ దృష్టిసారించింది.

ప్రధాని కిసాన్ సేవా కేంద్రాలుగా ఎరువుల రిటైల్ షాపులు

- నేడు ప్రధాని మోడీ రాజస్థాన్‌లో ప్రారంభిస్తారు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలోని ఎరువుల రిటైల్ షాపులను ప్రధాని కిసాన్ సేవా కేంద్రాలుగా మార్చబోతున్నట్టు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని గురువారం నాడు రాజస్థాన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభిస్తారనీ, శామీర్‌పేటలో తాను పాల్గొంటానని తెలిపారు. 14వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను కూడా 8.5 కోట్ల రైతుల ఖాతాల్లో గురువారం జమచేస్తామని చెప్పారు. తెలంగాణలో సుమారు 39 లక్షల మంది రైతుల అకౌంట్లలో డబ్బులు పడతాయన్నారు. అమెరికాలో ఒక యూరియా బస్తాను రూ.3 వేలకు రైతుకు దక్కుతుంటే మన దేశంలో మాత్రం రూ.265కే ఇస్తు న్నామని వివరించారు. 2014తో పోలిస్తే వరికి మద్దతు ధర 61 శాతం, పత్తికి రెట్టింపు స్థాయిలో పెంచామన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఒక తాను ముక్కలేనని విమర్శించారు. బీజేపీ ఆ మూడు పార్టీలతో గతంలో ఎప్పుడూ కలవలేదనీ, భవిష్యత్తులోనూ కలువబోమని స్పష్టం చేశారు.

ప్రజలను ఆదుకోవడంలో సర్కారు విఫలం : టీపీసీసీ చీఫ్ రేవంత్


నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గత వారం రోజులుగా కరుస్తున్న వానలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ అధ్యక్షులు,ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. సీఎం కేసీఆర్‌గానీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌గానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేటీఆర్ పుట్టిన రోజు మోజులో ఉండి ప్రజలను మరచిపోయారని విమర్శించారు. వరదలపై ప్రభుత్వం కనీసం సమీక్ష కూడా చేయలేదని తెలిపారు. భారీ వర్షాలతో రాష్ట్రం మొత్తం అల్లకల్లోలంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు నానా యాతన పడుతున్నారని తెలిపారు.

గంటలకొద్దీ రోడ్లపైనే ప్రజలు కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ డల్లాస్, ఓల్డ్ సిటీ ఇస్తాంబుల్ చేస్తామని ప్రగల్భాలు పలికిన కేసీఆర్, కేటీఆర్ హైదరాబాద్ నగరాన్ని నరక కూపంగా మార్చారని విమర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, నాలాలు, వరద ప్రాంతాలకు వెళ్లకూడదని విజ్ఞప్తి చేశారు. పాత భవనాలు, గోడలు, పాడు బడ్డ ఇండ్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని కోరారు. పిల్లలను బయటకు పంపవద్దని తెలిపారు. రాష్ట్రంలో గతంలో వరదలతో భారీ ఆస్తి, ప్రాణ, పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

రూ.50లు...30 కి.మీ..

- ఆర్టీసీలో టీ9-30 టికెట్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గ్రామీణ, పట్టణ ప్రయాణికుల కోసం టీఎస్‌ఆర్టీసీ మరో కొత్త రాయితీ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. 'టీ9-30 టికెట్' పేరుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రూ.50 ధరతో 30 కిలోమీటర్ల లోపు ప్రయాణించే వారికోసం ఈ రాయితీ టిక్కెట్‌ను తీసుకొచ్చినట్టు ఆ సంస్థ ఛైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. బుధవారం బస్‌భవన్‌లో టీ9-20 టిక్కెట్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ టిక్కెట్ వల్ల పల్లె వెలుగు బస్సుల్లోని ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. పల్లె వెలుగు బస్ కండక్టర్ల వద్ద లభించే ఈ టిక్కెట్లు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని వివరించారు. సాయంత్రం 6 గంటల వరకే ఈ టికెట్‌ను కండక్టర్లు ఇస్తారు. రాష్ట్ర సరిహద్దుల్లో 30 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఇతర రాష్ట్రాలకూ ఈ టికెట్ వర్తిస్తుందని తెలిపారు. ఈ టికెట్ తీసుకున్న ప్రయాణీకులు తిరుగు ప్రయాణంలో రూ.20 కాంబి టికెట్ తీసుకుని ఎక్స్ ప్రెస్ సర్వీసుల్లోనూ ప్రయాణించవచ్చు. ప్రయోగాత్మకంగా నెలరోజులు ఈ టిక్కెట్లను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ప్రయాణీకుల స్పందనను బట్టి గడువును పొడిగిస్తారు. అలాగే ఇటీవల టీఎస్‌ఆర్టీసీ అందుబాటులోకి తీసుకువచ్చిన టి9-60 టికెట్‌ను పల్లెవెలు గు బస్సుల్లో ప్రయాణించే వారందరికీ వర్తింపజేస్తున్నట్టు వారు తెలిపారు. గతంలో ఈ టిక్కెట్లను మహిళలు, సీనియర్ సిటిజన్లకు మాత్రమే వర్తింపచేశారు. దీనిలో రూ.100 చెల్లించి 60 కిలోమీటర్ల పరిధిలో రానూపోను ప్రయా ణించవచ్చు. ఈ టికెట్ కు మంచి స్పందన వచ్చిన నేపథ్యంలో దానికి కొనసాగిం పుగా తక్కువ దూరం ప్రయాణించే వారికోసం టీ9-30 టికెట్‌ను తీసుకొచ్చినట్టు వివరించారు. ఇతర వివరాలకు టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000,040-23450033ను సంప్రదించాలని సూచించారు. కార్య క్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వీ రవీందర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పీవీ ముని శేఖర్, పురుషోత్తం, కృష్ణ కాంత్, సీటీఎం జీవన్ ప్రసాద్, చీఫ్ మేనేజర్ ప్రాజెక్ట్స్ విజయ్ కుమార్, సీఎంఈ రఘునాథరావు, సీఈఐటీ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆ ఉద్యోగులను సొంత రాష్ట్రానికి బదిలీ చేయండి

- సీఎం కేసీఆర్‌కు కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఏపీ, తెలంగాణలో ఉన్న స్థానికేతరులుగా ఉన్న ఉద్యోగులను వారి సొంత రాష్ట్రానికి బదిలీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనలో భాగంగా ఉద్యోగుల విభజన కూడా జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయి ఉద్యోగులకు మాత్రమే ఆయా రాష్ట్రాల బదిలీలకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. జిల్లా/జోనల్/ మల్టీజోనల్ ఉద్యోగులు స్థానికేతరులుగా ఏపీ, తెలంగాణలో ఇప్పటికీ పనిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన ఉద్యోగులు దాదాపు 514 మంది ఏపీలో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని వివరించారు. స్థానికేతరులుగా అక్కడ పనిచేయడం వల్ల పిల్లల రిజర్వేషన్ కోల్పోవడం, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు దూరంగా ఉండటం వల్ల చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. తెలంగాణాలో పనిచేస్తున్న ఏపీకి చెందిన దాదాపు 1,808 మందిని వారి రాష్ట్రానికి తీసుకవెళ్లడానికి అక్కడి ప్రభుత్వం నిర్ణయం చేసిందని గుర్తు చేశారు. ఆ దస్త్రం తెలంగాణ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఇప్పటికే తొమ్మిదేండ్లు గడిచాయని పేర్కొన్నారు. ఉద్యోగుల బాధలను గుర్తించి స్థానికేతరులుగా పనిచేస్తున్న ఉద్యోగులను సొంత రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు.

సంపాదకీయం

ప్రణాళికలు సరే... ఫలితాలేవి...?

మొన్నటిదాకా కానరాని వాన గతవారం రోజుల నుంచి దంచి కొడుతోంది. మోస్తరుగా మొదలై... భారీ, అతి భారీ, అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ సహా జిల్లాలన్నీ అతలాకుతలమవుతున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లటం, రోడ్లు తెగిపోవటంతో అనేక ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. ఇంకో మూడు నాలుగు రోజులపాటు పరిస్థితి ఇలాగే ఉంటుందంటూ వాతావరణశాఖ ప్రకటించింది. ఆరెంజ్, ఎల్లో, రెడ్ హెచ్చరికలను జారీ చేసింది. ఈ పరిస్థితి దృష్ట్యా ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రులు, ఉన్నతాధికారులు సమీక్షల మీద సమీక్షలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

> **వాన రావటం, దాన్ని ఆపటమనేది మన చేతిలో లేదు. కానీ వరదను నియంత్రించటం, ఆ నీటిని మళ్లించటమనేది మన చేతిలో ఉన్నదే కదా..? అలాంటప్పుడు దాన్ని నివారించేందుకు, నియంత్రించేందుకు ప్రభుత్వం వేస్తున్న, వేసిన ప్రణాళికలు ఏమైపోతున్నట్టు..? ఏండ్లు గడిచినా వాటి ఫలితాలను ఎందుకు రాబట్టలేకపోతున్నాం..? అనే అంశంపై లోతైన చర్చ జరగాలి.**

ఇదంతా సరే... కానీ గతంలో ఇలాగే కుంభవృష్టి కురిసి పరిస్థితి అదుపు తప్పినప్పుడు సర్కారు అనేక ప్రకటనలు వెలువరించింది. వరద పోటెత్తి నగరాలు, పట్టణాల్లోని రోడ్లు, వీధులు, గల్లీలను ముంచెత్తకుండా ఉండేందుకు ఒక ప్రత్యేకమైన ప్రణాళికను రూపొందిస్తామంటూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెల్లడించిన విషయం విదితమే. 2020-21 ఆర్థిక సంవత్సరంలో వ్యూహాత్మక నాలాల అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ) పేరిట హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, ఇతర పట్టణాల్లో దీన్ని అమలు చేస్తామంటూ సర్కారు స్పష్టీకరించింది. తద్వారా వరదను మళ్లించేందుకు పక్కా ప్రణాళిక, అధునాతక సాంకేతిక పద్ధతుల్లో నాలాలను, వరద కాల్వలను నిర్మిస్తామంటూ ప్రకటించినప్పటికీ నేటికీ ఆయా పనులు నత్తనడకన సాగుతుండటం బాధితులకు నిజంగా శాపమే. దీంతో షరా మామూలుగా ఇప్పుడు మళ్లీ కాలనీలు, బస్తీలు నీటిలో మునకేస్తున్నాయి. పెద్ద పెద్ద అపార్టుమెంట్ల సెల్లార్లలో సైతం కార్లు, బైకులు తేలియాడుతున్నాయి.



మరోవైపు గతేడాది గోదావరి పోటెత్తి భద్రాచలాన్ని ముంచెత్తినప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయానా అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. దాంతోపాటు ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లోనూ ఆయన ఆ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించటం ద్వారా బాధితులకు భరోసానిచ్చారు. భద్రాద్రికి రూ.వెయ్యి కోట్లను కేటాయిస్తున్నామంటూ ప్రకటించటం ద్వారా ఆ సమయంలో అక్కడి ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని కూడా హామీనిచ్చారు. గోదావరికి కరకట్ట నిర్మించటం ద్వారా భద్రాచలంతోపాటు పరిసర ప్రాంతాలను ముంపు బారి నుంచి కాపాడతామంటూ సీఎం ప్రకటించారు. బాధితులకు అప్పట్లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల హామీని కూడా ఆయనిచ్చిన సంగతి తెలిసిందే. అయితే ముఖ్యమంత్రి వాగ్దానం నెరవేరకపోవటం బాధితులను ఇప్పుడు ఆందోళనకు గురిచేస్తోంది. పైగా అతి భారీ వర్షాలతో గోదావరి మహోగ్రరూపం దాల్చటంతో భద్రాచలం వద్ద బుధవారం మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేయటం గమనార్హం.

ఈ రకంగా ప్రతీ వర్షాకాలంలోనో లేక అతివృష్టి సంభవించి వరుణుడు కుంభవృష్టి కురిపించినప్పుడో రాష్ట్రం తల్లడిల్లిపోవటం సర్వసాధారణమైపోయింది. పట్నం పల్లె అనే తేడా లేకుండా వరద పారటం, బాధితులు ఓ పది రోజులపాటు నీటిలో నానటం షరా మామూలైంది. వాన రావటం, దాన్ని ఆపటమనేది మన చేతిలో లేదు. కానీ వరదను నియంత్రించటం, ఆ నీటిని మళ్లించటమనేది మన చేతిలో ఉన్నదే కదా..? అలాంటప్పుడు దాన్ని నివారించేందుకు, నియంత్రించేందుకు ప్రభుత్వం వేస్తున్న, వేసిన ప్రణాళికలు ఏమైపోతున్నట్టు..? ఏండ్లు గడిచినా వాటి ఫలితాలను ఎందుకు రాబట్టలేకపోతున్నాం..? అనే అంశంపై లోతైన చర్చ జరగాలి. అప్పుడే ఈ సమస్యకు ఒక పరిష్కారం లభిస్తుంది.

ప్రణాళికలేయటంతోపాటు చెరువులు, కుంటలు, నదుల పరివాహ ప్రాంతాలను పరిరక్షించటంపై కూడా సర్కారు దృష్టి సారించాల్సిన అవసరమెంతో ఉంది. ఇసుక తవ్వకాలు, అక్రమ కట్టడాల కోసం ఇష్టానుసారంగా నీటి ప్రవాహాలకు అడ్డుకట్టలేయటం, నచ్చిన పద్ధతుల్లో కబ్జా చేసుకుంటూ పోతే ప్రకృతి ప్రకోపించక మానదు. నగరాల్లో సైతం చెరువులను ఆక్రమించి, వాటి శిఖం భూముల్లో బహుళ అంతస్తుల భవనాలు, టవర్లు, అపార్టుమెంట్లను నిర్మిస్తున్న వైనాలు కోకొల్లలు. వరద ముప్పును అరికట్టే నాలాలను సైతం కంటికి కనబడకుండా కబ్జా చేస్తున్నారంటే పరిస్థితి ఎంతలా అదుపు తప్పిందో అర్థం చేసుకోవచ్చు. అందుకే వరదలను నియంత్రించాలంటే ముందు ఇలాంటి ఆగడాలన్నింటినీ అరికట్టాల్సిందే.

ఐక్యపోరుబాటలో కార్మికవర్గం

రాష్ట్రంలో కార్మికవర్గం పోరుబాటలో ఉన్నది. సమస్యల పరిష్కారం కోసం ఐక్యపోరాట బాట పట్టింది. పాలకుల మొండివైఖరినీ, ఏకపక్ష ధోరణులనూ ఎదిరించి పోరాడుతున్నది. సమస్యల పరిష్కారం కోసం పట్టుదలతో ఉద్యమబాటలో నడుస్తున్నది. పోరాటాల పట్ల అసహనం ప్రదర్శించే పాలకులు కూడా సమస్యలు పరిష్కరించాలని గుర్తించకతప్పటం లేదు. ఇది కార్మికవర్గ ఐక్య పోరాట శక్తి ఫలితం. స్కీం వర్కర్లు, మున్సిపల్, గ్రామపంచాయతీ, పారిశ్రామిక కార్మికులన్న తేడా లేదు. అనేక రంగాల కార్మికులు కదులుతున్నారు. 483 గ్రామీణ మండలాల్లో 43,415 మంది కార్మికులు జులై 6 నుంచి సమ్మెలో ఉన్నారు. పాఠశాల స్వీపర్లు కూడా సమ్మెలో ఉన్నారు. ఈమధ్యనే మూడు రోజుల చారిత్రాత్మక సమ్మె చేసిన అంగన్‌వాడీలు ఇప్పుడు దేశవ్యాపిత నిరసనలో సమరశీలంగా పాల్గొన్నారు. నల్లచీరలను చూసి ఆగ్రహించిన అధికారులకు తగు సమాధానం చెప్పారు. కనీసవేతనాలు, సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా గ్రాట్యుటీ చెల్లింపు, పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు కేంద్రం తెచ్చిన నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ వేలాది అంగన్‌వాడీలు కదం తొక్కారు. జులై 10వ తేదీన 30వేల మంది ధర్నాలలో పాల్గొన్నారు. పది కిలోమీటర్లు పాదయాత్రలు చేసారు. గత సంవత్సరం మార్చి 15న రాష్ట్ర ముఖ్యమంత్రి శాసనసభలో చేసిన ప్రకటన ప్రకారం మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ.2000 వేతనం పెంపు కోసం పోరుబాట పట్టారు. పెంపుదల అమలు, ఏరియర్స్, కొత్త మెనూ కోసం అదనపు బడ్జెట్ కోసం 13,200 మంది మూడు రోజులు సమ్మె చేసారు. మండల కేంద్రాలలోను, కలెక్టర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ధర్నాలు చేసారు. సమ్మె జరుగుతుండగానే అధికారులు కొన్ని జిల్లాలలో పెండింగ్ బిల్లులు చెల్లించారు. సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి బహిరంగ ప్రకటన చేయవల్సి వచ్చింది. పెరిగిన వేతనం అమలుకు, వారం రోజులలో బడ్జెట్ విడుదలకు అంగీకరించారు.



ఎస్. వీరయ్య

> **పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల ప్రయోజనాలే పరమావధిగా భావించే పాలకులు, పోరాటాల పట్ల అసహనం ప్రదర్శించటంలో ఆశ్చర్యం లేదు. మంత్రులైనా, పాలకపక్షానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధులైనా ఈ వైఖరి ప్రదర్శించటంలో వింత ఏమున్నది? ఒక మంత్రి, పోరాటంలో ఉన్న కార్మికుల పట్ల నోరుపారేసుకున్నారు. క్షుద్ర రాజకీయాలు నడిపేవారి చేతుల్లో పడిన కార్మికులు సమ్మె చేస్తున్నారన్నారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? ఒక శాసనసభ్యుడు "ఆటంకాలు సృష్టించటమే సీఐటీయూ పని" అని నిందించారు. కొందరు కలెక్టర్లు సీఐటీయూ నాయకులే కార్మికులను రెచ్చగొడుతున్నారని విసుక్కున్నారు. కార్మికులు ఎవరో రెచ్చగొడితే రెచ్చిపోయి పోరాడరనీ, కడుపు కాలినప్పుడు అనివార్యంగా పోరుబాట పడతారనీ ఎంత తొందరగా గుర్తిస్తే అంతమంచిది.**

ఆశాలకు పరీక్షలు నిర్వహించాలనీ, ఉత్తీర్ణులైనవారినే కొనసాగించాలని ప్రభుత్వం ప్రయత్నించింది. దీన్ని ఆశాలు తీవ్రంగా ప్రతిఘటించారు. పరీక్షల పద్ధతి రద్దుతో పాటు అనేక ఇతర సమస్యల పరిష్కారం కోసం 650 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల దగ్గర 8,570మంది ధర్నాలలో పాల్గొన్నారు. పోరాటం జరుగుతుండగానే టెలి కాన్ఫరెన్స్‌లో ఆశాల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి ప్రకటించారు. పరీక్షల పద్ధతి రద్దు చేస్తూ, కోర్కెల పత్రంలోని ఫిక్స్‌డ్ వేతనం తప్ప మిగిలిన అన్ని కోర్కెలూ అంగీకరించారు. ప్రసూతి సెలవులు, ఆస్పత్రులలో విశ్రాంతి గదుల ఏర్పాటు, రిజిస్టర్లు ఇవ్వటానికి, నాణ్యమైన దుస్తులు (యూనిఫామ్), జాబ్ చార్ట్ రూపొందించటానికీ అంగీకరించారు. గతంలో సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందం అమలుచేయాలనీ, గుర్తింపు ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికులకు ఓటు హక్కు ఇవ్వాలనీ కోరుతూ సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయం దగ్గర ధర్నా చేసారు. పరిష్కారానికి కమిషనర్ అంగీకరించారు. పాలిటెక్నిక్, ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ముద్రణాలయం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పోరాడారు. అక్రమంగా తొలగించిన 206 మందిని పనిలోకి తీసుకోవాలని ధర్నాలు చేసి పాక్షిక విజయం సాధించారు. యూనివర్సిటీ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా వేతన పెంపుదల కోసం పోరాడి పాక్షిక విజయం సాధించారు. 19జిల్లాలలో, 64 కేంద్రాలలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని పట్టాల కోసం, ఇండ్ల నిర్మాణం కోసం పోరాడుతున్న పేదల గుడిసెలు నిలదొక్కుకుంటున్నాయి. అధికారుల ఒత్తిడులు, కొన్నిచోట్ల పోలీసుదాడులను తట్టుకుని నిలబడుతున్నారు.

ఈ పోరాటాలకు ముందు 20,700 విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు జేఏసీ ఆధ్వర్యంలో 80రోజుల సుదీర్ఘ సమ్మె చేసారు. 9750 గ్రామపంచాయతీల కార్యదర్శులు, తమ సమస్యల పరిష్కారం కోసం 30రోజుల సమ్మె చేసారు. ఐకేపీ, వీఓఏలు 18వేలమంది 44 రోజులు సమ్మె చేసారు. 16వేల మంది సింగరేణి కాంట్రాక్టు కార్మికులు 18రోజులు జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె చేసారు. ఈ సమ్మెలు అన్నింటిలోనూ సీఐటీయూ నాయకత్వం జోక్యంతో సమస్యలు కొలిక్కి వచ్చాయి. సమస్యల తీవ్రత సుదీర్ఘ నిరవధిక సమ్మెలకూ, ఐక్య పోరాటాలకూ దారితీసింది. ప్రభుత్వ మొండివైఖరి, ఏకపక్ష ధోరణి సమస్య పరిష్కారానికి ఆటంకమైంది. అధికారులు వినతిపత్రాలు కూడా తీసుకోడానికి తిరస్కరించే ధోరణి ప్రదర్శించారు. సమ్మెల పట్ల పాలకులు తీవ్ర అసహనం ప్రదర్శించారు. కార్మికుల సమిష్టి బేరసారాల హక్కును నిరాకరించారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కరించే బాధ్యత నుండి తప్పించు కోలేక పోయారు. అంతిమంగా, పోరాడిన కార్మికులు విజయం సాధించారు.



విద్యుత్తు రంగంలో మాత్రం ఐక్యపోరాటానికి కార్మికులు సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రధాన సంఘాల నాయకుల లొంగుబాటు వైఖరి ఫలితంగా నష్టపోయారు. పోరాడే సంఘాలు ఆ రంగంలో బలహీనంగా ఉండటమే యాజమాన్యానికి కలిసివచ్చింది.

గత రెండు సంవత్సరాలుగా, కనీస వేతనాలు సవరించాలని రాష్ట్రవ్యాపితంగా కార్మికులు అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. జూన్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ఆందోళన మొదలైంది. హైదరాబాద్ చుట్టూ ఉన్న పారిశ్రామిక ప్రాంతాలలో సీఐటీయూ నాయకులు జీపుయాత్ర చేసి కార్మికులను ప్రత్యక్షంగా కలిసారు. జులై 14న కలెక్టర్ కార్యాలయాలకు తరలివచ్చిన కార్మికుల సంఖ్య సమస్య తీవ్రతను ప్రతిబింబిస్తున్నది. రాష్ట్రంలో కోటిమంది కార్మికులకు సంబంధించిన సమస్య కనీసవేతనాలు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ముఖ్యంగా వలస కార్మికుల పరిస్థితి దుర్భరంగా ఉన్నది. సగానికి పైగా కార్మికులు వీరే. కాంట్రాక్టీకరణ సర్వసాధారణమైంది. పన్నెండు గంటల డ్యూటీ చేయిస్తున్నారు. కార్మిక చట్టాలేవీ అమలులో లేవు. వలస కార్మికులను అనేకచోట్ల కంపెనీ ఆవరణలోనే షెడ్లలో పెట్టి, బానిస చాకిరీ చేయిస్తున్నారు. హమాలీ, భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్టు వంటి అసంఘటిత రంగాలలో కూడా వలస కార్మికుల సంఖ్య బాగా పెరిగింది. వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయటం లేదు.

ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం గత 15మాసాలుగా పేదలు పోరాడుతున్నారు. లక్షకు పైగా కుటుంబాలు గుడిసెలు వేసుకుని హక్కుల కోసం పోరాడుతున్నారు. జూన్ మాసంలో కొన్ని మునిసిపల్ వార్డులు, గ్రామాలలో సర్వే చేస్తే లక్షమంది ఇండ్లు లేని పేదలు వెంటనే తహసీల్దార్లకు దరఖాస్తు చేసారు. ఇది సమస్య తీవ్రతను సూచిస్తున్నది. జులై 3న కలెక్టర్ కార్యాలయాలకు తరలివచ్చిన పేదల ఆందోళన కూడా సమస్య తీవ్రతను సూచిస్తున్నది. గృహలక్ష్మి పేరుతో సమస్యను దాటవేసే పాలకుల ధోరణి సరైంది కాదు. ఇండ్ల పట్టాల కోసం జరుగుతున్న పోరాటాలలో మహిళలే వేలాదిగా తరలిరావటం ప్రత్యేకత. రాత్రీ, పగలు భూమిని అంటిపెట్టుకుని నిలబడుతున్నారు. మహిళలకు మరుగు, భద్రత ప్రాధాన్యతను సూచిస్తున్న అంశమిది. బట్టలు మార్చుకోవాలన్నా, ఆడపిల్లలను పెంచాలన్నా తడికచాటు అవసరం కదా! మరుగుదొడ్లు, స్నానాల గదులు అవసరం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. ఇది మహిళల ఆత్మగౌరవ సమస్య. కొన్ని కేంద్రాలలో పోలీసుల దాడులు, చిత్రహింసలు కూడా భరిస్తూ మహిళలు నిలబడుతున్నారు. ఒక పోరాటకేంద్రంలో, ముస్లిం మహిళలు బహిరంగ ప్రదేశాలలో, ఇండ్ల స్థలాల పేరుతో ఉండటం ఖురాన్ అంగీకరించదని రెచ్చగొట్టే ప్రయత్నాలకు కూడా ముస్లిం మహిళలే సమాధానం చెప్పారు. అందువల్ల ఈ సమస్య ప్రత్యేకతను గమనించాలి.

> **రాష్ట్రంలో కోటిమంది కార్మికులకు సంబంధించిన సమస్య కనీసవేతనాలు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ముఖ్యంగా వలస కార్మికుల పరిస్థితి దుర్భరంగా ఉన్నది. సగానికి పైగా కార్మికులు వీరే. కాంట్రాక్టీకరణ సర్వసాధారణమైంది. పన్నెండు గంటల డ్యూటీ చేయిస్తున్నారు. కార్మిక చట్టాలేవీ అమలులో లేవు. వలస కార్మికులను అనేకచోట్ల కంపెనీ ఆవరణలోనే షెడ్లలో పెట్టి, బానిస చాకిరీ చేయిస్తున్నారు. హమాలీ, భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్టు వంటి అసంఘటిత రంగాలలో కూడా వలస కార్మికుల సంఖ్య బాగా పెరిగింది. వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయటం లేదు.**

పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల ప్రయోజనాలే పరమావధిగా భావించే పాలకులు, పోరాటాల పట్ల అసహనం ప్రదర్శించటంలో ఆశ్చర్యం లేదు. మంత్రులైనా, పాలకపక్షానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధులైనా ఈ వైఖరి ప్రదర్శించటంలో వింత ఏమున్నది? ఒక మంత్రి, పోరాటంలో ఉన్న కార్మికుల పట్ల నోరుపారేసుకున్నారు. క్షుద్ర రాజకీయాలు నడిపేవారి చేతుల్లో పడిన కార్మికులు సమ్మె చేస్తున్నారన్నారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? ఒక శాసనసభ్యుడు "ఆటంకాలు సృష్టించటమే సీఐటీయూ పని" అని నిందించారు. కొందరు కలెక్టర్లు సీఐటీయూ నాయకులే కార్మికులను రెచ్చగొడుతున్నారని విసుక్కున్నారు. కార్మికులు ఎవరో రెచ్చగొడితే రెచ్చిపోయి పోరాడరనీ, కడుపు కాలినప్పుడు అనివార్యంగా పోరుబాట పడతారనీ ఎంత తొందరగా గుర్తిస్తే అంతమంచిది. కార్మికుల ప్రయోజనాలకే అంకితమైన కార్మికసంఘాలు సహజంగానే వారికి అండగా ఉంటాయి. అది వాటి బాధ్యత. అభాండాలు వేసిన మంత్రులూ, అధికారులే అనేక సందర్భాలలో, చర్చలతో సమస్యల పరిష్కారానికి పూనుకోవల్సి వచ్చింది. సమిష్టి బేరసారాల హక్కును గౌరవించి, చర్చలు జరపాలన్న స్పృహలో ఉండాలి. వివేకం ప్రదర్శించాలి. భావోద్వేగాలతో చెలగాటమాడే శక్తులు, ఓట్లకోసం మతాన్ని వాడుకునే నేతలు కార్మికుల అసంతృప్తిని వాడుకుంటారనీ, పక్కదారులు పట్టిస్తారన్న ప్రమాదాన్ని గుర్తించాలి. న్యాయమైన సమస్యల పరిష్కారం విషయంలో భేషజాలకు పోవడం తగదు.



అప్పుచేసి పప్పుకూడు!

ఏ దేశంలోనైనా పాలకుల పాలనా విధానాలను బట్టే ప్రజల అభివృద్ధి లేదా పేదరికం ఆధారపడి ఉంటుంది. భారతదేశానికి స్వాతంత్ర్య అనంతరం అభివృద్ధి చెందినప్పటికీ ఆశించిన స్థాయిలో లక్ష్యాన్ని చేరుకోలేదని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. అభివృద్ధి ఫలాలు కొందరికేనా! అప్పుల భారం అందరి పైనా.. అనే చర్చ జరుగుతుంది. అప్పుచేసి పప్పుకూడు తగదంటారు. "అప్పు ముప్పు" ఎందుకంటే? అప్పు అసలు తీర్చడం కన్నా దాని వడ్డీలు చెల్లించ డానికి ఉన్న ఆస్తులు అమ్మాల్సిందే అంటారు పెద్దలు. నేడు మన దేశంలో అప్పులు చేసి బ్యాంకులను, ఆర్థిక రంగాన్ని దివాలా తీయించి, ప్రజాధనాన్ని కొల్లగొట్టి పరాయి దేశాల్లో విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారు. ఆ భారాన్నంతా దేశ ప్రజలు భరించాల్సి వస్తుంది. ఈ అప్పులను రాబట్టాల్సిన విషయంలో పాలకులు కూడబలుక్కొని ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. కానీ జీవనోపాధి కోసం పేదవాడు అప్పు చేస్తే రాచి రంపాన పెట్టి పరువును బజారు కీడుస్తూ, దండోరా వేసి అప్పుల వసూళ్ల కోసం వారి ఆస్తులను వేలం వేస్తూ, జప్తు చేస్తారు. ఈ అమానుష చర్యలు తట్టుకోలేక సామాన్యులు ఆత్మహత్య చేసుకున్న వారు ఉన్నారు. ఉన్నోడికి ఒక నీతి, పేదోడికి ఒక నీతి అన్నట్లు వివక్ష కొనసాగుతుంది నిజం కాదా!.

ప్రపంచంలోనే నేడు మన దేశం అభివృద్ధి పథంలో శరవేగంతో దూసుకుపోతుందని పాలకుల ఉపన్యాసాల మోత, ప్రకటనల జోరుతో హోరెత్తిస్తున్నారు. గత ఐదేండ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రచార ప్రకటనల కోసం రూ.3,064.42 కోట్లు ఖర్చు చేసింది. అందులో ప్రింట్ మీడియాకు రూ.1,338.56 కోట్లు కాగా, ఎలక్ట్రానిక్ మీడియాకు రూ.1,273.06కోట్లు ఖర్చు పెట్టారు. హోర్డింగులు వంటి అవుట్ డోర్ ప్రకటనలకు రూ.452.8 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వ గణాంకాలే చెపుతున్నాయి. ప్రధాని విదేశీ పర్యటన కోసం రూ.254.87కోట్లు ఖర్చు చేశారు. ఇలా ప్రభుత్వ పథకాల ప్రచారార్భాటానికి ప్రపంచంలో కీర్తి ప్రతిష్ఠల కోసం వెంప ర్లాడుతూ ప్రజాధనాన్ని ఆర్థిక క్రమశిక్షణ లేమితో ఖర్చు చేస్తున్నారు. పాలకులు చెప్పే ఈ అభివృద్ధి ఫలాలు ఏ వర్గాలకు చేరినాయి? పాలకుల సన్నిహితులకు, వ్యాపార, కార్పొరేట్ రంగా(వర్గా)లకు చేరినట్లు ఆర్థిక గణాంకాలే తెలుపుతున్నాయి. వీరి ఆస్తులు ఎంతగా పెరిగిపో యాయంటే 2020 సంవత్సరం లెక్కల మేరకు ముఖేష్ అంబానీ ఆస్తులు 350శాతం, గౌతం ఆదాని ఆస్తులు ఏకంగా 700శాతం పెరిగినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఈ మూడేండ్లలో మరింత పెరిగాయి. కరోనా పేదలను దరిద్రులను చేసింది. కానీ కార్పొరేటు దిగ్గజాల వృద్ధిని అడ్డుకోలేకపోయింది. ప్రస్తుతం దేశం, రాష్ట్రాల అప్పుల కుప్పలు కొండల్లా పెరిగిపోతున్నాయి. గత దశాబ్ద కాలంలో క్రమేపి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. ఇలా రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు 200శాతం పెరగగా, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అప్పులు 150శాతం పెరిగింది. ఈ వివరాలు సాక్షాత్తు రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. కేంద్రం అప్పుల భారం 2022-23కి గాను రూ.155.6 లక్షల కోట్లకు చేరింది. రాష్ట్రాలు మొత్తం రూ.76.1లక్షల కోట్ల మేర అప్పుల్లో ఉన్నాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం అప్పులు రూ.220.5లక్షల కోట్లకు చేరినాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. అంటే ప్రతి భారతీయుడుపై సుమారు రూ.1,50,000 పైగా అప్పుల భారం పడనుంది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి వివిధ బ్యాంకుల నుండి ప్రజలు తీసుకున్న వ్యక్తిగత అప్పులు రూ.41లక్షల కోట్లకు చేరినాయి.



మేకిరి దామోదర్
9573666650

2014తో పోలిస్తే ఈ అప్పులు 400శాతం పెరిగాయి. ఉపాధిలేమితో కుటుంబాల ఆదాయాలు పరిమితంగా ఉంటున్నాయి. కొద్దిమందికైతే తగ్గిపోయాయి. ఈ దేశం ప్రగతి సంగతేమో కానీ అప్పుల కుప్పలు పెరిగి పోయాయి. దొరికినకాడల్లా అప్పులు చేస్తూ రిజర్వ్ బ్యాంక్ మొదలుకొని ప్రపంచ బ్యాంకు వరకు అప్పులు చేస్తూనే ఉన్నారు. ఇలా రాష్ట్రాలు, ప్రజలు వ్యక్తిగత రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగు తున్నారు. దీనికి ఆర్థిక క్రమశిక్షణ లేని విధానాలే కారణం. ఇది పూడ్చుకోవడానికి ప్రభుత్వరంగ సంస్థలను, ప్రభుత్వ ఆస్తులను హోల్‌సేల్‌గా అమ్మేస్తు న్నారు. అయినా సరిపోకపోవడంతో ప్రజలనెత్తిన భరించలేని ఆర్థిక భారాలు జీఎస్టీ, పన్నులు, సెస్సుల రూపంలో వసూలు చేస్తున్నారు. ఇంత చేసినప్పటికీ కేంద్ర ఖజానా నిండటం లేదు. ఈ అప్పులను ప్రభుత్వాలు ప్రజా సంక్షేమానికి ఖర్చు చేస్తే మంచిదేనని సమర్థించవచ్చు. కానీ వీటిని కార్పొరేట్ రంగానికి వారి అనుయాయులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, రాయితీల వంటి తాయిలాలు ఇస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వం తెచ్చిన రుణాలకు వడ్డీలకే సరిపోతుంది. 2023-24 బడ్జెట్ అంచనాల ప్రకారం వడ్డీ చెల్లింపులకు సుమారు రూ.11లక్షల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇది సంవత్సరానికి చేసే మొత్తం వ్యయంలో 23శాతం. అంటే ప్రజల సొమ్ములో అధిక భాగం ప్రభుత్వాలు తీసుకున్న రుణాల వడ్డీ చెల్లింపులకే వినియోగిస్తున్నారు. ఇలా అప్పులు వాటికి వడ్డీలు ఏండ్ల తరబడి కొనసాగుతూనే ఉంటుంది. ఆ తర్వాత రాబోయే ప్రభుత్వాలకు తలనొప్పిగా మారబోతుంది. ఇలాంటి ఆర్థిక క్రమశిక్షణ లేని విధానాలతో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఉపాధి లేమి, పేదరికం పెరిగిపోతుంది. ఆర్థిక అసమానతల అగాథం రెట్టింపు అవుతుంది. ఇప్పటికైనా పాలకులు భావోద్వేగాలు రెచ్చగొట్టే, విభజించే విధానాలు మాని అప్పుల ఊబి నుంచి ఈ దేశాన్ని బయటపడే ప్రయత్నాలు చేయాలి.



జాగో సబ్ లోగోం

ఎందుకండీ ఆచరణకు నోచుకోని
ప్రతిజ్ఞ రోజూ వల్లెవేయిస్తారు బడిలో
అన్నదమ్ములనే బోధన చేస్తుంటారు
కాని దేశంలో భాషలు, జాతులు
భిన్నత్వంలో ఏకత్వం అనేది
ఒక కుహనా భావనే తప్ప నిజంకాదు
ఎందుకో కొంతమంది
పాలకుల పుణ్యమా అని
వాస్తవానికి దానికి విలోమంగా
ఉన్నాయన్నది నగ్న సత్యం
చెప్పేవి శ్రీరంగనీతులు
దూరేవి...గుడిసెలన్న
చందాన రాజ్యమేలే
కమలనాథుల ప్రభుత్వ పాలనలో
రాజ్యాంగానికి చిల్లులు పెడుతూ
కాలం చెల్లని మనుస్మృతిని
అంటుపెడుతుంటే
లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థ
ఉరేసుకోబోతుంటే
స్తోత్రాలు వల్లిస్తూ
గమ్మునుండటం కాదు
అనివార్యంగా పిడికిలి బిగించి
ప్రజాపోరుకు సిద్ధపడాలి...

- కపిల రాంకుమార్,
9849535033

అగ్గి రాజేసిందెవరు? ఆజ్యం పోసిందెవరు?

మణిపూర్‌లో జరిగిన సంఘటన మానవత్వానికి మాయని మచ్చ. ఇది జరిగి 77రోజులు గడిచినా ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలై బయటి ప్రపంచానికి తెలిసేంతవరకు రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పట్టించుకో లేదు. సుప్రీంకోర్టు "మీరు చర్యలు తీసుకుంటారా? లేక మేము తీసుకోవాలా" అని కేంద్రాన్ని హెచ్చరిస్తే గానీ స్పందించడం లేదంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత ఉదాసీనంగా వ్యవహరిం చాయో అర్థం చేసుకోవచ్చు. అస్సలు అక్కడ అగ్గి రాజేసింది ఎవరు? ఆజ్యం పోసింది ఎవరు? చలి మంటలు కాచుకుంటున్నది ఎవరు? ఓట్ల కోసం ఏమైనా చేస్తారా?. లూటీలకు లూటీలు, హత్యలకు హత్యలు జరుగుతూ, మధ్యయుగ కాలంనాటి మత యుగాన్ని తలపిస్తున్నా ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏమి చేస్తున్నట్లు? స్థానికంగా ఉన్న పోలీసులు చర్యలేమయినట్లు? ఆర్మీ కాళ్లకు సంకెళ్లు వేసింది ఎవరు? న్యాయం చేయాల్సిన న్యాయస్థానం అన్యాయంగా వ్యవహరిస్తే ఆదివాసీలను ఆదుకునేదెవరు? స్వయంగా కేంద్ర హోంశాఖ మంత్రి రాష్ట్రంలో పర్యటించినా ఫలితమేది? ఆయన చేసిన వ్యాఖ్యలు పరిస్థితిని చల్లబరిచినట్లా? లేదా అగ్నికి మరింత ఆజ్యం పోసినట్లా? ఇదంతా దేశ ప్రజలు ఆలోచించాలి.



జుర్రు నారాయణ
9494019270

అక్కడ చెరబట్టింది ఆదివాసీ ఆడబిడ్డలను కాదు, యావత్ భారతదేశ మానప్రాణాలను. దేశాన్ని కాపాడిన సైనికుని భార్యకు దేశంలోనే రక్షణ లేదంటే దేశం ఏటుపోతున్నట్లు? ఈశాన్య రాష్ట్రాల రూపురేఖలు మారుతున్నాయని పదే పదే ప్రసంగించిన వారు దీనికి సమాధానం చెప్పాలి. రోమ్ నగరం తగలబడి పోతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయిస్తున్నట్టుగానే ఉన్నది ప్రధాని 78రోజుల మౌనం. న్యాయస్థానం(హైకోర్టు) అన్యాయానికి ఆజ్యం పోస్తే, రక్షించాల్సిన పోలీసులే రాక్షసులకు అప్పగిస్తే బాధితులకు రక్షణ కల్పించేదెవరు? విదేశాల్లో ప్రజాస్వామ్య పాఠాలు చెప్పే మనం, మన దేశ సంఘటన సోషల్ మీడియాలో వస్తేగాని స్పందించలేరంటే దేశంలో ప్రజాస్వామ్యం ఎంత పరడవిల్లినట్లు? మతం మత్తుమందు లాంటిది అన్నాడు కారల్ మార్క్స్. మధ్యయుగ కాలంలో జరిగిన సంఘటన నేపథ్యంలో మార్క్స్ అలా అని ఉండవచ్చు! మధ్య యుగంలో మతాల పేరా జరిగిన మారణహోమం అంతా ఇంతా కాదు. అయితే మతమౌఢ్యం ఒక దేశానికో, ఒక ప్రాంతానికో, ఒక మతానికో, ఒక జాతికో పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా అనేక మతాల, జాతుల్లో ఘర్షణలు జరిగాయి. ఆధునిక కాలంలో యూదులపై హిట్లర్ హింసాకాండ మత మౌఢ్యానికి ఒక ఉదాహరణ. తాలిబాన్ల కాలంలో మతమౌఢ్యం రాజ్యమేలింది, ఏలుతుంది. అయితే ఈ అన్ని సంఘ టనల్లో బాధితులు మాత్రం మహిళలే. దేశాన్ని భారత మాతగా భావించే మనదేశంలో, మహిళలను పూజించే జంబుద్వీపంలో మహిళలను చెరబడటమా?

ఈ ఆధునిక కాలంలో కూడా మతమౌఢ్యంలో ఉండి పోదామా? ఇంకా తెగలు, జాతులు, మతాల పేరా వైర్యం రాజేద్దామా? దేశ విభజనకు మతమే కారణం. ఆనాడు జరిగిన మరణహోమం అంతా ఇంత కాదు. 1984లో పంజాబ్‌లో జరిగిన అల్లలకు మతానికి సంబంధం ఉంది. ముంబాయిలో జరిగిన అల్లర్లకు మతమే కారణం. 2002లో గోద్రా అల్లరకు, తర్వాత జరిగిన సంఘటనలకు మతమే కారణం కాదా? ఇప్పుడు మణిపూర్‌లో జరిగిన సంఘటన స్థానిక గిరిజన, గిరిజనేతర తెగల మధ్య జరిగిన సంఘటనగా కనిపించినా మతమే అసలు కారణమని అందరికీ తెలుసు. అక్కడ అల్లర్లు ముందు ఎవరు ప్రారంభించారు, న్యాయం ఎవరిది, అన్యాయం ఎవరిదనేది ప్రశ్న కాదు. శాంతి నెలకొల్పాల్సిన పోలీసుశాఖ, న్యాయం చేయాల్సిన న్యాయశాఖా ఏమిచేస్తున్నట్లు? న్యాయశాఖ(హైకోర్టు) పరిధికి మించి వ్యవహరించడం వల్లేగా మణిపూర్ మంటలు అంటుకుంది. రక్షించాల్సిన పోలీస్ శాఖ బాధితులను రాక్షసులకు అప్పగించి ఉత్సవ విగ్రహాల్లా నిలబడటం వల్లేగా ఆ ఘోరం జరిగింది. ఈ వైఫ ల్యాలకు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది కాదా? దేశాన్ని కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం 355 అధికరణ ప్రయోగించిన ఫలితం రాలేదంటే ఆ వైఫల్యం కేంద్రానిది కాదా? ప్రజాస్వామ్యం అంటే మెజార్టీ అభిప్రాయమే కాదనలేం. కానీ మైనార్టీ



మనోభావాలను కూడా పరిగణలోకి తీసుకో వాల్సిందేగా. ఎవరు ఏమి కోరుకున్నా రాజ్యాంగ మౌలిక సూత్రాల ప్రకారం అది న్యాయబద్ధమైతేనేగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. దేశంలో మెజార్టీలు, మైనార్టీలు, ఎస్టీలు, ఎస్సీలు, ఓబీసీలు, ఓసిలు ఎవరైనా సరే రాజ్యాంగ మౌలిక సూత్రాలకు కట్టుబడి ఉండాల్సిందేగా.

మతవిద్వేషం తలకెక్కిన వారికి మానవత్వం కనిపించదు. అది ఏ ఒక్క మతానికో పరిమితం కాలేదు. ఇప్పటికి తాలిబాన్ల రూపంలోనో, కొన్ని ఆఫ్రికా, ఆసియా దేశాల్లోనో చూస్తున్నాం. మన దేశంలో కూడా ఒక క్రమ పద్ధతి ప్రకారం తమ సిద్ధాంతాలను అమలు చేసుకుంటూ వస్తున్నారు. అది మితవాద చర్యల నుంచి మొదలై చివరకు అతి తీవ్రమైన చర్యలుగా పరిణమిస్తున్నాయి. రాజ్యాంగ మౌలిక స్వరూపం నచ్చనివారు ప్రారంభం నుంచి రాజ్యాంగాన్ని అంగీకరించడం లేదు. దేశంలో రాజ్యాంగ పద్ధతుల్లోనే అధికారంలోకి రావాలి. కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని అంగీకరిస్తూ మితవాద చర్యలతో మొదలై మెల్లగా తమ సిద్ధాంతాలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని మార్చే కుట్ర క్రమంగా జరుగుతూనే ఉంది. నేడు అధికరణ 371సి మార్చే కుట్ర మణిపూర్‌లో కావచ్చు, రేపు 371ఎ నాగాలాండ్‌లో కావొచ్చు, 371బీ అస్సాంలో కావచ్చు, 371ఎఫ్ సిక్కింలో కావొచ్చు, 371జీ మిజోరాంలో కావచ్చు, 371హెచ్ అరుణాచల్‌ప్రదేశ్‌లో కావొచ్చు. ప్రస్తుతం మణిపూర్ లాంటి డిమాండ్లు రావని గ్యారెంటీ ఏంటి? ప్రకరణ 244(1)5వ షెడ్యూల్ ప్రకారం దేశ వ్యాప్తంగా గిరిజన ప్రాంతాలపై, ప్రకరణ 244(2)ఆరవ షెడ్యూల్ ప్రకారం అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరం రాష్ట్రాల్లో గిరిజన ప్రాంతాలపై కూడా ఇటువంటి డిమాండ్లు రావని గ్యారెంటీ ఏంటి? వస్తే ప్రభుత్వం మెజార్టీ ఓట్లకోసం రావణ కాష్టం రగిలించినా ఇలాగే చూస్తూ మౌనం వహిస్తుందా?

మతమౌఢ్యం తమ సిద్ధాంతాలను సామ దాన భేద దండోపాయాలతో అమలుకు ప్రయత్నిస్తూనే ఉంటుంది. మొన్న కర్నాటకలో హిజాబ్ లొల్లి, నిన్న ఢిల్లీ నడివీధుల్లో న్యాయం కోసం రెజ్లర్ల ఆర్తనాదాలు, నేడు తెగల ఘర్షణతో మణిపూర్‌లో మంటలు. కొన్ని రాష్ట్రాల పాలనలోనే ఇలాంటి సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా స్వయంగా ప్రధానమంత్రి "కుటుంబంలో ఇద్దరి వ్యక్తులకు రెండు చట్టాలు ఉంటాయా" అని బలవంతంగానైనా సరే ఉమ్మడి పౌరస్మృతి తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు ప్రకటించకనే ప్రకటించారు. దేశ మౌలిక స్వరూపమైన భినత్వంలో, ఏకత్వాన్ని కాదనే ఆలోచనలు మానుకోవాలి. మధ్యయుగం కాలం నాటి మత ఆలోచనలు విడనాడాలి. ఏ మతస్తులైన, ఏ కులస్తులైన,ఏ జాతులవారైనా, ఏ తెగలవారైనా అందరికీ రాజ్యాంగ సూత్రాలు వర్తిస్తాయని ప్రజలందరూ గమనించాలి. ఇది ఆధునిక కాలం. ప్రజలకు కావలసింది సమగ్ర సమ్మిళిత అభివృద్ధి. కానీ మతం పేర జాతుల పేర, తెగల పేర ప్రజల మధ్య విద్వేషాలు రగిలించే పాలన కాదు.



కాంపౌండ్ ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్

అదితి స్వామి... అండర్-18 కాంపౌండ్ మహిళల కప్‌లో అద్భుతమైన ప్రతిభను కనబరిచింది. రికార్డు సృష్టించింది. తన అసాధారణమైన ప్రతిభను యూత్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లలో కొనసాగించింది. ఫైనల్‌లో యుఎస్‌కి చెందిన లీన్ డ్రేక్‌ను ఓడించి ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించింది. 142-136 స్కోరుతో ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది.

జూనియర్ విభాగంలో తాను సాధించిన విజయాలతో పాటు కొలంబియాలో గత నెలలో సీనియర్ విభాగంలో కూడా అరంగేట్రం చేసింది. అక్కడ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయం అదితి ఎదుగుదలకు మరింత బలాన్ని ఇచ్చింది. అలాగే సీనియర్ స్థాయిలో పోటీపడేందుకు అవసరమైన సామర్థ్యాన్ని ఇచ్చింది. విలువిద్య ప్రపంచంలో ఆమె స్థిరమైన ప్రదర్శనలు, ఆటలో ఒత్తిడిని నిర్వహించడం మంచి ప్రభావాన్ని చూపిస్తున్నాయి.

"ఇది నా మొదటి యూత్ వరల్డ్ ఛాంపియన్‌షిప్. నాకు చాలా ప్రత్యేకమైనది. ఇప్పుడు నేను క్యాడెట్ ప్రపంచ ఛాంపియన్ అయ్యాను. ఐర్లాండ్‌లోని యూత్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో మా జట్టు స్వర్ణం గెలుచుకుంది. అయితే వాతావరణ పరంగా ఈ వారం సవాలుగా ఉంది. చల్లటి గాలులతో కొన్ని సార్లు దృష్టిని కేంద్రీకరిం చడం కష్టమయింది. అయితే నా బృందం వీటన్నింటినీ సవాలుగా తీసుకుంది. కాబట్టే విజయం సాధించ గలిగాం. నా తల్లిదండ్రులు, నా కోచ్, నన్ను నమ్మిన ప్రతిఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపు తున్నాను" అంటూ అదితి సోషల్ మీడియా ద్వారా తన కోచ్, మేనేజ్‌మెంట్, తల్లిదండ్రులకు కృతజ్ఞత లు తెలిపింది. భారతీయ ఆర్చరీకి చెందిన అనేకమంది యువత ప్రపంచ స్థాయిలో తమ సత్తాను చాటుకోవడంతో క్రీడకు మంచి భవిష్యత్ ఉందని ఆమె నమ్ముతుంది.

కొర్రలతో హెల్దీగా...

రోజురోజుకు మన ఆహార అలవాట్లు వేగంగా మారిపోతున్నాయి. ఎక్కువ రోగనిరోధక శక్తిని పెంచుకునే ఆహారానికే అందరూ ప్రాధాన్యం ఇస్తున్నారు. తృణధాన్యాల గురించి ఈ మధ్యకాలంలో చాలా మందికి బాగా అవగాహన పెరిగింది. క్రమం తప్పకుండా తృణధాన్యాలు తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు చురుగ్గా ఉండటానికి వీలవుతుందని, ఇతర పదార్థాలతో పోలిస్తే వీటితో చేసిన వంటల్లో పీచు ఎక్కువగా ఉండడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు, పెద్దలనే తేడా లేకుండా అన్ని వయసుల వారికీ ఇది చక్కని ఆహారం. మధుమేహ వ్యాధిగ్రస్తులకు సైతం ఎంతో ఉపయోగం. తక్కువ సమయంలో తృణధాన్యాలతో ఇంట్లోనే సులభంగా తయారు చేసుకునే వివిధ రకాల వంటలు ఏమున్నాయో ఈ రోజు తెలుసుకుందాం...





బిర్యానీ

కావాల్సిన పదార్థాలు : కొర్రలు - కప్పు, కాలీఫ్లవర్ - సగం (కట్ చేసి కొంచెం వేడి నీటిలో మరిగించి పక్కన పెట్టుకోవాలి), క్యారెట్ - రెండు (కావాల్సిన షేప్‌లో కట్‌చేసి పెట్టుకోవాలి), బీన్స్ - వంద గ్రాములు (అంగుళం ముక్కలుగా కట్‌చేసి పెట్టుకోవాలి), కొత్తిమీర - కొద్దిగా (సన్నగా తరగాలి), పుదీనా - కొద్దిగా (సన్నగా తరగాలి), గరం మసాలా - చెంచా, ఉల్లిగడ్డ - ఒకటి (మధ్యస్తంగా ఉండే ముక్కలుగా కట్‌చేసి పెట్టుకోవాలి)

తయారు చేసే విధానం : కొర్రలను గంట పాటు నీళ్లలో నానబెట్టి పక్కన ఉంచుకోవాలి. ఒక గిన్నెలోకి నెయ్యి వేసి వేడయ్యాక కొత్తిమీర, పుదీనా, ఉల్లిగడ్డ, గరం మసాలాలు ఒక్కొక్కటిగా వేసి వేయించాలి. తరిగిన క్యారెట్, బీన్స్, కొత్తిమీర, కాలీఫ్లవర్ అందులో వేయాలి. అన్ని కలిపి కొంచెం వేగాక, ఇందులో కప్పు కొర్రలకు రెండు కప్పుల చొప్పున నీటిని పోయాలి. ఇందులోనే తగినంత ఉప్పు వేయాలి. ఈ మిశ్రమం బాగా మరగబెట్టిన తర్వాత నానబెట్టిన కొర్రలను అందులో వేసి బాగా ఉడికేంత వరకు ఉంచాలి. అంతే కొర్ర బిర్యానీ రెడీ...



అంబలి

కావాల్సిన పదార్థాలు : రాగులు, కొర్రలు, పాలు - అర లీటరు, జీలకర్ర పొడి - కొద్దిగా

తయారు చేసే విధానం : రాగులు, కొర్రలు సమపాళ్ళలో తీసుకుని ఒక పూటంతా నానబెట్టి, మొలక కట్టాలి. మొలకలు వచ్చాక, వీటిని బాగా ఎండబెట్టి పిండి పట్టించాలి. ఈ పిండిని నీటితో కలిపి కొంచెం చిక్కగా తయారయ్యేలా చేసుకోవాలి. ఆ తర్వాత ఒక పాత్రలో పాలు పోసి బాగా మరిగించాలి. ఇందులో కొంచెం కొంచెంగా ముందుగానే కలిపి ఉంచుకున్న పిండిని ధారగా పోస్తూ ఉండలు కట్టకుండా బాగా కలపుతూ ఉండాలి. ఇందులో కొంచెం జీలకర్ర పొడి కూడా కలుపుకోవచ్చు. గోరు వెచ్చగా ఉన్నప్పుడు ఈ అంబలిని తాగితే అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

చిరుధాన్యాలుగా పిలువబడే కొర్రలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. కొర్రల్లో మాంసకృతులు, కాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, థైమిన్, రైబోఫ్లేవిన్‌తో పాటు అధిక మొత్తంలో పీచు పదార్థం ఉంటుంది. వీటిలో యాంటీ యాక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. చిన్నపిల్లలకు, గర్భిణిలకు మంచి ఆహారం. ఉదర సంబంధ వ్యాధులకు కొర్రలు తినడం వల్ల మంచి ఉపశమనం లభిస్తుంది. కడపునొప్పి, మూత్రంలో మంట, ఆకలి లేకపోవడం, అతిసారం వంటి సమస్యలకు కొర్రలతో చెక్ పెట్టొచ్చు. వీటిని నిత్యం తినడం ద్వారా అధిక బరువును తగ్గించుకోవచ్చు. ఇందులో ఉండే విటమిన్ బీ 1 అల్జీమర్స్‌ని దూరం చేస్తుంది. నాడీవ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపే మోరెల్ విటమిన్ వీటిలో లభిస్తుంది. నాడీ వ్యవస్థ పనితీరు సజావుగా సాగడానికి వీటిలోని ప్రోటీన్ సహాయ పడుతుంది. కొర్రలను రెగ్యులర్‌గా తినడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు రాకుండా కాపాడుతుంది.



కిచిడీ

కావాల్సిన పదార్థాలు : కొర్రలు - ఒక కప్పు, పెసలు - అరకప్పు, తోటకూర - రెండు చిన్న కట్టలు, క్యారెట్ - రెండు, బీన్స్ - వంద గ్రాములు, పచ్చిమిర్చి - రెండు, కరివేపాకు - రెండు రెమ్మలు, పోపు గింజలు - చెంచా, నూనె - రెండు చెంచాలు, ఉల్లిగడ్డ - ఒకటి (చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి), పసుపు - చిటికెడు.

తయారు చేసే విధానం : కొర్రలను నాలుగు గంటల పాటు, పెసలను గంట పాటు నీటిలో నానబెట్టాలి. తర్వాత కడాయిలో కొద్దిగా నూనె వేసి పోపుగింజలు, కరివేపాకు, ఉల్లిగడ్డ ముక్కలను వేసి వేయించాలి. తరిగి ఉంచిన క్యారెట్, బీన్స్, మిర్చి, తోటకూరతో పాటు చిటికెడు పసుపు అందులో కలపాలి. తర్వాత దీనిలో పెసలు వేసి 3 నిమిషాల పాటు కలుపుతూ ఉండాలి. తర్వాత కొర్రలు వేసి కలపాలి. కప్పు కొర్రలకు ఆరు కప్పుల నీరు చొప్పున పోసి ఉడికించాలి. అంతే కొర్ర కిచిడీ సిద్ధం..

పొంగలి

కావాల్సిన పదార్థాలు : కొర్రలు - పావుకిలో, పాలు - పావు లీటరు, బెల్లం - వంద గ్రాములు, కాజు, బాదం, కిస్మిస్ - పది గ్రాముల చొప్పున.

తయారు చేసే విధానం : ముందుగా కొర్రలను వేయించుకోవాలి. ఆ తర్వాత వీటిలో వంద మిల్లీలీటర్ల నీటిని పోసి పదినిమిషాల పాటు ఉడికించాలి. ఆ తర్వాత పాలు పోయాలి. మరో పది నిమిషాల పాటు ఆ మొత్తం మిశ్రమం మరిగేలా చేయాలి. ఆ తర్వాత బెల్లం వేయాలి. అయిదు నిమిషాల పాటు ఉడికిస్తే కొర్ర పొంగలి సిద్ధమవుతుంది. దించిన తర్వాత కాజు, బాదం, కిస్మిస్‌లతో అలంకరించుకోవచ్చు.



హార్మోన్ల సమస్యతో...

ఎక్కువ మంది ఇబ్బంది పడుతున్న సమస్యల్లో బరువు పెరిగిపోవడం ఒకటి. దీనికి ఎన్నోరకాల కారణాలు ఉండొచ్చు. అయితే అన్నింటి కంటే ప్రధాన కారణం మాత్రం హార్మోన్ల అసమతౌల్యత. సాధారణం గా ఇబ్బంది ఎదురవనంతకాలం చాలా మంది ఈ సమస్యను పెద్దగా పట్టించుకోరు. కానీ ఓసారి ఇబ్బంది ఎదురయ్యాక దాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి చాలా సమయమే పడుతుంది. అందుకే సమస్య మొదట్లో ఉన్నప్పుడే దాన్ని తగ్గించుకోవడం మంచిది. హార్మోన్ సమస్య ఏర్పడితే ఎదురయ్యే పరిణామాలు.. నివారణలు ఏంటో చూద్దాం...

బరువు : హార్మోన్ల అసమతౌల్యత బరువు పెరిగేలా చేస్తుంది. తిరిగి తగ్గడానికి చాలా కష్టమవుతుంది కూడా. అయితే ఇది కేవలం రెండు రకాల హార్మోన్ల వల్లే ఎదురవుతుంది. శరీరంలో ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లు విడుదలవుతాయన్న సంగతి చాలామందికి తెలిసిందే. రుతుక్రమం సరిగ్గా కొనసాగేందుకు ఇవి తోడ్పడతాయి. అయితే ఈ రెండు హార్మోన్లు సరైన మోతాదులో విడుదలవ్వాల్సి ఉంటుంది. రెండిట్లో ఏ ఒకటి ఎక్కువగా విడుదలైనా ఇబ్బందులు ఎదురవుతాయి. చాలామందిలో ప్రొజెస్టిరాన్ తక్కువగా విడుదలవుతూ ఈస్ట్రోజన్ స్థాయులు పెరుగు తుంటాయి. దీనివల్ల బరువు అపరిమితంగా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో పాటు జుట్టు రాలిపోవడం, రుతుచక్రం క్రమం తప్పడం వంటి సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. ఈస్ట్రోజన్ ఎక్కువవడం వల్ల కేవలం బరువు పెరగడమే కాదు.. డిప్రెషన్, ఎక్కువగా ఆందోళన చెందడం, నిద్రలేమి వంటివి ఎదురవుతాయి. ఈ సమస్యలు ఒత్తిడిని పెంచి ఎక్కువగా తినాలనే కోరికను పెంచుతాయి. దీంతో పాటు ఈస్ట్రోజన్ తినే ఆహారంలో ఎక్కువ భాగాన్ని శరీరంపై కొవ్వు పొరలాగా పరుచుకునేలా చేస్తుంది. ఇలా కొవ్వు పెరగడం వల్ల మరింత ఈస్ట్రోజన్ ఉత్పత్తి అవుతుంది. ఇలా ఈ విషవలయం కొన సాగుతూనే ఉంటుంది.



కారణాలు : శారీరక శ్రమ లేక పోవడం, సరైన ఆహారం తీసుకోక పోవడం, రుతుస్రావంలో తేడాలు, కుటుంబ నియంత్రణ మందులు వాడడం, సింథటిక్ ప్రొజెస్టిరాన్ ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ప్రొజెస్టిరాన్ తక్కువగా విడుదల కావడం వంటివి హార్మోన్ల అసమతుల్యతకు దారితీస్తాయి.

నివారణ : తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. కనీసం ఓ అరగంటపాటు నడవడం అయినా అలవాటు చేసుకోవాలి. ఫాస్ట్‌ఫుడ్ తినడం తగ్గించాలి. రోజూ తీసుకోవాల్సిన మోతాదులో పోషకాలను ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. వీలైనంత మేరకు ఆర్గానిక్ ఫుడ్, అదీ జన్యు మార్పులు చెందని ఆహారం తీసుకోవాలి. వైద్యుల సలహా లేకుండా కుటుంబ నియంత్రణ మందులు వాడుతుంటే వెంటనే వైద్యుల సలహా తీసుకోవాలి.

మహిళతో జవాన్ అసభ్యకర ప్రవర్తన

- కిరాణా స్టోర్‌లో ఘటన.. వీడియో వైరల్
- నగ్న ఊరేగింపు ఘటన భయానకం: ఎన్ఎస్‌సీఎన్ (ఐఎం)
- హింస జరగకుండా చూడండి : ఎన్‌హెచ్చార్సీ

ఇంఫాల్ : జాతి హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో మహిళల భద్రత ప్రశ్నార్థకమవుతున్నది. సాక్షాత్తూ ఒక బీఎస్ఎఫ్ జవాన్.. ఒక మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై నెటిజన్లతో పాటు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన భారత్‌తో పాటు అంతర్జాతీయంగానూ తీవ్ర ఆందోళనను కలిగించిన విషయం విదితమే. ఇప్పుడు ఒక మహిళతో బీఎస్ఎఫ్ జవాన్ లైంగికంగా వేధిస్తునన్న వీడియో బయటకు రావటం గమనార్హం. ఒక కిరాణా స్టోర్‌కు వచ్చిన మహిళ.. తనకు కావాల్సిన వస్తువుల కోసం వెతుకుతున్న సందర్భంలో సాయుధుడైన సదరు బీఎస్ఎఫ్ జవాను మహిళతో అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. ఆమె ఎక్కడికి వెళ్లినా ఆమెతో వెళ్తూ ఇష్టం వచ్చినట్టు చేతులు వేస్తూ కనిపించాడు. దాదాపు మూడు నిమిషాలకు పైగా నిడివి కలిగిన ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. ఈ ఘటన గతేడాది చోటు చేసుకున్నట్టుగా సమాచారం. నిందితుడైన బీఎస్ఎఫ్ జవాన్‌ను హెడ్ కానిస్టేబుల్ సతీశ్ ప్రసాద్‌గా గుర్తించారు. ఆయనను అధికారులు సస్పెండ్ చేశారు.

హింస జరగకుండా చూడండి : ఎన్‌హెచ్చార్సీ

అల్లర్లతో అట్టుడుకుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో ఎలాంటి హింసాకాండ జరగకుండా చూడాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్చార్సీ) మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేసింది. జాతి హింస కారణంగా ప్రభావితమైన బాధితులకు సహాయం, పునరావాసం గురించి తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

అది భయానక ఘటన:ఎన్ఎస్‌సీఎన్ (ఐఎం)

మణిపూర్‌లో మే 3న ఘర్షణలు చెలరేగిన తర్వాత మొదటిసారిగా ఈశాన్య ప్రాంతంలోని అతిపెద్ద తిరుగుబాటు బృందం ఎన్ఎస్‌సీఎన్(ఐఎం) తొలిసారిగా పెదవి విప్పింది. వీడియోలో బంధించిన ఇద్దరు గిరిజన మహిళలపై లైంగిక వేధింపులను ఖండించింది. మణిపూర్‌లోని కుకీ-ఆధిపత్యం గల కాంగ్‌పోక్పి జిల్లాలో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనను ఖండిస్తూ ఎన్ఎస్‌సీఎన్ (ఐఎం)కి చెందిన మహిళా విభాగం నేషనల్ సోషలిస్టు ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ నాగాలిమ్ (ఎన్ఎస్‌డబ్ల్యూఓఎన్) ఒక ప్రకటనను విడుదల చేసింది.

తప్పుదారి పట్టిస్తుంది

(మొదటిపేజీ తరువాయి)

సరైన ఆత్మీయుల అన్వేషణలో తరుచూ తప్పుడు పనులకు దిగుతున్నారని తెలిపింది. ఆత్మహత్యకు ప్రేరేపించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి బెయిల్ మంజూరు విచారణ సందర్భంగా న్యాయస్థానం పై అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. "ఈ దేశంలోని యువత వ్యతిరేక లింగానికి చెందిన వారితో స్వేచ్ఛా సంబంధానికి ఎర చూపడం, పాశ్చాత్య సంస్కృతికి లొంగిపోవడం, నిజమైన ఆత్మ సహచరుడిని కనుగొనకపోవడంతో తమ జీవితాలను పాడు చేసుకుంటున్న అనేక కేసులలో ఇది ఒకటి. సామాజిక మాధ్యమాలు, చలనచిత్రాలు ఆకట్టుకునే మనస్సుల ఊహాశక్తిని రేకెత్తిస్తుంది. వారు అదే ప్రయోగాలు చేయడం ప్రారంభిస్తారు. కానీ అవి ప్రస్తుత సామాజిక ప్రమాణాలకు సరిపోవు" అని అలహాబాద్ హైకోర్టు వెల్లడించింది. పాశ్చాత్య సంస్కృతిని అనుసరించడం వల్ల కలిగే పర్యవసానాల గురించి తెలియని యువతరం సోషల్ మీడియా, సినిమాల్లో చూపించే కంటెంట్‌కు ప్రభావితమై సంబంధాలలోకి ప్రవేశిస్తోందని వ్యాఖ్యానించింది.

హైకోర్టు తీర్పును అమలుచేయండి..

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటిస్తూ ఎన్నికల కమిషన్ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు శాసనసభలోని స్పీకర్ కార్యాలయానికి వచ్చిన జలగం..హైకోర్టు తీర్పు ప్రతులను స్పీకర్ కార్యలయంలో అందజేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు.

ఉపాధికి తూట్లు

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నీరుకారిపోతోంది. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి కుటుంబానికీ సంవత్సరానికి కనీసం వంద రోజుల ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. అయితే లక్ష్యానికి తూట్లు పొడుతూ ఈ పథకం నుండి 2022-23లో 5.18 కోట్ల మంది లబ్దిదారులను తొలగించారు. ఓ వైపు పథకం లబ్దిదారులలో 57.43 శాతం మంది మహిళలేనని గొప్పగా చెబుతున్న ప్రభుత్వం మరోవైపు ఏవేవో సాకులు చూపుతూ వారి నోటి కాడి కూడును లాగేసుకుంటోంది. ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగం పెరిగిపోతోంది. ఇదేదో ప్రతిపక్ష పార్టీలు చేసిన ఆరోపణ కాదు. సాక్షాత్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ మంగళవారం లోక్‌సభకు తెలియజేసిన విషయాలను పరిశీలిస్తే ఎవరికైనా ఈ విషయం ఇట్టే అర్థమైపోతుంది. 2021-22లో తొలగించిన వారి కంటే గత సంవత్సరంలో ఈ పథకం నుంచి తొలగించిన వారి సంఖ్య ఏకంగా 247 శాతం పెరిగిందట. పేరు తొలగిస్తే ఆ వ్యక్తి పని చేయడానికి అనర్హుడు అవుతాడు.

ఉపాధి హామీ పథకం లబ్దిదారుల జాబ్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం జనవరిలోనే నిర్ణయం తీసుకుంది. కార్మికులు, పనివారు నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వం మొండిగా తన నిర్ణయాన్ని అమలు చేయడానికే పూనుకుంది. ఆధార్ ఆధారిత చెల్లింపుల అమలు కోసం విధించిన గడువును ఇప్పటికే నాలుగు సార్లు పొడిగించింది.

తాజాగా ఆగస్ట్ 31వ తేదీ వరకూ గడువును పొడిగించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలు హడావిడిగా కార్మికుల పేర్లు తొలగించడం ప్రారంభించాయి. ఆధార్ వివరాలతో సరిపోలని జాబ్ కార్డులు కలిగిన వారి పేర్లను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారు.

2021-22లో 1,49,51,247 మందిని ఈ పథకం నుండి తొలగించగా 2022-23లో ఆ సంఖ్య 5,18,91,168కి పెరిగిందని మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. తొలగింపులు అనేవి రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే నిరంతర ప్రక్రియ అని, అంతేకానీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న కారణంగా వ్యవస్థలో దొర్లిన పొరబాటు కాదని ఆయన చెప్పుకొచ్చారు. జాబ్ కార్డులలో నకిలీలు, డూప్లికేట్లు ఉండడం, పని చేయడానికి లబ్దిదారులు ఇష్టపడకపోవడం, గ్రామాల నుంచి కుటుంబాలు శాశ్వతంగా వేరే ప్రాంతాలకు తరలిపోవడం, జాబ్ కార్డులో పేరున్న ఏకైక వ్యక్తి చనిపోవడం వంటి కారణాల వల్ల కూడా తొలగింపులు జరుగుతున్నాయని వివరించారు.

ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం 2022-23లో పశ్చిమ బెంగాల్‌లో అత్యధిక తొలగింపులు (83.36 లక్షలు) జరగగా ఆంధ్రప్రదేశ్ (78.05 లక్షలు), ఒడిశా (77.78 లక్షలు), బీహార్ (76.68 లక్షలు), ఉత్తరప్రదేశ్ (62.98 లక్షలు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

మహిళలే అధికం

ఉపాధి హామీ పథకం లబ్దిదారుల్లో 57.43 శాతం మంది మహిళలేనని కేంద్రం తెలిపింది. 2021-22లో... అంటే కోవిడ్ కష్టకాలంలో సైతం మహిళా లబ్దిదారుల సంఖ్య 54.82 శాతంగా నమోదైంది. కేరళలో నమోదైన లబ్దిదారులలో మహిళలు ఏకంగా 89.82 శాతం ఉండడం విశేషం. ఆ తర్వాత 87.48 శాతంతో పాండిచ్చేరి రెండో స్థానంలో నిలిచింది. గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని తెలియజేశారు. 2020-21లో ఈ పథకంలో 18-30 సంవత్సరాల మధ్య వయసున్న వారు 2.95 కోట్ల మంది చేరగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 3.06 కోట్లకు పెరిగింది.

ఈడీ డైరెక్టర్ పదవీ కాలాన్ని పొడిగించాలి

(మొదటిపేజీ తరువాయి)

అత్యవసరంగా జాబితా చేయాలని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం కోర్టును కోరారు. గురువారం ఈ పిటిషన్‌ను జాబితా చేసేందుకు జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం అంగీకరించింది. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు పిటిషన్‌ను విచారించడానికి అంగీకరించింది. ఈడీ అధిపతిగా 2018 నవంబర్‌లో సంజయ్ కుమార్ మిశ్రా నియమితులయ్యారు. రెండేండ్ల తరువాత (60 ఏండ్ల వయసు వచ్చిన) ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ, 2020 నవంబర్ 13న ఆయన పదవీ కాలాన్ని రెండేండ్ల నుంచి మూడేండ్లకు మార్చే విధంగా రాష్ట్రపతి 2018 ఉత్తర్వులను సవరించినట్టు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, దీనిని సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత జయా ఠాకూర్, స్వచ్ఛంద సంస్థ కామన్ కాజ్‌తోపాటు పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీటిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్‌లతో కూడిన ధర్మాసనం జులై 11న సంజయ్ మిశ్రా పొడిగింపు కుదరదని స్పష్టం చేస్తూ తీర్పు ఇచ్చింది. జులై 31 తరువాత ఆయన ఆ పదవిలో ఉండరాదని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. ఆ లోపు ఈడీకి కొత్త అధిపతిని నియమించుకోవాలని కేంద్రానికి సూచించింది. ఈ క్రమంలోనే కేంద్రం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

బీజేపీలో లొల్లి

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కసారిగా రాష్ట్ర కార్యాలయంలో బైటాయించారు. 'భారత్ మాతాకీ జై..అర్వింద్ డౌన్‌డౌన్.. వీవాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాం సుందర్ మాట్లాడుతూ..'నిజామాబాద్ జిల్లాలో ఎవ్వరికీ తెల్వకుండా, పార్టీకి సమాచారం లేకుండా 13 మంది మండలాధ్యక్షులను మార్చేశారు. దానివల్ల పార్టీ బలహీన పడుతున్నది. ఒక్క బోధన్ నియోజకవర్గంలోనే నలుగురు బలమైన మండలాధ్యక్షులను మార్చేసి వారి స్థానంలో కొత్తవాళ్లను పెట్టారు. ఆ నలుగురూ దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడుతున్నవాళ్లు. వారికి ఎలాంటి సమాచారం లేకుండా జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య వ్యతిరేకించినప్పటికీ ఉన్నతస్థాయిలోని నాయకులెవ్వరికీ సమాచారం లేకుండా జిల్లా అధ్యక్షుడు బసవ లక్ష్మీనర్సయ్యపై ఒత్తిడి తెచ్చి ఎంపీ అర్వింద్ ఈ నిర్ణయం తీసుకున్నారని కార్యకర్తలందరూ భావిస్తున్నారు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ నిర్ణయాన్ని రాష్ట్ర అధ్యక్షులైన కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేయడానికి, నిలుపుదల చేయడానికి ఈ రోజు నిజామాబాద్ జిల్లాలోని ముఖ్యమైన నాయకులు ఇక్కడకు వచ్చారు. కాబట్టి వెంటనే కిషన్‌రెడ్డి కలుగజేసుకుని సమస్యను పరిష్కరించి దశాబ్దాలుగా పార్టీ జెండాలు మోస్తున్న నాయకులకు, కార్యకర్తలకు న్యాయం చేయాలని ఏకైన విజ్ఞప్తితో ఇక్కడకు వచ్చాం. ఎంపీ అర్వింద్ ఈ నిర్ణయాన్ని ఎందుకు తీసుకున్నారనే దానికి రాష్ట్ర అధ్యక్షులకు వివరిస్తాం' అని చెప్పారు.

వినయ్‌రెడ్డి ప్రసంగం...ప్రకాశ్‌రెడ్డి జోక్యం..కార్యకర్తల ఆగ్రహం

'ఆర్మూర్ నియోజకవర్గంలో ఇద్దరు మండలాధ్యక్షులను మార్చారు. కొత్తగా నియమించిన సురేశ్‌నాయక్ వాయిస్ రికార్డ్ నా దగ్గర ఉంది. ఎంపీటీసీ ఎన్నికల్లో సురేశ్‌నాయక్ బీజేపీ అభ్యర్థులను ఓడగొట్టేందుకు శతవిధాలా ప్రయత్నించాడు. పార్టీ మండల నాయకులకు ఫోన్లు చేసి "అరె పొల్టుగాళ్లారా ఇంకెన్ని రోజులు బీజేపీలో ఉంటరు? బీఆర్ఎస్‌లోకి రండి. జీవన్‌రెడ్డి సార్‌తో నేను పైసలిప్పిస్త" అన్న వ్యక్తి పార్టీకి మండలాధ్యక్షుని పదవి ఎలా ఇస్తారు?' అని గత ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన వినయరెడ్డి ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతుండగానే...బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి అక్కడకు చేరుకున్నాడు. 'ఏయ్ బాబూ..ఏయ్ బాబూ..హల్లో హల్లో ముందు నువ్వు మైకు ఆపు..ఏయ్ ముందు నువ్వు ఆపు...నడ్వు బయటకు రా. నీకే నివ్వు బయటకు రా. ఇదేనా పద్ధతి? నువ్వు అసలు నాయకుడివేనా? మీడియా ముందు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతావా?' అంటూ కోపంతో ఊగిపోయారు. 'ఏం జేయమంటవ్ సార్.' అని కొందరు నాయకులు ప్రకాశ్‌రెడ్డితో మాట్లాడుతుండగానే.. 'అర్వింద్ డౌన్..అర్వింద్ డౌన్' అంటూ కొద్దిసేపు నినాదాలు చేశారు. 'పైకి నడవండి. ఈడ ఏం మాట్లాడొద్దు' అని ప్రకాశ్‌రెడ్డి అంటుండగానే... 'ఏయ్ నువ్వేం మాట్లాడుతున్నవ్? ఈడ కూసోని ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఊరుకోం. నువ్వు ఎవ్వడరవు బై మమ్ముల్ని అంటందుకు. ఊర్లల్లో 30, 40 ఏండ్ల నుంచి జెండా మోస్తున్నోళ్లం. మాకు ఇచ్చే గౌరవం ఇదేనా? పార్టీని ఆగంచేస్తున్నరు. ఇప్పుడు కూడా నోర్లు మూసుకుని ఉండాలా? మీరేం జేస్తరు? మహా అంటే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తరు అంతేగా? చేయండి చూద్దాం' అంటూ గ్రామస్థాయి నాయకులు ఆవేశంతో ఊగిపోతూ ఎదిరించారు. ధిక్కార స్వరం తీవ్రస్థాయిలో వినిపించటంతో ప్రకాశ్‌రెడ్డి, ఇతర నాయకులు వారికి నచ్చజెప్పారు. కిషన్‌రెడ్డి దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడించారు. మూలిగే నక్కమీద తాటి పండు పడ్డ చందంగా ఈ పరిణామం చోటుచేసుకున్నది. మునుముందు ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

భూం...ఫట్

(మొదటిపేజీ తరువాయి)



అడిగినా ఏమీ తెలియదని దాటవేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందినా.. ఏమీ చేయలేని పరిస్థితి. ప్రభుత్వ భూములకు కాపలా ఉండాల్సిన వారే నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కొంతమంది రైతులు, స్థానికులు, అధికారులు అందించిన వివరాల ప్రకారం.. ప్రత్యేక కథనం.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 249లో 1026.19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో కొంత భాగం అటవీశాఖ పరిధిలో ఉండగా, మరి కొంత సర్కారీ భూమిగా నమోదైంది. 1960-61 నుంచి 1964-65 వరకు ఖాస్రా, సేత్వార్ పహాణీల్లోనూ ఇది సర్కారు కంచెగా నమోదైంది. దీనిలో కొంత సాగుకు యోగ్యంగా ఉండటంతో స్థానికంగా ఉన్న పేద రైతులు ఏండ్లుగా సాగు చేసుకుంటున్నారు. 1980-81 నుంచి 1985-86 వరకు సర్వే నంబర్లు 249, 249/1 మినహా సర్వే నంబర్ 249/2 నుంచి 249/17 వరకు ఉన్న 70.24 ఎకరాలు పట్టా భూమిగా మారింది. 249/1 మాత్రం అలాగే వదిలేసి, ఆ తర్వాత వచ్చిన 249/2 నుంచి 249/17 సర్వే నంబర్లలోని భూమి పట్టా భూమిగా మారింది. నిజానికి ఈ భూములు హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లోనూ గ్రీన్‌జోన్ కింద నమోదై ఉన్నాయి. ఇక్కడ ఎలాంటి వాణిజ్య కార్యకలాపాలకు అవకాశం లేదు. కొంత మంది నేతలు, అధికారులు ఓ ప్రణాళిక ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో ఉన్న లోపాలను అవకాశంగా తీసుకుని రైతుల నుంచి చాలా తక్కువ ధరకు ఈ భూములను కొట్టేసినట్టు తెలిసింది. ఆ తర్వాత తమకున్న అధికార, ఆర్థిక బలంతో రెవెన్యూ, అటవీశాఖల అధికారులను మేనేజ్ చేయడం.. అసలు సర్వే నంబర్‌కు అనేక సబ్ డివిజన్లు సృష్టించడం చకచకా చేశారని సమాచారం. గ్రీన్‌జోన్ పరిధిలో ఉన్న తమ భూములకు విముక్తి కల్పించాలని కోరుతూ ఆయా శాఖల అధికారులు ఇచ్చిన రిఫరెన్స్ లెటర్లతో హెచ్ఎండీఏకు దరఖాస్తు చేశారు. ప్రభుత్వంలోని పెద్దలు చెప్పిందే తడవుగా హెచ్ఎండీఏ అధికారులు సైతం ఏ మాత్రం ఆలోచించకుండా సదరు సర్వే నంబర్లలోని భూమిని మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించారన్న ఆరోపణలున్నాయి. 249/1లోని భూమి గ్రీన్‌జోన్‌లో ఉంటే ఆ పక్కనే ఆనుకుని ఉన్న వివాదాస్పద సర్వే నంబర్లలోని భూములు మాత్రం ఎలా రెసిడెన్షియల్ జోన్‌లోకి మారాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఎన్ఓసీల జారీపై అనుమానాలెన్నో..?

అటవీ శాఖ తన భూములను నిర్ధారించక ముందే అప్పటి ఇన్‌చార్జి కలెక్టర్ ఏకంగా అవి ప్రయివేట్ పట్టా భూములుగా నిర్ధారిస్తూ ఎన్ఓసీ పత్రం (16/11/2019) జారీ చేశారు. కలెక్టర్ ఎన్ఓసీ జారీ చేసిన ఏడాది తర్వాత అటవీ శాఖ(799 ఎకరాలు)గా నిర్ధారిస్తూ రిపోర్టు ఇవ్వడంపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. అంతేకాదు అప్పటి కలెక్టర్ జారీ చేసిన ఒక ఎన్ఓసీపై సంతకం లేదు. మరో ఎన్ఓసీపై సంతకం ఉండటం గమనార్హం. ఇలా ఒకే భూమికి రెండు ఎన్ఓసీలు జారీ అయ్యాయి. అంతే కాదు 2018 ముందు ఆయా రైతుల పేరున ఉన్న పట్టాదారు పాసు పుస్తకాల్లోనూ ఆ భూములు అమ్మడం కొనడం నిషేధం అని రాసి ఉంది. ధరణి వచ్చిన తర్వాత ఈ భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయలేదు. దాంతో కొనుగోలుదారులు ప్లాన్ ప్రకారం వీటిని పెండింగ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిసింది.

తొలుత పెండింగ్ రిజిస్ట్రేషన్

ధరణిలో తమ పేర్లు రికార్డు చేయించుకుని, పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన తర్వాత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి తమ డాక్యుమెంట్‌లను రిలీజ్ చేసుకున్నారు. ఆయా భూములన్నీ పట్టా భూములే అయితే వాటిని కొనుగోలు చేసిన వారు డాక్యుమెంట్‌ను సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో పెండింగ్ జాబితాలో పెట్టాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న కూడా ఉత్పన్నం అవుతుంది. అంతేకాదు ఇప్పటి వరకు ఆ భూములను అమ్మిన రైతులకు మొత్తం కాకుండా సగం డబ్బులు మాత్రమే చెల్లించారు. దీనిపై సరైన వివరణ ఇచ్చే అధికారులే లేరు. తమ హయాంలో జరిగింది కాదని, ఆ విషయాలు ఏవీ తెలియవన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తి డాక్యుమెంట్లు ఉన్నా చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిసిన గద్దె విజయనేత



నవతెలంగాణ-వనస్థలిపురం

బీ.యన్.రెడ్డి టీడీపీ కంటెస్టెడ్ కార్పొరేటర్, అధ్యక్షులు గద్దె విజయనేత ఆధ్వర్యంలో పలువురు నేతలు వనస్థలిపురం ఏసీపీగా నూతన బాధ్యతలు స్వీకరించిన భీమ్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలోకషబ్, నవీన్, కార్పెంటర్ శ్రీను, శశాంక్ నేత, ప్రసాద్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు తెలిపిన వాటర్ బోర్డు నాయకులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

వాటర్ బోర్డులో అవుట్సోర్సింగ్ కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ వేతనాలు పెంచాలని నిర్ణయించిన సందర్భంగా రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మెన్ పులిమామిడి నారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీవో 60 ద్వారా వేతనాలు పెరగడానికి సంపూర్ణ సహకారాలు అందించిన ఎమ్మెల్సీ కవితకు 4000 మంది వాటర్ బోర్డు కార్మికులు రుణపడి ఉంటారని నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.టీ.యూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్‌తోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల మారయ్య పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన డాక్టర్ గజ్జి రాజు

నవతెలంగాణ-వనస్థలిపురం

రంగారెడ్డి జిల్లా డీసీహెచ్ఎస్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్. గజ్జిరాజు వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆస్పత్రి సిబ్బంది శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ హెల్త్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకం భిక్షపతి, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ శాంతికుమార్, వెల్నెస్ సెంటర్



ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమీర్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జరీనా పర్వీన్ , రంగారెడ్డి జిల్లా యూనియన్ అధ్యక్షులు నర్సింగ్, రాజేష్, అనిల్ గౌడ్, శానిటేషన్ సూపర్‌వైజర్ ఆగయ్య, ఫ్లంబర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అస్థవ్యస్తంగా ఎన్జీవోస్ కాలనీ మెయిన్ రోడ్డు



- తీవ్ర ఇబ్బందుల్లో వాహనదారులు
- సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్

నవతెలంగాణ-వనస్థలిపురం

బీ.యన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ రోడ్లు గుంతలు పడ్డాయి. వర్షాల కారణంగా లేబర్ అడ్డా వద్ద రోడ్డు గుంతలు పడడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని కాలనీవాసులు బీ.యన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి తెలియజేశారు. బుధవారం కార్పొరేటర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి రోడ్లను పరిశీలించారు. అనంతరం సమస్యను పరిష్కరించాలని సంబంధించిన అధికారులను ఆదేశిం చారు. దీంతో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు గుంతల్లో పాక్షికంగా కంకర వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోడ్డును త్వరలోనే బాగు చేయిస్తానని హామీ ఇచ్చారు. వెంటనే రోడ్డును బాగు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు డీఈ దామోదర రావు, ఏఈ రాకేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి శరత్ కుమార్, నాయకులు న్యూటాన్, జైపాల్‌రెడ్డి, కామేష్, పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అర్హులకే డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలి

- కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి

నవతెలంగాణ-సంతోష్‌నగర్

డబుల్ బెడ్రూం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి నిరుపేదకూ ఇండ్లు ఇవ్వాలని డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి డీసీకి సూచించారు. బుధవారం యాకూత్‌పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో వారి ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వెరిఫికేషన్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరుయాత్ర కార్యక్రమంతోనే రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ ఫైనల్ లిస్ట్ వెరిఫికేషన్ చేస్తుందన్నారు. మీ సేవలో అప్లై చేసుకున్న



ప్రతి ఒక్కరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలన్నారు. ఎలాంటి పక్షపాతం చూపించకుండా ఇండ్లు ఇవ్వాలని జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ నరసింహను కోరారు. కార్యక్రమంలో లబ్దిదారులు, అధికారులు పాల్గొన్నారు.

బోనాలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక : సునీతారెడ్డి



నవతెలంగాణ- చైతన్యపురి

బోనాలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్‌లోని సాయిబాబానగర్, ఎన్టీఆర్ నగర్‌లో ఫలహార బండి ఊరేగింపు ఉత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలోని పండుగలను అన్ని కులాలు, మతాలు కలిసిమెలిసి జరుపుకునే సంస్కృతి ఉందన్నారు. సీఎం కేసీఆర్ పండుగలకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో శ్రీనాథ్, లోకేష్, నితీష్, శంకర్, జహార, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి

నవతెలంగాణ-సంతోష్‌నగర్

భారతదేశ రిజర్వేషన్ పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ జయంతిని మలక్‌పేట్ బీవీఎఫ్ నియోజకవర్గం అధ్యక్షులు ఆడపు లక్ష్మణ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సాహు మహారాజ్ చిత్రపటానికి పలువు రు నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ .. అట్టడుగు వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, ఆరోగ్యం, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ కల్పించిన మహనీయుడని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం నిర్మాత బీఆర్. అంబేద్కర్ ఉన్నత చదువులకు ఎంతో సాయం చేశారని కొనియా డారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధ్యక్షులు ప్రజలకు కోరారు.



కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఆలుగోల రమేష్, చాట్ల చిరంజీవి, బీవీఎఫ్ కన్వీనర్ సుమన్, యాకత్‌పుర నియోజకవర్గ అధ్యక్షులు మాణిక్యం, డివిజన్ నాయకులు దశరథ్, శ్రీను, సురేష్ యువకులు పాల్గొన్నారు.

మహేశ్వరం టీడీపీ ఇన్‌చార్జిగా ఎడ్ల మల్లేష్ ముదిరాజ్




నవతెలంగాణ - మీర్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగా మీర్‌పేట్ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్‌ను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎడ్ల మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. చాలా రోజులుగా టీడీపీ పార్టీ అభివృద్ధి కోసం పనిచేశానని తెలిపారు. పార్టీ కార్యకర్త స్థాయి నుంచి మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పదవితో నాపై మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. బడుగు బలహీన వర్గాల వారికి ఎన్నో అవకాశాలను అందించిన పార్టీ టీడీపీ అని గుర్తు చేశారు. ఎన్టీఆర్ ఆశయాలు, చంద్రబాబు ఆచరణలో ప్రజలకు ఎన్నో సేవలు, ఎన్నో అభివృద్ధి పనులు, ఎన్నో సంక్షేమ పథకాల్ని అందించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. బడుగుబలహీన వర్గాల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్ నాయకత్వంలో తెలంగాణాలో తెలుగు దేశం పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజేష్ రెడ్డి, వాసు సాగర్ తదితరులు ఉన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీసీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-సంతోష్‌నగర్

వర్షానికి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మలక్‌పేటలో ముసారాంబాగ్‌వంతెన, అక్షయ హెూటల్, యశోద ఆస్పత్రిలోని పెలికాన్ సిగ్నలను పరిశీలించారు. సంతోష్‌నగర్, చంద్రయన్ గుట్ట పీఎస్‌లో లిమిట్ దోబీఘాట్ వాటర్‌లాగింగ్ పాయింట్లను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డీసీపీ ఆదేశించారు. వర్షాలతో చాదర్‌ఘాట్-మూసా రాంబాగ్ మార్గంలో ఉన్న మూసీనది ఉధృతంగా ప్రవహి స్తున్నందున వాహనదారులకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్



పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మూసి నది పరిస్థితిని సౌత్-ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ సుధీర్ బాబు, మలక్ పేట ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మూసారాంబాగ్ కాజీవే వద్ద పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ అధికారుల పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్ష సూచన

- జీహెచ్ఎంసీ హై అలర్ట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో వర్షాలు దంచికొడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నగరం అతలాకుతలమైంది. చెరువులు, కాలువలు, డ్రయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు, రోడ్లపై వరద, మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో నగర వాసులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం సైతం హైదరాబాద్ జంటనగరాల పరిధిలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతారణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. ఈ మేరకు నగరంలో హై అలెర్ట్‌ను ప్రకటించింది. అత్యవసర పరిస్థితుల్లో తప్ప మిగతా సమయాల్లో బయటకు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ అధికారులు లక్షలాది మందికి ఎస్ఎంఎస్‌ల ద్వారా అప్రమత్తం చేశారు. అత్యవసర సమయాల్లో సహాయం కోసం 9000113667 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చేసిన ట్విట్టర్ ద్వారా కోరింది. అయితే, వాతావరణశాఖ చార్మినార్, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎల్‌బీ నగర్, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి సహా హైదరాబాద్‌లోని ఆరు జోన్ల పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అంచనా వేసింది.

లోతట్టు ప్రాంతాల్లో వరద నివారణకు ప్రత్యేక చర్యలు

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

లోతట్టు ప్రాంతాల్లో వరద నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నేపథ్యంలో బుధవారం మేయర్ జోనల్ కమిషనర్‌లతో పాటు ఇతర విభాగాల అధికారులతో వైర్లెస్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని, అంతే కాకుండా క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జోనల్ పరిధిలో ఏ.ఏ ప్రాంతంలో వరద ముంపు ఉందో ముందుగానే గుర్తించి అక్కడ ఎలాంటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వర్షాల నేపథ్యంలో ఆయా జోన్ల లో ఏర్పడిన వరద పరిస్థితులను చేపట్టిన చర్యలపై జోనల్ కమిషనర్లను మేయర్ అడిగి తెలుసుకున్నారు. గాజుల రామారంలో పలు కాలనీలలో వర్షపు నీరు వచ్చినందున కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కుకట్ పల్లి జోనల్ కమిషనర్‌ను మేయర్ ఆదేశించారు. వాటర్ లాగింగ్ పై వచ్చిన పిర్యాదులు మాన్సూన్ ఎమర్జెన్సీ బందాలు వెంటనే నిలిచిన నీటితోపాటు బురదను కూడా తొలగించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో అక్కడక్కడ తీవ్రంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకొని సమస్య ఉత్పన్నం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లను మేయర్ కోరారు.

ప్రజలను రక్షించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం



- టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్‌రెడ్డి
- చెరువును తలపిస్తున్న జల్‌పల్లి కాలనీలు
- తీవ్ర ఇబ్బందులో ప్రజలు
- పట్టింపులేని అధికారులు, ప్రజా ప్రతినిధులు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

వర్షాలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలను రక్షించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్‌రెడ్డి అన్నారు. వర్షాలకు జల్‌పల్లి మున్సిపల్ కాలనీలుచెరువును గుర్తు చేస్తున్నాయని వాపోయారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బాలాపూర్ గ్రామ సమీపంలోని బిలాల్ కాలనీలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహ్మ రెడ్డితో కలిసి పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బంగారు తెలంగాణలో చిన్నపాటి వర్షాలకే రోడ్లు చెరువులుగా మారుతున్నాయని విమర్శించారు. కేటీఆర్, సబితాఇంద్రారెడ్డికి సమస్యలు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండిపడ్డారు. ప్రభుత్వం పేదల సమస్యలను పరిష్కారం చేయటంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాలనీలలో చిన్నపాటి వర్షాలకే రోడ్లు, కాలనీలు చెరువులుగా మారినా కేసీఆర్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యావహరిస్తుందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందనిన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా బంగారు తెలంగాణ అని ప్రశ్నించారు. అంతకుముందు కాలనీలో నిరసన చేశారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు అహ్మద్ బాం, బడంగ్‌పేట్ మున్సిపాల్టీ మైనార్టీ అధ్యక్షులు అష్షల్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారి మనోహర్, ఎర్ర జైహింద్, జల్‌పల్లి అధ్యక్షుడు అహ్మద్ బామ్, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు బాలింగని జంగయ్య తదితరులున్నారు.

శ్రీ సరితా విద్యానికేతన్ స్కూల్లో హరితహారం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తొమ్మిదో హరితహారంలో భాగంగా బుధవారం శ్రీ సరితా విద్యానికేతన్ స్కూల్లో హరితహారం నిర్వహించామని స్కూల్ డైరెక్టర్ శ్రీ సాభిద్, ప్రిన్సిపాల్ క్రిస్టల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలు చాలా కీలకమని, వృక్ష సంపద మీద ప్రపంచ మనుగడ సాగుతుందని తెలిపారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా.. మనిషి ఆక్సిజన్ పీల్చుకోవాలన్న వృక్షాలు చాలా కీలకమని విద్యార్థులకు సూచించారు. వాతావరణ పరిస్థితులు వృక్ష సంపద మీద ఆధారపడి ఉంటుందన్నారు. అడవులు ఎక్కువగా ఉన్న చోట సకాలంలో వర్షాలు పడతాయన్నారు. వృక్షాలు కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకొని మానవులకు ఆక్సిజన్ అందిస్తాయని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని కోరారు. మొక్కలు ఎన్ని ఎక్కువ నాటితే వాతావరణం పొల్యూషన్ కాకుండా ఉంటుందని వివరించారు. దీనివల్ల ప్రజలు ఎక్కువగా అనారోగ్యానికి గురి కాకుండా ఉన్నటరాని అన్నారు. ఈ సందర్భంగా మొక్కలను అం దరికీ ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనిల్, నవనీత, భావన, శ్రీనివాస్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చొరవతోనే హస్తినాపురం అభివృద్ధి

- డివిజన్ అధ్యక్షుడు ఆందోజ్ సత్యం చారి



నవతెలంగాణ - హస్తినాపురం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చొరవతోనే హస్తినాపురం డివిజన్ అభివృద్ధి చెందిందని డివిజన్ అధ్యక్షుడు ఆందోజ్‌చారి సత్యం అన్నారు. డివిజన్‌లో మౌలిక సదుపాయాలను మొదలుకొని అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీపడకుండా నిర్మాణాలు చేపడుతూ ఎల్బీనగర్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నూతన ఒరవడితో అను నిత్యం ప్రజలకు అందుబా టులో ఉంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఉన్నత లక్ష్యాల వైపు మళ్లించడంలో ఎమ్మెల్యే చొరవ అసామానమని అన్నారు. డివిజన్ అభివృద్ధికి కొన్ని వందల కోట్ల రూపాయలు వెచ్చించి నూతన డ్రయినేజీ, సీసీరోడ్లు, బీటీ రోడ్లను చేపడుతూ అభివృద్ధిలో దూసుకెళ్తున్నారని తెలిపారు.

రాజ్యాంగ ఫలాలు అందరికీ సమానంగా అందడం లేదు

- సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్

ఈ దేశంలో అట్టడుగు వర్గాలకు చెందిన దళితులు, గిరిజనులు, ఆదివాసులకు డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు అందరికీ సమానంగా అందడం లేదని, ఇప్పటికీ కుల వివక్షత కొనసాగుతూనే ఉందని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం హయత్ నగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి సీపీఐ హయత్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75ఏండ్లు అవుతున్నా ఇంకా దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచాల్సిన రాజకీయ నాయకులు ఆవిధంగా వ్యవరించడం లేదన్నారు. వారికి చట్టసభల్లో, విద్యావిధానంలో, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.



ప్రజాస్వామ్యంలో దళితులను ఓటు బ్యాంకుగా చూడటం సిగ్గుచేటన్నారు. హయత్‌నగర్ మండలం లో దళితుల సమస్యలపైన పోరాడటానికి నూతనంగా ఎన్నికైన కమిటీ చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో హయత్‌నగర్ మండల సహాయ కార్యదర్శి రమావత్ సక్రూ, జిల్లా దళిత హక్కుల పోరాట సమితి కార్యదర్శి వర్గ సభ్యులు నాగేష్, మహిళా సమాఖ్య మండల అధ్యక్ష, కార్యదర్శులు సరిత, సుభద్ర మండల నాయకులు గిరి, దిలీప్, సురేందర్, నాగరాజు, వెంకటేష్, నరేశ్, ఆదిలక్ష్మి, విరన్న, ముత్తయ్య పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పాలకమండలి సభ్యుడిగా నియమితులైన పాత్రికేయుడికి సన్మానం

నవతెలంగాణ -నాగోల్

మధ్యప్రదేశ్‌లోని మఖన్‌లాల్ చతుర్వేది నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జర్నలిజం, కమ్యూనికేషన్ పాలకమండలి సభ్యునిగా నియమితులైన పాత్రికేయుడు రావికంటి శ్రీనివాసులును అంతర్జాతీయ వైశ్య సామాఖ్య రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్తా, పర్వతాపూర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు బుధవారం శాలువతో సన్మానించారు. అనంతరం జర్నలిజం, మీడియా, కమ్యూనికేషన్ చదువులకు సంబంధించి ఆసియాలోనే మొట్టమొదటి విశ్వవిద్యాలయంలో పాలకమండలిలో శ్రీనివాసులుకు చోటు దక్కడంతో హర్షం వ్యక్తం చేశారు.



పూ ఎంటర్‌టైన్‌మెంట్ ఏజీ, స్విట్జర్లాండ్‌తో..
హార్న్‌బిల్ స్టూడియోస్ ఒప్పందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హార్న్‌బిల్ స్టూడియోస్ ప్రయివేటు లిమిటెడ్, డెట్రాయిట్‌లో ప్రధాన కార్యాలయం గల యూఎస్ సాంకేతిక సంస్థ పై స్క్వేర్ టెక్నాలజీస్‌కు పూర్తి అనుబంధ మల్టీమీడియా ప్రొడక్షన్ హౌస్ అండ్ డెలివరీ సెంటర్ హార్న్‌బిల్ స్టూడియోస్ ప్రయివేటు లిమిటెడ్, పూ ఎంటర్‌టైన్‌మెంట్ ఏజీ, స్విట్జర్లాండ్‌తో అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. ఫిలింఛాంబర్ వద్ద జరిగిన ఓ వేడుకలో ఈ ఎంవోయూపై సంతకాలు జరిగాయి. ఈ అవగాహనా ఒప్పందం ద్వారా హైదరాబాద్‌కు చెందిన హార్న్‌బిల్ స్టూడియోస్ రాబోయే సిరీస్‌లలో స్విస్ ఎంటర్‌టైన్‌మెంట్, మల్టీమీడియా మేజర్‌కు ప్రొడక్షన్ పార్టనర్‌గా వ్యవహరిస్తుంది. ఈ సందర్భంగా ఎఫ్‌ఓఓ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకుడు, దివంగత ప్రముఖ గాయకుడు మైఖేల్ జాక్సన్ కొరియోగ్రాఫర్ అయిన క్రిస్‌డీ, హార్న్‌బిల్ స్టూడియోస్ ప్రెసిడెంట్ శరత్ కొత్తపల్లి, ఎండీ రవి కొత్తపల్లి, సీఈవో శ్రీనివాస్ రాజు, ఎఫ్‌ఓఓ ఎంటర్‌టైన్‌మెంట్ జీఎమ్ ఐజాజ్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పై స్క్వేర్ టెక్నాలజీస్ ఇండియాకు చెందిన హార్న్‌బిల్ స్టూడియోస్ సీఈవో శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ ' మాదాపూర్, హైటెక్ సిటీలోని మైండ్‌స్పేస్ వద్ద ఉన్న ప్రొడక్షన్ హౌస్ సిబ్బందిని ప్రస్తుతం ఉన్న 100 నుంచి 200 వరకు 2024 నాటికి పెంచాలని యోచిస్తోంది. భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వినోద అండ్ మల్టీమీడియా సంస్థల అవసరాలను తీర్చటం పై స్టూడియో దష్టి సారిస్తుంది" అని తెలిపారు. హార్న్‌బిల్ స్టూడియోస్ మేనేజింగ్ డైరెక్టర్ రవి కొత్తపల్లి మాట్లాడుతూ ' పూ ఎంటర్‌టైన్‌మెంట్ ఫిలాసఫీ, సజనాత్మక ప్రయత్నాలతో అద్భుతమైన సినర్జీని హార్న్‌బిల్ స్టూడియోస్ కనుగొంది. ఈ బలమైన బంధంతో, భవిష్యత్ లీనమయ్యే అనుభవాలను నిర్మించడంలో మేం ముందంజలో ఉండగలం. ఈ ఏడాది మేం యానిమేషన్‌పై దష్టి పెట్టడం కొనసాగిస్తున్నందున, భారతీయ, గ్లోబల్ మూవీ ప్రొడక్షన్ హౌస్‌ల కోసం ప్రీ-విజ్ సేవలు, కోర్ అండ్ అభివద్ధిని కూడా అందించగలం' అని తెలిపారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన గోపాల్



నవతెలంగాణ-సంతోష్‌నగర్

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని ఎల్బీనగర్ నియోజకవర్గం బీసీ నాయకులు గోపాల్ ముదిరాజ్ అన్నారు. బుధవారం స్థానిక నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గోపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ రాష్ట్రమంతా అభివృద్ధిలో పరుగు పెడుతుందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులకు అందేలా చర్యలు కార్యక్రమాలు చేపట్టారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఎల్బీనగర్ తీర్చిదిద్దడంలో ఆదర్శంగా నిలవాలన్నారు. పరిశుభ్రత పరిరక్షణ విద్య, వైద్యం, ఆరోగ్యం, పెన్షన్లు, రెవెన్యూ జీహెచ్ఎంసీ వార్డ్ సభ్యులతో నూతనంగా చేపట్టిన పనులతో ప్రజలకు సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు నాయకులు పార్టీ శ్రేణులు అభిమానులు కార్యకర్తలు పెద్దలు యువకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డికి వెంకటేశం గౌడ్ శుభాకాంక్షలు



టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఓరుగంటి వెంకటేష్‌గౌడ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి బుధవారం ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఎస్ఎన్‌డీపీవర్క్స్, ఎస్ ఆర్ డీపీవర్క్స్, సీసీ రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ, పరిశుభ్రత పరిరక్షణ, వీధిలైట్లు, విద్య, వైద్యం, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు కోసం కృషి చేస్తున్నారనితె లిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు మిత్రులు పార్టీ శ్రేణులు కార్యకర్తలు సభ్యులు పెద్దలు యువకులు పెద్దలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

28న వికలాంగుల బస్సు పాస్ మేళా



నవతెలంగాణ- కాప్రా

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న వికలాంగులకు బస్సు పాస్ ప్రత్యేక క్యాంపును (మేళా) అంబేద్కర్ నగర్ బస్ స్టాప్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు కుషాయిగూడ డిపో మేనేజర్ పి. చంద్రకాంత్ బుధవారం ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. వికలాంగులకు ఉచిత బస్సు పాస్ అందజేస్తామని తెలిపారు. ఈ నెల 28న శుక్రవారం ఉదయం 9:30 నుండి సాయంత్రం 4:30 వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. (కుషాయిగూడ, నాగారం, దమ్మాయిగూడ, అంబేద్కర్ నగర్, బాలాజీ నగర్, బిజె ఆర్ నగర్, జై జై వన్) ఈ ప్రాంతాల్లో ఉన్న వికలాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. దీనికోసం సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్ ఫోటో సైజ్ ఫోటో, 50 రూపాయలు తీసుకొని బస్ పాస్ క్యాంపులో బస్సు పాస్ పొందగలరని సూచించారు.

'డ్రయినేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తా'



నవతెలంగాణ -ఉప్పల్

వర్షాకాల దృష్ట్యా రామంతపూర్ డివిజన్‌లోని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందకు కృషి చేస్తానని రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి అన్నారు. ఈ మేరకు బుధవారం డివిజన్లలోని పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలంలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మేనేజర్ రవీందర్, సూపర్‌వైజర్ కిషన్, డివిజన్ అధ్యక్షులు బండారు వెంకటరావు, రామంతపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు పూస సత్యనారాయణ, వెంకటాద్రి డివిజన్ నాయకులు పడిగెం నాగేష్, అల్లాడి నిరంజన్ గౌడ్, మసిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన

మయోర కంపెనీ యూనియన్ నాయకులు



నవతెలంగాణ- మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని మయోర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఇటీవల నూతనంగా బీఆర్టీయూ యూనియన్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు కార్మిక మంత్రి మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి..మయోర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బీఆర్టీయూ యూనియన్ ఏర్పాటుకు కృషి చేసిన మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జూకంటి సంతోష్, నాయకులు కుమార్, బాల మల్లేష్, నర్సింలు, మహేష్, ఖాదర్ వలీ, ప్రసాద్ రావు, దిల్లేశ్వరరావు, వీరాంజనేయులు, రాము, నాగార్జున రెడ్డి, కృష్ణారావు, వెంకటరమణ, సింహాచలం, వినోద్, సిద్ధిరాజు, రామూర్తి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ వైద్యులు, ఇతర సిబ్బందికి సూచించారు. కీసర, మల్కాజిగిరి డివిజన్ల జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు, ప్రైమరీ, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్, మెడికల్ ఆఫీసర్స్, రిపోర్టింగ్ సూపర్‌వైజర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కోసం ఏర్పాటు చేసిన యు-విన్ ట్రైనింగ్‌లో ఎమర్జెన్సీ రివ్యూ మీటింగ్‌ను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వాక్సిన్, మందులు, ఫ్లూయిడ్స్, యాంటి స్నేక్, యాంటి రాబీస్ ఇంజెక్షన్ తగు మోతాదులో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉండాలన్నారు. వైద్యులందరూ మేడ్చల్ జిల్లాలో నూతనంగా నియమితులైన 974 మంది ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లతో హౌజ్ టు హౌస్ సర్వే నిర్వహించి డెంగ్యు, మలేరియా, అతి సార వ్యాధిని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సకాలంలో డెంగ్యు, మలేరియా ఇతర వ్యాధిగ్రస్తుల వివరాలను జిల్లా ఆఫీస్‌కి పంపించాలనీ, మున్సిపల్‌శాఖ అనుసంధానంతో స్ప్రాయింగ్ ఆక్టివిటీ నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ/పల్లె దవాఖానలను సందర్శించే విధంగా ప్రోత్సహించాలన్నారు. లోతట్టు ప్రాంతంలో నివసించే వారికి ఎమర్జెన్సీ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు.

ప్రస్తుతం వర్షాకాలం దష్ట్యా ఆదివారం, సెలవు దినాల్లో కూడా అన్ని ఆరోగ్య సౌకర్యాలు పరీక్షలు, అవసరమైన మందులు సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది అలసత్వం వదిలి ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదనీ, కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చాయ్ పే ములాఖాత్‌లో ఫర్నిచర్ అందజేత



నవతెలంగాణ- కాప్రా

చాయ్ పే ములాఖాత్‌లో ఉద్యమకారుడి కూతరి వివాహానికి ఫర్నిచర్ అందజేశారు. మీర్‌పేట్, హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో తెలంగాణ ఉద్యమకారుడు కత్తుల రాజకుమార్ కూతురు వివాహం ఇటీవల జరిగింది. ఈ మేరకు ఉద్యమకారుడి ఇంట్లో బుధవారం చాయ్ పే ములాఖాత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్..బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఫర్నిచర్‌ను ఉద్యమకారుడి కూతురు పెండ్లికి బహూకరించారు. ఈ సందర్భంగా తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ చాయ్ పే ములాఖాత్ ద్వారా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. డివిజన్‌లో వారి వారి ఇళ్లకు వెళ్లి, సమస్యలను తెలుసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్, హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మణిపూర్ ఘటన నిందితులను ఉరి తీయాలి'



నవతెలంగాణ -ఉప్పల్

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, లైగింక దాడికి పాల్పడిన హంతకులను వెంటనే ఉరి తీయాలంటూ...సీపీఎం ఆధ్వర్యంలో రామంతపూర్ రాజేంద్రనగర్ చౌరస్తా, కృష్ణ హెూటల్ చౌరస్తాలో బుధవారం పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ మే 13న జాతుల మధ్య వైరం ఏర్పడి..150 మంది చనిపోయారు, ఇంకా ఎన్నో ఘోరాలు జరిగాయి అయినా కేంద్ర ప్రభుత్వం పట్టినట్లు వ్యవహరించడం చాలా దారుణం అని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కల్పించుకొని అక్కడి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఐద్వా మహిళా సంఘం నాయకులు పల్లవి, వినోద, సీపీఎం నాయకులు ఎర్రం శ్రీనివాస్, నామాల శ్రీనివాస్, వై వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, కృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

రేపు 'కామినేని'లో ఉచిత లివర్ హెల్త్ చెకప్



నవతెలంగాణ-హయత్‌నగర్/సిటీబ్యూరో

కామినేని హాస్పిటల్స్, ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం (జూలై 28) సందర్భంగా అందరికీ ఉచిత లివర్ హెల్త్ చెక్-అప్ ప్రకటించింది. హెపటైటిస్, దాని పరిణామం, ముందస్తుగా గుర్తించడం, నివారణ ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. ఈ ఏడాది ఈ ప్రచారం "ఒకే జీవితం, ఒకే కాలేయం" అనే థీమ్‌పై దష్టి పెడుతుంది. ఈ సందర్భంగా కామినేని హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) డాక్టర్ గాయత్రి కామినేని మాట్లాడుతూ 'ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలన్న కామినేని హాస్పిటల్ సంకల్పంలో భాగంగా హెపటైటిస్ డే రోజున నిర్వహించే ఉచిత ఆరోగ్య పరీక్ష కార్యక్రమంలో పాల్గొనే వారికి సమగ్ర ఆరోగ్య స్క్రీనింగ్‌లకు అవకాశం కల్పిస్తుందన్నారు. హాస్పిటల్‌కు చెందిన అత్యంత నైపుణ్యం గల ఆరోగ్య సంరక్షణ నిపుణుల బందం విలువైన అభిప్రాయాలను అందించడానికి, హెపటైటిస్ గురించి అవగాహన పెంచడానికి, నివారణ చర్యల గురించి హాజరైన వారికి అవగాహన కల్పించడానికి సిద్ధంగా ఉంటుంది" అని తెలిపారు. ఎల్బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్ గల లీడ్ హెపాటాలజిస్ట్ అండ్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ కావ్య దెందుకూరి మాట్లాడుతూ "ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఆరోగ్యంపై ఫ్యాటీ లివర్ వ్యాధి ప్రభావం పెరగడాన్ని మనం విస్మరించలేం. ఈ ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా వ్యక్తులు తమ కాలేయ ఆ రోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలనీ, కాలేయ వ్యాధికి సంభావ్య ప్రమాదాల గురించి తెలుసుకోవాలని మేం కోరుతున్నాం" అని తెలిపారు. టెలివిజన్ వ్యాఖ్యాత, నటి శ్రీముఖి తన మద్దతును తెలియజేశారు. "ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత కాలేయ ఆరోగ్య పరీక్షను అందించే కామినేని హాస్పిటల్ ఆలోచనాత్మక కార్యక్రమం హర్షణీయం. కాలేయ వ్యాధుల నుంచి రక్షణ పొందడానికి మంచి ఆరోగ్యం, రెగ్యులర్ చెక్-అప్‌లను చేయించుకోవాల్సిన ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మనమంతా కలిసి అందరికీ ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను ప్రోత్సహించగలం" అని తెలిపారు.

కామినేని ప్రత్యేక చర్యలు

ఈ ఏడాది ప్రపంచ హెపటైటిస్ దినోత్సవ ప్రచారంలో భాగంగా, కాలేయ వ్యాధులు, వాటి ప్రమాదకారకాలు, నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి కామినేని హాస్పిటల్స్ వరుస అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా క్రియాశీలక చర్యలు తీసుకుంటోంది. ఈ ఉదాత్తమైన ప్రయత్నానికి మరింత మద్దతుగా, కామినేని హాస్పిటల్స్ ఈ నెల 28వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కామినేని హాస్పిటల్స్ (ఎల్బీనగర్)లో సాధారణ ప్రజలకు ఉచిత కాలేయ ఆరోగ్య తనిఖీని అందించనుంది. కాలేయ వ్యాధులను ముందుగా గుర్తించడం, సకాలంలో చికిత్స ప్రాముఖ్యతను ప్రోత్సహించడం, అందరికీ ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయి.

జోరువానలో ఎమ్మెల్యే పాదయాత్ర



నవతెలంగాణ-ఉప్పల్

జోరువానలో కూడా ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పాదయాత్ర కొనసాగింది. బుధవారం నాటికి 17వ రోజుకు చేరుకున్న ఆ పాదయాత్రను ఎమ్మెల్యే..రామంతపూర్ డివిజన్‌లోని నెహ్రూ నగర్, ప్రిన్స్ స్టాన్ కాలేజ్ లైన్ ,శారద నగర్, ఆర్టీసీ కాలనీ, ఎండోమెంట్ కాలనీ, ఓల్డ్ రామంతపూర్, కృష్ణ హెూటల్ చౌరస్తా, భరత్ నగర్, బస్తీలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ.. సమస్యలను పరిష్కరిస్తూనే పాద యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో ముఖ్యంగా నెహ్రూ నగర్ లో రోడ్ల పైన వేసిన చెట్టు కొమ్మలను, ఓల్డ్ రామంతపూర్ లో డ్రైనేజీ, సీసీ రోడ్లు, మ్యాన్ హెూల్స్ పై మూతలు వేయించాలని, పారిశుద్ధ్య నిర్వహణ, భరత్ నగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు, వంగిపోయిన విద్యుత్ స్తంభాలను ఆధునీకరించాలని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చి, వినతి పత్రాలు అందజేసినట్లు వివరించారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతి రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, గంగిడి కృష్ణారెడ్డి, శాగ రవీందర్, శ్రీకాంత్ గౌడ్, తిప్పని సంపత్, డివిజన్, పార్టీ సీనియర్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గగానే పనులు ప్రారంభిస్తాం

కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్



నవతెలంగాణ-కాప్రా

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గగానే వీఎస్ రెడ్డి నగర్‌లో చేపట్టిన స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పనులను ప్రారంభిస్తామని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. వీఎస్ రెడ్డి నగర్‌లో రోడ్డు, స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పనుల కోసం తవ్విన పెద్ద పెద్ద గుంతలు ఈ వర్షపు నీటితో నిండి..ప్రమాదకరంగా మారాయి. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ బుధవారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆ గుంతలను పూడ్చినట్లు తెలిపారు. వర్షాలు తగ్గగానే పనులు ప్రారంభించి..త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట ఏఈ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, కాలనీ అధ్యక్షులు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి , జనరల్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ, వాసుదేవ రెడ్డి, రమేష్ చౌదరి, అంజిరెడ్డి, సూర్య భగవాన్, బాల్ రెడ్డి, రామిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్ రెడ్డి, కనకరాజు గౌడ్, నా రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, బత్తుల శ్రీకాంత్ యాదవ్, నరసింహ వంశరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శ బొడిగె లింగస్వామి



నవతెలంగాణ- మేడ్చల్

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శ బొడిగె లింగస్వామి కోరారు. మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయం నుండి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు బుధవారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 20రోజుల నుండి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు.. వారి సమస్యలను పరిష్కారించాలని కోరుతూ సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.19వేలు చెల్లించి, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి ..కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు సుధాకర్, రామచందర్, బాబు, లీలమ్మ సంతోష, నరసింహ, రాజు, ఎల్లమ్మ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- నేడు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయండి



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శామిర్‌పేట మండలం వద్ద మానవహారం, మూడు చింతలపల్లి మండలం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, వారికి పీఆర్సీ, ఇన్సూరెన్స్ చెల్లించాలని కోరారు. నేడు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు కార్మికులందరూ రావాలని కోరారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన వెంటనే కార్మికులను పర్మినెంట్ చేస్తామనీ, అందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని హామీనిచ్చి ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. ఇప్పటికీ వేతనాలు బకాయి పడ్డారని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతినెలా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. సబ్బులు, నూనె, బట్టలు, చెప్పులు ఇవ్వడం లేదన్నారు. సమస్య పరిష్కరించకపోతే సమ్మెను విరమించేది లేదని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ నాయకులు సుధాకర్, కష్ణ, రవి, ముత్యాలు, ఆరోగ్యంతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్



నవతెలంగాణ - శామీర్‌పేట

కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా తుంకుంట మున్సిపాలిటీ దేవరయాంజల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో, వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుండి సెక్యూరిటీ అధికారులు, స్థానిక నాయకులు కలిసి మొక్కలు నాటారు.అనంతరం కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కే రెడ్డి, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ బివిఎస్ బాబు, అసిస్టెంట్ పర్యావరణ అధికారి యస్ కె సుహాగ్, పర్యావరణ ఇంచార్జి సంజీవరావు, లాయిజన్ ఇంచార్జి సాయి, శామీర్‌పేట్ మండల మాజీ ఎంపీపీ నాలిక యాదగిరి, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ కొడిమెల ఉమా ఆంజనేయులు, మున్సిపల్ మేనేజర్ శ్రవణ్ కుమార్, స్థానికులు పట్నం నర్సింహారెడ్డి, భీమిడి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వరంగల్ జాతీయ రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఉప్పల్


ఉప్పల్ రింగ్ రోడ్డు నుండి నల్లచెరువు వరకు వరంగల్ జాతీయ రహదారిపై ప్రస్తుత వర్షాలకు గుంతలు ఏర్పడి..రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి బుధవారం సంబంధిత అధికారులతో కలిసి ఆ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డుపై ఉన్న గుంతలను త్వరగా పూడ్చి.. ప్రజలకు, వాహనదారులకు అందుబాటులోకి తీసుకొని రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రోడ్డుకు రెండు వైపులా బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు తెలిపారు. సంబంధిత టెండర్లను వెంటనే పిలిపించి, నాణ్యమైన రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. ఉప్పల్ జాతీయ రహదారిపై స్ట్రాంగ్ వాటర్ నిలవకుండా సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీబీ శ్రీనివాసరావు, సీఐ అశోక్, గాయత్రి కన్స్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజర్ అశోక్ బంగర్, నేషనల్ హైవే ఆర్ అండ్ బీఏఈ గోపికృష్ణ, ఉప్పల్ జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నాగేందర్, డీఈ నిఖిల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గడ్డం రవికుమార్, వేముల సంతోష్ రెడ్డి, లేత ఆకుల రఘుపతి రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, గంగిడి కృష్ణారెడ్డి, నయా వెంకట్రావు, అన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్, హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ కోరారు. ఈ మేరకు బుధవారం డీసీ ముకుందర్ రెడ్డితో కలిసి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయలని కోరారు.



మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయనగర్ బస్తీ రోడ్డులో వర్షాల కారణంగా స్థానికుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. ఈ విషయాన్ని తెలుసుకొని అక్కడికి చేరుకున్న కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్..వెంటనే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మధు, నవీన్ గౌడ్, ఏలీయా, జంపాల్ రెడ్డి, దండెం నరేందర్, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రాచీన దేశ వంటకాలకు బానిసైన యువత'



నవతెలంగాణ- కాప్రా

ప్రాచీన దేశ వంటకాలకు నేటి యువత బానిసై..తమ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారని ఉప్పల్ బి - బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా డా.ఏ.ఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో బుధవారం శ్రీనివాస్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో అమర జవానులకు నివా ళులర్పించారు. అనంతరం ఈట్ మిల్లెట్స్ స్టే హెల్దీ కార్యక్రమంలో భాగంగా అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లా డుతూ నేటి యువత ఆరోగ్యకర మైన ఆహారపు అలవాట్లను మానేసి.. ప్రాచీన దేశ వంటకాలకు బానిసై అనారోగ్య పాలవుతున్నారని తెలిపారు. ఆరోగ్యకరమైన మిల్లెట్స్ తిని ఆరోగ్యకరంగా ఉండాలని సూచించారు.

బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరికలు



నవతెలంగాణ- కాప్రా

ఉప్పల్ నియోజకవర్గంలోని చర్లపల్లి డివిజన్ ఇంద్ర గృహకల్ప కాలనీ, లక్ష్మీ నగర్, డీసీ కాలనీల్లోని టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బుధవారం మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురికి మాజీ మేయర్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌లు గులాబీ కండువాలు కప్పి.. పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని కొనియాడారు. రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు భారీ స్థాయిలో ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్ర గృహకల్ప కాలనీకి చెందిన ప్రభు గౌడ్, ముత్యాలు, నజీర్ బాయ్, వెంకట్ రెడ్డి, సత్యమ్మ, లలిత, శ్యాం ప్రసాద్, పి. మహేష్, బి. పరుశురాం యాదవ్, వి. కృష్ణ, జె. సత్తయ్య, ఏ. రాజయ్య, కే.యాకయ్య, ఎస్.కె. సమీనా, ఎస్. ప్రవీణ్, జి. యాదగిరి, ఆర్.అశోక్, పి. కృష్ణ, శివకృష్ణ బాలరాజు, కే. రమేష్, బి. నర్సింగరావు, సిహెచ్. రామ్ రెడ్డి, ఎండి. రాజ్ మహమ్మద్, కే. మోహన్, సాంబయ్య, నాగరాజు, పి. రంగారావు, ఎలేందర్ ధర్మారావు, జి. రాజు, కే. లక్ష్మణ్, లక్ష్మీ నగర్ కాలనీ, డీసీ కాలనీలకు చెందిన లక్ష్మీ నగర్ కాలనీ ప్రెసిడెంట్ శివ చరణ్, వినోద, వై. భాగ్యలక్ష్మి, శ్రీ వాణి, పి. విజయ్ కుమార్, మహమ్మద్ పాషా, అశోక్ గౌడ్, నరేష్, మహేష్ పంతులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు రూ.10 లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ (ఎల్.ఓ.సి) చెక్కులను బుధవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ తన నివాస కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు అమలు చేస్తున్నదని, అనారోగ్యాలతో ఆస్పత్రుల పాలైన నిరు పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఒక వరంలా మారిందని అన్నారు. తమ ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్య భద్రతకు వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

- జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ కొలుకుల జగన్ వినతి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజుల రామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్ అంజయ్య నగర్, మగ్దూం నగర్ , సోమయ్య నగర్, మైసమ్మ నగర్ తదితర ప్రాంతాలలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ కోరారు. ఈ మేరకు బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమతను ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో స్పందించిన జోనల్ కమిషనర్ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యేలా కృషి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ జి. సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల దష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు
- కలెక్టరేట్‌లో 24 గంటల పాటు అందుబాటులో టోల్ ఫ్రీ నెంబర్ 9492409781
- ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్
- కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి టెలీ కాన్ఫరెన్స్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల్లో అత్యవసర చర్యలు చేపట్టాలని, ఈ విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. బుధవారం భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన అత్యవసర చర్యలపై సీఎస్ జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ విషయమై రాబోయే 48 గంటల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపినందున ఆయా శాఖల ఉన్నతాధికారులు, సంబంధిత జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ ఆదేశించారు. అనంతరం టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో వర్షాల కారణంగా ఏర్పడే వరద పరిస్థితులపై లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో బుధ, గురువారాల్లో ఆరెంజ్ అలెర్టు జారీ చేసినట్టు తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినా అధికార యంత్రాంగం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పని చేసేలా హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామనీ, ప్రజలకు ఏమైనా ఇబ్బందులు, అత్యవసర సేవలు అవసరమతే టోల్ ఫ్రీ నెంబర్ 94924-09781 కు ఫోన్ చేయాలని కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్లకు సంబంధించి ఫోన్ నెంబర్లను తెలియజేశారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ నెంబర్ 040-27215959, జవహర్‌నగర్ కార్పొరేషన్ నెంబర్ 99639-96908, 8074064746, నిజాం పేట మున్సిపల్ కార్పొరేషన్ నెంబర్ 040-29569700, ఫీర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ నెంబర్ 73311-64056, దమ్మాయిగూడ మున్సిపాలిటీ నెంబర్ 96667-03077, దుండిగల్ మున్సిపాలిటీ నెంబర్ 95427-15377, ఘట్కేసర్ మున్సిపాలిటీ నెంబర్ 91540-83772, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ నెంబర్ 81435-89845, కొంపల్లి మున్సిపాలిటీ నెంబర్ 18004257590, మేడ్చల్ మున్సిపాలిటీ నెంబర్ 93920-11506, 86390-50325, నాగారం మున్సిపాలిటీ నెంబర్ 96400-10053, పోచారం మున్సిపాలిటీ నెంబర్ 89857-73105, తూంకుంట మున్సిపాలిటీ నెంబర్ 91542-79694 ఫోన్ నెంబర్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండే విధంగా ఈ కాల్ సెంటర్లను ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ హెల్ప్‌లైన్ సెంటర్ 24 గంటల పాటు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా అన్ని రకాల చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్పించి ఇంట్లో నుంచి బయటకు రాకూడదని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అధికారులు, సిబ్బందికి సెలవులను రద్దు చేసి ప్రతి రెండు గంటలకు ఒకసారి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని వివరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయు



నవతెలంగాణ-మల్కాజిగిరి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు మల్కాజిగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయు కార్యాలయం నుండి మల్కాజిగిరి చౌరస్తా వరకు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకులు మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి లేదని, గత ఆరు నెలలుగా ఆందోళన పోరాటాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డట్టు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. కనీస వేతనం 26,000 నిర్ణయించి అమలు చేయాలి. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మల్కాజిగిరి మండల నాయకులు కుర్ర యాదగిరి, ఎర్రోళ్ల సుమిత్ర, మూడవ సరోజ, బి.కొండల్, బాలు, సంతోష్, సాయి, చిట్టెమ్మ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణహోమాన్ని ఆపండి

- సీపీఐ(ఎం), సీపీఐ నాయకులు

నవతెలంగాణ-మల్కాజిగిరి



మణిపూర్ అల్లర్లు, ఘటన మీద మల్కాజిగిరి చౌరస్తాలో సీపీఐ(ఎం), సీపీఐ మల్కాజిగిరి మండల కమిటీల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం), సీపీఐలతో పాటు, చర్చీల ఫాదర్స్, క్రైస్తవ కుటుంబాలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కృపాసాగర్, సీపీఐ మండల సమితి నాయకులు నాగరాజు, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు నర్సింగ్ రావ్, గుంటి లక్ష్మన్, మంగ, చర్చీల ఫాదర్స్ బెన్హర్, స్టీఫెన్, సీపీఐ(ఎం) నాయకులు విజయ్ కుమార్, మణిపూర్‌లో జరుగుతున్న ఘటనల మీద ప్రసంగించారు. గత 85 రోజుల నుండి మణిపూర్ లో రెండు తెగల మధ్య అల్లర్లు జరుగుతున్నాయని, దాదాపు 50 వేల కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారన్నారు. మైనారిటీలయిన కుకీ తెగకు సంబంధించిన ముగ్గురు మహిళలను దుండగులు వివస్త్రలను చేసి, ప్రదర్శన నిర్వహించి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, చిత్ర హింసలకు గురి చేసి, లైంగికదాడు చేశారని.. అయినా అక్కడి బీజేపీ ముఖ్యమంత్రి ఇదంతా మామూలే అని నేరస్తులకు మద్దతు చేయడం ఎంత దారుణమో, సభ్య సమాజం సిగ్గుతో తల దించుకుంటున్నదన్నారు. మహిళల మీద లైంగికదాడి చేసి చంపేసిన దుండగులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. బీజేపీ మతోన్మాద రాజకీయాలు మానుకోవాలన్నారు. మణిపూర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని, మోడి గద్దె దిగేంత వరకు పోరాడతామని హెచ్చరించారు. ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండించారు. సీపీఐ(ఎం) మండల నాయకులు కామ్రేడ్ కొండల్, సూర్య కుమార్, సుమిత్ర, రాజ లక్ష్మీ, నాగమణి, యాదగిరి, నర్సింగ్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



- కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వసంత నగర్‌లో డ్రయినేజీ సమస్యను శాశ్వత పరిష్కారం చూపాలని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అధికారులకు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకి వసంత నగర్‌లోని రోడ్ నెంబర్ 4, 5 వద్ద డ్రయినేజీ పొంగడంతో బుధవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిత్యం డ్రయినేజీ పొంగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రజలకు ఎక్కడ ఇబ్బంది లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూతన పైప్ లైన్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఒకప్పుడు వర్షాలు వచ్చినప్పుడు హైదరాబాద్ మహానగరం అతలాకుతలమయ్యేదని, నేడు ప్రణాళిక ప్రకారం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ శాశ్వత పరిష్కారం దిశగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సాయి ప్రసాద్, హెచ్.ఎం. డబ్ల్యు. ఎస్. మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్, వసంత్ నగర్ అధ్యక్షులు నాగేశ్వరరావు, రాము ,వెంకటేశ్వరరావు, మురళి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సూరారం కమిటీ సభ్యులు..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, సూరారం 129 డివిజన్ పరిధిలోని సూరారం కట్ట మైసమ్మ ఆలయ నూతన కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ని తన నివాసం వద్ద కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమిటీ సభ్యులందరూ కలిసి మెలిసి ఆలయా అభివృద్ధికి కృషి చేయాలని, ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించడానికి ఎల్లవేళలా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, రాఘవరెడ్డి, మారి గణేష్, అంగడి మల్లేష్, మన్నె ప్రసాద్, సాయి ప్రసాద్ గౌడ్, యాది రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో ట్యాబ్‌లు బహుకరణ



- జగన్ మోహన్ రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ జన్మదినం రోజున ప్రకటించిన విధంగా, గిఫ్ట్ ఏ గిఫ్ట్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా, బుధవారం తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీస్ చైర్మెన్, పాటిమీది జగన్‌మోహన్ రావు, కూకట్‌పల్లి కార్యాలయంలో, 20 మంది విద్యార్థిని విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, నిరుపేద విద్యార్థులకు 18 వేల నోట్ బుక్స్‌ను పంపిణీ చేయడంతో పాటు, మరో 20 మంది విద్యార్థిని విద్యార్థులకు ట్యాబ్‌లను సైతం పంపిణీ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం అనేది బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులలో అంతర్భాగమైనదని రామన్న జన్మదినం పురస్కరించుకుని గిఫ్ట్ ఏ స్మైల్ ప్రవేశ పెట్టడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులను చులకన చేసి మాట్లాడటం తగదు



- సీపీఐ(ఎం) నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-మల్కాజిగిరి

సిద్దిపేట జిల్లాలో అంగన్ వాడి ఉద్యోగులతో హరీశ్ రావ్ కమ్యూనిస్టులను చులకన చేసి మాట్లాడటం ఆయన స్థాయికి తగింది కాదని సీపీఐ(ఎం) నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. కమ్యూనిస్టుల గురించి సరిగ్గా తెలిసి నవారు ఎవరు కూడా అలాంటి ప్రయత్నం చేయరని అన్నారు. రాజకీయ పబ్బం గడుపుకునే వాళ్లే కమ్యూనిస్టులపై నిందలు వేస్తారని అందులో హరీశ్‌రావ్ కూడా చేరడం బాగాలేదన్నారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొని నిర్బంధాలు ఎదుర్కొని ఎందరో ప్రాణాలు ఇచ్చిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదన్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తి, చైతన్యం ఈ తెలంగాణ గడ్డ మీద కల్పించిన స్ఫూర్తి కమ్యూనిస్టులకు ఉందని అన్నారు. అవసరం కోసం ఇతర పార్టీలకు వెళ్లడం, లేక ఇతర పార్టీల నాయకులను చేర్చుకునే పార్టీ కమ్యూనిస్టు పార్టీ కాదని అన్నారు. మా దగ్గర కార్యకర్తలు లేరనుకుంటే ఉద్యమ సమయంలో కేసీఆర్ సీపీఐ పార్టీ కార్యాలయానికి వచ్చాడు కానీ సీపీఐ నాయకుల రాలేదని, అలాగే రాజ్యసభ సభ్యుడి ఎన్నికల సమయంలో, హుజుర్నగర్, మునుగోడు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎందుకు కమ్యూనిస్టుల దగ్గరికి వచ్చారని అప్పుడు లేని మాటలు ఇప్పుడు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. కమ్యూనిస్టుల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. అధికారంలో ఉన్నామని మాట్లాడితే, ఆ అధికారం శాశ్వతం కాదని, కానీ కమ్యూనిస్టు పార్టీ మాత్రం అజరామరం అని, సూర్యుడి పై ఉమ్ము వేయాలని అనుకుంటే అది తిరిగి తమ మీదే పడుతుందని గుర్తుంచుకోవాలని అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యుడు స్వామి, మండల సహాయ కార్యదర్శి దుర్గయ్య, రాము ప్రజానాట్యమండలి కార్యదర్శి ప్రవీణ్, దళిత హక్కుల సంఘం నాయకులు రాములు, నర్సయ్య, ఏఐవైఎఫ్ కార్యదర్శి వెంకటేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కల్వర్టు పనులను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అభివృద్ధి విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. సుభాష్ నగర్ 130 డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్‌లో గల జనప్రియ అపార్ట్‌మెంట్ వద్ద గత కొన్ని సంవత్సరాలుగా కల్వర్టు లేక ప్రజలు డ్రయినేజీతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి రూ. 35 లక్షల జీహెచ్ఎంసీ నిధులతో కల్వర్టు పనులు బుధవారం సురేష్ రెడ్డి స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనప్రియ, ఏ బ్లాక్ , బి బ్లాక్ నివాసులతో పాటుగా కాలనీలోని లీడర్లు కార్యకర్తలు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, సురేష్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం సురేష్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చేస్తున్నామన్నారు. అదేవిధంగా వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రజా అవసరాల దృశ్య నాలాపై కల్వర్టు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కల్వర్టు నిర్మాణ పనులపై, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తను ఎల్లప్పుడు డివిజన్ ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలి : ఐద్వా



నవతెలంగాణ-మల్కాజిగిరి

కాలనీలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల కార్యదర్శి పి.మంగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. పిల్లి నరసింహారావు కాలనీలో డ్రయినేజీ మెయిన్ వాల్స్‌లోపల అస్తవ్యస్తంగా చేయకపోగా ఇటికలు కూలిపోతున్నయన్నారు. డ్రయినేజీ వాటర్ అంతా ఇండ్లల్లోకి వస్తుందని, కాలనీ ప్రజలంతా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే పనులు పూర్తి చేయించాలని అన్నారు. సమస్య పరిష్కరించాలని ఐద్వా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మల్కాజిగిరి మండలం పీఎస్ఆర్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ డి సీకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు రాజలక్ష్మి, నజీమా, పద్మ ,నాగమణి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

నల్లాలో రంగు మారిన నీరు...ఆందోళనలో ప్రజలు

- గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల టర్బైన్ వాటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా, కూకట్‌పల్లి సర్కిల్లోని ఆల్విన్ కాలని, వివేకానంద నగర్ డివిజన్‌లతో పాటు, గాజులరామారం సర్కిల్ పరిధిలోని షిర్డీ హిల్స్, శివ నగర్‌లలో కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో, నీళ్లు తాగాలా వద్దా అంటూ ఆందోళన చెందుతున్నారు. ఇంటింటికీ సరఫరా అవుతున్న మంచి నీరు పూర్తిగా కలుషితమై, రంగు, రుచి మారిపోయి, పూర్తిగా బురద రంగులో వస్తున్నాయి. కాబట్టి మంచి నీటిని అలాగే తాగితే అనారోగ్యాలపాలవ్వడం ఖాయం అంటూ స్థానిక ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదల సమయాల్లో సరఫరా అయ్యే నీటిని ఏ మాత్రం శుద్ధి చేయకుండా అలాగే సరఫరా చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టుగా కనబడుతుందని, నీటిని కనీస మోతాదులో కూడా శుద్ధి చేయకుండా సరఫరా చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మంచి నీళ్ళను వదిలే ముందు ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని శుద్ధి చేసి మా ఆరోగ్యాలను కాపాడాలని అధికారులను వేడుకుంటున్న ప్రజలు.

అధికారుల నిర్లక్ష్యం వల్లనే కలుషిత నీరు..



కలుషిత నీటి సరఫరా పై బీజేపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు మాట్లాడుతు వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు మంచి నీటిని త్రాగే పరిస్థితి లేదని, నల్లాలో నుండి త్రాగే నీరు కాదు మురికి నీళ్లు వస్తున్నయన్నారు. అవి త్రాగితే ప్రజలు అనారోగ్యాలకు గురవుతారని కాబట్టి, జలమండలి అధికారులు తక్షణమే స్థానిక నీటి రిజర్వాయర్‌లలో నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు.

– సురభి రవీందర్ రావు

కాచి వడపోసి నీళ్లు త్రాగండి....



కూకట్‌పల్లి జలమండలి జి .ఎం ప్రభాకర్ రావు మాట్లాడుతూ అతిగా కురుస్తున్న వర్షాల కారణంగా వరద ఉధృతి వల్ల, గోదావరి జలాలు పూర్తిగా రంగు మారిపోయి మడ్డింతితో కూడుకుని వస్తున్నాయి. ఆ నీటిని గోదావరి ట్రీట్ మెంట్ ప్లాంట్ వద్ద శుద్ధి చేసి పంపినప్పటికి, అతిగా వరదలు ఉండటం వల్ల నీరు బ్రౌన్ రంగులో వస్తుంది. స్థానిక వాటర్ టాంక్‌లో, లిక్విడ్ క్లోరిన్ కలిపి శుద్ధి చేసి పంపుతున్నాం. ప్రజలందరు నీటిని కాచి వడపోసి త్రాగాలని విజ్ఞప్తి చేస్తున్నాము. క్లోరిన్ 1.5 పీపీఎమ్ క్లోరిన్ మెయింటైన్ చేస్తూ నీటిని సరఫరా చేస్తున్నాం. వాటి వల్ల ఎలాంటి ఇబ్బందులూ ఉండవు.

కూకట్‌పల్లి జలమండలి జీఎం ప్రభాకర్ రావు

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373 జయంతి.. గోడపత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు ఆగస్టు నెల 13న నగరంలోని రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నట్లు జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం జయంతి ఉత్సవాల గోడపత్రికను రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్ నివాసంలో గౌడ సంఘ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు శేషగాని నరేష్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి బీసు వెంకటేష్ గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీనివాస్ గౌడ్, సభ్యులు మునుకుంట శ్రీనివాస్ గౌడ్, రాష్ట్రాలలోని జై గౌడ్ ముఖ్య నాయకులు, గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అడ్డుగా ఉన్న మెట్రో స్టేషన్ బాత్రూమ్‌లను తొలగించాలి

- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్



నవతెలంగాణ-బాలానగర్

వరద నివారణ చర్యల్లో భాగంగా హైదరాబాద్ మహానగరంలో వర్షాకాలంలో మురికినీరు సాఫీగా ప్రవహించేలా డ్రయినేజీ, కాలువలు పై ఉన్న నిర్మాణాలని తొలగించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. భరత్ నగర్ న్యూ హెచ్ఐజీ వద్దగల నాలా నీటి ప్రవాహానికి అంతరాయం కలిగించేలా ఉన్న మెట్రో స్టేషన్ బాత్రూమ్‌లను వెంటనే తొలగించి, అదే విధంగా మరోచోట ఏర్పాటు చేసుకోవాలని హెచ్ఎంఆర్ అధికారులను ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ కోరారు. బుధవారం హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు డిఈ రామకృష్ణ, ఏఈ రంజిత్‌తో కలిసి భరత్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద పర్యటించారు. ఇందులో భాగంగా హెచ్ఎంఆర్ నిర్మించిన బాత్రూం వలన క్రింద ఉన్న నాలా ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుందని, దానివలన పరిసర ప్రాంతాలు వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయని కార్పొరేటర్ అధికారులకు తెలిపారు. కావున సూచించిన విధంగా బాత్రూంలను మరోచోట నిర్మించాలని అధికారులకు తెలిపారు. సానుకూలంగా స్పందించిన అధికారులు సంబంధిత పనులను ఉన్నత అధికారులతో చర్చించి వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు.

అంత్యక్రియలు రూ.15 వేలు అందజేత

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు ఆదేశాలు మేరకు బుధవారం ఓ నిరుపేద అంత్యక్రియలు ఖర్చుల కోసం రూ.15 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ నివాసి మెకానిక్ పరమేశ్ చనిపోయాడు. సమాచారం తెలుసుకున్న నాయకులు మృతుడి కుటుంబీకులను కలిసి తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. దీని లో గుండా నిరంజన్ 5000/-, డివిజన్ అధ్యక్షుడు తులసి సురేష్ 1000/-, ఫరీద్ భాయ్ 4500/-, బాలకృష్ణ గుప్త 1000/-,శ్రీదేవి 1000/-,అరుంధతి 1000/-, యాదగిరి కురుమ 1000/-, మల్లేష్ చారి 500/- లు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.



ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

వర్షాలు కురుస్తున్న సమయంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా బాలానగర్ డివిజన్ పరిధిలో మల్లారెడ్డి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి సూచించారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీ నగర్‌లో మల్లారెడ్డి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులకు గుండె, కంటి, దంత, షుగర్, బీపీ, గర్భ, చర్మ సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాటాడుతూ మారిన జీవనశైలితోపాటు పర్యావరణంలో వస్తున్న అనేక మార్పుల వల్ల ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు నిత్యం వ్యాయామం, మెడిటేషన్, యోగ, ధ్యానం, నడకలాంటి వాటికి ప్రతి ఉదయం సమయాన్ని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి హాస్పిటల్స్ సిబ్బంది డాక్టర్ శ్రీ సాయి సవిత, డాక్టర్ పి. సాహితి రెడ్డి, డాక్టర్ మౌనిక, డాక్టర్ దివ్య డాక్టర్ అంజన, డాక్టర్ శ్రీవాణి, బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం మహిళలు కృషిచేయాలి



- డా. సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-బాలానగర్

కూకట్ పల్లి నియోజక వర్గంలోని మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులతో కలసి టీపీసీసీ అధికార ప్రతినిధి పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం కార్యాలయంలో బుధవారం సమావేశమై మహిళా కాంగ్రెస్ కమిటీల నియామకంపై చర్చించి కమిటీలను నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏ బ్లాక్ అధ్యక్షురాలు రమాదేవి, బి బ్లాక్ అధ్యక్షురాలు శోభ, కేపీహెచ్‌బీ డివిజన్ మహిళా అధ్యక్షురాలుగా రజిత, బాలాజీ నగర్ డివిజన్ మారుతి, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షురాలు భారతమ్మ, మూసాపేట డివిజన్ అధ్యక్షురాలు జోజమ్మ, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షురాలు జ్యోతి, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, బాలానగర్ డివిజన్ అధ్యక్షురాలు రేణుక, కూకట్ పల్లి డివిజన్ అధ్యక్షురాలుగా కృష్ణవేణి, బేగంపేట డివిజన్ అధ్యక్షురాలు రాధను ఎన్నిక చేసినట్లు తెలిపారు.

పనులు పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-మల్కాజిగిరి



ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు ఆదేశాల మేరకు గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని న్యూ మీర్జాల్ గూడలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్ ఏఈ. దివ్యజ్యోతితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ నరేందర్, నాయకులు కార్యకర్తలు కాలని వాసులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పని వేళలు యథావిధిగా కొనసాగుతాయి

నవతెలంగాణ-సిటీబ్యూరో

పారిశుధ్య కార్మికుల పని వేళలు యథావిధిగా కొనసాగుతాయని జీహెచ్ఎంసీ తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. పారిశుధ్య కార్మికులకు వేసవికాలంలో ఒక గంట సమయం మినహాయింపు ఇచ్చిన విషయం విదితమే. వేసవికాలం ముగిసినందున యథావిధిగా ప్రతిరోజు ఉదయం 6 గంటలలోపు హాజరై అప్పటి నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పని సరిగా విధులు నిర్వర్తించాలని సంబంధిత అధికారులు బుధవారం తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



నగరంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. బుధవారం జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్ -14 యూసీడీపీఓ విద్యాసాగర్ ఆధ్వర్యంలో మూసీ నది పక్కన ఉన్న ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలకు పునరావాస కేంద్రాలుగా గోషామహల్ డివిజన్‌లోని చుడి బజార్ భరత్ కమ్యూనిటీ హాల్, గౌలిగూడ కమ్యూనిటీ హాల్ లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యు సి డి సి ఓ సమ్మయ్య, ఆర్ పి సుమలత, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఎల్బీనగర్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-నాగోల్

ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివద్ది పరిచి ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి అన్నారు. నిత్యం ప్రజల్లో మమేకమై వారి సంక్షేమం , అభ్యున్నతికి పాటుపడుతూనే నియోజక వర్గంలోని ప్రతి డివిజన్ అభివద్ది కోసం అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గురువారం ఆయన జన్మదినం సందర్భంగా బుధవారం నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు. నియోజకవర్గ అభివద్ది కార్యక్రమంలో భాగంగా ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టు కింద దాదాపు రూ. 658 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం జరిగిందని, వాటిలో అన్ని ఫ్లైఓవర్లు ,అండర్ పాస్ వే పనులు పూర్తి చేసుకోవడం జరిగిందని అన్నారు. ఎల్బీనగర్ జంక్షన్ వద్ద రెండు వైపులా ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ ,నాగోల్ జంక్షన్ ఫ్లైఓవర్, కామినేని జంక్షన్ పై రెండు వైపులా ఫ్లై ఓవర్లు, చింతలకుంట జంక్షన్ వద్ద అండర్ పాస్ వే, బై రామల్ గూడా జంక్షన్ వద్ద రెండు ఫ్లైఓవర్ల ను నిర్మించడం జరిగిందని వివరించారు. ప్రస్తుతం అలేఖ్య టవర్స్ వద్ద సెకండ్ లెవెల్ నూతన స్లైప్ ఫ్లైఓవర్ నిర్మాణ దశలో ఉందని త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తేనున్నట్టు తెలిపారు. దీంతో ఈ పనులు పూర్తయితే ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉండవని అన్నారు. రాబోయే రోజుల్లో మెట్రో రైలును హయత్ నగర్ వరకు పొడిగించడానికి తన వంతు కషి చేస్తానని చెప్పారు. నాగోల్ నుండి మందమల్లమ్మ వరకు రెండు వైపులా ఫుట్ పాత్, సైక్లింగ్ ట్రాక్, మధ్యలో అందమైన పూల చెట్లతో సుందరీ కరణ అభివద్ది పనులను ప్రారంభించడం జరిగిందని, వాటి నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరివేక్షించడం జరుగుతుందని అన్నారు. రోజురోజుకు అభివద్ధిలో దూసుకుపోతున్న హైదరాబాద్ లాంటి నగరాలలో పాదచారులకు రక్షణ కల్పించడం, ఫుట్ పాత్, సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం, రోడ్ల విస్తరణ లాంటి సవాళ్లు నిత్యం ఎదురవుతూనే ఉంటాయని వాటిని ఎప్పటికప్పుడు నూతన ప్రణాళికలతో అమలు చేయడంతోనే ఈ సమస్యలు సమర్థవంతంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు.

ఇవి కాక నాగోలు డివిజన్‌లోని ఫతుల్ల గూడలో ఆరున్నర ఎకరాలలో 21 కోట్ల రూపాయల వ్యయంతో దేశంలో ఎక్కడా లేని విధంగా మూడు మతాలకు సంబంధించిన (ముక్తి ఘాట్) శ్మశాన వాటికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో హిందు, ముస్లిం, క్రైస్తవ మతస్థుల కోసం ఒకే దగ్గర వేరు వేరుగా అత్యున్నత ప్రమాణాలతో విశాలమైన గదులు, స్నానపు గదులు, మూత్రశాలలు, ఏర్పాటుతోపాటు అందరికీ అనుగు ణంగా ఉండే విధంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వ స్థలాలలో ఉంటున్న వారికి 58, 59 జీవోలను తీసుకురావడం, ఎన్నో సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్ల సమస్యను ఎదుర్కొంటున్న వారికి 118 జీవోను తెచ్చి ఊరట కలిగించడం జరిగింది అని చెప్పారు. కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ స్థలంలో రూ. 1200 కోట్ల వ్యయంతో వెయ్యి పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని, వనస్థలిపురం ఆటోనగర్ వద్ద అంతర్జాతీయ స్థాయిలో బస్సు టెర్మినల్ నిర్మించడం జరుగుతుందని తెలిపారు.

రాజకీయాలను కేవలం ఎన్నికల వరకు పరిమితం చేస్తూ నిరంతరం ప్రజా సంక్షేమం, అభివద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో కేటీఆర్ సహకారలతో నియోజకవర్గం అభివద్ది జరుపుకున్నామని, ఇంకా అభివద్ది జరుపుకోవాల్సి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. జరిగిన అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని అన్నారు. తెలంగాణలో చేపట్టిన అభివద్ధి, సంక్షేమ పథకాలను దేశంలో అమలుపరిచేందుకు బీఆర్ఎస్ పని చేస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ బలోపేతం చేస్తూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి మరోసారి రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ పాలన కొనసాగించేందుకు ప్రతీ ఒక్కరు కషి చేయాలని ఆయన నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

IN THE COURT OF HON'BLE XI ADDITIONAL CHIEF JUDGE CUM MACT CITY CIVIL COURT AT:HYDERABAD
O.P.NO.1167 OF 2022

BETWEEN:
SARA YADAMMA and Others ....Petitioner
AND
Indrapreet singh bhatia and Others. ....Respondent

To,
1.Indra preet singh Bhatia,C/o.Bhaurao Janadhar Patil,Occ:Owner of Crime Vehicle, R/o.H.No.Upper Chandmart Kohima, Nagaland, Kohima. R1

Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on **4/8/2023 at 10.30 am** for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDE OF COURT)
Sri.Ravi Krishna Kumar,
Advocate
Saidabad,
Hyderabad.

THE COURT OF HON'BLE ADDL JUDL. FIRST CLASS MAGISTRATE AT: SANGAREDDY
OS.NO. 590 OF 2021

BETWEEN:
Smt.B. Jyothi and another ...Plaintiffs
AND
K. M. Manemma and others ...Defendants

TO,
1. P. Gandhi raju, S/o Satyanarayana raju, Age about 75 years, R/o.plot no 41-A, flat no. 101, Srirama nilayam, venngalrao nagar colony, Hyderabad. 500038.
2. G. Ashok reddy, S/o Mallareddy, Age about 50 years,OCC; Business, R/o Flot no 204, Shilpa Manor, Shilpa park, Kondapur, Hyderabad.
3. P. Rangareddy, S/o Sathireddy, Age about 43 years,OCC; Business, R/o Flot no 204, Shilpa Manor, shilpa park,Kondapur, Hyderabad. ...Defendants

Please take notice that the plaintiffs filed above suit for partition and separate possession of the suit schedule properties against defendents no.4, 6 and 8 others and the above suit is posted for the appearance of defendant No.4, 6 and 8's on 07-08-2023 at 10-30 A.M., either personally or through Counsel, if you fail to attend before the Hon'ble Court the matter will be heard and decided against you by setting you Ex-parte.

(BY ORDER OF THIS HON'BLE COURT)
T.RATHNAKAR,
ADVOCATE,
SANGAREDDY.
Cell: 949344342

మణిపూర్ ఘటనపై కేంద్రం స్పందించకపోవడం శోచనీయం

- తెలంగాణ అడ్వకేట్ జేఏసీ నాయకులు పులిగారి గోవర్ధన్ రెడ్డి

నవతెలంగాణ-అడిక్ మెట్

మణిపూర్ హింసాత్మక ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ నాయకులు పులిగారి గోవర్ధన్ రెడ్డి ఒక పత్రిక ప్రక టనలో అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో వికతంగా ఆటవికంగా ప్రవర్తిస్తూ సభ్య సమాజాన్ని భయభ్రాంతులకు గురయ్యే సంఘటనలు.. మహిళల నగ్న ఊరేగింపు, హత్యలు, గృహ దహనాలు, తెగల మధ్య ఘర్షణలు నిత్య కృత్యమై రావణాకాష్టను తలపిస్తున్నాయని తెలిపారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న వీర సైనికుడి భార్యను కండ్ల ముందే నగ్నంగా ఊరేగించడం, లైంగికదాడి చేయడం జరుగు తున్న ఘటనలతో ప్రపంచ ప్రజల ముందు దేశం తలదించుకునే విధంగా ఉందన్నారు. ఆటవిక నాగరిక పోకడలు దేశంలో ఇంకా బతికే ఉన్నాయని ప్రస్తుత మణి పూర్ ఘటన సాక్ష్యం అన్నారు. దేశంలో మైనార్టీలు తెగలు ఆదివాసులు రాజ్యాంగబద్ధమైన పార్లమెంట్ ద్వారా వారికి రక్షణ కలుగుతుందని బలమైన భరోసాతో బతుకు తున్నారన్నారు. సుప్రీంకోర్టు స్పందించే వరకు రాజకీ యాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం తగు రీతిలో పార్లమెంట్‌లో స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం పరోక్షంగా ఘర్షణలను ప్రోత్సహిస్తున్నదన్నారు.

జీవో 46ను రద్దు చేయాలి

- సచివాలయం ముట్టడికి యత్నించిన నిరుద్యోగులు

నవతెలంగాణ - బంజారా హిల్స్..

పోలీస్ కానిస్టేబుళ్ల నియామకాలను చేపట్టడానికి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 46ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కొంతకాలంగా జిల్లా స్థాయిలో నిరుద్యోగులు కొనసాగిస్తోన్న ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు గ్రామాల నుంచి నగరానికి చేరుకున్నాయి. బుధవారం నిరుద్యోగులు భారీ సంఖ్యలో నగరంలోని సెక్రటేరియట్ వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. వేర్వేరు వాహనాల్లో ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకుని సుమారు వందమందికి పైగా కానిస్టేబుల్ ఆశావహులు.. ఒక్కసారిగా సచివాలయం ప్రధాన గేటు వద్దకు దూసుకెళ్లారు. జీవో నంబర్ 46ను రద్దు చేయాలంటూ నినదించారు. ప్లకార్డులను ప్రదర్శించారు. పాత పద్దతిలోనే కానిస్టేబుళ్ల నియామకాలను చేపట్టాలంటూ డిమాండ్ చేశారు ఈ తాజా జీఓ వల్ల గ్రామీణ ప్రాంతవాసులకు అన్యాయం జరుగుతుందంటూ ధ్వజమెత్తారు. అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. రోప్ పార్టీ సిబ్బంది వారందరినీ సచివాలయం రోడ్డుకు అవతలి వైపు వరకూ తీసుకెళ్లారు. అనంతరం వారందిరినీ అదుపులోకి తీసుకుని, ప్రత్యేక వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో సచివాలయం పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

IN THE COURT OF THE HON'BLE XII ADDITIONAL DISTRICT JUDGE R.R. DISTRICT :: AT. L.B.NAGAR
O.S. No.169 OF 2020

BETWEEN:
Mrs. Ayesha Sultana and others ...Plaintiffs
AND
Mr. B. Vijay Kumar & Others ...Defendants

COURT NOTICE

1. M/s S.M.R, Developers Private Limited, Rep, by Smt S. Savithri, W/o Late Sri Chenna Reddy, aged about 51 years, Occ: Managing Director, R/o Plot No 73, Nagarjuna Hills, Panjagutta, Hyderabad (Defendant no.3)
2. Sri L. Veera Reddy (Died) (Defendant no. 10)
3. Smt R Sunitha W/o Sri R Sai Reddy, D/o Sri L. Veera Reddy aged about 40 years, Occ: Housewife, R/o Muthangi Village, Patancheru Mandal, Medak District. (Defendant no.11)
4. Smt S. Mounika W/o Sri S. Madhusudhan Reddy, D/o SriL. Venkat reddy, aged about 34 years, Occ; House wife R/o Narsingi Village, RajendraNagar Mandal R.R. District. (Defendant no.15)
5. Smt. P.Hema Bindu W/o. P.Satish Chandra Reddy, Aged about 36 years, Occ: Housewife, R/o H.No 17-1-389/5, Prashathinagar Colony, Saidabad, Hyderabad. (Defendant No.22).
6. M/sTanvi Enterprises, Rep by its partners, 1) Sri K.Vishnu Vardhan Reddy S/o K. Janardhan Reddy, aged about 33 years, Occ: Business, 2) Smt K. Karthika W/o Sri K. Vishnu Vardhan Reddy, Aged about 26 years, Occ:Housewife, both Residing at No.3-86, Manchirevula (v), Rajendranagar (M) R.R. District. (Defendant no.23)
7. Sri L. Papi Reddy S/o L.Narayan Reddy Aged about 40 years Occ: Business, R/o H.NoSRT 382, Jawahar Nagar, Chikkadpally, Hyderabad. (Defendant No.36)

Please take notice that the above named Plaintiff has filed the above suit seeking for Cancellation of Exchange Deed with respect to the suit schedule property among other reliefs, and the same is posted on 23.08.2023, for your appearance, therefore you are hereby requested to make it to appear on **23.08.2023 at 10.30 am** either personally or through counsel before the Hon'ble XII Additional District Judge, Ranga Reddy District at L.B Nagar. In default of the same, the matter will be heard and decided, in accordance withlaw.

(BY THE ORDER OF THE COURT)
M/s. CHANDRASEN LAW OFFICES
HIMA VARSHINI
ADVOCATE
R/o. Avanthi Nagar, Basheerbagh, Hyderabad - 29. Mobile No: 8686519404
Counsel for Petitioner

PUBLIC NOTICE
IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE; RANGA REDDY DISRCIT AT: L.B.NAGAR
T..O.P. NO. 730 OF 2022

Between :
Narmala Sujatha and others ... Petitioner
AND
Mudimyala @ Valasingam Mounika and others ... Respondent

To,
Indra, W/o Late Sangeetha Rao, Aged about 33 Years, Occ House wife, R/o Lingampally, Hyderabad

The above named Petitioner have filed the TOP for Transfer OS.No 195 of 2016 pending on the file of the Hon'ble IAddl Junior Civil Judge- cum-XV Addl Metropolitan Magistrate, at Rajendra Nagar, Ranga Reddy District to be tried together with OS.No 174 of 2017 on the file of the XI Addl District Judge, at L.B.Nagar, Ranga Reddy District, if any body have got any objection for grant of the above relief in favour of the petitioner they may file their objections before the undersigned on the said date on 27-07-2023, other wise the matter will be heard and decided as per the rules, the matter stands posted on 27-7-2023.

(By Order of the Court)
HARIGOPAL NEELA
B.SHIRISHA,
ADVOCATE,
H.No 3-8-347, Chandrapuri Colony, L.B.Nagar, Hyderabad
Ph 9959322088

జంగమ సమాజం అభివృద్ధికి కృషి

- జంగమ సమాజం గ్రేటర్ నాయకురాలు జి. సరిత



నవతెలంగాణ-ముషీరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో నివసిస్తున్న జంగమ సమాజం ప్రజల అభివద్ధికి తగిన విధమైన ప్రణాళికతో కషి చేస్తానని జంగమ సమాజం గ్రేటర్ నాయకురాలు జి. సరిత తెలిపారు. బాగ్ లింగంపల్లిలో బుధవారం జరిగిన విలేకరుల మావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను జంగమ సమాజం అత్యధికంగా సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రతి ఏడాది ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతీ జంగమ కుటుంబానికి స్థానిక సమాజంతో సమాన హోదా కల్పిస్తామని అన్నారు. వేద విద్య పట్ల ఆసక్తి కలిగిన వారికి సహాయం అందజేయనున్నట్టు చెప్పారు. మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, ప్రభుత్వం ద్వారా రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. జంగమ సమాజం అంతా ఐకమత్యంగా ఉండి మొత్తం సమాజం అభివద్ధికి ప్రతి ఒక్కరూ సామాజిక చైతన్యం, అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 30వ తేదీన బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న జంగమ సమాజం ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బీసీ విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్న ప్రభుత్వం

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ



నవతెలంగాణ - అడిక్ మెట్

బీసీ విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఐఐటీ, ఐఐఎం చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది 'ని, అయితే ఇంజనీరింగ్, మెడిసిన్, ఎంబీఏ, ఎంసీఏ చదివే విద్యార్థుల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. రూ. 50,000 ఉన్న ఎమ్మెల్యేల వేతనాలను రూ. మూడు లక్షల వరకు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లకు మాత్రం నామమాత్రపు మెస్ చార్జీలు పెంచా రన్నా రు. సెక్రటేరియట్, ఫ్లైఓవర్, స్కై ఓవర్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలకు నిధులు ఉంటాయి కానీ భారతదేశ పౌరులుగా ఎదిగే విద్యా ర్థులు చదువుకోవడానికి సంక్షేమ హాస్టల్ కట్టడానికి నిధులు ఉండవా అని ప్రశ్నించారు. గురుకులాలకు ఐఏఎస్‌ను నియమించకపోతే వేలాదిమంది విద్యార్థులతో మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఇఎస్‌సీఐ ఆధ్వర్యంలో 'విపత్తు నివారణ, నిర్వహణ'పై రౌండ్‌టేబుల్ సమావేశం

- వరదలు రాకుండా, వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చ
- పలు సలహాలను, సూచనలను అందించిన ప్రతినిధులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణలో వర్షాలు దంచికొడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నగరం అతలాకుతలమైంది. ఇదిలావుండగా ముఖ్యంగా వరదలు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు వరదలు రాకముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చిన తర్వాత చేపట్టాల్సిన నివారణ చర్యలపై ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇఎస్‌సీఐ) ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం గచ్చిబౌలిలోని ఇఎస్‌సీఐ క్యాంపస్‌లో నిర్వహించిన సమావేశానికి ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జీ.రామేశ్వర్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా 'విపత్తు నివారణ' వరదల వల్ల కలిగే ఆర్థిక, సామాజిక నష్టాలపై అంచనా, వాటి నిర్వహణ, వరదలు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు, వరదలు రాకముందు, వచ్చిన తర్వాత తీసుకోవాల్సి నివారణ చర్యలతోపాటు వివిధ అంశాలపై దాదాపు మూడుగంటల పాటు చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీ.రామేశ్వర్‌రావు మాట్లాడారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇఎస్‌సీ) అనేది భారతదేశంలోనే అతిపెద్ద ప్రొఫెషనల్ ఇంజనీర్ కాలేజ్ అని వివరించారు. ఈ సంస్థలో ఇంజనీరింగ్ విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ, ఉన్నతమైన విద్యను అందించేందుకు 1981లో స్థాపించారని తెలిపారు. వరదల వల్ల కలిగే నష్టాలు, సామాజిక, ఆర్థిక నష్టాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సి చర్యలపై వివరించారు. అనంతరం జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ కే.కిషన్ మాట్లాడారు. వర్షాలు వచ్చిన సమయంలో వరద నివారణకు జీహెచ్ఎంసీ పరిధిలో అనే చర్యలు చేపట్టినట్టు తెలిపారు. వరదలు రాకుండా ముందస్తు చర్యలే కాకుండా వచ్చిన తర్వాత నివారణ నేపథ్యంలో అన్ని ముందస్తు పనులను పూర్తి చేశామన్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న నాలాలను మరింత పెద్దవిగా చేశామని, చెరువులను గొలుసుకట్టు చెరువులుగా ఏర్పాటు చేసినట్టు వివరించారు. అన్ని చెరువుల్లో నీటిని నింపామన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నగరవాసులను ఎస్ఎంఎస్, రేడియో, ఇతర మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తామని తెలిపారు. నగరంలో ఎడతెరిపి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో దాదాపు 450 డీఆర్ఎఫ్, ఈవీడీఎం బృందాలను రంగంలోకి దించామని తెలిపారు. ఈ బృందాలు శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లు గుర్తించి, ప్రమాదకరమనుకున్న వాటిని కూల్చేస్తారన్నారు. అంతేకాకుండా నాలా చెత్తాచెదారం, వరద నీరు నిల్చిపోతే తొలగిస్తారని తెలిపారు. ఆపదలోవున్న వారిని రక్షిస్తారని చెప్పారు. ఈ సెమినార్‌కు నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా ప్రధాన కార్యదర్శి జీ.అశోక్‌కుమార్, ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ కే.కరుణగోపాల్, రీసస్టైనబిలిటీ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ పీ.జీ. శాస్త్రీ, జేఎన్‌టీయూ హెచ్‌ఓడీ ఎం.వీ.ఎస్.ఎస్ గిరిధర్, ఓయూ ప్రొఫెసర్ డాక్ట. ఎం.గోపాల్ నాయక్, ఏసీపీ ఎం.నర్సింగ్‌రావుతోపాటు వాటర్‌బోర్డు, ఓయూ, ఇఎస్‌సీఐకి చెందిన అధికారులు తదితరలు పాల్గొన్నారు. వరద నివారణపై వారి సూచనలు, సలహాలను అందించారు.



చేతి రాతతో మనస్సు ప్రశాంతత

-డా.హిప్నో పద్మా కమలాకర్, లయన్ జి.కష్ణ వేణి, లయన్ డా.పి.స్వరూపారాణి

నవతెలంగాణ-సిటీబ్యూరో

చేతి రాతతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని లయన్ జి.కష్ణ వేణి, లయన్ డా.పి.స్వరూపా రాణి, డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. నవభారత లయన్స్ క్లబ్, డా.హిప్నోకమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ ఆధ్వర్యంలో దోమలగూడలోని హైదర్‌గూడ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పోషకాహారం, స్నాక్స్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత మరచిపోయిన జ్ఞాపకాలను తిరిగి తీసుకురాగలుగుతుందన్నారు. మెదడును పదునుగా, చురుకుగా ఉంచుతుం దన్నారు. ఒక గొప్ప మానసిక వ్యాయామని చెప్పారు. కల్పిత కథలు రాయడం వల్ల విషయాలను విశ్లేషించి, వాటిని వేరే కోణంలో చూడగలుగుతారని తెలిపారు. మౌఖిక కమ్యూనికేషన్ పెరుగుతుందన్నారు .తద్వారా పని చేయడం, సమస్యలను పరిష్కరించడం, జీవితాన్ని ఆస్వాదించడం తెలుస్తుందన్నారు. సంతోషకరమైన జ్ఞాపకాలు ముఖంపై చిరునవ్వును కలిగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ ఉమా సత్యరేఖ, ప్రవీణ వినయ్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE XII ADDITIONAL DISTRICT JUDGE R.R. DISTRICT :: AT. L.B.NAGAR
IA. No. 357 OF2020
IN
O.S. No.169 OF 2020

BETWEEN:
Mrs. Ayesha Sultana and others ...Petitioner
AND
Mr. B. Vijay Kumar & Others ...Respondent

COURT NOTICE

1. M/s S.M.R, Developers Private Limited, Rep, by Smt S. Savithri, W/o Late Sri Chenna Reddy, aged about 51 years, Occ: Managing Director, R/o Plot No 73, Nagarjuna Hills, Panjagutta, Hyderabad (Defendant no.3)
2.Sri L.Veera Reddy(Died)(Defendant no.10)
3. Smt R Sunitha W/o Sri R Sai Reddy D/o Sri L. Veera Reddy aged about 40 years, Occ: Housewife, R/o Muthangi Village, Patancheru Mandal,Medak District. (Defendant no.11)
4. Smt S. Mounika W/o Sri S. MAdhusudhan Reddy, D/o SriL. Venkat reddy, aged about 34 years, Occ; House wife R/o Narsingi Village, RajendraNagar Mandal R.R. District. (Defendant no.15)
5. Smt. P.Hema Bindu W/o. P.Satish Chandra Reddy, Aged about 36 years, Occ: Housewife, R/o H.No 17-1-389/5, Prashathinagar Colony, Saidabad, Hyderabad. (Defendant No.22).
6.M/s Tanvi Enterprises,Repby its partners 1)Sri K.Vishnu Vardhan Reddy S/o K. Janardhan Reddy, aged about 33 years, Occ: Business,
2) Smt K. Karthika W/o Sri K. Vishnu Vardhan Reddy, Aged about 26 years, Occ:Housewife, both Residing at No.3-86, Manchirevula (v), Rajendranagar (M) R. R District. (Defendant no.23)
7. Sri L. Papi Reddy S/o L.Narayan Reddy Aged about 40 years Occ: Business, R/o H.No SRT 382, Jawahar Nagar, Chikkadpally, Hyderabad. (Defendant No.36)

Please take notice that the above named Petitioner has filed the above interlocutory application No 357 of 2020 seeking for restraining the respondents from change in nature of the suit schedule B property till the disposal of the main suit among other reliefs, and the same is posted on 23.08.2023, for your appearance, therefore you are hereby requested to make it to appear on 23.08.2023 at 10.30 am either personally or through counsel before the Hon'ble XII Additional District Judge, Ranga Reddy District at L.B Nagar. In default of the same, the matter will be heard & decided, in accordance with law.

(BY THE ORDER OF THE COURT)
M/s. CHANDRASEN LAW OFFICES
HIMA VARSHINI
ADVOCATE
R/o. Avanthi Nagar, Basheerbagh, Hyderabad - 29. Mobile No: 8686519404
Counsel for Petitioner

IN THE COURT OF THE HON'BLE XII ADDITIONAL DISTRICT JUDGE R.R. DISTRICT :: AT. L.B.NAGAR
IA. No. 358 OF2020
IN
O.S. No.169 OF 2020

BETWEEN:
Mrs. Ayesha Sulthana and others ...Petitioner
AND
Mr. B. Vijay Kumar & Others ...Respondent

COURT NOTICE

1. M/s S.M.R, Developers Private Limited, Rep, by Smt S. Savithri, W/o Late Sri Chenna Reddy, aged about 51 years, Occ: Managing Director, R/o Plot No 73, Nagarjuna Hills, Panjagutta, Hyderabad (Defendant no.3)
2.Sri L.Veera Reddy(Died)(Defendant no.10)
3. Smt R Sunitha W/o Sri R Sai Reddy D/o Sri L. Veera Reddy aged about 40 years, Occ: Housewife, R/o Muthangi Village, Patancheru Mandal,Medak District. (Defendant no.11)
4. Smt S. Mounika W/o Sri S. MAdhusudhan Reddy, D/o SriL. Venkat reddy, aged about 34 years, Occ; House wife R/o Narsingi Village, RajendraNagar Mandal R.R. District. (Defendant no.15)
5. Smt. P.Hema Bindu W/o. P.Satish Chandra Reddy, Aged about 36 years, Occ: Housewife, R/o H.No 17-1-389/5, Prashathinagar Colony, Saidabad, Hyderabad. (Defendant No.22).
6.M/sTanvi Enterprises,Rep by its partners 1)Sri K.Vishnu Vardhan Reddy S/o K. Janardhan Reddy, aged about 33 years, Occ: Business,
2) Smt K. Karthika W/o Sri K. Vishnu Vardhan Reddy, Aged about 26 years, Occ:Housewife, both Residing at No.3-86, Manchirevula (v), Rajendranagar (M) R. R District. (Defendant no.23)
7. Sri L. Papi Reddy S/o L.Narayan Reddy Aged about 40 years Occ: Business, R/o H.No SRT 382, Jawahar Nagar, Chikkadpally, Hyderabad. (Defendant No.36)

Please take notice that the above named Petitioner has filed the above interlocutory application No 358 of 2020 seeking for restraining the respondents from alienations with respect to the suit B schedule property till the disposal of the main suit and pass such other order or orders as this honble court may deems fit and proper in the circumstances of the case, and the same is posted on 23.08.2023, for your appearance, therefore you are hereby requested to make it to appear on 23.08.2023 at 10.30 am either personally or through counsel before the Hon'ble XII Additional District Judge, Ranga Reddy District at L.B Nagar. In default of the same, the matter will be heard and decided, in accordance with law.

(BY THE ORDER OF THE COURT)
M/s. CHANDRASEN LAW OFFICES
HIMA VARSHINI
ADVOCATE
R/o. Avanthi Nagar, Basheerbagh, Hyderabad - 29. Mobile No: 8686519404
Counsel for Petitioner

IN THE COURT OF THE HON'BLE XII ADDITIONAL DISTRICT JUDGE R.R. DISTRICT :: AT. L.B.NAGAR
IA. No. 359 OF2020
IN
O.S. No.169 OF 2020

BETWEEN:
Mrs. Ayesha Sulthana and others ...Petitioner
AND
Mr. B. Vijay Kumar & Others ...Defendants

COURT NOTICE

1. M/s S.M.R, Developers Private Limited, Rep, by Smt S. Savithri, W/o Late Sri Chenna Reddy, aged about 51 years, Occ: Managing Director, R/o Plot No 73, Nagarjuna Hills, Panjagutta, Hyderabad (Defendant no.3)
2.Sri L.Veera Reddy(Died)(Defendant no.10)
3. Smt R Sunitha W/o Sri R Sai Reddy D/o Sri L. Veera Reddy aged about 40 years, Occ: Housewife, R/o Muthangi Village, Patancheru Mandal,Medak District. (Defendant no.11)
4. Smt S. Mounika W/o Sri S. MAdhusudhan Reddy, D/o SriL. Venkat reddy, aged about 34 years, Occ; House wife R/o Narsingi Village, RajendraNagar Mandal R.R. District. (Defendant no.15)
5. Smt. P.Hema Bindu W/o. P.Satish Chandra Reddy, Aged about 36 years, Occ: Housewife, R/o H.No 17-1-389/5, Prashathinagar Colony, Saidabad, Hyderabad. (Defendant No.22).
6.M/sTanvi Enterprises,Rep by its partners 1)Sri K.Vishnu Vardhan Reddy S/o K. Janardhan Reddy, aged about 33 years, Occ: Business,
2) Smt K. Karthika W/o Sri K. Vishnu Vardhan Reddy, Aged about 26 years, Occ:Housewife, both Residing at No.3-86, Manchirevula (v), Rajendranagar (M) R. R District. (Defendant no.23)
7. Sri L. Papi Reddy S/o L.Narayan Reddy Aged about 40 years Occ: Business, R/o H.No SRT 382, Jawahar Nagar, Chikkadpally, Hyderabad. (Defendant No.36)

Please take notice that the above named Petitioner has filed the above interlocutory application No 359 of 2020 seeking for restraining the respondents from mortgaging the suit suit schedule property or any part therefore before any banks or any private financial institutions by crating any third party rights in the suit B schedule property among other reliefs and the same is posted on 23.08.2023, for your appearance, therefore you are hereby requested to make it to appear on 23.08.2023 at 10.30 am either personally or through counsel before the Hon'ble XII Additional District Judge, Ranga Reddy District at L.B Nagar. In default of the same, the matter will be heard and decided, in accordance with law.

(BY THE ORDER OF THE COURT)
M/s. CHANDRASEN LAW OFFICES
HIMA VARSHINI
ADVOCATE
R/o. Avanthi Nagar, Basheerbagh, Hyderabad - 29. Mobile No: 8686519404
Counsel for Petitioner

హస్తినాపురం డివిజన్ అభివృద్ధి కి నిధులు కేటాయిస్తూ పలు రంగాలలో అభివృద్ధి పథంలో నిలుపుతున్న స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సేవలు వెల కట్టలేనివని బి.ఆర్.ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆందోజీ సత్యం చారి అన్నారు. డివిజన్ లో మౌలిక సదుపాయాలను మొదలుకొని అభివృద్ధి పనుల విషయం లోఎక్కడ రాజీ పడకుండా నిర్మాణాలు చేపడుతు అహర్నిశలు ఎల్బీనగర్ నియోజక వర్గాన్ని అభివృద్ధినీ కాంక్షించే వ్యక్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అని పేర్కొన్నారు. నూతన ఒరవడిక తో అను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమమే తన ధ్యేయంగా ఉన్నత లక్ష్యాల వైపు మళ్ళించడం లో ఎమ్మెల్యే చొరవ అనన్యసామాన్యమని వారు అన్నారు. డివిజన్ అభివృద్ధి కి కొన్ని వందల కోట్ల రూపాయలు వెచ్చించి నూతన డ్రయినేజీ విధానాలు మొదలుకొని సి.సి రోడ్లు, బి. టి రోడ్ ల నిర్మాణాలు చేపడుతూ సిగ్నల్ రహిత నియోజక వర్గంగా తీర్చిదిద్ది నియోజక వర్గ రూపు రెఖల్ని మార్చిన ఘనత ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దని సత్యం చారి తెలిపారు. నవతెలంగాణ-హస్తినాపురం



బీసీలకు హక్కులపై ఐక్యంగా పోరాడాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



తెలంగాణ బీ.సీ జాగృతి అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్‌గా ఏనుగంటి దిలీప్ కుమార్ నేత నియమి తులయ్యారు. గోల్నాక డివిజన్ దుర్గానగర్‌కు చెందిన ఆయనకు బీసీ జాగతి అధ్యక్షులు కే.పీ మురళి కష్ణ బుధవారం బర్కతపుర తెలంగాణ బీ.సీ జాగతి కార్యాలయంలో నియామకాపత్రం అందజేశారు. దిలీప్ కుమార్ మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలో బీ.సీ కులాలను ఐకమత్యం చేసి బీ.సీ హక్కులను, సమస్యలను ప్రభుత్వం దష్టికి, వివిధ రాజకీయ పార్టీల దష్టికి తీసుకొని వెళ్తానని తెలిపారు.తనను నియమించినందుకు అధ్యక్షులు కే.పీ మురళి కష్ణకు కతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి కత్తులు సుదర్శన్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగం గౌడ్, ఉపాధ్యక్షులు అచ్చిన రమేష్ కోశాధికారి పాతకోటి మహేష్ ,వేణు గోపాల్ చారి, లాలా గౌడ్ పాల్గొన్నారు.

నూతన అడ్డా ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కంటోన్మెంట్



రసూల్‌పుర ఇందిరమ్మ నగర్ లో భవన నిర్మాణ కార్మికుల కోసం సీపీఐ(ఎం) రెండో వార్డ్ నాయకులు యాదగిరి ఆధ్వర్యంలో బుధవారం ఉషా కంపెనీ వద్ద నూతన అడ్డా ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న అడ్డా వద్ద కార్మికులు ఇబ్బందులు పడుతుండడంతో ఈ అడ్డా ఏర్పాటైంది. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ అడ్డా మీద కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చినా సీపీఐ(ఎం) తరపున అండగా ఉండిపరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఓయూలో కొత్త హాస్టల్, మెస్ భవనాలు నిర్మించాలి

- పరిశోధక విద్యార్థులు
- మురుగు నీటిలో భోజనం చేస్తూ నిరసన





నవతెలంగాణ-ఓయూ

ఓయూలో గత వారం రోజులుగా రీసెర్చ్ స్కాలర్స్ మెస్ భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు నుంచి వాటర్ కారుతున్నా యూనివర్సిటీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని నిరసిస్తూ అదే మురుగుపడిన వాటర్‌లో భోజనం చేస్తూ పరిశోధక విద్యార్థులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థులు మాట్లాడుతూ ఈ మధ్య ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు హిమాన్షు ఒక శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలను బాగుచేయడాన్ని అభినందించారు. కానీ తెలంగాణలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఇంటర్, డిగ్రీ కళాశాలలు విశ్వవిద్యాల యాలు మొత్తం ప్రభుత్వ విద్యనే భ్రష్టు పట్టిందని హిమాన్షు తెలుసుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్, మంత్రిక కేటీఆర్‌లకు చిత్తశుద్ధి ఉంటే ఓయూలో హాస్టల్, మెస్ భవనాలను సందర్శించి వాటిలో భోజనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించని యెడల విద్యార్థులను పెద్ద ఎత్తున కలుపుకొని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య, పీడీఎస్‌యూ (విజంభన) కన్వీనర్ బొడ్డుపల్ల అఖిల్, తెలుగు రీసర్చ్ స్కాలర్స్ చేవెళ్ల యాదగిరి, మధు, సోషియాలజీ రీసెర్చ్ స్కాలర్స్ గోవర్ధన్, రవి పాల్గొన్నారు.

కురువైన ముందస్తు మరమ్మతులు కురుస్తున్నఆర్ట్స్ కళాశాల, మెస్ లు

ఉస్మానియా విశ్వవిద్యాలయం లో ఆర్ట్స్ కళాశాల లో పలు విభాగాలతో పాటుగా మెస్ లు,వసతి గహాలు కురుస్తున్నాయి. అధికారులకు ఈ విషయం తెలిసినప్పటికీ ముందస్తు చర్యలు చేపట్టడం లో వైఫల్యం చెందారు ని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తుగా కనీస మరమ్మతులు చేపట్టినా ఇలా కురవడం ఉండేది కాదన్నారు.కనీసం రూఫ్ మీద కొన్ని చోట్ల పిచ్చి మొక్కలు పెరగడం, ఇంకొన్ని రూఫ్స్ మీద వివిధ రకాల వ్యర్థాలు పేరుకు పోవడం, కనీసం వర్షపునీరు సాఫీగా పోవడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. కొన్ని వసతి గహాలు, మెస్‌లలో రూఫ్స్ కింద పెచ్చులు నెర్రలు బారి అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి.

రెగ్యులర్ చేయాలని హోంగార్డుల ధర్నా



నవతెలంగాణ-అడిక్ మెట్

తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ హోంగార్డులు బుధవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నాకు దిగారు. పెద్ద ఎత్తున హోంగార్డులు చేరుకుని ఆందోళన చేపట్టడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు హోంగార్డులను ధర్నా చేయడానికి అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. అయినా వి వాంట్ జస్టిస్ అంటూ హోంగార్డులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. భారీ ఎత్తున పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ధర్నా అడ్డుకొని, నిరసన చేయడానికి వీలు లేదని పైనుంచి ఆర్డర్స్ వచ్చాయని తెలిపారు. హోంగార్డులను అరెస్టు చేసి పోలీస్ వాహనంలో ఎక్కించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హోంగార్డులతో పాటు కారుణ్య నియామకాలు చేపట్టాలని హోంగార్డుల కుటుంబ సభ్యులు కూడా వచ్చి ఆందోళన చేపట్టడంతో పోలీసులు వారిని కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా హోంగార్డులు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా చెప్పిన హోంగార్డులను రెగ్యులరైజ్ చేస్తానని సీఎం కేసీఆర్ మాట ఇచ్చారన్నారు. ఆ హామీనికి కేసీఆర్ ఇప్పటికి అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో హోంగార్డుల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంటోంది కానీ ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే హోంగార్డులను రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

- డాక్టర్ చీమ శ్రీనివాస్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి దానికి చట్టబద్ధత కల్పించాలని మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయన్నారు. మణిపూర్ లో ఆదివాసీ మహిళలపై లైంగికదాడులు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న విభజన కుల మత రాజకీయాల ఫలితమే అని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనించి విభజన రాజకీయాలు చేసే పార్టీలను భూస్థాపితం చేసి భారతదేశ లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, తెలం గాణ రాష్ట్రంలో కూడా ఇలాంటి కుట్రలు జరగకుండా చూడా లని పిలుపునిచ్చారు. దేశంలో బడుగు బలహీన వర్గాల పై దాడులు జరుగుతుంటే మోడీ మౌనం వహించడం శోచనీయం అన్నారు. మతతత్వ రాజకీయ పార్టీలు తెలంగాణ రాష్ట్రంలో బలపడకుండా చూడాల్సిన బాధ్యత తెలంగాణ పౌర సమాజంపై ప్రజాసం ఘాలపై ఉందన్నారు. రాత్రికి రాత్రి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ప్రవేశపెట్టిన మోడీ గత 30 సంవత్సరాలుగా జరుగుతున్న వర్గీకరణ ఉద్యమం పట్ల స్పందించకపోవడం ఆయన అహంకారపూరితానికి నిదర్శనం అన్నారు. మాదిగ మేధావుల ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పల్లెల వీరస్వామి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ నతనీయేలు, కోశాధికారి బెజ్జంకి రాంబాబు, ఉపాధ్యక్షులు ఏం నరసయ్య, ఆనంద్, ఎస్సీ ఎస్టీ ఫోరం నాయకులు రాజేందర్, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటించిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌లోని ఉమా సిగ్నేచర్ టవర్స్ వద్ద వరద నీళ్ల భారీగా చేరుతుందని అపార్ట్మెంట్ వాసులు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి దష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు డిప్యూటీ మేయర్ బుధవారం జలమండలి అధికారులతో కలిసి అపార్ట్మెంట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అలాగే అపార్ట్‌మెంట్‌లో డ్రయినేజీ నీళ్ల, వర్షపు నీళ్ళు కలిసి అపార్ట్మెంట్‌కు వస్తున్నాయని తెలుసుకుని, అపార్ట్మెంట్ వాసులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ‘'ని డిప్యూటీ మేయర్ ఆదేశించారు. జలమండలి అధికారులు ఏరియా మేనేజర్ నికిత రెడ్డి, సూపర్వైజర్ అశోక్, బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు, అపార్ట్మెంట్ వాసులు ఉన్నారు.

యువతులు అన్ని రంగాల్లో ముందుండాలి

- చైర్మెన్ మన్నె క్రిశాంక్



నవతెలంగాణ-కంటోన్మెంట్

యువతులు అన్ని రంగాల్లో ముందుండాలని రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ పిలుపునిచ్చారు. యువతులను చైతన్యవంతులుగా తీర్చిద్దేం దుకు గాను కంటోన్మెంట్ ఐదో వార్డ్ కాకాగూడాలో షీ టాక్స్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా అనేక కార్యక్రమాలను, పథకాలను తీసుకొచ్చిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు ముఖ్యంగా యువతలు చైతన్య వంతులు కావాలని కోరారు. ఆర్థికంగా ఎదగాలని, యువతులు నిర్భయంగా సభలు సమావేశాలు చర్చ కార్యక్రమాల్లో పాల్గొంటే మనోధర్యం వస్తుందనిసూచించారు యువతులు చర్చ కార్యక్రమంలో పాల్గొనడం వల్ల వారికి అనేక విషయాలు తెలుస్తాయని సమాజాన్ని అర్థం చేసుకోగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 30 మంది యువతు లు పాల్గొని బహుళజాతి కంపెనీలలో ఉపాధి అవకాశాలు, వ్యవస్థాపకత, స్వయం ఉపాధి, మహిళా సాధికారత గురించి చర్చించారు.. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ కార్యక్రమంలో పాల్గొన్నందుకు యువతులకు క్రిశాంక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్య , సంకీర్తన, ఝాన్సీ, సుస్మిత, శిరీష, డానిష్క, యశస్విని, శ్రీ లక్ష్మి, మోనిక, రమ్య భాను, లోహిత, ఐశ్వర్య కీర్తన తదితరులు పాల్గొన్నారు..

బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ



నవతెలంగాణ - అడిక్ మెట్

ఎంబీఏ ఎంసీఏ పీజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీలపల్లి అంజి డిమాండ్ చేశారు. ఐఐటీ ఐఐఎం కోర్సుల విద్యార్థులకు పూర్తి ఫీజు రియంబర్మెంట్స్ ప్రకటన పై విద్యానగర్ బీసీ భవన్ లో బీసీ విద్యార్థి సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీ ఐఐఎంలో చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు రియంబర్మెంట్స్ 150 కోట్లు నిధుల కేటాయింపు అనే ప్రకటన ఎన్నికల లబ్ది ప్రకటనని అన్నారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాల నుంచి అంతకుముందు అమలులో ఉన్న మొత్తం ఫీజు రియంబర్మెంట్ పథకాన్ని ఎగ్గొట్టారన్నారు. ఏటా రెండున్నర లక్షల చొప్పున దరఖాస్తు చేసుకున్న బీసీ విద్యార్థులకు 10,000 లోపు ర్యాంకు వచ్చిన వారికి పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ పథకంగా కుదించి కేవలం 4000 మంది బీసీలకు మాత్రమే ఇచ్చి లక్షలాదిమంది బీసీ విద్యార్థులను ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం దూరం చేసిందన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు సీలింగ్ లేకుండా ఇస్తున్నారని, బీసీలకు మాత్రం సీలింగ్ ఎందుకని ప్రశ్నించారు. విదేశీ విద్య బీసీలకు లక్ష రూపాయల పథకాలు అమలులో కూడా కొత్త కొత్త మార్గదర్శకాలు తీసుకువచ్చి 99 శాతం మంది బీసీలను అనర్హులుగా చేస్తున్నారని అన్నారు. 120 కి పైగా కులాలు ఉన్న బీసీలలో కేవలం ఐదు కులాల వారికి మాత్రమే లక్ష రూపాయల పథకం వర్తింపజేసి మిగిలిన వారిని వివక్షకు గురి చేస్తున్నారన్నారు. ఎంబీఏ, ఎంసీఏ, పీజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలని, కొత్తగా ఏర్పడిన యూనివర్సిటీలో రిజర్వేషన్లు అమలు చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కష, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకష్ణ, సుధాకర్, మల్లేష్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ క్రీడల్లో సిల్వర్ మెడల్ సాధించిన అబిడ్స్ కానిస్టేబుల్

- అభినందించిన అబిడ్స్ ఇన్స్పెక్టర్ బి.ప్రసాద్ రావు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఢిల్లీలో జరిగిన ఫెన్సింగ్ క్రీడల్లో సిల్వర్ మెడల్ సాధించిన అబిడ్స్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఓంకార్ నాథ్‌కు డీజీపీ అంజనీకుమార్ రూ. 30వేల



రివార్డును ఆయనకు ప్రకటించారు. ఈ మేరకు అబిడ్స్ ఇన్స్పెక్టర్ బీ ప్రసాద్ రావు రివార్డును ఓంకార్ నాథ్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణ నిర్వర్తిస్తూనే క్రీడల్లో పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని అభినందించారు. కానిస్టేబుల్ ఓంకార్ నాథ్ మాట్లాడుతూ తాము ఢిల్లీలో జరిగిన 7వ ఆల్ ఇండియా పోలీస్ మీట్ జూడో క్లస్టర్‌లో భాగంగా సెంట్రల్ జోన్ నుండి 40 మంది పాల్గొన్నామన్నారు. ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన క్రీడాపోటీల్లో 10 ఏండ్ల తరువాత సిల్వర్ మెడల్ సాధించిన వ్యక్తిని తానేని చెప్పారు.క్రీడల్లో సిల్వర్ మెడల్ సా ధించేందుకు సహకరించిన పోలీస్ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐ అభిలాష్, ఎస్ఐలు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం స్థానిక అధికారులతో కలిసి ఎమ్మెల్యే బాగ్ అంబర్ పేట డివిజన్ సీఈ కాలనీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తివాసులు అక్కడ వీధి దీపాలు వెలగడం లేదని, ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగ్గా పనిచేయడం లేదని, కాలనీలో వాహనాలు వేగంగా వెళ్లడాన్ని నిరోధించడానికి స్పీడ్ బ్రేకర్లు కావాలని, ప్రస్తుతం వర్షాల వల్ల నీరు నిలిచి ఇబ్బందులు కలుగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కాలనీలోని పార్క్‌ను అభివృద్ధి చేయాలని, కాలనీలో ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయడం లేదా వేరే బస్సుల రూటు మార్చి ప్రయాణం సులభతరం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే కాలనీలో మరిన్ని అభివద్ధి కార్యక్రమాలు కూడా చేపడతామని వారికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, , కాలనీ వాసులు పాల్గొన్నారు.

మరో చారిత్రక ఘట్టానికి తెరలేపిన తెలంగాణ ప్రభుత్వం

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

మైనారిటీ సోదరుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం రూ. లక్ష సాయం చేపడుతున్నందుకు తార్నాక డివిజన్‌కు చెందిన మైనారిటీ నాయకులు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డిలను బుధవారం కలిసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సంధ్బంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ. మైనార్టీల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా దేశానికే ఆదర్శవంతమైన మరో చారిత్రక ఘట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిందన్నారు. బీసీ కులవృత్తిదారులు, చేతివత్తిదారుల అభ్యున్నతి కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్న విధంగానే రాష్ట్రంలోని మైనార్టీలందరికీ రూ.లక్ష ఆర్థిక సాయం చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కులమతాలకు అతీతంగా పేదరికాన్ని పారద్రోలాలనే దార్శనికతతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. విభిన్న సంస్కతులు, విభిన్న మత ఆచార, సంప్రదాయాలను సమానంగా ఆదరిస్తూ రాష్ట్రంలో గంగా జమున తహజీబ్‌ను కాపాడే ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా రూ.లక్ష సాయానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మోండా డివిజన్ కార్పొరేటర్ దీపిక బుధవారం గ్రౌండ్ లో కార్గిల్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం అమరులయిన సైనికుల త్యాగాలు మరవరానివని అన్నారు. కార్పొరేటర్‌తో పాటు బీజేపీ నాయకులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఆగస్టు 12 న చలో హైదరాబాద్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



ఆగస్టు 12న నిర్వహించనున్న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ఈయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎన్ నరేందర్ రావు పిలుపునిచ్చారు. బుధవారం అబిడ్స్‌లోని బీమా భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ "అభి నహీ తో కబీ నహీ" నినాదంతో "పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర" టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ నాయకత్వంలో జులై 16వ తేదీన జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రారంభమై 33 జిల్లాల గుండా 16 రోజుల పాటు కొనసాగుతూ 30. రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి చేరుకుంటుందన్నారు. 31 వ తేదీన యాదాద్రిలో ముగుస్తుందని తెలిపారు. ఆగస్టు 12న హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయి సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ యాత్రకు అన్ని సంఘాల నాయకత్వం మద్దతు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఉద్యోగులను పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి దారులుగా మార్చిన ఈ దళారీ పెన్షన్ విధానం (కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం)ను అంతమొందించాలని పంతంతో చేపట్టినది ఈ రథయాత్ర అన్నారు. ఉద్యోగుల మెడకు ఉరితాడు లాంటి సిపిఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ గత పది రోజులుగా యాత్ర విజయవంతంగా కొనసాగుతూ నేడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చేరుకుందన్నారు. టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర ఈసీ సభ్యులు బి శ్రవణ్ కుమార్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ సత్యనారాయణ, కోశాధికారి కే శ్యాంసుందర్.కే. గంగాధర్ అర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

నాలాలు పూడిక తీయడంలో వైఫల్యం

నవతెలంగాణ-ఓయూ

అకాల వర్షాల కారణంగా ప్రజల సమస్యలపైన బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు రామువర్మ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు పార్టీ నేతలు బుధవారం వినతిపత్రం



అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ తార్నాక డివిజన్‌లో పలు బస్తి లలో చంద్రబాబు నగర్, సత్య నగర్, సిరిపూరి కాలనీ, వినోభ 'నగర్ తదితర ప్రాంతాల్లో నాలాల నుంచి వర్షం నీరు పొంగిపొర్లుతున్నాయన్నారు. ఇండ్లలోకి నీరు చేరి నిత్యావసర సామగ్రి అంత తడిసిపోయి ప్రజలు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలాల నుంచి పూడిక తీయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు జెమికుంట వేణు, కృష్ణ మూర్తి నవీన్ మాల, ప్రధాన కార్యదర్శిలు గోవర్ధన్, సతీష్ రెడ్డి , అజయ్ ముదిరాజ్ ,యువ మోర్చా అధ్యక్షుడు ఉపేందర్ యాదవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ప్రమోద్ పాల్గొన్నారు.

అధికారులు ఫిర్యాదులను సమన్వయంతో పరిష్కరించాలి

- కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్



నవతెలంగాణ - అడిక్ మెట్

గాంధీనగర్ డివిజన్ జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో ప్రజల సమస్య ఫిర్యాదులను సమన్వయంతో పరిష్కరించాలని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. బుధవారం డివిజన్‌లోని చిక్కడపల్లి వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఫిర్యాదులు వాటి పరిష్కార వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 80, నేరుగా వచ్చి చేసిన 9 ఫిర్యాదులకు గాను 71 ఆన్‌లైన్ ఫిర్యాదులను పరిష్కరించామని, నేరుగా చేసిన ఫిర్యాదులతో కలిపి ఇంకా మిగిలిన 18 పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారన్నారు. ఫిర్యాదుల ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రజలు వాటి గురించి వార్డ్ ఆఫీసు చుట్టూ తిరిగే అవసరం లేకుండా చూడాలన్నారు. ఇలాగే అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహిస్తామని, అత్యవసరం వీలున్నప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు వినయ్ కుమార్, వార్డ్ ఆఫీసు అధికారులు రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీదేవి,వాటర్ వర్క్స్ సిబ్బంది మల్లేష్, సనిటాయిజేషన్ బాల్ రాజ్, ఎంటమాలజీ అంజయ్య యూబీడీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి హాజరైన మంత్రి



నవతెలంగాణ-కంటోన్మెంట్

మహేంద్ర హిల్స్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో వన మహోత్సవం కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పల్లవి ఢిల్లీ స్కూల్స్ లా గ్రూప్ స్కూల్ చైర్మెన్ మల్కా కొమరయ్య విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు మంత్రి కేటీఆర్ పుట్టినరోజుని పురస్కరించుకొని మహేంద్ర హిల్స్ లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మెన్ మల్కా కొమరయ్య, ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ (తెలంగాణ ప్రభుత్వ హెచ్ఎం డీఏ) సలేహా ఆఫ్రోస్, స్కూల్ యాజమాన్యం, సిబ్బందితో కలిసి మంత్రి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నందితా సుంకర, స్కూల్ సీఓఓ మల్కా యశస్వీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమరయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతీ సంవత్సరం విద్యార్థులు హరితహారాన్ని నిర్వహిస్తుంటారని, ప్రతీ విద్యార్థి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడమే కాకుండా వాళ్ళ ఇండ్లల్లో కూడా మొక్కలు నాటుతున్నారని తెలిపారు. అందుకు పాఠశాల అధ్యాపకులు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు.

ఆర్థిక చేయూత ఇవ్వండి : డా.కె. పాల్ మార్క్

నవతెలంగాణ-ఓయూ



క్రైస్తవులకు కూడా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని పూర్తి సబ్సిడీతో ఇవ్వనున్నట్టు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్టు డాక్టర్. కే.పాల్ మార్క్ చెప్పారు.బుధవారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇలాంటి మరిన్ని ఆర్థిక సహాయ, అధిక భరోస పథకాలను కేసీఆర్ క్రైస్తవులకు కల్పించాలని, క్రైస్తవ యువ నాయకులకు రాజకీయంగా అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ విద్యార్థి విభాగంరాష్ట్ర ప్రధాన కార్యదర్శి, క్రిస్టియన్ మైనార్టీ నేత డా.కె.పాల్ మార్క్ తో పాటుగా పలువురు నేతలు పాల్గొన్నారు.

వైద్యానికి సహాయం అందజేసిన పద్మారావు

నవతెలంగాణ-ఓయూ



నిరుపేదలకు మంచి వైద్యాన్ని అందించేందుకు తన వంతు కషిలో భాగంగా డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ముందుకు వచ్చారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ఆరతి, శ్రీదేవి, సతీష్ కుమార్, ముస్కాన్, కనకయ్య యాకయ్యలు అనారోగ్యం తో బాధపడుతున్నారు.వీరికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన ఎల్ ఓ సి పత్రాలను బుధవారం ఆరతి (2 .50 లక్షలు) శ్రీదేవి (2 .50 లక్షలు), సతీష్ కుమార్ (2 .50 లక్షలు), ముస్కాన్ (2 .50 లక్షలు) , యాకయ్య (2 .50 లక్షలు) , కనకయ్య (1 లక్ష) మొత్తం రూ. 13 లక్షల విలువ చేసే (ఎల్ఓసీ) లను లబ్దిదారులకు అందజేశారు. సీతాఫల్‌మండిలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ4.50లక్ష విలువజేసే ఎల్ ఓ సి పత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిషన్ 2023!

- భారత్ ప్రపంచకప్ సన్నద్ధత
- పోటీ ఇవ్వటంపైనే విండీస్ గురి
- భారత్, విండీస్ తొలి వన్డే నేడు
- రాత్రి 7 నుంచి డిడిస్పోర్ట్స్‌లో

2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు మరో రెండు నెలలు గడువే ఉంది. 50 ఓవర్ల ఫార్మాట్‌లో తుది జట్టు రూపుపై టీమ్ ఇండియా ఓ అవగాహనకు రాలేదు. కరీబియన్లతో వన్డే సిరీస్‌లో యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వనున్నట జట్టు మేనేజ్‌మెంట్.. కొన్ని ప్రత్యామ్నాయ అవకాశాలపై ఓ అంచనాకు రానుంది. వన్డే సిరీస్‌తో టీమ్ ఇండియా ప్రపంచకప్ సన్నద్ధతకు సై అంటుండగా.. 2023 వరల్డ్‌కప్‌కు దూరమైన కరీబియన్లు గమ్యం లేని గమనం దిశగా సాగుతున్నారు!. మూడు వన్డేల్లో రోహిత్‌సేనకు గట్టి పోటీ ఇవ్వటమే వెస్టిండీస్ ముందున్న ప్రస్తుత లక్ష్యం!. భారత్, వెస్టిండీస్ తొలి వన్డే పోరు నేడు.

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్

స్వదేశంలో మెగా టైటిల్ వేటకు సమర శంఖం పూరించేందుకు.. కరీబియన్ గడ్డపై సన్నద్ధతకు సై అంటోంది రోహిత్‌సేన. సుదీర్ఘ విరామం అనంతరం ఐసీసీ టైటిల్‌పై కన్నేసిన భారత్.. స్వదేశంలో జరుగుతున్న 2023 వన్డే వరల్డ్‌కప్‌కు జట్టు కూర్పును కుదుర్చుకునే పనిలో నిమగ్నమైంది. కొందరు కీలక ఆటగాళ్లు గాయాలతో దూరం కాగా.. ప్రత్యామ్నాయ వనరులపై రోహిత్, ద్రవిడ్ ద్వయం దృష్టి నిలిపింది. ప్రపంచకప్ నేపథ్యంలో వన్డే సిరీస్‌కు టీమ్ ఇండియా రెడీ అవుతుండగా.. వెస్టిండీస్‌కు ఎటువంటి లక్ష్యం లేదు. ఈ సిరీస్‌లో ఓటమి, గెలుపు ఆ జట్టును ఏ విధంగా ప్రభావితం చేయలేవు. అయితే, అగ్రజట్టు భారత్‌పై సత్తా చాటేందుకు కరీబియన్ కుర్రాళ్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో నేడు కెన్నింగ్‌స్టన్ ఓవల్ వేదికగా తొలి పోరు. భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు మ్యాచ్ ఆరంభం కానుంది. దూరదర్శన్ స్పోర్ట్స్, జియో సినిమాలో భారత్, విండీస్ వన్డే మ్యాచ్‌ను వీక్షించవచ్చు.

సంజుకు అవకాశం దక్కేనా?

ప్రతిభావంతుడు, మ్యాచ్‌ను మలుపు తిప్పగల సమర్థుడు. అయినా, నిలకడలేమి ప్రదర్శన అతడి అవకాశాలను ప్రభావితం చేస్తుంది. వన్డే ఫార్మాట్‌లో కెరీర్ మొదలై, ముగిసే అన్నట్టు సాగుతుంది. ప్రధాన వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఎన్‌సీఏలో కోలుకుంటున్న తరుణంలో.. 50 ఓవర్ల ఫార్మాట్‌లో, ప్రత్యేకించి ప్రపంచకప్ ప్రణాళికల్లో చోటు సాధించేందుకు సంజు శాంసన్ ఉవ్విళ్లూరుతున్నాడు. గతంలో మాదిరి కాకుండా, సంజు శాంసన్‌కు ఈ సారి సిరీస్‌లో మూడు మ్యాచుల్లోనూ ఆడే అవకాశం లభించవచ్చు. విండీస్‌తో టెస్టుల్లో ఆడిన ఇషాన్ కిషన్ నుంచి పోటీ ఎదురైనా.. ఈ ఫార్మాట్‌లో సంజు శాంసన్‌కు చాన్స్ ఇచ్చేందుకు జట్టు మేనేజ్‌మెంట్ సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తుంది. ఇక సూర్యకుమార్ యాదవ్ ఈ ఫార్మాట్‌లో పెద్దగా రాణించింది లేదు. దీంతో వరల్డ్‌కప్ ముంగిట అతడు మిడిల్ ఆర్డర్‌లో ధనాధన్ మెరుపుల మోత మోగిస్తేనే తుది జట్టులో ఉండగలడు. స్పిన్ విభాగంలో రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌లు తుది జట్టులో నిలువనున్నారు. యుజ్వేంద్ర చాహల్‌ను కాదని మణికట్టు మాయగాడు కుల్దీప్ యాదవ్ నేడు ఆడే అవకాశం ఉంది. పేస్ విభాగంలో మహ్మద్ సిరాజ్ ఒక్కడే ప్రపంచకప్ ప్రణాళికల్లో నిలకడగా ఉన్న పేసర్. ఉమ్రాన్ మాలిక్, జైదేవ్ ఉనద్కత్, ముకేశ్ కుమార్‌లు సత్తా చాటాల్సి ఉంది. బ్యాటింగ్ విభాగంలో కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శుభ్‌మన్ గిల్ ఫామ్‌లో ఉన్నారు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు భారీ ఇన్నింగ్స్‌లపై కన్నేసి బరిలోకి దిగుతున్నారు.



కుర్రాళ్ల ఉత్సాహం

ఎటువంటి ప్రేరణ, లక్ష్యం లేకుండా వన్డే సిరీస్‌కు వస్తున్న కరీబియన్లు.. అగ్రజట్టుకు గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తున్నారు. విండీస్ బ్యాటర్ షిమ్రోన్ హెట్‌మయర్‌కు భారత్‌పై మంచి రికార్డుంది. 45.55 సగటు, 121.35 స్ట్రయిక్‌రేట్‌తో అతడు టీమ్ ఇండియాపై 500 వన్డే పరుగులు సాధించాడు. తాజా సిరీస్‌లో అతడిని నిలువరించటం భారత్‌కు సవాల్‌గా మారనుంది. రెండో టెస్టులో ప్రతిఘటించిన ఉత్సాహంతో కరీబియన్లు తొలి వన్డేలో పోటీపడనున్నారు. బ్రాండన్ కింగ్, కైల్ మేయర్స్, హోప్, పావెల్‌లు జోరుమీదున్నారు.

పిచ్ రిపోర్టు

2022 ఆగస్టులో వెస్టిండీస్, న్యూజిలాండ్ మూడు వన్డేలు ఇక్కడ ఆడాయి. తొలి ఇన్నింగ్స్‌లో వరుసగా 190, 212, 301 పరుగులు నమోదయ్యాయి. పేస్, స్పిన్‌కు పిచ్ నుంచి సహకారం లభించినా.. వికెట్ల వేటలో పేసర్లదే హవా నడిచింది. ఆ సిరీస్‌లో మూడు మ్యాచులు డే నైట్‌లో జరుగగా.. భారత్‌తో వన్డే పోరు ఉపఖండపు అభిమానుల టీవీ టైమింగ్స్‌కు అనుగుణంగా జరుగుతుంది. ఫింగర్ స్పిన్నర్లకు పెద్దగా పిచ్ సహకరించలేదు. మణికట్టు స్పిన్నర్లకు కాస్త మొగ్గు కనిపించవచ్చు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే వీలుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, సంజు శాంసన్/ఇషాన్ కిషన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ముకేశ్ కుమార్.

వెస్టిండీస్ : బ్రాండన్ కింగ్, కైల్ మేయర్స్, కీసీ కార్టీ, షాయ్ హోప్ (కెప్టెన్, వికెట్ కీపర్), షిమ్రోన్ హెట్‌మయర్, రోవ్‌మన్ పావెల్, రొమారియో షెఫర్డ్, కెవిన్ సింక్లెర్, అల్జారీ జొసెఫ్, ఒసానే థామస్, జేడెన్ సీల్స్.

వర్షం సూచన!



భారత్, వెస్టిండీస్ తొలి వన్డేకు వర్షం ముప్పు పొంచి ఉంది. కెన్నింగ్‌స్టన్ ఓవల్‌లో గురువారం 20 శాతం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఏదో ఒక ఇన్నింగ్స్‌కు వరుణుడు ఆటంకం కలిగించే ప్రమాదం లేకపోలేదు. రెండో వన్డే మ్యాచ్‌కు సైతం కెన్నింగ్‌స్టన్ ఓవల్ ఆతిథ్యం ఇస్తుండగా.. ఆ మ్యాచ్‌కు వర్షం కురిసే అవకాశం 50 శాతం ఉంది. వర్షం కారణంగా అధిక శాతం ఆటకు అంతరాయం ఏర్పడితే డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో లక్ష్యాలను సవరించటం, ఓవర్లను కుదించటం వంటివి జరుగుతాయి. దీంతో టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునేందుకు మొగ్గు చూపవచ్చు.

సింధు ఓటమి



టోక్యో : భారత అగ్రశ్రేణి షట్లర్, మాజీ వరల్డ్ నం.2 పి.వి సింధు వైఫల్యాల బాట వీడటం లేదు!. జపాన్ ఓపెన్‌లో తొలి రౌండ్లోనే పరాజయం పాలైన సింధు.. టోక్యో నుంచి నిష్క్రమించింది. చైనా అమ్మాయి జాంగ్ యి మాన్‌తో పోరులో 12-21, 13-21తో వరుస గేముల్లోనే చేతులెత్తేసింది. 32 నిమిషాల్లోనే సింధును ఓడించిన చైనా షట్లర్ మహిళల సింగిల్స్‌లో ముందంజ వేసింది. కొత్త కోచ్ హఫీజ్ శిక్షణ సారథ్యంలో సింధు వరుసగా రెండో టోర్నీలో తొలి రౌండ్లోనే పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ విభాగం ఆల్ ఇండియన్స్ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 21-15, 12-21, 24-22తో ప్రియాన్షు రజావత్‌పై పైచేయి సాధించాడు. మెన్స్ డబుల్స్‌లో కొరియా ఓపెన్ విజేతలు సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్లో ఇండోనేషియా జోడీ లీయో రాలీ, డానియల్ మార్టిన్‌పై 21-16, 11-21, 21-13తో మూడు గేముల మ్యాచ్‌లో విజయం సాధించాడు.

రాజీవ్ శుక్లాకు హైదరాబాద్ బాధ్యతలు!



న్యూఢిల్లీ : 2023 వన్డే వరల్డ్‌కప్ నిర్వహణకు ఆతిథ్య బీసీసీఐ కీలక సబ్ కమిటీలను ఏర్పాటు చేసింది. సబ్ ఏర్పాటు బాధ్యతలను ఎస్‌జీఎం ఆఫీస్ బేరర్లకు అప్పగించగా.. ప్రపంచకప్ వేదికల పర్యవేక్షణ, స్టేడియాల ఆధునీకరణకు సబ్‌డీలకు సబ్ కమిటీలు నియమించారు. సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా హైదరాబాద్, బెంగళూర్‌లను పర్యవేక్షించనుండగా.. అహ్మదాబాద్, చెన్నైలను రోజర్ బిన్నీ.. ఢిల్లీ, ధర్మశాలను జై షా.. ముంబయి, కోల్‌కత, తిరువనంతపురంను దేవాజిత్ సైకియ.. పుణె, లక్నో, గువహటిలను ఆశీష్‌లు పర్యవేక్షించనున్నారు. స్టేడియాల్లో మౌళిక సదుపాయాల కల్పన సబ్‌డీలకు ఐపీఎల్ చైర్మెన్ అరుణ్ కుమార్, మాజీ కోశాధికారి అనిరుధ్ చౌదరి, ప్రభతేజ్ భాటియా, శంకర్ సహా ఐదుగురు ఆఫీస్ బేరర్లు ఉండనున్నారు. ప్రపంచకప్ మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వనున్న రాష్ట్ర క్రికెట్ సంఘాలతో నేడు న్యూఢిల్లీలో బీసీసీఐ ఆఫీస్ బేరర్లు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

హ్యాండ్‌బాల్ సంఘానికి క్రీడాశాఖ గుర్తింపు

- ఫలించిన జగన్‌మోహన్ రావు కృషి
- మంత్రి హరీశ్‌రావు సహా పలువురు అభినందన





న్యూఢిల్లీ : సీనియర్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్, తెలుగు వ్యక్తి అర్శనపల్లి జగన్‌మోహన్ రావు కృషి ఫలించింది. జాతీయ స్థాయిలో హ్యాండ్‌బాల్ పరిపాలనలో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. రెండు వర్గాలను ఏకం చేసిన జగన్‌మోహన్ రావు..భారత హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్‌ఏఐ) జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్) గుర్తింపు పొందేలా చేశారు. దిగ్విజయ్ సింగ్ చౌతాలా హెచ్‌ఏఐ అధ్యక్షుడిగా, తేజ్‌రాజ్ సింగ్ కోశాధికారిగా, జగన్‌మోహన్ రావు ప్రధాన కార్యదర్శిగా ఇటీవల జైపూర్‌లో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఆఫీస్ బేరర్ల ఎన్నిక అనంతరం తొలి అడుగుగా భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నుంచి హెచ్‌ఏఐకి గుర్తింపు లభించింది. తాజాగా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ భారత హ్యాండ్‌బాల్ సంఘాన్ని హ్యాండ్‌బాల్ ఆటకు సంబంధించి జాతీయ క్రీడా సమాఖ్యగా గుర్తింపు అందించింది. దీంతో అంతర్జాతీయ, ఆసియా హ్యాండ్‌బాల్ సమాఖ్యలతో పాటు ఐఓఏ, క్రీడాశాఖ గుర్తింపు హెచ్‌ఏఐ దక్కించుకుంది. ఈ మేరకు క్రీడాశాఖ కార్యదర్శి సుధీర్ కుమార్ గుప్తా అధికారికంగా వెల్లడించారు. క్రీడాశాఖ గుర్తింపుతో ఇక నుంచి హెచ్‌ఏఐ కేంద్ర నిధులు అందుకోనుంది. జాతీయ క్రీడల్లో సైతం హ్యాండ్‌బాల్‌ను చేర్చనున్నారు. ఆసియా క్రీడలు, ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ ఈవెంట్లకు హ్యాండ్‌బాల్ జట్లను ఎంపిక చేసే బాధ్యతలు భారత హ్యాండ్‌బాల్ సంఘం తీసుకుంటుంది. దేశంలో హ్యాండ్‌బాల్ కార్యక్రమాలు, పోటీలు, అభివృద్దిపై హెచ్‌ఏఐకి పూర్తి అధికారం లభించింది. 'క్రీడాశాఖ గుర్తింపు లభించటం సంతోషం. కఠిన పరిస్థితుల్లో అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు. ఐఓఏ, క్రీడాశాఖ మద్దతుతో దేశంలో హ్యాండ్‌బాల్‌కు సరికొత్త రూపు తీసుకొస్తాం. రానున్న ఆసియా క్రీడల్లో పతకమే లక్ష్యంగా పని చేస్తామని' జగన్‌మోహన్ రావు తెలిపారు.

భారత హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్‌ఏఐ) క్రీడాశాఖ గుర్తింపు దక్కించుకోవటంలో కీలక భూమిక పోషించిన జగన్‌మోహన్ రావును మంత్రులు హరీశ్ రావు, వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ కవిత, శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్, మాజీ క్రికెటర్ అంబటి రాయుడు సహా పలువురు సోషల్ మీడియా వేదికగా అభినందించారు.

నవచిత్రం

బ్రో.. నవ్విస్తుంది ఏడిపిస్తుంది

పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ మొదటిసారి కలిసి నటించిన చిత్రం 'బ్రో'. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై జీ స్టూడియోస్‌తో కలిసి టి.జి.విశ్వప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి పి.సముద్రఖని దర్శకత్వం వహించారు. త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించిన ఈ సినిమాకి తమన్ సంగీతం సమకూర్చారు. ఈనెల 28న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.



ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ మంగళవారం సాయంత్రం శిల్పకళావేదికలో ఘనంగా జరిగింది. అభిమానుల సమక్షంలో ఎంతో వైభవంగా జరిగిన ఈ ఈవెంట్‌లో వరుణ్ తేజ్, వైష్ణవ్ తేజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, 'ఇది చాలా సంపూర్ణమైన సినిమా. సముద్రఖని రాసిన కథకి త్రివిక్రమ్ సరికొత్త స్క్రీన్ ప్లే అందించారు. అంతేకాదు ఈ సినిమా సాయి తేజ్ చేస్తే బాగుంటుందని త్రివిక్రమే సూచించారు. అందుకే నాకు ఈ సినిమా చాలా ప్రత్యేకమైనది. తమన్‌తో ఇది నాకు హ్యాట్రిక్ ఫిల్మ్. ఈ సినిమాని వేగంగా పూర్తి చేయడానికి కారణం నిర్మాతలు విశ్వప్రసాద్, వివేక్‌ల ప్లానింగ్. ఈ సినిమా నవ్విస్తుంది, బాధపెడుతుంది. గుండెల నిండుగా నవ్వుకుంటాం, నవ్వుతూ ఏడుస్తాం. ఇలాంటి చక్కటి సినిమాని అందించిన సముద్రఖనికి కృతజ్ఞతలు' అని తెలిపారు.

అందుకే.. కథ కూడా వినలేదు

'నా కెరీర్ ప్రారంభంలో ఎవరైతే నాకు సపోర్ట్ చేశారో, ఆయనతో (పవన్‌కళ్యాణ్) కలిసి నటించే అరుదైన అవకాశం 'బ్రో'తో వచ్చింది. ఇది నన్ను నేను నిరూపించుకునే అవకాశమిది. అందుకే కథ కూడా వినకుండానే ఓకే చెప్పా. మాతృక కూడా చూడలేదు. ఇది నా కెరీర్‌కి ట్రిబ్యూట్ ఫిల్మ్. నేను గురువుగా భావించే మావయ్యతో కలిసి సినిమా చేయడం చాలా సంతోషాన్నిచ్చింది. మావయ్యతో సినిమా చేస్తున్నానని తెలిసి మీ గురుశిష్యులకు బాగా కుదిరింది అంటూ చిరంజీవి చాలా ఆనందపడ్డారు. ఈ సినిమాకి ఓకే చెప్పిన సమయానికి నాకు యాక్సిడెంట్ జరగలేదు. అది యాదృచ్ఛికంగా జరిగింది. టైమ్ విషయంలో మాత్రం ఈ చిత్రకథతో బాగా కనెక్ట్ అయ్యాను. ఎందుకంటే నేను కుటుంబంతో ఎక్కువ సమయం గడపటాన్ని ఇష్టపడతాను. ఈ సినిమా ఈ క్షణంలో బతకడం గురించి, మన కష్టం మనం పడితే అందుకు తగిన ప్రతిఫలం దక్కుతుందని చెబుతుంది. ఇక త్రివిక్రమ్ లాంటి గొప్ప టెక్నీషియన్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ రాసిన సినిమాలో నటించే అవకాశం రావడం అదృష్టం. ముఖ్యంగా సినిమా చివరిలో నాకు, కళ్యాణ్ మావయ్యకి మధ్య ఆయన రాసిన సంభాషణలు కట్టిపడేస్తాయి. తేలికైన పదాలే అయినా లోతైన భావం ఉంటుంది. ఈ సినిమా చూసిన తర్వాత ప్రతి ఒక్కరు తమన్ సంగీతం అద్భుతంగా ఉందని చెప్తారు. సముద్రఖని, థమన్ కలిసి మ్యాజిక్ చేశారు. రవితేజ, ప్రభాస్, తారక్, కళ్యాణ్ రామ్, మనోజ్ ఇలా అందరితోను, అలాగే చిరంజీవి మావయ్యతో కలిసి నటించడం కోసం ఎదురు చూస్తున్నా' అని సాయిధరమ్ తేజ్ మీడియాతో చెప్పారు.




సాయి ధరమ్ తేజ్

నిర్మాతల శ్రేయస్సు కోసం..

'దర్శకరత్న దాసరి బాటలో నిర్మాతగా, నిర్మాతల మండలిలో సభ్యుడిగా ఎదిగాను. నిర్మాతల సంక్షేమం కోసం రకరకాలుగా ఆదాయాన్ని సమకూర్చాను. నాలుగు రాష్ట్రాల చిత్ర పరిశ్రమలను కలిపి లీడ్ చేద్దామనుకుంటున్నాం. ఆయా ప్రభుత్వాల సహకారంతో నాలుగు రాష్ట్రాల పరిశ్రమలకు మంచి చేస్తాం' అని ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికల నేపథ్యాన్ని పురస్కరించుకుని నిర్మాత సి.కళ్యాణ్ అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నిర్మాతలకు తొలుత మెడిక్లెయిమ్ తీసుకొచ్చిందే నేను. నిర్మాతల మండలి ఆదాయానికి గిల్డ్ అనే గ్రూపు గండి కొట్టింది. గిల్డ్‌లోని 27 మంది సభ్యులు 1600 మంది నిర్మాతల రక్తం తాగుతున్నారు. గత నాలుగేళ్లలో ఫిల్మ్ ఛాంబర్ సర్వనాశనం అయ్యింది. నేను ఈసారి అధ్యక్షుడిగా పోటీ చేయడానికి బలమైన కారణం ఉంది. డిజిటల్ ఛార్జీల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటామని దిల్ రాజు, దామోదరప్రసాద్ చెబితే గతంలో పోటీ చేయకుండా విరమించుకున్నా. చిన్న సినిమాలను ఆపితే కృష్ణానగర్ అకలితో అలమటిస్తుంది. ఈ ఎన్నికల్లో దిల్ రాజు కేవలం ప్రత్యర్థి మాత్రమే. గుత్తాధిపత్యం, స్టూడియోల వ్యాపారం వల్ల పరిశ్రమ బీటలు వారుతోంది' అన్నారు.



టిక్కట్టే కొనకుండా..

'డీజే టిల్లు' సినిమాతో, అందులోని పాత్రతో యువతకు బాగా దగ్గరైన సిద్ధు మరొక థ్రిల్లింగ్ ఎంటర్‌టైనర్ 'టిల్లు స్క్వేర్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ ఈ సీక్వెల్‌ని నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'డీజే టిల్లు' కోసం రామ్ మిరియాల స్వరపరిచి, పాడిన 'టిల్లు అన్న డీజే పెడితే' పాట ఎంత పెద్ద హిట్ అయ్యిందో, ఆ పాట మాదిరిగానే ఈ సినిమా కోసం కూడా ఆయన సరికొత్త పాటను స్వరపరచి, ఆలపించారు. ఈ పాట బుధవారం సాయంత్రం విడుదలైంది. మాస్ బీట్స్‌తో కాలు కదిపేలా, హుషారుగా సాగిన 'టికేటే కొనకుండా' పాట కూడా పార్టీలు, పబ్‌ల అనే తేడా లేకుండా ప్రతి చోటా ప్లే అయ్యేలా, యువత అమితంగా ఇష్టపడేలా ఉంది. పబ్‌లో మరొక అమ్మాయిని కలిసి, ప్రేమించి మళ్ళీ అవే తప్పులు పునరావృతం చేయకుండా టిల్లును హెచ్చరిస్తున్నట్లుగా ఈ పాట సాగింది. సాంగ్ ప్రోమోలో నాయిక అనుపమ పరమేశ్వరన్ లుక్‌తోపాటు టిల్లుతో జరిపిన సంభాషణ వైరల్‌గా మారాయి.



సిద్ధు జొన్నలగడ్డ

రుద్రంకోట కుర్రాడి ప్రేమకథ

సీనియర్ నటి జయలలిత సమర్పకులుగా వ్యవహరిస్తూ ఓ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'రుద్రంకోట'. ఏఆర్‌కె విజువల్స్ పతాకంపై రాము కోన దర్శకత్వంలో అనిల్ ఆర్కా కండవల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిల్, విభీష, రియా హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురించి హీరో, నిర్మాత అనిల్ ఆర్క కండవల్లి మాట్లాడుతూ,'శ్మశాన వాటికలో పెరిగి పెద్దైన ఓ యువకుడి ప్రేమకథా చిత్రమిది. భద్రాచలం దగ్గర రుద్రంకోట అనే ఊరి నేపథ్యంలో కథ నడుస్తుంది. ఇప్పటి వరకు ఎవరూ చూపించని అంశాలను చూపిస్తున్నాం. సంగీత దర్శకులు కోటి అద్భుతమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిం చారు. ఇటీవల సెన్సార్ పూర్తయ్యింది. యు/ఏ సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు సినిమా బావుందంటూ సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. మా సినిమా నచ్చడంతో స్క్రీన్ మాక్స్ సంస్థ ఆగస్టులో గ్రాండ్‌గా విడుదల చేస్తోంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు మా సినిమా తప్పకుండా నచ్చుతుందనే నమ్మకంతో ఉన్నాం' అని తెలిపారు. ఆలేఖ్య, బాచి, రమ్య తదితరులు ఇందులో నటిస్తున్నారు.



అనిల్ కుమార్, విభీష

తారకాసుర 2 మొదలైంది

కన్నడలో ఘనవిజయం సాధించిన 'తారకాసుర' చిత్రాన్ని అదే పేరుతో తెలుగులో అనువాదం చేస్తూనే, ఆ చిత్రానికి సీక్వెల్‌గా స్ట్రెయిట్ తెలుగు చిత్రానికి శ్రీకారం చుట్టారు. శ్రీజ మూవీస్ పతాకంపై విజయ్ భాస్కర్ రెడ్డి పాల్యం దర్శకుడిగా, ముఖ్య పాత్రధారిగా, నిర్మాతగా 'తారకాసుర -2' చిత్రం పటాన్ చెరులోని జైపాల్ ముదిరాజ్ ఫామ్ హౌస్‌లో ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య పాత్రధారి విజయ్ భాస్కర్ రెడ్డిపై పటాన్ చెరు ఎమ్.ఎల్.ఎ.మహీపాల్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, జైపాల్ ముదిరాజ్ క్లాప్ కొట్టారు. పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ గౌరవ దర్శకత్వం వహించారు.

"తారకాసుర' సిరీస్‌తో విజయ్ భాస్కర్ రెడ్డి పేరు చిత్ర పరిశ్రమలో మారుమ్రోగాలని అతిథులు ఆకాంక్షించారు.

టెన్నిస్ ప్లేయర్‌గా, రియల్ ఎస్టేట్ వ్యాపారిగా, ఒక బ్యాంక్ వ్యవస్థాపకునిగా విజయ్ భాస్కర్ రెడ్డిని వరించిన విజయాలు సినిమా రంగంలోనూ వరించాలని అభిలషించారు.

కార్టూనిస్ట్ మల్లిక్, నటులు హేమ సుందర్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.



సర్‌ప్రైజ్ చేసే కాన్సెప్ట్

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. మైక్ మూవీస్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రానికి పూరీ జగన్నాథ్ శిష్యుడు డాక్టర్ ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించారు.

అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈనెల 29న రిలీజ్ చేయనుంది. ఈ సందర్భంగా హీరోయిన్ ప్రణవి మానుకొండ మీడియాతో మాట్లాడుతూ.

'చైల్డ్ ఆర్టిస్ట్‌గా మంచి ఆఫర్లు వచ్చాయి. సీరియల్స్‌లోనూ లీడ్‌గా చేశాను. కానీ నాకు సినిమాలంటే ఇష్టం. అందుకే ఇటు వైపు వచ్చాను. 'రొటీన్ లవ్ స్టోరీ', 'ఉయ్యాల జంపాల'తో మంచి గుర్తింపు వచ్చింది. కళ్యాణ్ రామ్ 'అమిగోస్'లోనూ నటించాను. నేను చేసిన రీల్స్ నుంచి మైక్ టీవీ నుంచి ఈ ఆఫర్ వచ్చింది. టైటిల్ మాదిరిగానే కథ కూడా కొత్తగానే ఉంటుంది. స్క్రిప్ట్ అంతా కూడా నవ్వుతూనే చదివాను. ఈ సినిమాలో ఎమోషన్స్ ఎక్కువగా ఉంటాయి. ఫన్ రైడ్‌తో పాటు ఎమోషన్స్‌ను బ్యాలెన్స్ చేశారు దర్శకుడు. నేను చేసిన మౌనిక పాత్ర కూడా కొత్తగా ఉంటుంది. రెగ్యులర్ హీరోయిన్ కారెక్టర్‌లా ఉండదు. సంజయ్‌తో ఎంతో ఫ్రీగా, నేచురల్‌గా నటించాను. రెగ్యులర్ కారెక్టర్లు కాకుండా.. నేను చేసే పాత్రలకు ప్రాధాన్యం ఉండాలని భావిస్తాను. క్యారెక్టర్ డిమాండ్ చేస్తే గ్లామర్, డీ గ్లామర్‌గానైనా నటిస్తాను. ప్రస్తుతం నా ఫోకస్ మొత్తం సినిమాలపైనే ఉంది' అని చెప్పారు.



ప్రణవి మానుకొండ



ఎల్బీనగర్ సుధీరుడికి

అభివృద్ధిలో లేరు ఎవరూ పోటీ



నవతెలంగాణ-హాయత్‌నగర్

హైదరాబాద్ మహానగరంలో ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అందుకు కారణం ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి అంటే అతిశయోక్తి కాదు. ఆయన తన నియోజకవర్గానికి ఎక్కువే నిధులు మంజూరు చేయించుకుని తన సత్తా ఏమిటో నిరూపించుకుంటున్నారు. రాష్ట్రంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యే లకు ముఖ్యమంత్రి తో ఉన్న సాన్నిహిత్యం తనకు ఉందని నిరూపించడానికి ఎల్బీనగర్ రూపురేఖలలే సాక్ష్యం గా చెప్పవచ్చును. ఎల్బీ నగర్ లో ఏర్పాటు చేసిన ఫ్లై ఓవర్లు,స్కై వేలు,అండర్ పాస్ లు,ప్రజలకు సేవలు అందించేందుకు గాను నాగోల్‌లో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటు, నాగోల్ లో హిందు,ముస్లిం, క్రిస్టియన్ లకు ఒకే చోట స్మశానం ఏర్పాటు, హాయత్ నగర్ వరకు మెట్రో రైలు పొడిగింపు, కామినేని వద్ద ఉన్న ఫ్లై ఓవర్ కింద సుమారు 40రకాల మొక్కలు ఉన్న కోట్ల రూపాయల ఆక్సిజన్ పార్క్ నిర్మాణం, ప్రతి డివిజన్ లో పార్కులు,కమ్యూనిటీ హాల్,వార్డ్ కార్యాలయాలు,బస్తీ దవాఖానాలు, స్మశాన వాటికలు ఏర్పాటు చేశారు. మన్సూరాబాద్ లో ఉన్న ఆటో నగర్ డంపింగ్ యార్డ్ తరలించి అట్టి ప్రాంతంలో పూలవనం ఏర్పాటు కు కృషి చేశారు. ప్రతీ డివిజన్ పరిధిలో 58,59 కింద లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ, దానికి తోడు పార్టీ మారాక ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఒప్పించి 118జీవో ను తెచ్చి ఏండ్ల తరబడి పెండింగ్ లో ఉన్న రిజిస్ట్రేషన్ కాని భూములకు ఊరట కల్పించారు. గడ్డి అన్నారం డివిజన్ లో పాత పండ్ల మార్కెట్‌లో 1000పడకల టిమ్స్ హాస్పిటల్ కు ముఖ్యమంత్రిచే శంకుస్థాపన చేయించారు. ఓపెన్ జిమ్ లు,చైల్డ్రెన్స్ పార్క్ లు,ప్రతి డివిజన్‌లో చెరువులకు వాకింగ్ ట్రాక్ లు, ప్రతీ డివిజన్‌కు సబ్ స్టేషన్లు ఏర్పాటు, నేరాల నియంత్రణ కోసం ఎమ్మెల్యే నిధుల నుంచి ప్రతి కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు, ఇలా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రతిపక్షాల నోర్లు మూయించి, వారికి కేవలం అభివృద్ధి తోనే సమాధానం చెబుతానని అంటారు సుధీర్‌రెడ్డి.


ప్రతి పక్షాలకు అభివృద్ధి సమాధానం : ఎమ్మెల్యే

ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలకు తన వంతు సేవ చేయడానికి తాను నిత్యం ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని,తనపై ప్రతి పక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా తాను మాత్రం కేవలం అభివృద్ధి తోనే వారికి సమాధానం చెబుతానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. అది తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దే నేర్చుకున్నానని తెలిపారు.









రాష్ట్రంలో బీఆర్ఎస్.. ఎల్బీనగర్‌లో సుధీరుడిదే విజయం

- **బీఆర్ఎస్ మన్సూరాబాద్ యువజన నాయకుడు జక్కిడి రఘు వీర్ రెడ్డి**



నవతెలంగాణ-హాయత్‌నగర్

రాష్ట్రంలో మరో సారి బీఆర్ఎస్, ఎల్బీనగర్‌లో సుధీరుడిది విజయం ఖాయం అని బీఆర్ఎస్ మన్సూరాబాద్ యువజన నాయకుడు జక్కిడి రఘు వీర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధీర్‌రెడ్డిపై ప్రతి పక్షాలు ఎన్ని విమర్శలు చేసినా ఆయన మాత్రం అభివృద్ధిలో పోటీ పడుకుంటూ ముందుకు వెళ్తున్నారన్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో ఆయన గెలుపును ఎవరూ ఆపలేరని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ మంత్రి కేటీఆర్ సహకారంతో ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ప్రతీ ఓటరు తప్పని సరిగా బీఆర్ఎస్‌కు ఓటు వేసి సుధీర్ రెడ్డిని గెలిపించుకుని మంత్రిగా చూడాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

కళకళ్లాడుతున్న గోదావరి బేసిన్ జలాశయాలు

- శ్రీరామసాగర్, నిజాంసాగర్‌కు పెరిగిన ప్రవాహం
- రైతన్నలకు వరంగా వర్షాలు
- ముమ్మరంగా వ్యవసాయ పనులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

రాష్ట్రంలో తాజాగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి బేసిన్ ప్రాజెక్టు పరిధిలోని జలాశయాలు కళకళ్లాడుతున్నాయి. నిండు కుండలా కనిపిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో, రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టుల్లోకి వరద నీరు ఎక్కువగా చేరుతున్నది. పరీవాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టులకూ వరద ప్రవాహాలు పెరిగాయి. శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు 1,21,008 ఇన్ ఫ్లో ఉండగా, 882 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 90.31 టీఎంసీలకు గాను,63.47 టీఎంసీలు నీళ్లు నిల్వఉన్నాయి. ఇప్పటికే నిండిన నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు 48,475 క్యూసెక్కులు, కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 22.440 క్యూసెక్కుల వరద వస్తున్నది. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకు ప్రస్తుతం 5.99 క్యూసెక్కుల వరద వస్తుండగా, 385 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతున్నది. జలాశయం పూర్తి స్థాయి సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 21.48 టీఎంసీలకు చేరుకుంది. మేడిగడ్డ వద్ద లక్ష్మీ బ్యారేజీకి 5,49,210 క్యూసెక్కుల వరద వస్తుండగా, 5.49 లక్షల క్యూసెక్కుల నీటిని 75 గేట్ల ద్వారా కిందకు వదులుతున్నారు. అదేవిధంగా మిడ్ మానేరు రిజర్వాయర్ లో 27.50 టీఎంసీల నీటి సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 15.72 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు రైతన్నలకు వరంగా మారాయి. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నది. ఈమేరకు బుధవారం సమాచార, పౌరసంబంధాల శాఖ ఒక ప్రకటన జారీచేసింది.

దోస్త్ మూడోవిడత సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 28

- వర్షాల నేపథ్యంలో ఉన్నత విద్యామండలి నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మూడో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువును ఈనెల 28 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, విద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల నేపథ్యంలో బుధ, గురువారం రెండురోజులపాటు అన్ని విద్యాసంస్థలకూ ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని పేర్కొన్నారు. దీంతో మొదటి, రెండు, మూడో విడతలో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసిన వారు కాలేజీల్లో రిపోర్టు చేసే గడువు కూడా ఈనెల 28 వరకు పొడిగించామని తెలిపారు. అదేరోజు నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

సంక్షేమానికి చిరునామా

- అన్ని వర్గాలకూ ఆర్థిక భరోసా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి చిరునామాగా నిలుస్తుందని సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ తెలిపారు. ఈ మేరకు బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2014లో ఆసరా పెన్షన్ లబ్దిదారుల సంఖ్య 28,47,855 మాత్రమేననీ, 2023 నాటికి ఈ సంఖ్యను 43,81,338కు తెలంగాణ ప్రభుత్వం పెంచిందని తెలిపారు. 2014లో ఆసరా కింద నెలకు ఇచ్చిన పెన్షన్ మొత్తం రూ.67.47 కోట్లు మాత్రమేననీ, ఇప్పుడు ఆ సొమ్ము నెలకు రూ.976.42 కోట్లుగా ఉందన్నారు. రాష్ట్రంలోని 5 లక్షల 11 వేల 656 మంది దివ్యాంగులకు నెలకు పెన్షన్ రూ.4016 లకు పెంచినందువల్ల లబ్ది పొందుతున్నారన్నారు. బీడీ కార్మికులు, ఫైలేరియా ప్రభావిత వ్యక్తులు, డయాలసిస్ బాధితులకు పెన్షన్లు అందచేస్తున్నట్టు తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ పొందే అర్హత వయస్సును 65 నుండి 57 సంవత్సరాలకు తగ్గించడంతో కొత్తగా 10 లక్షల మంది లబ్దిదారులు పెరిగారని వివరించారు. ఏ రాష్ట్రంలోనూ తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్నంత పెద్ద మొత్తంలో పెన్షన్లు ఇవ్వట్లేదనీ, ఇది ఆయా వర్గాల గౌరవ ప్రదమైన జీవనానికి నాంది పలుకుతుందని విశ్లేషించారు.

వెట్టిచాకిరి

సర్కార్ ఆర్డర్ లేకుండానే పనులు



- వేతనం ఊసేలేదు
- పట్టించుకోని రెవెన్యూశాఖ
- మంత్రులు, కలెక్టర్లను కలిసినా ఫలితం శూన్యం
- ఇదీ కంప్యూటర్ ఆపరేటర్ల దుస్థితి
- మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి :బాధితులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ శాఖల్లో పర్మినెంట్ ఉద్యోగిగానో..కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలోనో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పనిచేయాల్సి ఉంటుంది. కానీ రెవెన్యూశాఖలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఆ శాఖలో ఏలాంటి ఆర్డర్ లేకుండానే కంప్యూటర్ ఆపరేటర్లతో పనులు చేయిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011లో భూ రికార్డులను ఆన్‌లైన్ చేశారు. అప్పటి నుంచి ఈ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. రెవెన్యూశాఖ చేస్తున్న అన్ని పనులూ వీరి ద్వారానే కొనసాగున్నాయి. కానీ వీరికి వేతనం లేదు. ఉద్యోగ భద్రత లేదు. ఫలితంగా ఆయా ఉద్యోగుల కుటుంబాలు రోడ్డునపడ్డాయి. తమను ఆదుకోవాలని కోరుతూ మొరపెట్టుకోని మంత్రిలేడు...కలవని కలెక్టర్ లేరు. అయినా ఎక్కడేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. అయితే బుధవారం సచివాలయానికి వచ్చిన వారు తమ గోడును వెళ్లబోశారు. తమను కనీసం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగానైనా గుర్తించాలని వేడుకుంటున్నారు.

2011 నుంచి...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మ్యాన్యువల్‌గా భూ రికార్డులను ఆన్‌లైన్ చేశారు. అప్పటి నుంచి కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో 33జిల్లాలకు కలెక్టరేట్‌లు ఉన్నాయి. ఒక్కో కలెక్టరేట్‌కు ఐదుగురి చొప్పున 33జిల్లాలకు 165 మందిని ఆ కలెక్టర్లకు కేటాయించారు. 74 ఆర్‌డీఓ కార్యాలయాలకు ఒక్కో ఆర్‌డీఏకు ఇద్దరి చొప్పున 148 మందిని కేటాయించారు. 594 మండలాలకు ఒక్కొక్కరి చొప్పున 594 మందిని కేటాయించారు. వీరిలో 393 మందిని టీఎస్‌పీఎస్‌సీ ద్వారా రెగ్యులర్ టైపిస్టులుగా ప్రభుత్వం నియమించింది. 2006లో జీఓనెం.2618, 2011లో జీఓనెం.909 ద్వారా 302 మందిని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా నియమించింది. మిగిలిన 212 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు మాత్రం ఏలాంటి ఆర్డర్‌లేదు. కానీ రెవెన్యూ శాఖ వారితో రెగ్యులర్‌గా పనులు చేయిచుకుంటోంది. అయితే వీరిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులుగా నియమించుకోవడానికి అనుమతి కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీసీఎల్‌ఏ కమిషనర్ 2016లో లేఖ రాశారు. అప్పటి నుంచి ఈ ఫైల్‌లో ఏలాంటి కదలికలేదు.

పనులన్నీ వీళ్లకే

రెవెన్యూశాఖలో ఏ పని అయినా వీళ్లే చేయాలి. లేకపోతే అంతేసంగతులు. 12ఏండ్లుగా చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కంప్యూటర్ ఆపరేటర్ల శ్రమ ఎంతో ఉంది. వెబ్ ల్యాండ్, క్రాప్ బుకింగ్, జేఎల్‌ఆర్‌ఎంఎస్ పహణీలు, మీ-సేవా సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ప్రజావాణి, రేషన్‌కార్డుల జారీ, ఎన్నికల విధులు, సమగ్ర కుటుంబ సర్వే నివేదికలు, ధరణి, విపత్తుకు సంబంధించిన నివేదికలు, కోవిడ్-19లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ రిపోర్టులు, సాదాబైనమా నివేదికలు, ఇంటింటి సర్వేలు, కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అంశాల వంటి వంటి పనులు రెగ్యులర్‌గా చేస్తున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేసినా ఫలితంలేకుండాపోయింది.

గుర్తింపు కరువు

'పర్మినెంట్ చేయాలని అడగడంలేదు. వేతనాలు పెంచాలని కోరడంలేదు. ఉద్యోగ భద్రత కల్పించాలి. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగానైనా నియమించాలి' అంటూ కంప్యూటర్ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆపరేటర్లకు ఏలాంటి వేతనం లేదు. మీ-సేవా కేంద్రాలకిచ్చే బడ్జెట్ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. దీంతో రూ.10వేలు దాటడంలేదు. ఒక్కోసారి రూ.5వేలు కూడా రావడంలేదని కొంత మంది ఆపరేటర్లు కంటతడి పెట్టారు. నాలుగేండ్లుగా వేతనం కరువైంది. కనీసం గుర్తింపులేదని వాపోయారు.

మంత్రులను కలిసినా..

తమ సమస్యలను పరిష్కరించాలని, రోడ్డున పడ్డ తమ కుటుంబాలను ఆదుకోవాలని ఆపరేటర్లు గతంలో మంత్రులను కలిసి విన్నవించారు.వారు సీసీఎల్‌ఏనూ కలిశారు. అన్ని జిల్లాలకు సంబంధించిన కలెక్టర్లను కలిశారు. ఎక్కడికెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. కలెక్టర్లను కలిస్తే బడ్జెట్ లేదని సమాధానమిస్తున్నారు. విసిగివేసారిన వారు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయానికి వచ్చారు. సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్‌ను కలవడానికి వెళ్లారు. ఆయన బయటికెళ్తూ 'వీఆర్‌ఏ సమస్య పరిష్కారమయ్యాక చూద్దాంలే' అనుకుంటూ వెళ్లిపోవడం గమనార్హం.

చదువులకు పేదలు దూరం

నూతన విద్యా విధానంపై విద్యావేత్తల ఆందోళన

- వర్సిటీలు ప్రజా ఉద్యమాలతో మమేకం కావాలని పిలుపు



న్యూఢిల్లీ : నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ), యూనివర్సిటీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీయూఈటీ) కారణంగా అనేక మంది విద్యార్థులు విద్యకు దూరమవుతారని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పేదలు, బలహీన వర్గాల వారికి విద్య అందని ద్రాక్ష అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 'సంక్షోభంలో ఉన్నత విద్య' అనే అంశంపై జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో కేంద్ర విశ్వవిద్యాలయాల ఉపాధ్యాయుల సంఘాల సమాఖ్య (ఫెడ్‌క్యూటా) ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు వందలాది మంది విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూజీసీ మాజీ చైర్మెన్ సుఖ్‌దేవ్ థోరట్ ప్రసంగిస్తూ పేద విద్యార్థులు, విద్యార్థినులు, దళితులు, ఆదివాసీలు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు దూరమై పోతారని చెప్పారు.

ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మాజీ డీన్ అనితా రాంపాల్ సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ కేంద్రంలోని పెద్దల అధికార దర్పం కారణంగా ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు తమ స్వతంత్రతను కోల్పోతాయని అన్నారు. విద్యార్థుల అవసరాలు కేంద్ర పాలకులకు అర్థం కావని చెప్పారు. మధ్య తరగతి వారిని ఎలా బుట్టలో వేసుకోవాలో నూతన విద్యా విధానానికి తెలుసునని వ్యాఖ్యానించారు. సెకండరీ స్థాయిలో ప్రస్తుతం ఐదు కోర్సులు మాత్రమే ఉన్నాయని, నూతన విద్యా ప్రణాళికలో 16 కోర్సులను చేర్చారని అంటూ పలు రాష్ట్రాలలో జరిగిన బోర్డు పరీక్షలలో యాభై శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేకపోయారని తెలిపారు.

విద్యార్థుల సమ్మెను పరిష్కరించాలంటూ అధికారులకు లేఖ రాసిన పాపానికి సస్పెన్షన్‌కు గురైన దక్షిణాసియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రవి కుమార్ ప్రసంగిస్తూ విశ్వవిద్యాలయాలు బలహీనంగా మారాయని చెప్పారు. సమాజం కులం, మతం ప్రాతిపదికన వ్యవహరిస్తే విశ్వవిద్యాలయాలు కూడా అదే దారిలో నడుస్తాయని అన్నారు. ఫీజుల పెంపుదలను వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగడంతో జేఎన్‌యూపై దాడులు పెరిగాయని గుర్తు చేశారు. 'జామియా ఉపాధ్యాయ సంఘాన్ని సస్పెండ్ చేశారు. మమ్మల్ని కూడా సస్పెండ్ చేశారు. అయినప్పటికీ రెక్టార్లుగా పనిచేస్తున్న మా సహచరులు మౌనం వీడలేదు. విశ్వవిద్యాలయాలు తమ ప్రజాస్వామిక స్వభావాన్ని తిరిగి పొందాలంటే మేము ప్రజా ఉద్యమాలతో మమేకం కావాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. మణిపూర్ హింసను, దళితులపై జరుగుతున్న దాడులను యూనివర్సిటీలు ఖండించాలని, ఇందుకోసం అందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయాలు ప్రజలతో కలిసిపోవాలని అంటూ మెక్సికో ఆందోళనను ప్రస్తావించారు.

ఉమ్మడి ప్రవేశ పరీక్ష పాఠశాల విద్యకు హాని కలిగిస్తుందని, విద్యార్థులు తరగతులకు హాజరు కాకుండా ప్రవేశ పరీక్ష కోచింగ్‌పై దృష్టి సారిస్తారని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రవేశ పరీక్షలో ఎక్కువగా సీబీఎస్‌ఈ సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారని, ఇది రాష్ట్ర బోర్డుల విద్యార్థులను నిరుత్సాహపరుస్తుందని ఢిల్లీ యూనివర్సిటీ హిందీ ప్రొఫెసర్ అపూర్వానంద్ చెప్పారు. యూజీసీకి పూర్తి స్వతంత్రత లేదని ఆయన అన్నారు.

పనులు పరిగెత్తించండి

- అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై సీఎస్ శాంతి కుమారి సమీక్ష



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో అమలవుతున్న వివిధ అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. బుధవారంనాడామె డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బీ వెంకటేశం, కార్మిక శాఖ కమీషనర్ అహ్మద్ నదీమ్, పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, పశుసంవర్ధక శాఖ సంచాలకులు రామ్ చందర్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ,పౌర సరఫరాల శాఖ శాఖ కమీషనర్ అనీల్ కుమార్, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, జీఏడీ కార్యదర్శి శేషాద్రి తదితరులతో వారి శాఖల్లోని పనుల పురోగతిని సమీక్షించారు.

వర్షాలపై...

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, ఎస్పీలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ అంజనీ కుమార్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రజత్ కుమార్, సునీల్ శర్మ, విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న బస్సులో రూ.28 లక్షలు అపహరణ

- సీసీ పక్కీలో దోపిడీ
- వరుసగా ఒకే చోట మూడోసారి చోరీ

నవతెలంగాణ -నార్కట్‌పల్లి

ఆగి ఉన్న ప్రయివేటు బస్సులో నుంచి రూ.28లక్షలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన బుధవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపులాయిపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారి 65పై ఉన్న పూ.ఇత హోటల్ వద్ద జరిగింది. ఆ ప్రాంతంలో ఆగి ఉన్న బస్సుల్లో చోరీ జరగడం ఇది మూడోసారి. స్థానిక ఎస్‌ఐ సైదాబాబు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మైలావర్ధపల్లిలోని కృష్ణాపురం కాలనీలో నివాసముంటున్న పాండా సుశాంత్‌కుమార్ త్రిశక్తి ప్లాస్టిక్ ట్రేడింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలో తనకు వ్యాపారంలో రావాల్సిన డబ్బుల కోసం వెళ్లారు. రూ.28లక్షలు తీసుకొని, ఒక బ్యాగులో రూ.24లక్షలు, మరొక బ్యాగులో రూ.4 లక్షలతోపాటు బట్టలు పెట్టుకొని హైదరాబాద్‌కు బయల్దేరాడు. ఈ క్రమంలో ఒడిశాలోని బరంపూర్‌లో ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో మంగళవారం రాత్రి ఎక్కాడు. ఆ బస్సును నార్కట్‌పల్లి శివారులోని జాతీయ రహదారి 65పై పూజిత హోటల్ వద్ద టీ, టిఫిన్ కోసం డ్రైవర్ ఆపారు. బ్యాగులను బస్సులోనే ఉంచి టీ కోసం అందరితోపాటు సుశాంత్ కూడా హోటల్‌కు వెళ్లాడు. అతడు తిరిగి వచ్చి చూడగా బ్యాగులు కనిపించలేవు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగులు ఉన్న డబ్బును తీసుకుని పరారయ్యారు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.సీసీపక్కీలో పక్కా ప్లాన్ ప్రకారం దోపిడీ జరిగింది. హోటల్ వద్ద అప్పటికే కాచుకూర్చుంటున్న దుండగులు.. ఆగి ఉన్న బస్సుల నుంచి ప్రయాణికులు దిగి హోటల్లోకి వెళ్లగానే చోరీకి పాల్పడుతున్నారు. ప్రయాణికులు దిగే వరకు వేచి ఉండి వెంటనే బస్సులోకి వెళ్లి బ్యాగులను వెతకడం.. డబ్బులు ఉన్న బ్యాగులను తీసుకొని వెంటనే వేరే వాహనంలో పరారవుతున్నారు. జాతీయ రహదారి వెంట ఇప్పటికి ఇలాంటి ఘటనలు మూడు జరిగాయి. ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో జరిగిన రూ.28 లక్షల దోపిడీ ముందస్తు ప్లాన్ ప్రకారమే జరిగినట్టు పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. స్థానిక పోలీసులతోపాటు జిల్లా యంత్రాంగం అప్రమత్తమై నిందితుల కోసం గాలింపు మొదలు పెట్టారు. అంతరాష్ట్ర దొంగలు ఈ చోరీలకు పాల్పడుతున్నట్టు అనుమానం వ్యక్తమవుతోంది.

ఒకే చోట మూడోసారి..

హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై పూజిత హోటల్ వద్ద మూడు సంవత్సరాల్లో మూడోసారి చోరీ జరిగింది. గతంలో రెండుసార్లు 20 లక్షల రూపాయలు, 20 తులాల బంగారం ఆగి ఉన్న బస్సు నుంచి అపహరణకు గురయ్యాయి. అదే తరహాలో బుధవారం రూ.28 లక్షల చోరీ జరిగింది.

వర్షాలు...కరెంటుతో జాగ్రత్త

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు కరెంటు స్తంబాలు, వైర్లతో జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎన్పీడీసీఎల్) సీఎమ్‌డీ ఏ గోపాలరావు హెచ్చరించారు. ముఖ్యంగా పొలాల్లోకి వెళ్లే రైతులు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కరెంటుతో ప్రతి ఒక్కరు తప్పని సరిగా స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు. తడి చేతులతో ఇంట్లో విద్యుత్ పరికరాలు, తీగలను ముట్టుకోవద్దనీ, బట్టలు ఆరేసే దండెంలకు విద్యుత్ వైర్లు తాకకుండా చూసుకోవాలన్నారు. చిన్న పిల్లలు భవనాల పైకి వెళ్ళకుండా చూడాలని, విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని హెచ్చరించారు. గురైతే, ఆతృతతో ఆ వ్యక్తిని ముట్టుకోరాదనీ, కర్ర, ప్లాస్టిక్ వస్తువులతో ఆ వ్యక్తిని వేరు చెయ్యాలని చెప్పారు. సొంత రిపేర్లు చేయొద్దనీ, రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరికి వెళ్లొద్దనీ, స్టార్టర్ డబ్బాలు నీటిలో తడవకుండా చూసుకోవాలని తెలిపారు. ఇలలాంటి జాగ్రత్తలతో కరెంటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. విద్యుత్ పర్యవేక్షణ కోసం ఫోన్ నంబర్లు 9440811244, 9440811245, టోల్ ఫ్రీ నెంబరు. 1800 425 0028 కు లేదా 1912 కు ఫోన్ చేయాలని తెలిపారు. సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టి మాట్లాడకూడదనీ, 3 పిన్ ప్లగ్‌తో నాణ్యమైన చార్జర్లను వాడాలని సూచించారు. ఎవరైనా విద్యుద్ఘాతానికి

ఎవరి బలం ఎంత?

- ప్రభుత్వానికి అనుకూలం 356
- వ్యతిరేకం 153 • తటస్థం 28

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో గెలుపు పాలకపక్షానిదే అనే విషయం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం లోక్‌సభలో బలాబలాలను బట్టి ప్రభుత్వానికి మద్దతుగా 356 మంది, వ్యతిరేకంగా153 మంది ఉండగా 28 మంది తటస్థంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల బలాబలాలను పరిశీలిస్తే...

మోడీకి బాసటగా...

నరేంద్ర మోడీ ప్రభుత్వానికి లోక్‌సభలో 356 మంది సభ్యుల (స్పీకర్‌తో కలిపి) మద్దతు ఉంది. బీజేపీకి సొంతంగా 301 మంది సభ్యులు ఉన్నారు. భాగస్వామ్య పక్షాలైన శివసేన (షిండే)కు 13, రాష్ట్రీయ లోక్ జన్‌శక్తి పార్టీ (ఆర్‌ఎల్‌జేపీ)కి 5, అప్నాదళ్ సోనీలాల్ (ఏడీఎస్)కి ఇద్దరు సభ్యులు ఉండగా లోక్‌జనశక్తి పార్టీ (రామ్‌విలాస్), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్), ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ), నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ), నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్), నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ), సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కేఎం), మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్) పార్టీలకు ఒక్కో సభ్యుడు ఉన్నారు. స్వతంత్ర సభ్యులు సుమలత, నవనీత్ కౌర్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారు. ఎన్డీఏలో భాగస్వాములుగా లేనప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లోని అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ పార్టీలు అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగానే ఉన్నాయి. వైసీపీకి 22 మంది, టీడీపీకి ముగ్గురు ఎంపీలు ఉన్నారు.

విపక్ష కూటమిలో...

కొత్తగా 26 పార్టీలతో ఏర్పడిన ప్రతిపక్ష కూటమి 'ఇండియా'కు 142 మంది సభ్యుల బలం ఉంది. కాంగ్రెస్‌కు 50 మంది ఎంపీలు ఉన్నారు. డీఎంకేకు 24, టీఎంసీకి 23, జేడీయూకి 16, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే)కు 6, ఎన్సీపీ (శరద్ పవార్)కి 4, సీపీఐ (ఎం)కు 3, ఎస్పీకి 3, ఐయూఎంఎల్‌కి 3, జేకేఎన్‌సీకి 3, సీపీఐకి ఇద్దరు సభ్యులు ఉండగా ఆప్, జేఎంఎం, ఆర్‌ఎస్పీ, వీసీకే, కేరళ కాంగ్రెస్ (మణి) పార్టీలకు ఒక్కో ఎంపీ ఉన్నారు. అయితే కూటమిలో లేని బీఆర్‌ఎస్ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చింది. ఆ పార్టీకి తొమ్మిది మంది ఎంపీలు ఉన్నారు. అలాగే ఎంఐఎంకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు.

తటస్థంగా 28 మంది...

తీర్మానంపై తటస్థంగా ఉన్న పార్టీలకు 28 మంది ఎంపీలు ఉన్నారు. బీజేడీలో 12 మంది, బీఎస్పీలో 9, శిరోమణి అకాలీ దళ్ (సాద్)లో ఇద్దరు సభ్యులు ఉండగా జేడీఎస్, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్‌ఎల్పీ), ఆల్ ఇండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎఐయూడీఎఫ్), శిరోమణి అకాలీదళ్ (అమృత్‌సర్) పార్టీలకు చెందిన ఒక్కో సభ్యుడు, స్వతంత్ర అభ్యర్థి హీరా శరణ్య తటస్థంగా ఉన్నారు.

ఐదు స్థానాలు ఖాళీ

లోక్‌సభలో ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అందులో ఇటీవల అనర్హత వేటు పడిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్థానం కూడా ఒకటి. ఘాజీపూర్, చంద్రాపూర్, పూణే, అంబాలా, వయనాడ్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

బజాజ్ ఆటోలో ఎల్ఐసీ వాటాల విక్రయం

ఓపెన్ మార్కెట్‌లో 2% ఈక్విటీల అమ్మకం



ముంబయి : దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఓపెన్ మార్కెట్‌లో బజాజ్ ఆటోలో రెండు శాతం వాటాలను విక్రయించింది. బజాజ్ ఆటో లిమిటెడ్‌లోని తమ 147,12,999 షేర్ల నుంచి 89,77,945 ఈక్విటీ షేర్లకు తగ్గించుకున్నట్టు తెలిపింది. దీంతో పెయిడ్ అప్ కాపిటల్‌లోని వాటాలు 5.2 శాతం నుంచి 3.17 శాతానికి తగ్గాయని ఎల్ఐసీ రెగ్యూలేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ షేర్ ఒక్కంటిని సగటున రూ.4,772.18కు విక్రయించింది. 2022 నవంబర్ 16 నుంచి 2023 జులై 25 మధ్య కాలంలో ఓపెన్ మార్కెట్‌లో షేర్లను అమ్మేసింది. దీంతో 5.2 శాతం నుంచి 3.17 శాతానికి తగ్గడంతో దాదాపు 2.07 శాతం వాటాలను విక్రయించినట్లయ్యింది. బజాజ్ ఆటో ద్విచక్ర, త్రిచక్ర వాహనాల తయారీలో ఉంది. దాదాపుగా 79 దేశాలకు ఎగుమతులు చేస్తోంది. ఇంతక్రితం మేలో హెచ్‌పీసీఎల్‌లో ఎల్ఐసీ తన వాటాలను 4.901 శాతం నుంచి 5,013 శాతానికి పెంచుకుంది. గడిచిన జూన్ మాసంలో ఎల్ఐసీ నూతన ప్రీమియం వ్యాపారం వసూళ్లు 21 శాతం పెరిగి రూ.24,970.82 కోట్లుగా నమోదయ్యింది. ఇదే సమయంలో ప్రయివేటు బీమా కంపెనీల వ్యాపారం 13 శాతం పెరిగి రూ.11,990.94 కోట్లుగా చోటు చేసుకుంది. బుధవారం బీఎస్ఈలో ఎల్ఐసీ షేర్ విలువ 0.84 శాతం పెరిగి రూ.628.50 వద్ద ముగిసింది.

స్విగ్గీ, హెచ్‌డీఎఫ్‌సీ నుంచి కోబ్రాండెడ్ క్రెడిట్ కార్డ్



న్యూఢిల్లీ : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీలు సంయుక్తంగా నూతన కో- బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్‌ను ఆవిష్కరించాయి. మాస్టర్ కార్డ్ పేమెంట్ నెట్‌వర్క్‌పై పని చేసే ఈ కార్డ్‌పై స్విగ్గీ ఫుడ్, గ్రాసరీ డెలివరీలపై 10 శాతం క్యాష్‌బ్యాక్ అందిస్తున్నట్లు తెలిపాయి. ఇతర రివార్డ్‌లు, ప్రయోజనాలు కల్పించనున్నట్లు పేర్కొన్నాయి. రవాణ అగ్రిగేటర్లు, ఇ-కామర్స్ వేదికలపై 5 శాతం క్యాష్ బ్యాక్ ఇస్తోన్నట్లు తెలిపాయి. ఇతర కొనుగోళ్లపై 1 శాతం క్యాష్‌బ్యాక్ కల్పిస్తోన్నాయి. ఆ మొత్తాలు స్విగ్గీ మనీలో జమ అవుతాయి.

బిజినెస్

సామ్‌సంగ్ ఐదో తరం ఫోల్డబుల్ ఫోన్ల విడుదల

సియోల్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ తన ఐదో తరం గెలాక్సీ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లు జడ్‌ఫ్లిప్ 5 పేరుతో విడుదల చేసింది. ఇవి సొగసైన, కాంపాక్ట్ డిజైన్‌లు, లెక్కలేనన్ని కస్టమైజేషన్ ఎంపికలు, శక్తివంతమైన పనితీరుతో ప్రతి వినియోగదారునికి ప్రత్యేక అనుభవాలను అందిస్తాయని ఆ సంస్థ పేర్కొంది. సృజనాత్మక కోణాల నుంచి ఫోటోలను తీసేందుకు ఫ్లెక్స్ కామ్ వంటి అసాధారణ కెమెరా సామర్థ్యాలను కూడా అన్‌లాక్ చేస్తాయని పేర్కొంది. డ్యామేజ్ ప్రొటెక్షన్ కోసం గొరిల్లా గ్లాస్ విక్టస్ 2తో మరింత మన్నికగా ఉండేలా పలు జాగ్రత్తలు తీసుకుని తయారు చేసినట్లు పేర్కొంది.

ఎంఎస్ఎంఇలకు అన్‌సెక్యూర్డ్ రుణాలు

గోద్రేజ్ క్యాపిటల్ వెల్లడి

హైదరాబాద్ : గోద్రెజ్ గ్రూప్ ఆర్థిక సేవల విభాగం అయిన గోద్రెజ్ క్యాపిటల్ కొత్తగా ఎంఎస్ఎంఈల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన అన్‌సెక్యూర్డ్ (తనఖా రహిత) బిజినెస్ లోన్‌లను అందించనున్నట్లు ప్రకటించింది. ఈ రంగంలోని వ్యాపారాలు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తిస్తూ, గోద్రెజ్ క్యాపిటల్ వినూత్నమైన, సౌకర్యవంతమైన రీపేమెంట్ అవకాశాలతో వారి అవసరాలను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. పూర్తి డిజిటలైజ్డ్ ప్రాసెస్, వేగవంతంగా మంజూరు చేయటం, రుణాలను అందించటం, 60 నెలల వరకు చెల్లించే అవకాశం, సకాలంలో తిరిగి చెల్లింపులపై పరిశ్రమలో మొట్ట మొదటి రివార్డ్ ప్రోగ్రామ్‌తో సహా అనేక ఇతర ప్రయోజనాలను కూడా అందిస్తున్నట్లు పేర్కొంది. తొలుత 31 నగరాల్లో ఈ సేవలు అందించనున్నామని.. అందులో విజయవాడ, రంగారెడ్డి, విశాఖపట్నం, హైదరాబాద్ ప్రాంతాలు ఉన్నాయని తెలిపింది.

శ్రీరామ్ ప్రోటీన్స్‌కు భారీ ఎగుమతి ఆర్డర్

హైదరాబాద్ : కాటన్ సీడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలోని శ్రీరామ్ ప్రోటీన్స్ లిమిటెడ్‌కు 63,277 మెట్రిక్ టన్నుల పత్తికి ఎగమతి ఆర్డర్ దక్కినట్టు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలపింది. ఈ ఆర్డర్ నుండి కంపెనీకి రూ.50 నుండి 60 కోట్ల ఆదాయం రానుందని తెలిపింది. చైనాలోని షాంఘైకి 63277.20 మెట్రిక్ టన్నుల 100 శాతం కాటన్ నూలు ఎన్ఈసీసీహెచ్ 32ను ఎగుమతి చేయడానికి ఆర్డర్‌ను పొందినట్లు ప్రకటించింది. దీని ఫలితంగా వార్షిక లాభాల్లో 6 శాతం పెరుగొచ్చని అంచనా వేసింది.

డాక్టర్ రెడ్డీస్ లాభాల్లో 18% వృద్ధి

హైదరాబాద్ : ప్రముఖ ఔషద ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ 18 శాతం వృద్ధితో రూ.1,402.5 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,187.6 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.1,221 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ1లో 149 శాతం పెరిగి రూ.1,763.3 కోట్ల రెవెన్యూ నమోదయ్యింది.

వెల్‌స్పన్ కొత్త 'లోగో' ఆవిష్కరణ

న్యూఢిల్లీ : మౌలికవసతులు, వస్త్రాలు, పైపులు తదితర రంగాల్లో ఉన్న వెల్‌స్పన్ కంపెనీ నూతన బ్రాండింగ్‌లో భాగంగా లోగోను మార్చుకున్నట్లు ప్రకటించింది. ఈ నూతన బ్రాండ్ గుర్తింపు అనేది తదుపరి స్థాయి అవకాశాలు,విలువ,అనుభవాలను అందించడానికి దోహదం చేయనుందని పేర్కొంది.'ది ఎక్స్‌పోనెంట్' అని నామకరణం చేయబడిన కొత్త చిహ్నం చరిత్ర, భవిష్యత్తు రెండింటినీ సూచించడానికి ఆధునికీకరించిన వర్డ్‌మార్క్ చివరిలో పైకి ఎత్తినట్టుగా రూపొందించబడిందని తెలిపింది.

కార్ రుణాలపై బీఓబీ స్థిర వడ్డీ రేటు

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కార్లపై ఇచ్చే రుణాలపై స్థిర వడ్డీ రేటును ప్రవేశపెట్టినట్లు ప్రకటించింది. రుణగ్రహీతలకు కార్ లోన్‌లపై స్థిరమైన లేదా ఫ్లోటింగ్ వడ్డీ రేటు మధ్య ఎంపిక చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోన్నట్లు పేర్కొంది.



మణిపూర్ మారణకాండకు బాధ్యులెవరు?



బి. వీరభద్రం

భారతదేశంలోని మణిపూర్ రాష్ట్రంలో మైతేయిలు, కూకీలు అనే రెండు జాతుల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతోంది. రాష్ట్ర జనాభా పరంగా మైతేయిల జనాభానే ఎక్కువ, ఆ రాష్ట్ర శాసనసభలో 60సీట్లు ఉంటే 41సీట్లలో మైతేయిల ప్రాతినిధ్యం ఉంటుంది. మైతేయిలలో అత్యధిక భాగం హిందువులు, కొంత వరకు ముస్లింలు కూడా ఉన్నారు. మైతేయిలు షెడ్యూల్ కులాల్లో, ఓబీసీ కులాల్లో ఉండి రాష్ట్రంలో మెజారిటీ వర్గంగా ఉన్నారు. వీళ్ళు ఇంఫాల్ వంటి పట్టణాల్లో, కొండ లోయ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. కూకీలు, నాగాలు కొండపై నివాసం ఉండే గిరిజనజాతులు. జనాభాలో మెజారిటీ మైతేయిలే అయినా, రాష్ట్రంలో అత్యధిక భూభాగం మాత్రం కుకీలు, నాగాల చేతుల్లోనే ఉంది. రాష్ట్రంలో కూకీలు నివాసం ఉండే ప్రాంతాల్లో ఆర్టికల్ 371(సి) అమల్లో ఉంటుంది, గిరిజనుల భూములను కొనడానికి కానీ అమ్మడానికి కానీ అధికారాలుండవు. మైతేయిలు అక్కడి గిరిజనుల భూములపై ఉన్న ఆంక్షలు ఎత్తివేసి, భూముల అమ్మకం, కొనుగోలుకు స్వేచ్ఛా మార్కెట్ కోసం యత్నిస్తూనే, తమనూ గిరిజన తెగగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. కూకీలు చట్టసభల్లో తమ ప్రాతినిధ్యం పెంచాలని, ఎక్కువ శాసనసభా స్థానాలు తమకు కేటాయించాలని, జాతి స్వయం ప్రతిపత్తిని కాపాడాలని కోరుతున్నారు. ఈ రెండు అంశాల్లో జాతుల మధ్య వైరుధ్యమే నేటి మణిపూర్ మారణకాండకు ప్రధాన కారణం. దీనిని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని బిరేన్ సింగ్ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. అక్కడి గిరిజనుల భూములను బడా బహుళజాతి సంస్థలకు కట్టబెట్టేందుకు అక్కడి బీజేపీ నేతృత్వంలోని బిరేన్‌సింగ్ ప్రభుత్వం మైతేయిలను కూకీలపై ఉసిగొల్పుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

77రోజుల వ్యవధిలో 150మంది ప్రాణాలు కోల్పోయారు, 400మంది గాయాలపాలయ్యారు, 60వేల మంది నిరాశ్రయులయ్యారు. మణిపూర్ రాష్ట్రంలో కాంగ్ పోకి జిల్లాలో ఇద్దరు కూకీ-జో అనే జాతుల మహిళలను వివస్త్రలను చేసి, రేప్ చేసి, తండ్రి తమ్ముడిని చంపేసిన ఘటన భారత సమాజాన్ని తలదించుకునేలా చేసింది. ఘటన జరిగి రెండు నెలలు గడుస్తున్నా కేసు నమోదు చేయడంలో అలసత్వం వహిస్తున్నారు. ఇంత జరిగినా దేశప్రధాని, హెూంమంత్రి నోరు మెదపడం లేదు. మన పార్లమెంటులో ఈ అంశంపై చర్చే లేదు, యూరప్ దేశ పార్లమెంటులో మణిపూర్ అల్లర్లపై శాంతి, భద్రతలు గూర్చి చేసిన తీర్మానం ఆ దేశానికున్న కనీస స్పృహ మనకు లేకుండాపోయింది. శాంతి భద్రతలు అదుపు చేసేందుకు అనే పేరుతో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. జాతీయ మహిళా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసినా కనీసం స్పందించడం లేదు. శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రజాస్వామ్యం అన్నదే లేదు. అత్యున్నత న్యాయస్థానం కలగజేసుకున్నా పాలకుల్లో కనీస చలనం లేదు. పైగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి అనడం మరింత విస్తుపోయేలా చేసింది. తమ స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి ఇరు జాతుల మధ్య వైరుధ్యాలను పరిష్కరించాలి, గిరిజనుల హక్కులను కాపాడాలి. రాష్ట్రంలో శాంతి భద్రతలను నెలకొల్పాలి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మెజారిటీ వర్గ ప్రజల ప్రతినిధా లేక మొత్తం రాష్ట్ర ప్రజల ప్రతినిధా తేల్చుకోవాలి, తన పదవికి రాజీనామా చేయాలి. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలే ఈ అల్లర్లకు బాధ్యత వహించాలి. బాధితులకు రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలి.

ఉమ్మడి పౌరస్మృతి కన్నా పాలనాస్మృతి అవసరమెక్కువ!

ఎన్నికల వేటలో ప్రజానీకాన్ని విభజించడానికి, ప్రజల మనసుల్లో ద్వేష కుంపటిని రాజేయడానికి, కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిస్తున్నవారు వేసిన దుర్మార్గపు ఎత్తుగడ యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) ప్రతిపాదన. ఎదుటివాడి ముక్కులో మాత్రమే మలినముందని చెప్పే ప్రయత్నమిది. ఇస్లాంపై బురదజల్లి లౌకికత్వాన్ని సమర్థించే పార్టీలను ఒంటరిజేసే కుటిలత్వమిది. యూనిఫామ్ సివిల్ కోడ్‌కు సంబంధించిన డ్రాఫ్ట్, అనగా "సదరు సివిల్ కోడ్ పరిధిలోకి ఏయేఅంశాలు వస్తవి, వాటిపైన ఏ రకమైన మార్పులు, చేర్పులు వగైరా ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించబోతున్నది" అనే అంశాలు కలిగిన సమగ్ర డాక్యుమెంట్, తయారు చేయకుండానే యూనిఫాం సివిల్ కోడ్ పైన సాధారణ ప్రజానీకం నుండి లా కమిషన్ అభిప్రాయాన్ని సేకరించడానికి ప్రయత్నం చేస్తున్నది. ఈ ప్రయత్నాలు కేంద్రం చిత్తశుద్ధి లేమి, కేవలం భావోద్వేగాన్ని రెచ్చగొట్టడం కోసమే జరుగుతున్న ప్రయత్నమని మనకు స్పష్టమవుతున్నది. న్యాయ సమ్మతమైన, ఆచార సాంప్రదాయాలకు సంబంధించిన సున్నితత్వపు అంశాల పైన న్యాయశాఖ, కేంద్ర ప్రభుత్వం ఏ రకమైన విధానాలు రూపొందించకుండా, యూసీసీ లేకపోవడం వల్ల జరుగుతున్న నష్టాలను తెలుపకుండా, నూతన ప్రతిపాదనల ఫలితాలను వివరించకుండా సామాన్య ప్రజానీకం నుండి అభిప్రాయాన్ని సేకరించడం రాజ్యాంగబద్ధ పాలన కాదు. ఈ అసంబద్ధ ప్రతిపాదనలను వ్యతిరేకించే వారిని తప్పుగా చిత్రీకరించడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నమే ఇది. దేశ పరిపాలనను ప్రభావితం చేసేవి "కామన్ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్" కామన్ సివిల్ కోడ్ కాదు. పౌరస్మృతికి సంబంధించినవి ఏవైనా సరే మితిమీరిన వివాదాస్పదమైనప్పుడు నేరపూరిత చట్టాల పరిధిలోకి వస్తాయి. కుల మత ప్రాంత వ్యత్యాసం లేకుండా క్రిమినల్ ప్రొసీజర్ దేశమంతా ఒకే విధంగా అమలు జరుగుతున్నది. ఉమ్మడి పౌరస్మృతి లేనంత మాత్రాన జరిగిన నష్టాలేమీ లేవు. దీనిని తీసుకురావడం చేత ఫలానా వాళ్ళని కట్టడి చేయొచ్చు అన్న భ్రమలు కల్పింపజూస్తున్నారు. ట్రిపుల్ తలాక్ చట్టాన్ని తెచ్చారు. ఫలితమేమంటే మనోవర్తి కూడా చెల్లించే అవకాశం లేకుండా సదరు దోషి జైలుపాలవుతున్నాడు. ఇదా బాధితురాలు కోరుకునేది? "ట్రిపుల్ తలాక్ చెల్లదు, విడాకులకోసం కోర్టును సంప్రదించి, పరిహారం చెల్లించి, ఎవరి దారిన వారు నడవండి" అనే చట్టం తేవాల్సిందిపోయి, దాన్ని నేరపూరితం జేస్తే కుటుంబమంతా రోడ్డున పడుతుంది. ట్రిపుల్ తలాక్ చెప్పిన ముస్లిం నేరస్తుడైనప్పుడు, విడాకుల నోటీస్ పంపించిన హిందువు నేరస్తుడు కాడా? ఈయనకి మాత్రం రాచమర్యాదలతో విడాకులు మంజూరు చేస్తారా!

వివాహం, విడాకులు, పిల్లల సంరక్షణ, వారసత్వపు హక్కు వంటివి ప్రధాన అంశాలు యూసీసీలో భాగంగా భావించబడుతున్నవి. అయితే వివాహాలు సంప్రదాయాలను సివిల్ చట్టాలే కాదు క్రిమినల్ చట్టాలు కూడా ఇప్పటివరకు శాసించలేకపోయినవి. వరకట్నం నిషేధం కాని జరుగుతున్నది ఏమిటి? జరిగిన అఘాయిత్యాల్లో నమోదు కాబడుతున్నవి కూడా చాలా తక్కువ. దేశమంతా కుల, మత రహిత కుటుంబ సంబంధాలను - వివాహాలు, వ్యవహారాల అంశాలలో - బలవంతంగా అమలుపరచడం సాధ్యపడదు. అన్ని మతాల్లోనూ గుడిలోకి ప్రవేశానికి, పూజకి పరిమితులున్నవి. వీటన్నిటిని కామన్ సివిల్ కోడ్ క్రిందకి తీసుకురాగలమా? పిల్లల సంరక్షణ, వృద్ధుల సంరక్షణ, ఆస్తిపాస్తుల పంపకాలు మొదలగునవన్నీ పౌరచట్టాల పరిధిలోనే ఉన్నప్పటికీ వివాదాస్పద మైనప్పుడు కోర్టులు ఎలాగూ పరిష్కరిస్తున్నాయి. విడాకుల అనంతరం మనోవర్తికి సంబంధించి ముస్లిం పర్సనల్ లా బోర్డు విభేదించినప్పటికీ 1985లోని షాబానో కేసులో అప్పటి ప్రభుత్వం సుప్రీంకోర్టు ప్రోగ్రెసివ్‌గా బాధితురాలికి అనుకూలంగా తీర్పును ఇవ్వడం జరిగింది. కామన్ సివిల్ కోడ్ చట్టాల ద్వారా మాత్రమే సాధ్యపడదు. దీనికి అంతిమ పరిష్కారం



సామాజిక ఎదుగుదలలోనే ఉన్నది. ఒక వేళ ఈ యూసీసీ వ్యక్తిగత ఆచారాలను కట్టడి చేసేలా రూపొందిస్తే మతం పేరుమీద చలామణిలో ఉన్న అనేక సంస్థలు భావోద్వేగాలను రెచ్చగొట్టి అనిశ్చితికి కారణ మవుతాయి. శబరిమల ఆలయంలోకి అనుమతినివ్వాలని కోరిన వారికి అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునిస్తే సదరు తీర్పును సాక్షాత్తూ కేంద్ర మంత్రులే ధిక్కరించారు. ఇస్లాం మతాచారం ప్రకారం మసీదుల్లోకి మహిళలకి అనుమతి లేదు, కొన్ని హిందూ దేవాలయాల గర్భగుడుల్లోకి కొందరికే అనుమతి ఉన్నది. బహుభార్యత్వం చెల్లదు, కాని, ఫిర్యాదు చేయబడినప్పుడే అది నేరం. ఆస్తిపాస్తుల పంపకాల్లో వివాదాలేర్పడినప్పుడు కోర్టులు సమానతీర్పులు ఇవ్వాల్సి వస్తుంది. వీటన్నింటినీ యూసీసీ పరిష్కరించగలదా!

ఒక రిపోర్టు ప్రకారం 1971 నాటికి మొత్తం బహుభార్యత్వపు కేసుల్లో ముస్లింలకి సంబందించినవి కేవలం 5.79శాతం, ఎక్కువ శాతం అదివాసీలు, జైనులు మొదలగు వారే ఉన్నారు. ఆ తరువాతి జనాభా లెక్కల్లో ఈ గణాంకాల నమోదుకు 'కాలం' (ప్రస్తావన) తీసేశారు. మహిళా హక్కులకు పెద్దపీట వేయడానికి స్వతంత్ర భారత మొదటి న్యాయశాఖ మంత్రి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లును ఆనాటి మితవాద శక్తులు వ్యతిరేకించడమే కాదు, శబరిమల అంశంలో సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించిన బీజేపీకి ఉమ్మడి పౌరస్మృతిని గురించి మాట్లాడే హక్కు లేదు. దేశంలో 400మంది పైన పార్లమెంటు సభ్యులు, 1000మంది దాకా శాసనసభ్యులు గెలిగిన బీజేపీలో ఒక్క ప్రజాప్రతినిధి కూడా 20కోట్ల ప్రజానీకి సంబంధించిన ఒక ముస్లిం లేడు. ఒక వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తూ అన్ని వర్గాలకు సంబంధించిన చట్టాలను రూపొందిస్తామనడం హాస్యాస్పదమవుతుంది. నిజానికి ఈ దేశంలో ఉమ్మడి పౌరస్మృతి కన్నా ముందు, ఉమ్మడి పాలనాస్మృతి అవసరం ఎక్కువగా కనిపిస్తున్నది. వివాదాలకు కారణమైన 370ఆర్టికల్ రామజన్మభూమి వంటి వాటిపై నిర్ణయం తీసుకున్న కేంద్రం మహిళలకు 33శాతం రిజర్వేషన్లపై ఎందుకు కదలడం లేదు. అంతేకాకుండా నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను పెంచి పోషిస్తున్నప్పుడు అదే ప్రాతిపదికన ప్రజాప్రతినిధుల ఎన్నిక ఎందుకు ఉండకూడదు అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. కేవలం ధన వంతులకు నెలవులుగా మారిన చట్టసభల్లో వ్యక్తుల సంపద ప్రాతిపదికన కూడా సీట్లు ఎందుకు కేటాయించ కూడదన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతుంది. అంచేత ఎదుటివారిపై ఎగదోసేముందు మన ముక్కులో ఏముందో వేలు పెట్టుకొని చూసుకోవడం మంచిది.

అయితే వ్యక్తిగత, సాంప్రదాయ స్వేచ్ఛకు భంగం కలుగకుండా ఉమ్మడి స్మృతిని పాటించమని చెప్పడం కచ్చితంగా ఆహ్వానించదగినదే. అయితే ఇందు లో కులాలకు, మతాలకు లేదా ప్రాంతాలకు ప్రత్యేకమైన మిన హాయింపులేవి ఇవ్వని నిష్పక్షపాతం ఉండాలి. ఉమ్మడి పౌరస్మృతికి భంగం కలిగినప్పుడు వర్తించే క్రిమినల్ చట్టాల ప్రతిపాదన కూడా అందులో భాగమై ఉండాలి. ఇలాంటి మరింత విశాల దృక్పథంతో ఉమ్మడి పౌరస్మృతికి సంబం ధించిన డ్రాఫ్ట్ సిద్ధం చేసిన తర్వాత మాత్రమే దానిని ప్రజాబహుళ్యంలో చర్చకు పెట్టాలి. వన్నులు, పంపకాల అంశంలో ప్రజల అభిప్రాయాలను సేకరించని ప్రభుత్వం ఈ సున్నిత అంశాన్ని ప్రస్తావించడంలో అంతర్లీన అంశం లేదని అనుకోలేం.

-జి.సునితారాణి, 9440543563



టి. వెంకట్ కౌశిక్
7601061383

నగ్నమైన సమాజం..!

నేను ఈ దేశపు సార్వభౌమాధికారాన్నే ప్రశ్నిద్దాం అనుకుంటున్నాను. ఎందుకంటే దేశంలో పరిణామాలు చూస్తే ఆందోళన కలుగుతోంది. ప్రత్యేకంగా మణిపూర్‌లో తెగల ఘర్షణ ఇప్పటికే ఎంతోమందిని బలిగొంది. మహిళల్ని వివస్త్రలను చేసి ఊరిగేంచి లైంగికదాడి చేసి మరీ హత్యలు చేస్తున్నారు. ఎందుకింత దారుణాలకు తెగబడుతున్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికార బీజేపీ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు? ఇలాంటి అనేక విషయాలకు కారణాలు వెతికితే అసలు దోషి కేంద్రం. మతం మాటున తెగల మధ్యన ఘర్షణ పెట్టి చోద్యం చూస్తోంది. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తోంది. ఇది బాధ్యతారహితమైన పాలనకు నిదర్శనం. మణిపూర్ రాష్ట్రంలో ఉన్న మైతి తెగలు ఎస్టీ హోదా కావాలని కోర్టులో పిటిషన్ వేయగా దాన్ని స్వీకరించిన కోర్టు దానికి సంబంధించిన వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దాంతో మిగిలిన కుకీ, నాగా తెగలు ఆ ఆదేశాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు చేస్తూ రోడ్డెక్కారు దాంతో ఇరు వర్గాల మధ్య దాడులు జరిగాయి అలామొదలైన గొడవలు కాస్త మత ఘర్షణలుగా మారాయి. బిపీనామ్ గ్రామంలో మే 4న మిట్ట మధ్యాహ్నం కుకీ, నాగా తెగలకు చెందిన ఇద్దరి మహిళలను వివస్త్ర చేసి సామూహిక లైంగికదాడికి పాల్పడి మానవ మృగాల మాదిరి వ్యవహరించిన తీరు విస్మయానికి గురిచేసింది. ఒక తల్లిని నగ్నంగా బహిరంగంగా తిప్పుతూ ఆనందిస్తుంటే ఇందుకేనా 75సంవత్సరాలుగా నిర్మిస్తున్న స్వతంత్ర భారతం? మణిపూర్‌లో వివస్త్రను చేసింది ఒక స్త్రీని కాదు, నీ తల్లి అస్తిత్వాన్ని, నీ దేశపు గౌరవాన్ని. రెండు జాతుల మధ్య జరుగుతున్న పోరాటాన్ని రెండు మతాల పోరుగా చేసి నడిపిస్తున్న కుళ్లు రాజకీయాల మారువేషం కోసమా ఈ దేశ నిర్మాణం. వేదాలు పుట్టిన నేల అని గర్వంగా చెప్తారు కదా! సనాతన ధర్మానికి తార్కాణమని జబ్బలు చరుస్తూ అరుస్తారు కదా! మరి నీ తల్లి అస్తిత్వాన్ని దెబ్బతీస్తుంటే కనీసం నోరు కూడా మెదపవా? ఇది ఎంత దారుణమైన పరిస్థితి అంటే, అంత బహిరంగంగా కెమెరాల ముందు కనబడుతున్నా ఈ దేశపు ప్రతీకలు న్యాయస్థానాలు, రక్షక నిలయాలు కళ్ళుండే నిద్రపోతున్న తీరును చూస్తుంటే... బాధే స్తోంది. మానవతా విలువలని మరిచి మైకంలో ఉంటే దీని కోసమా వేలాది గుండెలు త్యాగాలు చేసి సాధించిన స్వతంత్రమా అనిపిస్తుంది.



ఇలా రోజుకొకడు, వీధికొక్కడు మహిళల్ని నగ్నంగా నిలబడుతుంటే సమాజం తలవంచుకొని తప్పుని ఆమోదిస్తుంటే ఇంతకుమించిన రాక్షసత్వం రాక్షస రాజ్యం ఉంటుందా? దేశ గౌరవం అత్యున్నత స్థాయికి పోవాలి అంటే పెద్ద పెద్ద విగ్రహాలు, అతిపెద్ద నిర్మాణాలర, రాజమార్గాలు నిర్మిస్తే సరిపోతుందనుకుంటే అది సిగ్గుచేటు ఈ దేశం ఏనాడైతే స్వేచ్ఛకి, స్వచ్ఛతకు ఆదర్శంగా నిలుస్తుందో ఆనాడే కదా నువ్వు గొప్ప అంటూ నిలబడేది. నేను ఈ ఒక్క సంఘటన గురించే మాట్లాడటం లేదు. ఈ దేశంలో అడుగడుగునా జరుగుతున్న ఇలాంటి వందలాది ఘటనల గురించి మాట్లాడుతున్న సంస్కారం మా నరనరాల్లో ఉంది అంటూ విర్రవీగుతారు కదా! ఒక స్త్రీని వివస్త్ర చేసిన సంస్కారం ఈ దేశం తాలూకు వీరత్వమా అని ప్రశ్నిస్తే ఏంచేస్తారు.? నాకైతే ఆనాటి కౌరవసభ గుర్తుకొస్తుంది, కీచకులంతా ఏకమై రాజకీయాల రంగును పులు ముకుని ఉన్నారా అనిపిస్తుంది. ఈ దేశపు మూల సంపద యువతే అంటారు కదా! అలాంటి యువత కూడా మౌనంగా ఉండటం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ మౌనానికేనా పీహెచ్‌డీలు, గౌరవమైన డిగ్రీలు చదివింది. నాకు అడవి కాలపు రాతియుగం కూడా ఎంత ఘోరంగా లేదేమో అనిపిస్తుంది. మృగాల మాదిరి వేటాడుతుంటే. దీనికి అడవి చట్టాన్ని అమలు చేయాలని అనిపిస్తుంది. ఎంతో గొప్ప గొప్ప పోరాటపు వీరులు పుట్టిన గడ్డకి ఇంత తుచ్ఛమైన స్థితియా! కులం అంటూ అగ్గి రాజేసి ఒక స్త్రీ ఆత్మాభిమానాన్ని దహనం చేయటం మన సంకుచితమైన మనస్తత్వాలకు అది ఒక బలమైన నిదర్శనం. రాబోయే తరాలకు భవిష్యత్తులకు నువ్వు నేర్పిస్తున్న వ్యక్తిత్వం వికాసం ఇదేనా! జనగణమన అంటూ ప్రతిరోజు పాడే జాతీయ గీతం ఉత్తిదేనా? ఒక రాజ్యం ఒక సమాజం ఏకపక్షంగా వ్యవహరిస్తున్న తీరు దారుణం అధికార ఆపేక్షతో ఎంత తారాస్థాయికైనా దిగజారి పోవటం, దీన్ని దేశభక్తి అని మళ్లీ అనడం కూడా మీకే సాధ్యం. ఇలాంటి వ్యక్తులకి మళ్లీ మళ్లీ మనం రాజ్యాధికారం అందించడం నీచాతి నీచం.

ఇలాంటిదే మీ ఇంట్లో ఉన్న తల్లికో చెల్లికో జరిగితే ఇలాగే మౌనంగా ఏమీ పట్టనట్లు ఉంటావా? దిక్కులన్నీ పగిలి పోయేటట్లు అరుస్తావా లేదా! ఇంత జరిగినా శవాల మీద పేలాలు ఏరుకునే రాజకీయాలను, రాజకీయ సిద్ధాంతాలను చూస్తే ఒక్కసారిగా ఈ నగ్నపు సమాజాన్ని దహించి వేయాలన్న ఆక్రందన నాలోకి వస్తుంది.

ఈ రాజ్యం ఎవరిని ఎక్కడ వదిలిందని ఈ దేశానికి పేరును పతకాలను తెచ్చిన స్త్రీలను గౌరవించేది పోయి లైంగికదాడులకు పాల్పడితే దానికి నిరసనగా నిరసిస్తే వాళ్లని ఉక్కుపాదంతో అణిచివేస్తుంటే ఇలాంటి రాజ్యం కోసమా ఓటు వేస్తుంది? ఇలాంటి రాజ్యంలోనా మనం జీవిస్తున్నామని అనిపిస్తుంది. సందు దొరికితే చాలు మేధావులు అంటూ, విశ్లేషకులు అంటూ టీవీల్లో దూరిపోయి 'ఇది ప్రజా స్వామ్యదేశం. సమాఖ్య విలువలకు చిహ్నం' అంటూ భజనలు చేస్తారుగా... కనీసం ఒక్కరికి కూడా అప్పుడు గుర్తు రాలేదా? ప్రజాస్వామ్య దేశంలో ఒక స్త్రీని వివస్త్రను చేసి ఊరేగించి నప్పుడు? మతవిశ్వాసాల ఆధారంగా పాలించేవాళ్లను, మానవ మృగాలు వెనక్కివేసు కొచ్చేవాళ్లను పాతాళానికి తొక్కేయాలి. నిత్య నూతనంగా మనల్ని మనం నిర్మించుకోవాలి. లేదు... నేను ఇలాగే ఉంటాను... అంటావా రేపు నీ ఇంటికి కూడా ఇదే పరిస్థితి వస్తుంది!

తప్పదారి పట్టిస్తున్నది

- యువతపై సోషల్ మీడియా ప్రభావం
- వారు సరైన జీవిత గమనాన్ని నిర్ణయించుకోలేకపోతున్నారు
- అలహాబాద్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : యువతపై సోషల్ మీడియా, సినిమాలు, వెబ్ సిరీస్‌ల ప్రభావంపై అలహాబాద్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీటి ప్రభావంతో యువత సరైన జీవిత గమనాన్ని నిర్ణయించుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించింది. అలాగే, సరైన ఆత్మీయుల అన్వేషణలో తరుచూ తప్పుడు పనులకు దిగుతున్నారని తెలిపింది. ఆత్మహత్యకు ప్రేరేపించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి బెయిల్ మంజూరు విచారణ సందర్భంగా న్యాయస్థానం పై అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. "ఈ దేశంలోని యువత వ్యతిరేక లింగానికి చెందిన వారితో స్వేచ్ఛా సంబంధానికి ఎర చూపడం, పాశ్చాత్య సంస్కృతికి లొంగిపోవడం, నిజమైన ఆత్మ సహచరుడిని కనుగొనకపోవడంతో తమ జీవితాలను పాడు చేసుకుంటున్న అనేక కేసులలో ఇది ఒకటి.


సామాజిక మాధ్యమాలు, చలనచిత్రాలు ఆకట్టుకునే మనస్సుల ఊహాశక్తిని రేకెత్తిస్తుంది. వారు అదే ప్రయోగాలు చేయడం ప్రారంభిస్తారు. కానీ అవి ప్రస్తుత సామాజిక ప్రమాణాలకు సరిపోవు" అని అలహాబాద్ హైకోర్టు వెల్లడించింది. పాశ్చాత్య సంస్కృతిని అనుసరించడం వల్ల కలిగే పర్యవసానాల గురించి తెలియని యువతరం సోషల్ మీడియా, సినిమాల్లో చూపించే కంటెంట్‌కు ప్రభావితమై సంబంధాలలోకి ప్రవేశిస్తోందని వ్యాఖ్యానించింది.

ఖురాన్ దహనాలపై ముస్లిం ప్రపంచం నిరసన



డెన్మార్క్ : స్వీడన్ రాజధానుల్లో జరిగిన నిరసనల్లో ఖురాన్ దహనాలను పదేపదే అనుమతించటంపట్ల ముస్లిం దేశాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. డెన్మార్క్ రాజధాని కోపెన్ హాగన్‌లో ముస్లిం పవిత్ర గంథం ఖురాన్‌ను కాళ్ళ కింద తొక్కుతూ ధ్వంసం చేసిన ఘటన సోమవారం నాడు జరిగింది. డానిష్ పేట్రియాట్స్ పేరుగల పచ్చి మితవాత గ్రూపు ఒకటి ఇరాక్ రాయబార కార్యాలయం ఎదుట జరిపిన నిరసనను టర్కీ ఖండించింది. 'మా పవిత్ర గ్రంథంపై చేస్తున్న దాడి'గా టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ అభివర్ణించింది. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డానిష్ అధికారులను టర్కీ కోరింది. 'ఇటు వంటి తీవ్ర చర్యలకు పాల్పడే సమాజాలు టెర్రరిజం బారీన పడటమే కాకుండా, అవి సృష్టించే ద్వేషం సహ జీవనాన్ని దెబ్బతీస్తుంది' అని ఇరాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. కోపెన్ హాగన్‌లో గతవారం జరిగిన సంఘటనను డానిష్ పాట్రియాట్స్ ఫేస్‌బుక్‌లో లైవ్ స్ట్రీమ్ చేయటంతో ఇరాక్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. అదేరోజు డానిష్ రాయబార కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులందరూ బాగ్దాద్‌ను వదిలి వెళ్లారని ఇరాకీ మంత్రిత్వశాఖ ప్రకటించింది. తమ రాయబార కార్యాలయాన్ని వేసవి సెలవులకోసం మూసివేశామనీ, ఉద్యోగులను ఉపసంహరించుకోలేదని డెన్మార్క్ తెలిపింది.

రష్యాపైన ఉక్రెయిన్ ప్రతిదాడి ఎందుకు విఫలమైందంటే..



మాస్కో : గగనతలం నుంచి వచ్చేదాడులను ఎదుర్కొనే ఆయుధాలు లేకపోవటం, రష్యాన్ మైన్ ఫీల్డ్స్ అపరిమితంగా ఉండటంతో తమ ప్రతిదాడి వెనకపట్టు పట్టిందని ఉక్రెయిన్ రక్షణ మంత్రి అలెక్సె రెజ్నికోవ్ అన్నాడు. 'గగనతలం నుంచి వచ్చే దాడులను రక్షించే పటిష్టమైన రక్షణ వ్యవస్థ లేకపోవటం, సరిహద్దు పొడుగు మరీ ఎక్కువగా ఉండటంవల్ల మా ప్రతిదాడి అనుకున్నంతగా ముందుకు సాగటం లేదు. శత్రువుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది' అని రెజ్నికోవ్ సిఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. దక్షిణ యుద్ధ క్షేత్రంలో రష్యన్ మైన్ ఫీల్డ్స్‌ను ఛేదించటం చాలా కష్టంగా ఉందని రెజ్నికోవ్ వివరించారు. అయితే అందుకు తాను విచారించటం లేదనీ, ఎందుకంటే ప్రతి ప్రతిదాడి వేగంగా విజయవంతం కావాలనేమీ లేదని ఆయన అన్నారు. జూన్ ఆరంభంలో మొదలయిన ప్రతిదాడి "అనుకున్నంతగా ముందుకు సాగటంలేదు" అని ఉక్రెయిన్ అధ్యక్షుడు, వ్లాడీమీర్ జెలెన్‌స్కీ అంగీకరించిన తరువాత ఉక్రెయిన్ రక్షణ మంత్రి పైన పేర్కొన్న విధంగా వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేల లేఖ కలకలం

బెంగళూరు : కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాసిన లేఖ కలకలం రేపుతున్నది. ఎమ్మెల్యేలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నట్టు ఉన్న ఆ లేఖ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు ఎమ్మెల్యేల వినతులకు స్పందించడం లేదని నియోజకవర్గాలకు కేటాయించిన నిధులను విడుదల చేయడం లేదని లేఖలో ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఫండ్స్ రిలీజ్ చేయిస్తామంటూ మధ్యవర్తులు రంగంలోకి దిగారని, కమీషన్ ఇస్తే నిధులను విడుదల చేయిస్తామంటున్నారని చెప్పారు. ఈ లేఖపై 10 మంది ఎమ్మెల్యేల సంతకాలున్నాయి. ఈ 10 మందిలో ఉన్న ఒక ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఈ లేఖ తమ వ్యక్తిగతమనీ, గురువారం నాడు సీఎల్పీలో దీనిపై చర్చిస్తామని చెప్పారు. అయితే, ఈ లేఖ మీడియాకు లీక్ కావడం కలకలం రేపింది. మరోవైపు ఈ లేఖపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ ఇది ఫేక్ లెటర్ అని కొట్టిపారేశారు. ఇంకోవైపు లేఖలో పేరు ఉన్న మరో ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ స్పందిస్తూ ఈ లేఖ నిజం కాదని అన్నారు. ఇది బీజేపీ కొత్త నాటకంలో భాగమని ఆరోపించారు.

మంత్రి సెంథిల్ బాలాజీ జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు

చెన్నై : 'క్యాష్ ఫర్ జాబ్' కుంభకోణం కేసులో అరెస్టయిన తమిళనాడు మంత్రి వి.సెంథిల్ బాలాజీ జ్యుడిషియల్ కస్టడీని ఆగస్టు 8వ తేదీ వరకూ చెన్నై సెషన్స్ కోర్టు పొడిగించింది. ఆయన జ్యుడిషియల్ రిమాండ్ పొడిగించడం ఇది మూడోసారి. ప్రస్తుతం పుళల్ జైలులో ఉన్న సెంథిల్ బాలాజీ జ్యుడిషియల్ కస్టడీ బుధవారంతో ముగియనుండటంతో ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి ఎస్.అలి ముందు హాజరుపరిచారు. దీనికి ముందు, సెంథిల్ బాలాజీ అరెస్టుపై ఆయన భార్య మేఘల వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం క్లోజ్ చేసింది. బాలాజీ అరెస్టు చట్టవిరుద్ధమని, ఒక వ్యక్తిపై వచ్చిన ఆరోపణలపై ఇంటరాగేషన్ పేరుతో అరెస్టు చేసే అధికారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి లేదని పిటిషనర్ వాదించారు. దీనిపై న్యాయమూర్తులు నిషా భాను, డి.బి.చక్రవర్తి పరస్పర విరుద్ధమైన తీర్పులు ఇచ్చారు. దీంతో దీనిపై మరోసారి విచారణ జరిపిన జస్టిస్ సీవీ కార్తికేయన్ ధర్మాసనం ఇటీవల కీలక తీర్పు వెలువరించింది. సెంథిల్‌ను అరెస్టు చేయడం చట్టబద్ధమేనంటూ ఈడీకి అనుకూలంగా తీర్పునిచ్చింది. క్యాష్ ఫర్ జాబ్ స్కామ్‌లో మనీలాండరింగ్ కింద జూన్ 14న సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్టు చేసింది. అప్పటినుంచి ఆయన జ్యుడిషియల్ కస్టడీలోనే ఉన్నారు. గతంలో అన్నాడీఎంకే హయాంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఈ కుంభకోణానికి పాల్పడినట్టు ఈడీ ఆరోపణగా ఉంది. ఈడీ అరెస్టుతో ఆయన విద్యుత్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మంత్రి పదవులను కోల్పోయారు. ప్రస్తుతం ఆయన ఏ శాఖ లేని మంత్రిగా డీఎంకే ప్రభుత్వంలో కొనసాగుతున్నారు.

మరోసారి బీజేపీనయవంచన

- విభజన హామీలను నెరవేర్చాలి : కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఇచ్చిన విభజన హామీల్లో దాదాపు అన్ని నెరవేర్చామంటూ చెప్పడం ద్వారా కేంద్రంలోని బీజేపీ సర్కార్ మరోసారి నయవంచనకు పాల్పడిందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోదర్ విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హామీలను నిజంగా నెరవేర్చి ఉంటే పార్లమెంటు వేదికగా అంశాల వారీగా ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, పారిశ్రామిక రాయితీలు తదితర హామీలను అమలు చేయకుండా మోడీ సర్కార్ తొమ్మిదన్నరేండ్లుగా రాష్ట్ర ప్రజలను మోసగిస్తూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా విభజన హామీలను అమలు చేయాలని దామోదర్ డిమాండ్ చేశారు. కేంద్రం సహకరించకున్నా సీఎం కేసీఆర్ తన మేధాశక్తితో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపారని కొనియాడారు.

ఇజ్రాయిల్‌లో డాక్టర్ల సమ్మె

వార్తాపత్రికల మొదటి పేజీల్లో బ్లాక్ యాడ్స్

- న్యాయ వ్యవస్థపై దాడికి నిరసనగా ఇజ్రాయిల్‌లో ఆందోళనలు
- నెతన్యాహుపై పెరిగిన వ్యతిరేకత



జెరూసలేం : ఇజ్రాయిల్ న్యాయ వ్యవస్థపై మితవాద ప్రభుత్వం జరుపుతున్న దాడిని నిరసిస్తూ డాక్టర్లు 24గంటల సమ్మెను నిర్వహించారు. మంగళవారం నాటి వార్తాపత్రికల మొదటి పేజీలు బ్లాక్ యాడ్స్‌తో నిండిపోయాయి. న్యాయ వ్యవస్థ ప్రక్షాళన పేరుతో తీసుకువస్తున్న మొదటి విడత చర్యలను ప్రభుత్వం ధృవీకరించడంపై ఆందోళన జరుగుతోంది. ఈ చర్యలు న్యాయ స్థానాల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ముప్పుగా పరిణమిస్తాయని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలను సుప్రీం కోర్టు సమీక్షించడానికి రద్దు చేస్తూ ప్రభుత్వం బిల్లు తీసుకువచ్చింది. ఆ బిల్లును సోమవారం పార్లమెంట్ ఆమోదించింది. బిల్లును నిరసిస్తూ ప్రతిపక్షాల సభ్యులు సభ నుండి వాకౌట్ చేశారు. సుదీర్ఘకాలం దేశానికి ప్రధాన మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నెతన్యాహు దేశాన్ని నియంతృత్వం దిశగా నడుపుతున్నారని విమర్శించారు.

ఇజ్రాయిల్‌లో నెలల తరబడి నిరసన ప్రదర్శనలు సాగుతున్నాయి. వేలాదిమంది వీధుల్లోకి వస్తున్నారు. సోమవారం రాత్రి పోలీసులతో ఆందోళనకారులు ఘర్షణ పడ్డారు. ఇది "ఇజ్రాయిల్ ప్రజాస్వామ్యం చీకటి దినం" అని ప్రధాన వార్తాపత్రికల మొదటి పేజీల్లో యాడ్ ప్రచురితమైంది. ఆందోళన చెందుతున్న హై టెక్ వర్కర్లుగా చెప్పుకుంటున్న గ్రూపు ఈ యాడ్‌లను ఇచ్చింది.

ప్రభుత్వం గనుక తన ప్రణాళికలతో ముందుకు వెళ్లినట్లైతే, మిలటరీ రిజర్విస్ట్‌లు ఎవరూ తమ విధులకు హాజరు కాబోరని ఆందోళన జరుపుతున్న నేతలు చెప్పారు. దీనివల్ల ఇజ్రాయిల్ యుద్ధ సన్నద్ధత దెబ్బ తింటుందని మాజీ సైనికాధ్యక్షులు ఆందోళన చెందుతున్నారు. అయితే అలా విధులకు రాని వారిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు సైన్యం తెలిపింది.

నెతన్యాహు విజయావకాశాలకు ఎదురు దెబ్బ

తాజాగా తీసుకున్న నిర్ణయాలతో రాబోయే ఎన్నికల్లో ప్రధాని నెతన్యాహుకు విజయావకాశాలు దెబ్బ తింటాయని ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడైంది. ప్రధాన స్రవంతి లోని రెండు వార్తా ప్రసార సంస్థలు నిర్వహించిన సర్వేల్లో ఈ విషయం స్పష్టమైంది. తక్షణమే ఎన్నికలు నిర్వహిస్తే నెతన్యాహు పాలక సంకీర్ణానికి వచ్చే సీట్ల సంఖ్య 64 నుండి 52 లేదా 53కి పడిపోతుందని హెచ్చరించింది. ఆయన స్వంత లికుడ్ పార్టీకి 32 నుండి 28కి సీట్లు తగ్గుతాయని ఎన్12 న్యూస్ తెలిపింది. 25సీట్లే వస్తాయని రెషెట్ 13 సంస్థ పేర్కొంది.

బీజేపీ పంచన వైసీపీ, టీడీపీ

న్యూఢిల్లీ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలన్నీ ఛీకొడుతుంటే రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ మాత్రం మోడీ సర్కార్ మెప్పు కోసం పరితపిస్తున్నాయి. మణిపూర్ మారణకాండ నేపథ్యంలో కేంద్ర మంత్రిమండలిపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టగా..వైసీపీ, టీడీపీ రెండూ బీజేపీ పంచనే నిల్చున్నాయి. శాంతిభద్రతలు కేంద్ర హోంశాఖ చూసుకుంటుందని, ప్రభుత్వంపై అవిశ్వాసం అనవసరమని వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయి రెడ్డి అన్నారు.

బుధవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ 'అంతా సవ్యంగా సాగుతున్నప్పుడు అవిశ్వాస తీర్మానం పెట్టాల్సిన అవసరం ఏముంది? ఆ తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నాం' అని ఆయన తెలిపారు. మణిపూర్ దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన అంశమని, ఇది పూర్తిగా కేంద్ర హోంశాఖ పరిధిలో ఉంటుందన్నారు. ఇలాంటప్పుడు ఉభయ సభలను నిలిపివేయడం వల్ల ఉపయోగం లేదని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

మరోవైపు రాష్ట్రంలోని ప్రతిపక్ష టీడీపీ కూడా అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వలేదు. లోక్‌సభ స్పీకర్ అవిశ్వాస తీర్మానాకి మద్దతు ఇచ్చే సభ్యులను నిలబడమని కోరినప్పుడు సభలో ఉన్న ప్రతిపక్ష ఎంపిలంతా నిలబడ్డారు. బీఆర్ఎస్ ఎంపీలు కూడా తమ స్థానాల్లో నిలబడి అవిశ్వాస తీర్మానానికి మద్దతు ప్రకటించారు. అయితే సభలో ఉన్న టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ మాత్రం తీర్మానానికి మద్దతుగా నిలబడలేదు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని అధికార, ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వనట్టు స్పష్టం అయింది.

సమస్యలు పరిష్కరించకుంటే.. పోరాటం ఉధృతం

తాత్కాలిక సిబ్బందిని అడ్డుకున్న జీపీ కార్మికులు

- 21వ రోజూ వినూత్న రీతిలో నిరసనలు
- సీఐటీయూ, అనుబంధ సంఘాల మద్దతు



నవతెలంగాణ-విలేకరులు

తమ సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామని పంచాయతీ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పలు జిల్లాల్లో ప్రయివేటు వ్యక్తులతో పనులు చేయించుకుంటున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంతా తమ సమ్మెకు సహకరించాలని కోరారు. బుధవారంతో 21వ రోజుకు చేరిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతుగా సీఐటీయూ, అనుబంధ సంఘాలు నిరసనల్లో పాల్గొని మద్దతు తెలిపాయి. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వినూత్నంగా నిరసనలు తెలిపారు.

సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామంలో ప్రయివేటు వ్యక్తితో పంచాయతీ ట్రాక్టర్‌తో పనిచేయిస్తుండగా కార్మికుడు అడ్డం పడుకుని అడ్డుకున్నాడు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెకు సహకరించాలని కోరారు. మండలంలో కండ్లు, చెవులు మూసుకుని నిరసన తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో సమ్మె శిబిరాన్ని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు సందర్శించి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. మానకొండూర్ మండలంలో కార్మికులు తలకు ఉరితాళ్లతో వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఇల్లందకుంట మండలంలో దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి ర్యాలీ నిర్వహించారు. గంగాధర మండలంలో సిబ్బంది భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. మల్యాల మండలంలో మోకాళ్లపై నిల్చొని ఆవేదన వ్యక్తం చేశారు. కొనరావుపేటలో ఉరితాళ్లతో నిరసన తెలిపారు.

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలో సీఐటీయూ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే నేడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. మంచాలలో చేపట్టిన దీక్షలకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో చేపట్టిన సమ్మెకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద రావు మద్దతు తెలిపి మాట్లాడారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట వర్షంలో దీక్ష కొనసాగించారు.

దీక్ష కేంద్రం వద్ద వంటావార్పు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో జేసీకి వినతి పత్రం అందజేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరిలో జీపీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. బొమ్మలరామారం మండలకేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో సీఐటీయూ, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వైయస్సార్ విగ్రహం నుంచి ఎంపీడీవో కార్యాలయం ఎదుట జరుగుతున్న సమ్మె శిబిరం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి మద్దతు తెలిపాయి. నాంపల్లిలో జీపీ కార్మికులు చేతులు జోడించి వేడుకుంటూ నిరసన తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి మండలంలో జీపీ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. పెన్‌పహాడ్ మండలంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు.

వార్డు ఆఫీసులో పామును వదిలిన యువకుడు

- ఫిర్యాదును అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన

నవతెలంగాణ- నేరేడ్‌మెట్



వరద నీటితోపాటు పాములు కూడా ఇండ్లలోకి వస్తున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని ఓ యువకుడు వినూత్నంగా నిరసన తెలిపాడు. ఓ పామును పట్టుకొచ్చి నేరుగా జీహెచ్ఎంసీ వార్డు ఆఫీసులో వదిలి పెట్టాడు. ఈ ఘటన హైదరాబాద్ అల్వాల్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

భారీ వర్షాలకు నగరంలో పలుచోట్ల ఇండ్లలోకి వరద నీరు వస్తోంది. అల్వాల్ ప్రాంతంలో సంపత్‌కుమార్ ఇంట్లోకి వరద నీటితోపాటు ఓ పాము కూడా వచ్చింది. దాంతో అతను వెంటనే జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసి 6 గంటలు గడిచినా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో అతను ఓ పామును పట్టుకుని నేరుగా అల్వాల్ జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయానికి తీసుకొచ్చాడు. అక్కడ టేబుల్‌పై పామును వదిలిపెట్టి నిరసన తెలిపాడు. దీంతో అధికారులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. అందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది.

భార్యభర్తల దారుణ హత్య కామారెడ్డి జిల్లాలో ఘటన

నవతెలంగాణ-నసురుల్లాబాద్(బీర్కూర్)



కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలో దంపతులు దారుణహత్యకు గురైన ఘటన సంచలనం రేపింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన దారం నారాయణ గుప్తా (75) 40 ఏండ్ల కిందట రైతునగర్ గ్రామానికి చెందిన సుశీల(65) ను వివాహం చేసుకొని ఇంట్లోనే కిరాణా దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి సంతానం లేదు. వ్యాపారం ద్వారా దాచుకున్న కొంత డబ్బును ఇతరులకు అప్పుగా ఇస్తుంటారు. కాగా బుధవారం తెల్లవారుజామున ఇంటి వెనుక నుంచి నిచ్చెన వేసుకొని ఇంట్లోకి చొరబడ్డ దుండగులు.. ఇతరులకు అరుపులు, కేకలు బయటకు వినపడకుండా టీవీ శబ్దం ఎక్కువ చేసి.. నారాయణ గుప్తాను మరణాయుధంతో తలపై బాది హత్య చేశారు. అనంతరం సుశీలను హాలులోకి తీసుకెళ్లి చీరతో ఉరేశారు. ఉదయమైనా నారాయణగుప్త ఇంటి తలుపులు మూసి ఉండటంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే బాన్సువాడ రూరల్ సీఐ మురళి, బాన్సువాడ డీఎస్పీ రఘునాథరెడ్డి రైతునగర్‌లోని ఘటనాస్థలికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకొని పరిశీలించారు. దుండగులను పట్టుకునేందుకు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గురైన భార్యభర్తలు ఇద్దరు కూడా ఎవరినీ పల్లెత్తు మాట అనేవారు కాదని గ్రామస్తులు తెలిపారు. కాగా పోలీసులు హత్యకు సంబంధించిన వివరాలను పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో భార్యభర్తల దారుణ హత్య జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

వర్షాలకు గజ్వేల్‌లో ఎర్రబారుతున్న మొలకలు

- దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు

నవ తెలంగాణ -గజ్వేల్



ఆలస్యంగా సాగైన పత్తి పంటకు అధిక వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. పది రోజులుగా కురుస్తున్న వానలకు చేన్లు నీరు పట్టి మొలకలు ఎర్రబారుతున్నాయి. ఎరువులు వేసి కలుపు తీసేందుకూ తెరపినివ్వడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్, ములుగు మండల వ్యవసాయ డివిజన్ పరిధిలో పొలాలు నీటితో నిండి పత్తి, మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 1.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. సీజన్ ఆరంభంలో వర్షాలు కురవకపోవడంతో విత్తనాలు వేయలేని ప్రతికూల పరిస్థితుల్లో.. మృగశిర కార్తెలో కాస్త జల్లులు పడటంతో విత్తనాలు వేశారు. కొన్నిచోట్ల మొలకెత్తగా.. కొన్ని చోట్ల భూమిలోనే మురిగిపోయాయి.

జిల్లాలో దాదాపు 10 వేల ఎకరాల్లో పత్తి పంట ప్రమాదకర స్థితికి చేరిందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. గజ్వేల్, జగదేవపూర్, కొండపాక, చేర్యాల, మిరుదొడ్డి, సిద్దిపేట గ్రామీణం, వర్గల్, ములుగు, రాయపోల్, దుబ్బాక, దౌల్తాబాద్ మండలాల పరిధిలో నల్లరేగడి భూముల్లోని పత్తి పంటపై వర్షాల ప్రభావం అధికంగా ఉంది. వర్షాలు ఇలాగే కురిస్తే రూ.10 కోట్ల మేర పంట నష్టం వాటిల్లే ప్రమాదముందని అంటున్నారు.

రైతులకు సూచనలు

ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు రైతులకు గజ్వేల్ డివిజన్ వ్యవసాయ అధికారి బాబు నాయక్ పలు సూచనలు చేశారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటల్లో మొక్కల సాళ్ల మధ్య నీరు నిలవకుండా బయటకు పోయేలా కాలువలు తీసుకోవాలని సూచించారు. అధిక తేమ వల్ల పత్తి మొక్కలకు వేరుకుళ్లి తెగులు సోకడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దీన్ని అధిగమించడానికి మొక్క వయసును బట్టి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19.19.19 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పంట ఎదుగుదలను పెంచడానికి వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు ఐదు సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలని చెప్పారు.

రోజూ వర్షంలోనే పంట చేలు

వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో పత్తి సాగుచేసిన చేనంతా నీరు చేరింది. ఇప్పుడిప్పుడే వస్తున్న మొలకలు ఎర్రబారుతున్నాయి. పెట్టుబడి చేతికి వస్తుందో రాదో తెలియడం లేదు. షావుకారు వద్ద అప్పు తెచ్చాం. సమయానికి వర్షాలు రాకపోవడంతో ఆలస్యంగా పంటలు సాగు చేశాం. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.



రైతు మల్లయ్య

అద్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టులో ప్రమాదం పైప్ తగిలి కార్మికుడు మృతి

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : కార్మిక సంఘాల డిమాండ్



నవతెలంగాణ - గోదావరిఖని/ రామగిరి

సింగరేణి ఆర్జీ-3 పరిధిలోని అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు (ఎఎల్‌పి)లో మంగళవారం రాత్రి రెండో షిఫ్ట్‌లో ప్రమాదం జరిగింది. ప్రాజెక్టులో బొగ్గు ఉత్పత్తి పనులు జరుగుతున్న సమయంలో లాంగ్ వాల్ మిషన్‌కు ఉన్న ఓస్ పైప్ ఒక్కసారిగా ఊడిపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎంజెడబ్ల్యూ కార్మికుడు బూర్ల సారయ్య(40) ఛాతికి బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని గోదావరిఖని పట్టణంలోని సింగరేణి రామగుండం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సారయ్య కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఆస్పత్రిలో కార్మికుని మృతదేహాన్ని పలువురు రాజకీయ పార్టీల, కార్మిక సంఘాల నాయకులు బుధవారం పరిశీలించారు.

ఉత్పత్తిపైనే శ్రద్ధ..
సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికులకు రక్షణ ఏర్పాట్లు చేయడంతో యాజమాన్యం చూపడం లేదని ఎస్‌సీఈయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. కార్మికుడు సారయ్య మృతదేహాన్ని ఆయన సందర్శించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. నిబంధనలకు విరుద్ధంగా సింగరేణి అధికారులు వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు దొమ్మేటి కొమురయ్య, ఎం.వెంకటేశ్వర్లు, ఎండి.అహ్మద్ పాషా, డి.రవి కుమార్ తదితరులున్నారు.

అంత్యక్రియల కోసం.. ఉప్పొంగుతున్న వాగులో పాడే మోత



నవతెలంగాణ-చేర్యాల

జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిద్దిపేట జిల్లాలో మరణించిన వ్యక్తి అంత్యక్రియల కోసం ఉప్పొంగుతున్న వాగులో పాడే మోస్తూ గ్రామస్తులు, బంధువులు ఈదుకుంటూ అవస్థలు పడిన ఘటన తాజాగా చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే... చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో మంగళవారం సాయంత్రం గ్రామానికి చెందిన బసవరాజు బాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామస్తులు, బంధువులందరూ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగు ఉప్పొంగుతోంది. శ్మశానవాటిక వాగు అవతలి వైపు ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, చేర్యాల వేచరేణి గ్రామాల మధ్య వాగు ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది కలగకుండా వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1.96 కోట్లు కేటాయించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసినప్పటికీ కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్నట్టు గ్రామ సర్పంచ్ ఏనుగుల దుర్గయ్య అసహనం వ్యక్తం చేశారు. ఈ కాంట్రాక్ట్ అక్టోబర్‌తో ముగుస్తున్నందున ఇప్పటికైనా పనులు చేపట్టాలని కోరారు.

ప్రాణాలకు తెగించి వైద్యం అందించి..

నవతెలంగాణ-మంగపేట

భారీ వర్షాల్లో సైతం వైద్య సిబ్బంది ప్రాణాలు పణంగా పెట్టి గిరిజన గ్రామాల ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలంలోని బ్రాహ్మణపల్లి ఆస్పత్రి వైద్యాధికారి కారం నిఖిల్ తన సిబ్బంది బుధవారం కుండపోతగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయక ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటి ఆస్పత్రి పరిధి దోమెడ గ్రామంలో రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దోమెడలో ఇంటి కొకరు జ్వరం, వైరల్, మలేరియా భారినపడి మంచాన పడ్డట్టు గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న వైద్యాధికారి తన వైద్య బృందంతో గ్రామానికి వెళ్లి వైద్యం అందించారు. వర్షాల కారణంగా దోమెడకు వెళ్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అది దాటి గిరిజనులు ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోలేని స్థితిని దృష్టిలో పెట్టుకుని గ్రామానికి వెళ్లి వైద్య పరీక్షలు, రక్త నమూనాలు సేకరించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు డాక్టర్ నిఖిల్ తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ల్యాబ్ టెక్నీషియన్ రాంబాబు, ఏఎన్ఎం సీతారావమ్మ, ఆశ, నళిని, తదితరులు పాల్గొన్నారు.

మైహోం సిమెంట్ పరిశ్రమ వద్ద కార్మికుల ఆందోళన

- మృతదేహాలను చూపించాలని డిమాండ్

నవ తెలంగాణ - మేళ్లచెరువు

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు పరిధిలోని మైహోం సిమెంట్స్‌లో ప్రమాద ఘటన వద్ద బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ కార్మికులు బుధవారం పెద్దఎత్తున ఆందోళన చేశారు. మంగళవారం నాటి ప్రమాదంలో చనిపోయిన తమ వారి మృతదేహాలను చూపించాలని డిమాండ్ చేశారు. శిథిలాల కింద మరికొందరి మృతదేహాలు ఉండొచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. దాంతో పరిశ్రమ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు మోహరించారు. నిర్మాణ పనులు నిలిపివేసి ప్రమాద ఘటన శకలాలను తొలగించారు.

బీడీ కార్మికులకు కుర్‌కురేలను అంటగట్టం

- హామీ ఇచ్చిన యాజమాన్యం
- కంపెనీ యాజమాన్యంతో సీఐటీయూ చర్చలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

బలవంతంగా బీడీ కార్మికులకు కుర్‌కురేలను అంటగట్టబోమని బీడీ యాజమాన్యం హామీనిచ్చిందని తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. దేశాయి బీడీ కంపెనీ యాజమాన్యం బీడీ కార్మికులతో బలవంతంగా కుర్‌కురేలు, తిను బండారాలను అమ్మిస్తూ.. వారికి వచ్చే బట్వాడాల నుంచి డబ్బులు తీసుకుంటున్న విషయాన్ని దశల వారి పోరాటాల ద్వారా కార్మిక శాఖ అధికారుల దృష్టికి తీసుకుపోయిన విషయం తెలిసిందే. కాగా, బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయంలో బీడీ యూనియన్ నాయకులు నూర్జహాన్, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు, మోహన్, జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్‌తో.. దేశాయ్ బీడీ కంపెనీ యాజమాన్యం తరఫున అనిల్, సంజయ్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా బీడీ కార్ఖానాల్లో కార్మికులకు కుర్‌కురేలను కానీ, ఇతర తినుబండారాలను కానీ అమ్మకాలు జరపకుండా చర్యలు చేపడతామని యాజమాన్యం హామీ ఇచ్చింది. ఒకవేళ ఎవరికైనా బలవంతంగా వాటిని అమ్మితే నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పారు. ఇకపైన ఏ కార్ఖానాల్లో కార్మికులు వాటిని కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్మికుల బట్వాడాల్లో కోతలు లేకుండా చూస్తామని హామీ నిచ్చారు. చర్చల్లో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

ఎస్సారెస్పీకి జలకళ.. కేసీఆర్‌తోనే సాధ్యం

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- ఘనంగా 'శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ 60 వసంతాలు వేడుక'

నవతెలంగాణ-మెండోరా

ఎస్సారెస్పీకి జలకళ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని శ్రీరామ్‌సాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్ట్ పనులకు శ్రీకారం చుట్టి 60 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా బుధవారం ప్రాజెక్టు వద్ద బుధవారం నిర్వహించిన 'శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ 60 వసంతాలు వేడుక'లకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారు. అంతకు ముందు ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌పై ఉన్న భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా నిర్మించిన ముప్కాల్ పంప్ హౌజ్ వద్ద జరిగిన వేడుకల్లో మంత్రి ప్రసంగించారు. 1951లో ఆనాటి హైదరాబాద్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఈ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదనలు పంపిస్తే.. 12 సంవత్సరాలకు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1963లో 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.40 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. 1983లో ఎస్సారెస్పీ పూర్తి చేసి డ్యాంలో నీటిని నింపారన్నారు. ప్రాజెక్ట్ మొదటి ఫేజ్ పూర్తి కావడానికి సుమారు 20 ఏండ్లు పట్టిందని తెలిపారు. 2015-16లో పది లక్షల ఎకరాల అయకట్టుకు నీళ్లు అందించేలా రెండో ఫేజ్ పనులు పూర్తయ్యాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం జరిగిందని కేసీఆర్ ఎన్నో సార్లు ఆవేదన వ్యక్తం చేశారని, ఆంధ్ర ప్రాజెక్టులు వైష్ణవాలయాలుగా, తెలంగాణ ప్రాజెక్టులు శివాలయాలుగా ఉన్నాయని 1996లో ఎస్సారెస్పీ కట్ట మీద ప్రాజెక్ట్ దుస్థితి చూసి కేసీఆర్ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు.

ఎన్నో సార్లు ఎండిపోయిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ చూశానని, పునరుజ్జీవ పథకం ద్వారా కాళేశ్వరం జలాలు శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి తీసుకొచ్చామని, ఎస్సారెస్పీ ద్వారా 18 లక్షల ఎకరాలకు నీరందించేలా ప్రణాళికలు చేశామని తెలిపారు. ప్యాకేజీ 21, 22 ద్వారా ఉమ్మడి జిల్లాలోని గ్రామాలకు కాళేశ్వరం జలాలను త్వరలో అందిస్తామన్నారు. ఈ వేడుకల్లో ఉద్యమకారుడు, రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ శాఖ సలహాదారు శ్రీధర్ రావుదేశ్ పాండే, ఈఎన్సీ నాగేందర్, ఎస్సారెస్పీ సీఈ సుధాకర్‌రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్ట్ సీఈ నల్లా వెంకటేశ్వర్లు, నిజామాబాద్ సీఈ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే ప్రభుత్వాన్ని వదిలే ప్రసక్తే లేదు

- కేంద్రాన్ని వెంటాడి, వేటాడుతాం..
- మణిపూర్ అంశంపై చర్చ జరపకుండా పారిపోతోంది : బీఆర్ఎస్ లోక్ సభ పక్ష నేత నామా నాగేశ్వరరావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తొమ్మిదేండ్ల పాలనలో అన్నింటా విఫలమై దేశాన్ని భ్రష్టు పట్టించిన కేంద్ర సర్కార్‌ను వదిలే ప్రసక్తే లేదు.. వెంటాడి,వేటాడుతామని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నాయకులు నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రం మణిపూర్ అంశంతో సహా అనేక కీలక అంశాలపై పార్లమెంట్లో చర్చించకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న కేంద్రం తీరుకు నిరసనగా బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం నోటీస్‌ను ఇచ్చిందని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక కీలక అంశాలపై చర్చించాలని పార్లమెంట్ ప్రారంభమైన నాటి నుంచి తమ పార్టీ తరుపున వాయిదా తీర్మానాలు ఇస్తూనే ఉన్నా కేంద్రం మొండిగా వెనక్కిపోతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తీరు తీవ్ర ఆక్షేపణీయమన్నారు. ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో హింసాత్మక ఘటనలతో అక్కడి ప్రజలు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని, బతుకుతున్నారని వాపోయారు. ఇప్పటికే ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ చెలరేగిన హింస వల్ల శాంతి భద్రతలు క్షీణించి, నరమేధం జరుగుతోందనీ, అయినా కేంద్రానికి పట్టకపోవడం దారుణమని విమర్శించారు. ఆయా ఘటనలపై పార్లమెంట్‌లో చర్చించాలని పదే పదే బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చినా చర్చకు అనుమతిమించకుండా ఎన్డీయే ప్రభుత్వం నిర్లక్ష్యంగా, మొండిగా వ్యవహరిస్తూ తప్పించుకుంటోందని అన్నారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు 19న జరిగిన పార్లమెంటరీ పార్టీ నాయకుల సమావేశంలో కూడా మణిపూర్ అంశంతో సహా అనేక కీలక అంశాలపై పూర్తి స్థాయిలో చర్చించాలంటూ కోరామని గుర్తుచేశారు.

అప్పుల బాధకు తాళలేక యువ రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-దామెర



అప్పుల బాధకు తాళలేక యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హన్మకొండ జిల్లా దామెర మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మన్నపేట గ్రామానికి చెందిన బండి వెంకటేష్(32) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమితో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత రెండేండ్లుగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులు పెరిగాయి. ఈ ఏడాది వేసిన పత్తి పంట కూడా అధిక వర్షాలకు దెబ్బతిన్నది. దాంతో అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపానికి గురై గడ్డి మందు తాగాడు. గమనించిన స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుని తల్లి సాంబలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

త్వరలో ఫార్మసీ కౌన్సిల్ కు ఎన్నికలు

- డాక్టర్ ఆకుల సంజయ్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌కు ఎన్నికలు నిర్వహించనున్నట్టు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆకుల సంజయ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1948 ఫార్మసీ చట్టం ప్రకారం ఆరుగురు ఫార్మసిస్టుల ఎన్నుకోవాల్సి ఉందని తెలిపారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ ఉన్నవారే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న వారు వెంటనే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. రెన్యూవల్ చేసుకునేందుకు జులై 31 చివరి గడువు అని తెలిపారు. ఫార్మసీ కౌన్సిల్ లో చిరునామా, ఈమెయిల్, ఫోన్ నెంబర్‌ను అప్‌డేట్ చేసుకోవాలని కోరారు.

ఇంజినీరింగ్ రెండోవిడతలో వెబ్‌ఆప్షన్ల నమోదుకు నేడే ఆఖరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న రెండోవిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో వెబ్‌ఆప్షన్ల నమోదు గడువు గురువారంతో ముగియనుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధ్రువపత్రాల పరిశీలనకు 5,301 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఈనెల 31లోపు రెండోవిడత సీట్లు కేటాయింపు ఉంటుందని వివరించారు. ఇప్పటి వరకు 38,318 మంది అభ్యర్థులు 14,66,391 వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని పేర్కొన్నారు. ఒక అభ్యర్థి అత్యధికంగా 672 ఆప్షన్లను ఇచ్చారని తెలిపారు. ఇంజినీరింగ్ రెండో విడతలో 30,125 సీట్లు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో.. 1.559 కిలోల బంగారం పట్టివేత

నవతెలంగాణ-శంషాబాద్



విదేశాల నుంచి బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తూ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన బుధవారం ఎయిర్‌పోర్టులో చోటుచేసుకుంది. హైదరాబాద్ కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. విదేశాల నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన స్మగ్లర్స్ నుంచి రూ.93.28 లక్షల విలువ చేసే 1.559 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం నలుగురి నుంచి ఈ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఓ ప్రయాణికుడి నుంచి రూ.12.59 లక్షల విలువైప 240 గ్రాముల బంగారం, మరో ప్రయాణికుడి నుంచి రూ.21.15 లక్షల విలువైన 348 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మూడు, నాలుగో కేసులో రూ.29.10 లక్షలు, రూ.30.43 లక్షల విలువ చేసే 474.8 గ్రాములు, 496.6 గ్రాముల బంగారం పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.